ఈనాడు

విజయవాడ 19-8-2025 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 10

THE LARGEST CIRCULATED TELUGU DAILY


రూ. 6-50 పేజీలు 14

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ADITYA BIRLA
PAINTS

భారతదేశానికి
మొట్టమొదటి నోబెల్
ఠాగూర్ ఇంటికి కీర్తిని తెచ్చాడు



అంగారక గ్రహాన్ని చేరుకున్న
మొట్టమొదటి
ఆసియా దేశంగా భారతదేశం అవతరించింది



మొట్టమొదటి హరిత విప్లవం
భారతదేశం స్వయం సమృద్ధిగా మారింది



భారతదేశానికి
మొట్టమొదటి
క్రికెట్ ప్రపంచ కప్ విజయం



బిర్లా ఓపస్ అష్యూరెన్స్

సమర్పిస్తున్నాము
భారతదేశపు మొట్టమొదటి పెయింట్ వాగ్దానం

ఒక శతాబ్దానికి పైగా, పెయింట్ పరిశ్రమలో వాగ్దానాలు నోటి మాటతోనే సాగుతున్నాయి, నాణ్యత లేదా సేవ ఏదైనా సరే వాటిని నమ్మవలసి వచ్చేది.

ఇప్పుడిక అలా ఉండదు. బిర్లా ఓపస్ పెయింట్స్‌లో, మేము అత్యాధునిక సాంకేతికత, అధునాతన నాణ్యత మరియు ఇంతకు ముందు ఎప్పుడూ చేయని రాతపూరిత వాగ్దానంతో ఆ విధానాన్ని మారుస్తున్నాము.

సమర్పిస్తున్నాము బిర్లా ఓపస్ అష్యూరెన్స్: పెయింట్ వేసిన తేదీ నుండి ఒక సంవత్సరం లోపు పెయింట్‌కు ఏదైనా సమస్య కలిగితే, మీ గోడను ఉచితంగా తిరిగి పెయింట్ వేసి ఇస్తాము, అదనపు మెటీరియల్ మరియు కార్మిక ఛార్జీలు ఏమాత్రం లేకుండా.*


అందుకే, మీ ఇంటిని అందంగా తీర్చిదిద్దుకోవడానికి మొదటి అడుగు వేసి బిర్లా ఓపస్ పెయింట్స్‌కు మారండి.




UPI - భారతదేశపు
మొట్టమొదటి
డిజిటల్ చెల్లింపు సిస్టమ్



ఎవరెస్ట్‌ను అధిరోహించిన
మొట్టమొదటి
భారతీయ మహిళ



అథ్లెటిక్స్‌లో భారత్
మొట్టమొదటి
ఒలింపిక్ స్వర్ణం గెలుచుకుంది



*నియమాలు మరియు నిబంధనలు వర్తిస్తాయి. సందర్శించండి www.birlaopus.com/assurance-tnc

మొదటిసారిగా ఎప్పుడూ లేని విధంగా,
నెలకు కేవలం ₹2,999/- నుండి EMI ప్రారంభం
అందిస్తున్నారు

PaintCraft
PAINTING SERVICES

ఇప్పుడు
100+ పట్టణాలలోని
ఫ్రాంచైజ్ స్టోర్లలో లభ్యం

బిర్లా ఓపస్ అష్యూరెన్స్ అనేది ఇదివరకే ఉన్న అత్యుత్తమ ఉత్పత్తి వారంటీలతో పాటు అదనంగా ఉంటుంది.

రిజిస్టర్ చేసుకునేందుకు

ఫోన్ **1800 120 1234**

సందర్శించండి **www.birlaopus.com**

స్కాన్ QR కోడ్

రాత్రి 8.30 నుంచి



పతక విజేతలు

ఎయిర్ పిస్టల్‌లో

● ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్

భారత్‌కు రజతం

షెమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ బోణీ కొట్టింది. పురుషుల ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగంలో రజతం గెలుచుకుంది. సోమవారం అన్మోల్ (580), ఆదిత్య మాల్రా (579), సౌరభ్ చౌదరి (576)లతో కూడిన భారత జట్టు 1735 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. చైనా (1744) స్వర్ణం నెగ్గగా.. ఇరాన్ (1733) కాంస్యాన్ని సొంతం చేసుకుంది. పురుషుల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో అన్మోల్ ఆరో స్థానంతో సరిపెట్టుకున్నాడు. క్వాలిఫికేషన్‌లో 580 పాయింట్లతో ఏడో స్థానంతో ఫైనల్ చేరిన అతడు.. పతక రౌండ్లో రాణించలేకపోయాడు. ఆదిత్య (579), సౌరభ్ చౌదరి (576) క్వాలిఫికేషన్లోనే వెనుదిరిగారు. 20 ఏళ్ల అమిత్‌శర్మ క్వాలిఫికేషన్లో 588 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. కానీ అతడు 'ర్యాంకింగ్ పాయింట్స్ ఓన్లీ' విభాగంలో పోటీలో ఉండడంతో ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయాడు. జూనియర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో కపిల్ పసిడి గెలిచాడు. ఫైనల్లో 243 పాయింట్లతో అతడు అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఇదే విభాగంలో మరో భారత కుర్రాడు గవిన్ ఆంథోని (220.7) కాంస్యం సాధించాడు. గవిన్, కపిల్, విజయ్ తోమర్‌లతో కూడిన జూనియర్ జట్టు (1723) రజతం గెలిచింది.

దులీప్ ట్రోఫీకి ఆకాశ్, ఇషాన్ దూరం



ఇషాన్ కిషన్



ఆకాశ్ దీప్

కోల్‌కతా: దులీప్ ట్రోఫీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌కు ఈస్ట్‌జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్, పేసర్ ఆకాశ్ దీప్ దూరమయ్యారు. గాయాల నుంచి వీళ్లిద్దరూ ఇంకా కోలుకోకపోవడంతో ఆరంభ మ్యాచ్‌కు అందుబాటులో ఉండట్లేదు. ఈనెల 28 నుంచి 31 వరకు జరిగే క్వార్టర్స్‌లో నార్త్‌జోన్‌తో ఈస్ట్‌జోన్ తలపడనుంది. ఇంగ్లాండ్ పర్యటనలో వెన్ను నొప్పితో ఇబ్బంది పడిన ఆకాశ్.. వైద్యుల సలహా మేరకు దులీప్ ట్రోఫీ క్వార్టర్స్‌కు అందుబాటులో ఉండనని జోనల్ సెలెక్షన్ కమిటీకి తెలియజేశాడు. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో అతను కోలుకుంటున్నాడు. ఇ-బైక్ మీద నుంచి పడిపోయిన ఇషాన్ చేతికి వైద్యులు కుట్లు వేశారు. అతను కూడా సీఓఈలోనే ఉన్నాడు. ఆకాశ్ స్థానంలో ముఖ్తార్ హుస్సేన్ (బిహార్), ఇషాన్‌కు బదులుగా ఆశీర్వాద్ స్వేన్ (ఒడిశా)లను ఈస్ట్‌జోన్‌కు ఎంపిక చేశారు. ఇషాన్ గైర్హాజరీలో అభిమన్యు ఈశ్వరన్ సారథ్యం వహిస్తాడు. రియాన్ పరాగ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.

ఈస్ట్‌జోన్ జట్టు: అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), రియాన్ పరాగ్ (వైస్ కెప్టెన్), సందీప్ పట్నాయక్, విరాట్ సింగ్, డెనిష్ దాస్, శ్రీదమ్ పాల్, శరణ్‌దీప్ సింగ్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), ఆశీర్వాద్ స్వేన్ (వికెట్ కీపర్), ఉత్కర్ష్ సింగ్, మానిషి, సూరజ్ సింధు జైస్వాల్, ముకేశ్ కుమార్, ముఖ్తార్ హుస్సేన్, మహ్మద్ షమి

40 రోజుల ముందే..

మహిళల వన్డే ప్రపంచకప్‌నకు భారత జట్టు ఎంపిక నేడు



హర్మన్‌ప్రీత్

ముంబయి: మహిళల వన్డే ప్రపంచకప్, ఆస్ట్రేలియాతో సిరీస్‌లో పోటీపడే భారత జట్టును మంగళవారం ఎంపిక చేయనున్నారు. ఎనిమిది జట్లు పోటీపడే ప్రపంచకప్ సెప్టెంబరు 30న ఆరంభం కానుంది. భారత్ ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీలో పాకిస్థాన్ తన మ్యాచ్‌లన్నింటినీ కొలంబోలో ఆడుతుంది. టోర్నీ మొదలవడానికి 40 రోజుల ముందే భారత జట్టును ప్రకటించబోతున్నారు. ఇటీవలే ఇంగ్లాండ్‌ను టీ20, వన్డే సిరీస్‌ల్లో ఓడించిన భారత జట్టు.. ఎంతో ఆత్మవిశ్వాసంతో టోర్నమెంట్లో అడుగుపెట్టనుంది. ప్రపంచకప్ కన్నా ముందు భారత్.. ఆసీస్‌తో మూడు వన్డేలు ఆడుతుంది. నీతూ డేవిడ్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ.. బ్యాటర్ షెఫాలి వర్మ, పేసర్ రేణుక ఠాకూర్‌లను ప్రపంచకప్‌నకు ఎంపిక చేస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. ఓపెనింగ్ బ్యాటర్ అయిన షెఫాలి వన్డేలు ఆడి దాదాపు ఏడాది కావస్తోంది. మరోవైపు స్మృతి మంధానతో కలిసి ప్రతీక రావల్ ఓపెనర్‌గా రాణిస్తోంది. దూకుడు పెంచడం కోసం కుదురుకున్న లైనప్‌ను సెలక్టర్లు కదిలిస్తారా అన్నది చూడాలి. ఇక రేణుక గాయం కారణంగా ఇంగ్లాండ్ పర్యటనకు దూరమైంది. మార్చి నుంచి ఆమె ఆడట్లేదు. ఆమె పనిభారం గురించి చర్చించి సెలక్షన్ కమిటీ నిర్ణయం తీసుకోనుంది. ఫిట్‌గా ఉంటే ఆమె పునరాగమనానికి ఆస్ట్రేలియాతో సిరీస్ చక్కని వేదిక అవుతుంది. ప్రపంచకప్ కోసం ఎంపిక చేసే జట్టులో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతీక రావల్, హర్లీన్ డియోల్, జెమీమా, రిచా ఘోష్, యాస్తిక భాటియా, దీప్తి శర్మ, స్నేహ్ రాణా, శ్రీచరణి, రాధా యాదవ్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, రేణుక, అమన్‌జ్యోత్ ఉంటారని అంచనా.

సర్ఫరాజ్ మెరుపు శతకం

● ముంబయి 367/5
● బుచ్చిబాబు ట్రోఫీ



సర్ఫరాజ్

చెన్నై: భారత టెస్టు జట్టులో పునరాగమనం చేయాలనే సంకల్పంతో ఉన్న యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ (138; 114 బంతుల్లో 10×4, 6×6).. బుచ్చిబాబు ట్రోఫీలో సత్తా చాటాడు. తమిళనాడుతో మ్యాచ్‌లో అతడు సెంచరీ బాదాడు. సర్ఫరాజ్ మెరుపులతో తొలి రోజు, సోమవారం ఆట చివరికి ముంబయి తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 367 పరుగులు చేసింది. 98 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన ముంబయిని.. అయిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన సర్ఫరాజ్ ఆదుకున్నాడు. ఆరో వికెట్‌కు ఆకాశ్ పార్కర్ (67)తో 129 పరుగులు జోడించాడు. దూకుడుగా ఆడిన అతడు 92 బంతుల్లోనే సెంచరీ మైలురాయిని అందుకున్నాడు. ఆట ఆఖర్లో సర్ఫరాజ్ రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. చివరిగా సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో సర్ఫరాజ్ ఆడాడు. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులు చేసిన అతడు.. తర్వాత మూడు ఇన్నింగ్స్‌ల్లో (11, 9, 0) విఫలమయ్యాడు. ఆపై ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికైనప్పటికీ, తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు జట్టులోనే లేడు. ఆహారాన్ని నియంత్రించి, జిమ్‌లో కష్టపడి సర్ఫరాజ్ రెండు నెలల వ్యవధిలో 17 కేజీలు తగ్గడం విశేషం.

ఛాంపియన్

ఎంతో ఆసక్తి రేకెత్తిస్తున్న ఆసియాకప్ జట్టు ఎంపికకు సమయం ఆసన్నమైంది. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ కోసం భారత జట్టును నేడు ఎంపిక చేయనున్నారు. సూపర్ ఫామ్‌లో ఉన్న టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఐపీఎల్‌లో అదరగొట్టిన శ్రేయస్ అయ్యర్‌లకు అవకాశం దక్కుతుందా లేదా అన్నది ఉత్కంఠ రేపుతోంది.

ఎవరికో ఛాన్స్!

ఆసియాకప్‌నకు భారతజట్టు ఎంపిక నేడే

ముంబయి



గంభీర్, అగార్కర్

అవకాశమెవరికో... నిరాశ ఎవరికో! టీ20 ఆసియాకప్‌నకు భారత జట్టులో ఎవరుంటారన్నది ఆసక్తికరం. టోర్నీ కోసం 15 మంది సభ్యుల జట్టును ఎంపిక చేసేందుకు అగార్కర్ నేతృత్వంలో సెలక్షన్ కమిటీ మంగళవారం సమావేశం కానుంది. ఆసియాకప్‌తో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మొదలయ్యే టీ20 ప్రపంచకప్‌నకు టీమ్‌ఇండియా సన్నాహం మొదలవుతుంది. ఈ నేపథ్యంలో జట్టులో చోటు కోసం గట్టి పోటీ ఉంది. ముఖ్యంగా శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ పొట్టి క్రికెట్లోకి పునరాగమనం చేస్తారా అన్నది చర్చనీయాంశంగా మారింది. వీళ్లిద్దరు ఈ ఫార్మాట్లో ఆడి ఏడాది దాటిపోయింది. భారత్ ఆడిన గత 12 టీ20ల్లోనూ ఆరంభం చేసిన అభిషేక్ శర్మ, సంజు శాంసన్ ఓపెనర్లుగా స్థిరపడ్డారు. ఇటీవలే సొంతగడ్డపై ఇంగ్లాండ్‌తో ఆడిన టీ20 సిరీస్‌లో అభిషేక్.. 219.68 స్ట్రైక్‌రేట్‌తో 279 పరుగులు చేసి టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఎడమచేతి వాటం స్పిన్‌తో మూడు వికెట్లు కూడా పడగొట్టాడు. ఇక వికెట్ కీపర్ బ్యాటర్ శాంసన్ ఐపీఎల్‌లో, ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో అస్థిర ప్రదర్శన చేసినా.. అంతకుముందు దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్‌లపై చెలరేగిపోయాడు. అయిదు ఇన్నింగ్స్‌ల్లో మూడు శతకాలు బాదేశాడు. అతణ్ని కొనసాగించే అవకాశాలు మెండు. ఈ పరిస్థితుల్లో గిల్, జైస్వాల్‌లో ఒకరికే అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు. ఇందులో జైస్వాలే ముందున్నట్లు తెలుస్తోంది. జైస్వాల్ మూడో ఓపెనర్‌గా ఎంపికయ్యే అవకాశముంది. నిరుడు టీ20 ప్రపంచకప్‌లో కూడా జైస్వాల్ రిజర్వ్ ఓపెనర్‌గా ఉన్నాడు. మరోవైపు స్పీడ్‌స్టర్ జస్‌ప్రీత్ బుమ్రా పునరాగమనం చేయడం లాంఛనమే. భారత పేస్ దళానికి అతడు నాయకత్వం వహిస్తాడు. తాను ఆసియా కప్‌నకు అందుబాటులో ఉంటానని బుమ్రా.. సెలక్టర్లకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రసిద్ధ్‌కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్ అతడితో కలిసి పేస్ భారాన్ని పంచుకోవచ్చు. ఇంగ్లాండ్‌లో టెస్టు సిరీస్‌లో విశేషంగా రాణించినప్పటికీ మహ్మద్ సిరాజ్ జట్టులోకి వచ్చే అవకాశం లేదు. ఈ ఏడాది ఆడిన అయిదు టీ20 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు పడగొట్టిన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని ఆసియాకప్ జట్టుకు దూరంగా ఉంచడం కష్టమే.



శ్రేయస్

శ్రేయస్‌కు నిరీక్షణ తప్పదా!

మిడిల్ ఆర్డర్‌లో సూర్యకుమార్, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్ స్థానాలు ఖాయం చేసుకున్నారు. తిలక్ వర్మ, రింకు సింగ్ జట్టులో ఉండే అవకాశమున్న ఇతర బ్యాటర్లు. శివమ్ దూబె, వాషింగ్టన్ సుందర్‌లను ఎంపికకు పరిగణనలోకి తీసుకోవచ్చు. ఈ ఏడాది ఐపీఎల్‌లో పరుగుల వరద పారించిన శ్రేయస్ అయ్యర్ కూడా జట్టులో స్థానానికి గట్టి పోటీదారనడంలో సందేహం లేదు. కానీ అతడు ఇంకొంతకాలం నిరీక్షించక తప్పదేమో. సెలక్షన్ కమిటీ అతణ్ని కాదని జితేశ్ శర్మ వైపు మొగ్గుచూపొచ్చు. రెండో వికెట్‌కీపర్ బ్యాటర్‌గా జితేశ్ జట్టులోకి రావొచ్చు. ఐపీఎల్‌లో అతడు బ్యాటుతో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఆసియాకప్ సెప్టెంబరు 9న యూఏఈలో ఆరంభం కానుంది. పాకిస్థాన్, యూఏఈ, ఒమన్‌లతో పాటు భారత్ గ్రూప్-ఎలో ఉంది. శ్రీలంక, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, హాంకాంగ్ గ్రూప్-బిలో పోటీపడనున్నాయి. సెప్టెంబరు 10న యూఏఈతో పోరుతో టీమ్ ఇండియా తన కప్పు వేటను ప్రారంభిస్తుంది.

పాక్ స్థానంలో బంగ్లాదేశ్

దిల్లీ: ఆసియా కప్ హాకీ టోర్నీలో పాకిస్థాన్ స్థానాన్ని బంగ్లాదేశ్‌తో భర్తీ చేసే అవకాశముంది. టోర్నీలో పాల్గొనే విషయాన్ని వీలైనంత త్వరగా ధ్రువీకరించకపోతే పాక్ స్థానంలో బంగ్లాను ఆడిస్తామని హాకీ ఇండియా (హెచ్ఐ) అధికారి స్పష్టం చేశాడు. ఈనెల 29న బిహార్‌లోని రాజ్‌గిర్‌లో ఆసియా కప్ ప్రారంభంకానుంది. ఈ టోర్నీ కోసం పాక్ ఆటగాళ్లకు వీసాలు అందిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పేర్కొంది. అయితే భద్రత కారణాల దృష్ట్యా భారత్‌లో పర్యటించేందుకు పాక్ హాకీ సమాఖ్య (పీహెచ్ఎఫ్) నిరాకరించింది. ఎనిమిది జట్లు బరిలో దిగుతున్న ఈ టోర్నీలో పాక్ స్థానాన్ని భర్తీ చేయడానికి నిర్వాహకులు ఇప్పటికే బంగ్లాను సంప్రదించారు. రానున్న 48 గంటల్లో ఈ విషయంలో పూర్తి స్పష్టత వస్తుందని హెచ్ఐ తెలిపింది. "పాక్ ఆటగాళ్లకు వీసాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు భారత ప్రభుత్వం ఇప్పటికే స్పష్టంచేసింది. అయినా భారత్‌కు రాకూడదనుకుంటే అది మా సమస్య కాదు. పాక్ రాకపోతే బంగ్లాను పాల్గొనాలని ఆహ్వానించాం. పాక్ వస్తుందో రాదో నిర్ధారించుకోడానికి మరో రెండు రోజులు వేచి చూడాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు పాక్ లేదా బంగ్లా నుంచి ఎలాంటి ధ్రువీకరణ లేదు. కానీ పాక్ స్థానంలో బంగ్లా ఆడే అవకాశముంది" అని హెచ్ఐ అధికారి పేర్కొన్నాడు.

నేటి నుంచే 'మిక్స్‌డ్' మజా

బరిలో స్టార్ జోడీలు ● యుఎస్ ఓపెన్



సినియాకోవా



సినర్

న్యూయార్క్: యుఎస్ ఓపెన్ ఈసారి ఎంతో ప్రత్యేకం. ప్రతి సంవత్సరం టోర్నమెంట్లో భాగంగా జరిగే మిక్స్‌డ్ డబుల్స్ పోటీలు ఈ ఏడాది సింగిల్స్ డ్రాకు ముందే జరగబోతున్నాయి. ఇక రెండు రోజులు (19, 20 తేదీలు) మిక్స్‌డ్ సందడే! తక్కువ సమయంలో విజేత తేలిపోతుండడం, ప్రైజ్‌మనీ భారీగా దక్కుతుండడంతో స్టార్ ప్లేయర్లు పోటీపడుతున్నారు. జకోవిచ్-డానిలోవిచ్, సినర్-సినియాకోవా, అల్కరాస్-రదుకాను తదితర జంటలను మిక్స్‌డ్ పోటీల్లో చూడొచ్చు. 16 జోడీలు పోటీలో ఉన్నాయి. పోటీలు నేరుగా ప్రిక్వార్టర్స్‌తో మొదలవుతాయి. కంబైన్డ్ సింగిల్స్ ర్యాంకు ఆధారంగా ఎనిమిది జంటలకు నేరుగా ప్రవేశం దక్కగా.. మరో ఎనిమిది జోడీలు వైల్డ్‌కార్డుతో ఆడుతున్నాయి. ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినర్ (ఇటలీ).. నవారోతో సినర్ కలిసి ఆడాల్సి ఉండగా.. ఆమె తప్పుకోవడంతో సినియాకోవా జతగా బరిలోకి దిగుతున్నాడు. తొలి రౌండ్లో జ్వెరెవ్-బెన్సిచ్ జంటతో సినర్-సినియాకోవా జోడీ తలపడనుంది. అల్కరాస్-రదుకాను తొలి రౌండ్లోనే క్లిష్టమైన పోటీని ఎదుర్కోనున్నారు. టాప్ సీడ్ జోడీ జెస్సికా పెగులా-జేక్ డ్రేపర్ ద్వయంతో అల్కరాస్ ద్వయం పోటీపడనుంది. మరోవైపు జకోవిచ్-డానిలోవిచ్ జంట తొలి రౌండ్లో ఆండ్రీవా-మెద్వెదెవ్ జోడీతో తలపడనుంది. 45 ఏళ్ల వయసులో గ్రాండ్‌స్లామ్ బరిలో దిగుతున్న అమెరికా వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. తొలి రౌండ్లో వీనస్-రిలీ ఒపెల్కా జంట రుబ్లెవ్-ముచోవా జోడీతో పోటీపడనుంది. టోర్నీ విజేతకు రూ.8 కోట్ల 76 లక్షల ప్రైజ్‌మనీ దక్కనుంది.

ఫైనల్లో సుమిత్, కాంస్య పోరుకు అమిత్


అండర్-20 ప్రపంచ రెజ్లింగ్

సమకోవ్: అండర్-20 రెజ్లింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు సుమిత్ మలిక్, అమిత్ సత్తా చాటారు. సుమిత్ 57 కేజీల విభాగంలో ఫైనల్ చేరాడు. అతను సెమీఫైనల్లో 11-3తో ఇయాన్ బుల్గరు (మాల్డోవా)ను చిత్తు చేశాడు. ఫైనల్లో సుమిత్.. సలియాక్ (రష్యా)ను ఢీకొంటాడు. 79 కేజీల విభాగంలో అమిత్ కాంస్య పోరుకు అర్హత సాధించాడు. సెమీస్‌లో అమిత్ 4-5తో విలియమ్ ప్యాట్రిక్ (అమెరికా) చేతిలో పోరాడి ఓడాడు.

క్రీడా బిల్లులో స్వల్ప మార్పులు

దిల్లీ: యువ పరిపాలకుల్ని తీర్చిదిద్దేందుకు.. క్రీడాకారుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు నూతన జాతీయ క్రీడా బిల్లు దోహదపడుతుందని కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ అన్నారు. జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్ఎఫ్ఎస్)లలో అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవుల అర్హతను మరింత సరళం చేసినట్లు తెలిపారు. గతంలో ఎన్ఎఫ్ఎస్‌లో ఈ మూడు కీలక పదవులకు పోటీ చేయాలంటే ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ)లో రెండు పర్యాయాలు పనిచేయాలన్న కనీస అర్హత నిబంధనకు తాజా క్రీడా బిల్లులో మార్పులు చేశారు. ఇకపై ఈసీలో ఒక దఫా బాధ్యతలు నిర్వర్తించినా.. ఎన్ఎఫ్ఎస్‌లలో అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు అర్హులు కావొచ్చు. గతవారం క్రీడా బిల్లుకు పార్లమెంటు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. రాష్ట్రపతి ఆమోదం లభించగానే ఈ బిల్లు చట్టంగా మారుతుంది. "సమాఖ్యల ఎన్నికలలో పోటీ చేయడానికి కనీస ముందస్తు పదవీకాల అర్హతను తగ్గించాలన్న నిర్ణయం అర్హత కలిగిన, సమర్థులైన అభ్యర్థులకు కలిసొస్తుంది. కొత్త నాయకత్వానికి అవకాశం కల్పిస్తుంది" అని మాండవీయ పేర్కొన్నారు.

పరిమిత ఓవర్ల క్రికెట్లో అతడెందుకు?



గావస్కర్

ముంబయి: టెస్టు క్రికెటే ముఖ్యం అనుకుంటే కీలక పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను పరిమిత ఓవర్ల క్రికెట్‌కు పరిగణించొద్దని భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ సెలక్టర్లను కోరాడు. "ఏది ముఖ్యం? ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించడమా లేక ద్వైపాక్షిక సిరీస్‌లలో పరిమిత ఓవర్ల మ్యాచ్‌లు ఆడడమా? బుమ్రా భారత జట్టుకు ప్రధాన బౌలర్. అలాంటప్పుడు అక్టోబర్, నవంబర్‌లో వెస్టిండీస్, దక్షిణాఫ్రికాతో జరగబోయే నాలుగు టెస్టుల్లో అతడిని ఆడించాలి. పరిమిత ఓవర్ల సిరీస్‌లలో బుమ్రాకు విశ్రాంతి ఇవ్వాలి. ఇంగ్లాండ్ పర్యటనలో అతడిని మూడు టెస్టులే ఆడించడంపై చర్చ నడుస్తోంది. ఈ స్థితిలో బోర్డు సరైన నిర్ణయం తీసుకోవాలి" అని సన్నీ అన్నాడు. పని భార నిర్వహణలో భాగంగా ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల సిరీస్‌లో బుమ్రా మూడు మ్యాచ్‌లే ఆడాడు. వచ్చే నెలలో జరిగే ఆసియాకప్ టీ20 టోర్నీలో బుమ్రాను జట్టులోకి తీసుకుంటారనే వార్తలు వస్తున్నాయి.

షీనా వార్కీపై వేటు



షీనా వార్కీ

దిల్లీ: అంతర్జాతీయ ట్రిపుల్ జంప్ క్రీడాకారిణి షీనా వార్కీపై వేటుపడింది. నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు తేలడంతో ఈ భారత అథ్లెట్‌పై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) సస్పెన్షన్ విధించింది. "షీనా వార్కీని సస్పెండ్ చేశారు" అని నాడా అధికారి తెలిపాడు. హాంగ్‌జౌ ఆతిథ్యమిచ్చిన 2023 ఆసియా క్రీడల్లో భారత్‌కు 32 ఏళ్ల షీనా ప్రాతినిధ్యం వహించింది. కేరళకు చెందిన షీనా ఈ ఏడాది ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో రజత పతకం సాధించింది. ఫెడరేషన్ కప్‌లో కాంస్యం నెగ్గింది. 2018లో ఆసియా ఇండోర్ ఛాంపియన్‌షిప్‌లో రజతం గెలుచుకుంది. డోప్ పరీక్షల్లో భారత క్రీడాకారులు వరుసగా విఫలమవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈనెల 11న జాతీయ క్రీడల స్వర్ణ పతక విజేత గగన్‌దీప్‌సింగ్ సహా కొంతమంది క్రీడాకారులపై నాడా మూడేళ్ల నిషేధం విధించింది. తాజాగా షీనా పాజిటివ్‌గా తేలడం అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు మరింత ఇబ్బందికరంగా మారింది.

ఈనాడు

విజయవాడ 19-8-2025 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 10
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

2040లో చందమామపైకి భారత వ్యోమగామి



- 2027లో మానవసహిత గగన్‌యాన్
- శుక్లా ఘనతపై లోక్‌సభ చర్చలో కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ వెల్లడి

దిల్లీ: వికసిత భారత్‌కు దూతగా 2040లో భారతీయ వ్యోమగామి చందమామపై అడుగుపెట్టనున్నాడని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. శుభాంశు శుక్లాను అభినందిస్తూ కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ సోమవారం లోక్‌సభలో చర్చను ప్రారంభించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారేందుకు అంతరిక్ష కార్యక్రమంలో ఈ యాత్ర కీలకపాత్ర పోషిస్తుందని సింగ్ చెప్పారు. 'సంస్కరణల ద్వారా అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని (మిగతా 3లో)



యాక్సియం 4 మిషన్‌కు సంబంధించిన జ్ఞాపికను ప్రధాని మోదీకి బహూకరిస్తున్న శుభాంశు శుక్లా

మోదీతో శుభాంశు శుక్లా భేటీ

రోదసిలోకి తీసుకువెళ్లిన త్రివర్ణ పతాకం అందజేత

దిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి వెళ్లి సురక్షితంగా వచ్చిన తొలి భారతీయ వ్యోమగామి, గ్రూపు కెప్టెన్ శుభాంశు శుక్లా సోమవారం ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. నాసా యాక్సియం-4 మిషన్‌ను ఇటీవల విజయవంతంగా పూర్తిచేసుకున్న శుక్లా ఆదివారం స్వదేశానికి చేరుకున్న విషయం తెలిసిందే. వ్యోమగాములు ధరించే ప్రత్యేక జాకెట్‌తో లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసానికి ఆయన వచ్చినప్పుడు మోదీ స్వాగతం పలికి ఆప్యాయంగా హత్తుకున్నారు. భుజంపై చేయివేసి ఆయనతో కలిసి నడుస్తూ ముచ్చటించారు. తనతోపాటు ఐఎస్ఎస్‌కు తీసుకువెళ్లిన త్రివర్ణ పతాకాన్ని, యాక్సియం-4 మిషన్‌కు సంబంధించిన జ్ఞాపికను శుక్లా ఆయనకు అందజేశారు. రోదసి నుంచి జూన్ 29న ప్రధానితో శుక్లా ముచ్చటించినప్పుడు వెనుకవైపు ఇదే పతాకం రెపరెపలాడుతూ (మిగతా 3లో)

అమరావతికి అభివృద్ధి సిరులు

₹904 కోట్లతో రాజధాని గ్రామాల్లో మౌలిక వసతులు


- కీలక ప్రాజెక్టులకు మరో ఎస్పీవీ
- మంగళగిరిలో గోల్డ్ క్లస్టర్ ఏర్పాటుకు భూసమీకరణ
- ఎస్ఆర్ఎం, విట్‌లకు మరో 100 ఎకరాల చొప్పున కేటాయింపు
- సీఎం అధ్యక్షతన సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో నిర్ణయం

ఈనాడు - అమరావతి

రాజధాని అమరావతిలో గ్రామకంఠాల్లోగల 29 గ్రామాల్లో రూ.904 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. వీటిని అభివృద్ధి చేసి రాజధాని ప్రాంతానికి అనుసంధానించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సీఆర్‌డీఏ అథారిటీ 51వ సమావేశం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. మంగళగిరిలో 78.01 ఎకరాల్లో గోల్డ్ క్లస్టర్ ఏర్పాటుకు భూ సమీకరణ చేయాలని సమావేశంలో నిర్ణయించారు. రాజధానిలో అంతర్జాతీయ విమానాశ్రయం, స్పోర్ట్స్ సిటీ, ఐకానిక్ బ్రిడ్జి వంటి ప్రాజెక్టుల పనుల కోసం మరో ఎస్పీవీ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. భూ సమీకరణలో భూములిచ్చిన రైతులకు నష్టం లేకుండా వారికి ప్లాట్లు కేటాయించేటపుడు (రిటర్నబుల్ ప్లాట్లు) ఎసైన్డ్ పదాన్ని తొలగించాలని నిర్ణయించారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, విట్‌కు డెంటల్, మెడికల్, పారా మెడికల్ కళాశాలల ఏర్పాటుకు రాజధానిలో మరో వంద ఎకరాలు చొప్పున కేటాయించాలని తీర్మానించారు. ఈ రెండు సంస్థలు 17 వేల మందితో నడిపాక అదనపు భూమి కేటాయించాలన్న ఒప్పందం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశం అనంతరం పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ ఈ వివరాలను విలేకర్లకు వెల్లడించారు.

తాగునీరు, రోడ్లు, మురుగునీటి శుద్ధి

'రాజధాని పరిధిలోని 217 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో గ్రామకంఠాల్లోగల గ్రామాల్లో రూ.64.35 కోట్లతో తాగునీటి సౌకర్యం, రూ.339.04 కోట్లతో రహదారులు, రూ.110.72 కోట్లతో మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, రూ.12.25 కోట్లతో వీధి దీపాలు ఏర్పాటు చేయనున్నాం. ఈ నెల 21న నిర్వహించే మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తీసుకుని పనులకు టెండర్లు పిలవనున్నాం. ఏడేళ్లపాటు ప్రాజెక్టుల నిర్వహణ (ఓఅండ్ఎం)తో సహా మొత్తం రూ.904 కోట్లు ఖర్చు చేయనున్నాం. రాజధానిలో రూ.787.59 కోట్లతో వాడిన నీరు (యూజ్డ్ వాటర్) శుద్ధి చేసే ప్లాంట్ల ఏర్పాటుకు రెండు ప్యాకేజీల్లో టెండర్లు పిలవబోతున్నాం. మహాలక్ష్మి హోటల్ కన్సార్షియంకు రాజధానిలో ఎకరా భూమి కేటాయించాలని నిర్ణయించాం. మంగళగిరిలో గోల్డ్ క్లస్టర్ ఏర్పాటు ద్వారా జెమ్స్, జ్యూయలరీ విభాగంలో రూ.5 వేల కోట్ల పెట్టుబడులతో ప్రత్యక్షంగా 20 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నాం. రాజధాని నగరం డిజైన్ చేసినప్పుడు సీడ్ క్యాపిటల్‌కు కుడి, ఎడమ వైపున రెండు వంతెనలు నిర్మించాలనుకున్నాం. ఇందులో భాగంగానే వైకుంఠపురం వద్ద ఐకానిక్ బ్రిడ్జి రానుంది. కరకట్ట రోడ్డుపై రెండు వైపులా రిటైనింగ్ వాల్ కట్టాలా (మిగతా 3లో)



పులివెందులలో కాలర్ ఎగరేసుకు తిరిగేలా చేశారు

నాయకులు, కార్యకర్తలకు చంద్రబాబు అభినందన 12లో



ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంటు ఆవరణలో ఆందోళన చేస్తున్న విపక్ష ఎంపీలు అభిషేక్ బెనర్జీ, మల్లికార్జున ఖర్గే, అఖిలేశ్ యాదవ్, కల్యాణ్ బెనర్జీ తదితరులు

జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన?

- తీర్మానానికి విపక్షాలు సిద్ధం.. త్వరలో నిర్ణయం!
- రాజ్యాంగ విధుల నిర్వహణలో ఈసీ పూర్తిగా విఫలమైందని ఆరోపణ

దిల్లీ: బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)పై, 'ఓట్ల చోరీ'పై ఆందోళనను ముమ్మరం చేయడంతో పాటు కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్ష 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలు పావులు కదుపుతున్నాయి. ఈ విషయంపై చర్చించేందుకు ప్రతిపక్ష సభ్యులు సోమవారం రాజ్యసభలో విపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆదివారం మీడియాను ఉద్దేశించి మాట్లాడిన సీఈసీ ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలకు బదులివ్వడానికి బదులు ఏదేదో (మిగతా 3లో)

ఉక్రెయిన్‌పై త్రైపాక్షిక భేటీ



అమెరికాలోని శ్వేతసౌధంలో జెలెన్‌స్కీతో చర్చలు జరుపుతున్న ట్రంప్

- పుతిన్‌తోనూ మాట్లాడతాను
- రష్యాతో యుద్ధం ముగియబోతోంది: ట్రంప్
- ఐరోపాకు భద్రతా హామీలు కోరిన నేతలు
- కాల్పుల విరమణకు పట్టు
- దానివల్ల ఉపయోగం ఉంటే ప్రయత్నిస్తానన్న ట్రంప్
- శ్వేతసౌధంలో జెలెన్‌స్కీ, మెక్రాన్, స్టార్మర్ తదితరులతో చర్చలు

వాషింగ్టన్

ఉక్రెయిన్‌కు తాము పూర్తి రక్షణ కల్పిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భరోసా ఇచ్చారు. సమస్య పరిష్కారానికి త్రైపాక్షిక భేటీ జరపనున్నట్లు వెల్లడించారు. దానికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా సమ్మతి తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగియబోతోందని, అయితే అది ఎప్పుడన్నదీ స్పష్టంగా చెప్పలేనని ట్రంప్ వ్యాఖ్యానించారు. మూడున్నరేళ్లుగా కొనసాగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు సోమవారం శ్వేతసౌధం ఓవల్ కార్యాలయంలో ఆయన కీలక భేటీలు నిర్వహించారు. తొలుత ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చర్చించుకున్నారు. ఆ తర్వాత ఐరోపా నేతలతో సమావేశమయ్యారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడెరిక్ మెర్జ్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్, నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టె, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్‌లెయన్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఉక్రెయిన్‌తో పాటు ఐరోపాకూ అమెరికా నుంచి భద్రతపరంగా హామీ కావాలని ఆయా దేశాల నేతలు కోరారు. కాల్పుల విరమణకు వారు గట్టిగా ప్రతిపాదించారు. అది ఎంతవరకు ఫలిస్తుందో అనుమానమేనని, సత్ఫలితాన్ని ఇస్తుందంటే మాత్రం ఒత్తిడి తెస్తానని ట్రంప్ బదులిచ్చారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ ఫోన్లో మాట్లాడతానని ప్రకటించారు. "ఐరోపా దేశాలు మొదటి రక్షణ కంచెగా ఉన్నాయి. వారికీ మేం భద్రత కల్పిస్తాం. ఉక్రెయిన్‌కు ఎంతో మంచి రక్షణ, భద్రత కల్పిస్తాం. శాంతి ఒప్పందంలో భాగంగా నాటో (మిగతా 3లో)



దిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో చర్చిస్తున్న మంత్రి లోకేశ్

ఆర్థిక చేయూతనివ్వండి

దిల్లీలో ఎనిమిది మంది కేంద్ర మంత్రులతో మంత్రి లోకేశ్ వరుస భేటీలు

- జైశంకర్‌తో సింగపూర్ పర్యటన విశేషాల ప్రస్తావన
- సరిపడా యూరియా సరఫరాకు జేపీ నడ్డా హామీ
- మిర్చి, జీడి, మామిడి బోర్డులు ఏర్పాటు చేయాలని పీయూష్ గోయల్‌కు వినతి
- హైవేలు, మౌలిక వసతులపై గడ్కరీకి విజ్ఞప్తి
- సెమీకండక్టర్ యూనిట్ మంజూరుపై అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు

ఈనాడు, దిల్లీ: రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ సోమవారం ఇక్కడ ఎనిమిది మంది కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు. రాష్ట్ర సమస్యలపై విన్నవించడానికి దిల్లీకి వచ్చిన ఆయన ఉదయం 10.30 నుంచి రాత్రి 10.40 వరకు విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్, ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డా, పెట్రోలియం మంత్రి హర్దీప్‌సింగ్ పురి, రహదారి రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, నౌకాశ్రయాలు, జలరవాణా మంత్రి శర్బానంద్ సోనోవాల్, ఐటీ, ఎలక్ట్రానిక్స్, రైల్వే శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో విడివిడిగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి డేటా సెంటర్లు, బీపీసీఎల్ రిఫైనరీ, వివిధ హైవేలు, దుగరాజపట్నం సహా పలు పోర్టుల నిర్మాణాలకు (మిగతా 2లో)

కరిగి నీరైన మేఘం.. తోడైన వాయుగుండం



గోదావరి నదిలో వరద పెరిగి నీట మునిగిన అల్లూరి సీతారామరాజు జిల్లా పోశమ్మగండి గ్రామంలోని గండిపోశమ్మ అమ్మవారి ఆలయం

- ఉత్తరాంధ్రలో పలుచోట్ల రాకపోకలకు అంతరాయం
- 44 ప్రాంతాల్లో 10 సెం.మీ.కు పైగా వర్షపాతం
- 1.83 లక్షల ఎకరాల్లో నీటమునిగిన పంటలు
- పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం
- రేపు, ఎల్లుండి కోస్తాలో భారీ వర్షాలకు అవకాశం

ఈనాడు - విశాఖపట్నం, అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏకధాటిగా కురుస్తూనే ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో వరద నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా విశాఖ జిల్లా కాపులుప్పాడలో 16.1 సెం.మీ., గంభీరంలో 15.8, పరదేశిపాలెంలో 14.7, భీమునిపట్నంలో 13.8, మధురవాడలో 13.8, అల్లూరి (మిగతా 3లో)

ఈకలు కరవై.. ఆట బరువై!

- ఏడాదిలో 158% పెరిగిన షటిల్‌కాక్‌ల బ్యారెల్ ధర
- చైనాలో గూస్‌లు లేక తగ్గిన ఉత్పత్తి
- ఆ దేశంలో ఆహారపు అలవాట్లు మారడమే కారణం



ఈనాడు, అమరావతి: షటిల్‌కాక్ ధరలు భయపెడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోతున్నాయి. చైనాలో గూస్ (ఓ రకమైన బాతు) మాంసం తినడం దాదాపుగా ఆపేయడమే ఇందుకు కారణం. గూస్ ఎడమ రెక్క ఈకలతో తయారయ్యే షటిల్‌కాక్‌లకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో డిమాండ్ ఉంది. దీని తయారీకి 16 ఈకలు కావాలి. రెండు, అంతకంటే ఎక్కువ గూస్‌ల ఈకలు అవసరం. బేస్‌కు ఓక్, రబ్బరు మిశ్రమాన్ని ఉపయోగిస్తారు. ఎంతో నాణ్యమైన వీటిని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ఉపయోగిస్తారు. బాతు ఈకల నుంచి కూడా షటిల్‌కాక్‌లు తయారుచేస్తారు. గూస్ ఈకలతో తయారైనవాటితో పోల్చితే వీటి ధరలు తక్కువ. ప్రస్తుతం చైనా ప్రజలు పంది మాంసంపై ఆసక్తి చూపుతున్నారు. గూస్‌ల పెంపకం తగ్గించేశారు. బర్డ్‌ఫ్లూ భయంతో పెద్దఎత్తున వీటిని చంపేయడమూ మరో కారణం. ఫలితంగా వాటి ఈకల సరఫరా కూడా బాగా పడిపోయింది. ఈ కారణాల వల్ల షటిల్‌కాక్‌ల తయారీ తగ్గిపోయింది. ధర ఏడాదిలో 158% మేర పెరిగింది.

ప్రత్యామ్నాయం లేదా?

ప్లాస్టిక్, నైలాన్‌తో తయారుచేసిన షటిల్‌కాక్‌లు అందుబాటులో ఉన్నాయి. సంప్రదాయ (మిగతా 3లో)

ఏడాదిలో రూ.1,200 నుంచి రూ.3,100

ఫెదర్‌కాక్‌ల ఉత్పత్తిలో తొలిస్థానం చైనాదే. 70-80% పైగా ఆ దేశం నుంచే సరఫరా అవుతాయి. భారత్‌తో పాటు వియత్నాం, ఇండోనేసియా లోనూ కొన్ని సంస్థలు కొంతమేర ఉత్పత్తి చేస్తున్నాయి. ఏడాదిగా సరఫరా తగ్గిపోవడంతో ధరల పెరుగుదల మొదలైంది. ఏఎస్-2 రకం షటిల్‌కాక్ బ్యారెల్ ధర 2024 ప్రారంభంలో రూ.1,200 ఉండేది. క్రమంగా పెరుగుతూ రూ.3,100కు చేరింది. రాబోయే రోజుల్లో మరింత పెరగనుంది. బ్యాడ్మింటన్ అకాడమీల బడ్జెట్‌లో 80% వరకు ఇప్పటికే వీటికి ఖర్చుచేయాల్సి వస్తోంది. జాతీయ, అంతర్జాతీయ పోటీలకు హాజరయ్యే వారికి నెలకు కనీసం 15 బ్యారెల్స్ అవసరం. ఇందుకోసం నెలకు రూ.45 వేలకు పైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. అయినా అవసరాలకు సరిపడా లభించడం లేదు.

ఆకులు కావివి..



చిగురిస్తున్న ఆకుల్లా కనిపిస్తున్నా.. ఎవరైనా అటువైపు వెళితే రివ్వున ఎగిరిపోతూ చూపరులను ఆకట్టుకుంటున్న ఈ అందాల భామలు సీతాకోకచిలుకలు! తెలంగాణలోని ఆదిలాబాద్ గ్రామీణ మండలం ఖండాలా ఘాట్ రోడ్డు పక్కన ఇలా నేలను ముద్దాడుతూ కనిపించాయి.

- ఈనాడు, ఆదిలాబాద్

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

మరికొన్ని ఆసక్తికర చిత్రాలు 11లో

ఉప రాష్ట్రపతి ఎన్నికకు.. రేపు సీపీ రాధాకృష్ణన్ నామినేషన్

ఈనాడు, దిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఎన్డీయే అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ బుధవారం మధ్యాహ్నం 12 గంటలలోపు నామినేషన్ వేయనున్నారు. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజూ సోమవారం ఇక్కడ ప్రకటించారు. ఎన్డీయే అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం ముంబయి నుంచి దిల్లీ చేరుకున్నారు. సాయంత్రం ప్రహ్లాద్ జోషీ నివాసంలో ఎన్డీయే పార్టీల ఉభయసభాపక్ష నేతలతో రాధాకృష్ణన్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెదేపా తరఫున రామ్మోహన్‌నాయుడు, లావు శ్రీకృష్ణ దేవరాయలు, జనసేన పక్ష నేత వల్లభనేని బాలశౌరి పాల్గొన్నారు. రాధాకృష్ణన్ తనను తాను పరిచయం చేసుకున్నారు. 1998లో కోయంబత్తూరు లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికైనప్పటి నుంచి మహారాష్ట్ర గవర్నర్ వరకు తన రాజకీయ ప్రస్థానాన్ని వివరించారు. తన అభ్యర్థిత్వానికి మద్దతు పలికినందుకు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఉదయం పార్లమెంటు ఆవరణలో జరిగే ఎన్డీయే ఎంపీల సమావేశంలో రాధాకృష్ణన్ పాల్గొంటారని, ఓటర్లైన ఎంపీల మద్దతు కోరతారని రిజిజూ తెలిపారు. 'సీపీ రాధాకృష్ణన్ లాంటి మంచి వ్యక్తిని 17వ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు ఎన్డీయే తరఫున ప్రధానికి ధన్యవాదాలు. ఆయనకు అన్నిపార్టీలూ మద్దతు పలుకుతాయని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. మరోపక్క, ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు కూడగట్టేందుకు కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివిధ రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నారు.



ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు చెబుతున్న మంత్రి నారా లోకేశ్

రాధాకృష్ణన్‌తో లోకేశ్ 40 నిమిషాలు భేటీ

రాధాకృష్ణన్‌తో తెదేపా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సోమవారం దిల్లీలో సుమారు 40 నిమిషాల పాటు భేటీ అయ్యారు. ప్రహ్లాద్ జోషీ నివాసంలో పార్టీ ఎంపీలతో కలిసి రాధాకృష్ణన్‌ను శాలువాతో సన్మానించారు. వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. పార్టీ ఎంపీలను పేరుపేరునా పరిచయం చేసి, వీరంతా మీ కుటుంబసభ్యులేనని పేర్కొన్నారు. తన అభ్యర్థిత్వాన్ని బలపరిచినందుకు తెదేపా అధ్యక్షుడు చంద్రబాబుతో పాటు పార్టీ ఎంపీలందరికీ రాధాకృష్ణన్ ధన్యవాదాలు తెలిపారు. 'సంపద సృష్టించి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా పేదలకు పంచాలన్న చంద్రబాబు ఆలోచనా విధానం మంచిది. మోదీ, చంద్రబాబుల జోడీతో దీన్ని మరింత సమర్థంగా అమలు చేయొచ్చు. ఎంపీలంతా ఆ దిశగా కృషి చేయాలి. ఈ ఎన్నికలో అభ్యర్థిని నేనుకాదు, మీరే' అని రాధాకృష్ణన్ వ్యాఖ్యానించారు. మూడు రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేసిన మీ అనుభవం భవిష్యత్తులో దేశానికి గొప్పగా సేవలు అందించడానికి ఉపకరిస్తుందని లోకేశ్ బదులిచ్చారు. నిరాడంబరత, క్రమశిక్షణ, పట్టుదలకు మారుపేరైన మీరు తమలాంటి కొత్త తరానికి ఆదర్శప్రాయులని పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైతే, దాని సమన్వయం కోసం లోకేశ్ సెప్టెంబర్ 8న దిల్లీకి వస్తారని తెలిసింది.

జీడి, మిర్చి, మామిడి బోర్డులు ఏర్పాటు చేయండి

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో భేటీలో లోకేశ్



ఈనాడు, దిల్లీ: శ్రీకాకుళంలో జీడి, గుంటూరులో మిర్చి, చిత్తూరులో మామిడి బోర్డులు ఏర్పాటు చేయాలని కేంద్ర వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్‌ను మంత్రి లోకేశ్ కోరారు. 'జీడిపప్పు ఉత్పత్తిలో ఏపీ రెండో స్థానంలో ఉంది. ప్రాసెసింగ్ వ్యవస్థ ఆధునికీకరణ, సరైన మార్కెటింగ్ కోసం జీడి బోర్డు అవసరం. మిర్చి బోర్డు ఏర్పాటైతే ధరల హెచ్చుతగ్గులను నియంత్రించవచ్చు. రాష్ట్రంలో ఏటా దాదాపు 50 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడి వస్తోంది. రైతుల కష్టాలు తొలగించేందుకు చిత్తూరులో మామిడి బోర్డు ఒక్కటే పరిష్కారం. మూలపేట, చిలుమత్తూరు, కుప్పం, దొనకొండల్లో 4 కొత్త పారిశ్రామిక నోడ్‌లను అభివృద్ధి చేసేందుకు అనుమతివ్వాలి. నీరు, విద్యుత్తు, రైల్వే కనెక్టివిటీ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.5,811 కోట్ల గ్రాంట్ మంజూరు చేయండి. విజయవాడ- చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో చిత్తూరు నోడ్ అనుమతివ్వాలి. ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్ మాస్టర్‌ప్లాన్లు ఆమోదం పొంది, టెండర్లకు సిద్ధంగా ఉన్నాయి. వీటి ఈపీసీ విడుదలకు నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి ఆమోదం ఇప్పించండి' అని విజ్ఞప్తి చేశారు.

ఐజేయూ సెక్రటరీ జనరల్‌గా సోమసుందర్



ఈనాడు, హైదరాబాద్: ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) అధ్యక్షుడిగా పంజాబ్, చండీగఢ్ జర్నలిస్టుల యూనియన్ నుంచి బల్వీందర్ సింగ్ జమ్ము, సెక్రటరీ జనరల్‌గా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ నుంచి దూసనపూడి సోమసుందర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి మహేష్‌కుమార్ సిన్హా సోమవారం ప్రకటించారు. సోమసుందర్ విశాలాంధ్ర దినపత్రికలో విలేకరిగా మూడు దశాబ్దాలకు పైగా పని చేశారు. 'జనబలం' మాసపత్రికకు వర్కింగ్ ఎడిటర్‌గా కొనసాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు బాధ్యతలు నిర్వర్తించారు.

కాదన్నానని బదిలీ చేశారు

సీఎస్‌కు లేఖ రాసి, సెలవుపై వెళ్లిన ఆగ్రోస్ జీఎం

ఈనాడు, అమరావతి: వ్యవసాయ యంత్ర పరికరాల తయారీదారులు, వ్యవసాయ శాఖ మంత్రి పేషీకి మధ్యవర్తిగా వ్యవహరించాలని మంత్రి ఓఎస్డీ తనను కోరారని ఏపీ ఆగ్రోస్ జీఎం రాజమోహన్.. ఆ సంస్థ వైస్ ఛైర్మన్, ఎండీకి లేఖ రాశారు. దాని ప్రతిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూడా పంపారు. మంత్రి కార్యాలయ ఓఎస్డీ చెప్పిన మాట వినకపోవడంతో తనను తీవ్ర ఒత్తిడికి గురి చేసి, నెల్లూరుకు బదిలీ చేశారని వాపోయారు. సెలవుపై వెళ్లడం తప్ప, తనకు మరో మార్గం లేదని వివరించారు. ఈ నెల 11న రాసిన లేఖలో రాజమోహన్ పేర్కొన్న అంశాలివి. 'ఏపీ ఆగ్రోస్‌లో ఒప్పంద ఉద్యోగి చేసిన తప్పులను నేను గుర్తించాను. వీసీ, ఎండీ ఆమోదంతో ఆ ఉద్యోగిని దూర ప్రాంతానికి బదిలీ చేశాను. చట్టబద్ధమైన చర్యలు చేపట్టేందుకు షోకాజ్ నోటీస్ ఇచ్చాను. తర్వాత వ్యవసాయ మంత్రి ఓఎస్డీ నన్ను పిలిచి, యంత్ర పరికరాల తయారీదారులు, మంత్రి పేషీకి మధ్యవర్తిగా వ్యవహరించాలని కోరారు. దానికి నేను తిరస్కరించాను' అని వివరించారు. తన స్థానంలో నియమించిన జూనియర్ అధికారి.. జనరల్ మేనేజర్ పోస్టుకు అర్హుడు కాదని, పెండింగ్ కేసులు ఎదుర్కొంటున్నాడని పేర్కొన్నారు.

ఆర్థిక చేయూతనివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

సాయాన్ని అభ్యర్థించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఇటీవల చేపట్టిన సింగపూర్ పర్యటన వివరాలు, రాష్ట్రాభివృద్ధికి ఆ దేశ ప్రభుత్వంతో జరిపిన చర్చల వివరాలను జైశంకర్‌కు వివరించారు. ఆ ఒప్పందాల సాకారానికి విదేశాంగ శాఖ తరఫున సహకరించాలని కోరారు. రాష్ట్రంలో యూరియా సమస్యను ఈనెల 21 నాటికి పరిష్కరిస్తామని, అప్పటికల్లా 29 వేల మెట్రిక్ టన్నులు కేటాయిస్తామని కేంద్రమంత్రి నడ్డా.. లోకేశ్‌కు హామీ ఇచ్చారు. గత 14 నెలల్లో ఏపీలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నడ్డాకు లోకేశ్ వివరించారు. పోలవరం, రాజధాని పనులకు కేంద్రం అందిస్తున్న సాయానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రానికి సెమీకండక్టర్ యూనిట్ ప్రకటించినందుకు ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వానికి ఉదారంగా సాయం అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర నిధులతో చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిని వివరించి, కొత్త ప్రాజెక్టులకు సహకరించాలని లోకేశ్ కోరారు.

విదేశాంగ మంత్రి జైశంకర్‌తో..



విదేశాలకు వెళ్లే రాష్ట్ర యువతకు సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చేలా విశాఖలో ఏపీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, డేటా సిటీ ఏర్పాటుకు చేయూతనివ్వాలి. విశాఖలో డేటా సిటీ అభివృద్ధి వల్ల ఏపీ.. టెక్నాలజీ హబ్‌గా మారుతుంది. 35 లక్షల మంది ప్రవాసాంధ్రులు విదేశాల్లో ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఉన్నారు. గల్ఫ్ దేశాల్లోనే 8 లక్షల మంది ఉన్నారు. విదేశాలకు వలస వెళ్లే కార్మికుల సంక్షేమం, భద్రత కోసం ప్రవాస భారతీయ బీమా యోజనను విస్తరించాలి. ప్రవాసుల ఫిర్యాదుల పరిష్కారానికి ఏపీలో ప్రత్యేక విభాగం ఏర్పాటుచేయాలి.

ఎరువులు, రసాయనాల మంత్రి నడ్డాతో



రాష్ట్రంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నందున వెంటనే తగినంత యూరియా సరఫరా చేయాలి. యువతకు ఉపాధి కల్పించేలా రాష్ట్రంలో ప్లాస్టిక్ పార్కు ఏర్పాటుకు సహకరించాలి. విశాఖలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్) శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు 100 ఎకరాల భూమి సిద్ధంగా ఉన్నందున వెంటనే దాన్ని నిర్మించాలి.

పెట్రోలియం మంత్రి హర్దీప్‌సింగ్ పురీతో..



రామాయపట్నం పోర్టు సమీపంలో బీపీసీఎల్ సంస్థ 6 వేల ఎకరాల్లో రూ. 95 వేల కోట్ల వ్యయంతో తలపెట్టిన రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ కార్యకలాపాలు త్వరగా ప్రారంభించేందుకు సహకరించాలి. ఈ రిఫైనరీకి అదనపు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం దీపం-2 కింద బీపీఎల్ కుటుంబాలకు ఏటా 3 గ్యాస్ సిలిండర్ల చొప్పున ఉచితంగా ఇస్తోంది. దీన్ని ప్రధానమంత్రి ఉజ్వల యోజనతో అనుసంధానించాలి. ఇంధనం, మారిటైం రంగాల్లో పెట్టుబడులు, అనుమతులు, అంతర్జాతీయ ఒప్పందాలను ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రం మద్దతివ్వాలి.

శర్బానంద్ సోనోవాల్‌తో


రాష్ట్ర విభజన హామీ మేరకు దుగరాజపట్నం ఓడరేవును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలి. అక్కడ నౌకల తయారీ, మరమ్మతుల కేంద్రం నిర్మాణానికి 2వేల ఎకరాల భూమి సిద్ధంగా ఉంది. పోర్టు అనుబంధ రంగాల్లో రూ. 26 వేల కోట్ల పెట్టుబడులకు అవకాశముంది. 6 వేల మందికి ప్రత్యక్షంగా, 30 వేల మందికి పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి.

✦ సాగరమాలలో భాగంగా రాష్ట్రంలో రూ. 1.14 లక్షల కోట్లతో చేపట్టిన 110 ప్రాజెక్టులను వేగవంతం చేయాలి.

✦ రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట, కాకినాడ యాంకరేజి పోర్టుల్లో వార్ఫ్‌లు, స్పిల్‌వేల ఉన్నతీకరణ, జీవవైవిధ్య కార్యకలాపాలకు రూ.200 కోట్లు మంజూరు చేయాలి.

✦ గోదావరి, కృష్ణా నదులపై కొత్తగా జలరవాణా మార్గాలు, కార్గో టెర్మినళ్లు, ఫ్లోటింగ్ జెట్టీల అభివృద్ధికి రూ. 127.5 కోట్లు ఇవ్వాలి.

✦ అమరావతి- విజయవాడతో పాటు పలు పట్టణ జలరవాణా మార్గాల అభివృద్ధికి ఆర్థికంగా చేయూతనివ్వాలి.



కేంద్ర ఓడరేవులు, జలరవాణాశాఖ మంత్రి శర్బానంద సోనోవాల్‌తో చర్చిస్తున్న మంత్రి నారా లోకేశ్. చిత్రంలో కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు

రహదారుల శాఖ మంత్రి గడ్కరీతో



✦ విజయవాడ బెంజ్ సర్కిల్ వద్ద ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా కానూరు-మచిలీపట్నం మధ్య రహదారిని 6 వరుసలకు విస్తరించాలి. తూర్పు బైపాస్ రోడ్డు నిర్మించాలి. హైదరాబాద్-గొల్లపూడి రహదారి విస్తరణ ప్రాజెక్టును అమరావతితో కలపాలి.

✦ ఎన్‌హెచ్-16 వెంట విశాఖలో 20 కి.మీ., విజయవాడలో 14.7 కి.మీ. మేర డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ ప్లస్ మెట్రో కారిడార్‌ను నాగ్‌పూర్ తరహాలో అభివృద్ధి చేయాలి.

✦ కర్నూలు-ఎమ్మిగనూరు రహదారి విస్తరణ, బైపాస్ రోడ్డు నిర్మాణం, వినుకొండ-గుంటూరు నడుమ ఎన్‌హెచ్ 544డీ, కాకినాడ పోర్టు-ఎన్‌హెచ్ 216 నడుమ దక్షిణ రహదారి, కాణిపాకం వినాయక దేవాలయం లింకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి.

✦ బెంగళూరు-చెన్నై (ఎన్ఈ-7)తో నేరుగా అనుసంధానానికి కుప్పం- హోసూరు- బెంగళూరు నడుమ రూ.3 వేల కోట్లతో 56 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి అనుమతులివ్వాలి.



తెదేపా ఎంపీల సన్మానం

లోకేశ్ తొలిసారి పార్లమెంటు భవనంలోని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయానికి వచ్చారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, ఇతర ఎంపీలంతా ఆయన్ను శాలువాతో సత్కరించారు. ప్రాంతీయ పార్టీగా ఉంటూ జాతీయ రాజకీయాల్లో తెదేపా పోషించిన పాత్రను గుర్తు చేసుకున్నారు.

ఐటీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో..



అమరావతి క్వాంటమ్ వ్యాలీ పార్కును దేశంలో తొలి జాతీయస్థాయి క్వాంటమ్ క్లస్టర్‌గా, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను జాతీయస్థాయి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలి. క్వాంటమ్ వ్యాలీకి రూ.వెయ్యి కోట్లు, ఇన్నోవేషన్ హబ్‌కు రూ.300 కోట్ల సాయం చేయాలి. అమరావతిలో గ్లోబల్ క్వాంటమ్ సమ్మిట్, ఇండియా ఇన్నోవేషన్ వీక్-2026 నిర్వహించేందుకు అవకాశమివ్వాలి. రాజధానిలో నేషనల్ క్వాంటమ్ మిషన్ ఆధారిత డీప్‌టెక్ స్కిల్ అకాడెమీని ఏర్పాటుచేయాలి.

✦ జాతీయ విద్యావిధానం కింద ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లు, ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు సాయమందించాలి. ✦ గ్లోబల్ డేటా సెంటర్ల పెట్టుబడులను ఆకర్షించడానికి విశాఖపట్నంలో సముద్రగర్భ కేబుల్స్ ల్యాండింగ్ పనులను వేగవంతం చేయాలి. తృతీయ శ్రేణి నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఐటీ పరిశ్రమల విస్తరణకు వీలుగా ఆదాయ పన్ను మినహాయించాలి.

మాటమార్చిన ముసుగు వ్యక్తి

'ధర్మస్థల' దర్యాప్తులో కొత్త మలుపు

ఈనాడు – బెంగళూరు, మంగళూరు, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మస్థలలో వందల మృతదేహాలను ఖననం చేశానని ప్రకటించుకున్న ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు భీమా మాట మార్చాడు. 'నాకు ఒకరు పుర్రెను ఇచ్చి సిట్ అధికారులకు ఇవ్వాలని సూచించారు. న్యాయస్థానంలో అర్జీ కూడా వారే వేయించారు. నేను 2014 నుంచి తమిళనాడులోనే ఉంటున్నా' అని ప్రకటించాడు. ఆ వ్యక్తి ఇచ్చిన సమాచారం ఆధారంగా భీమాను ప్రేరేపించిన వ్యక్తులకు నోటీసులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని సిట్‌కు నేతృత్వం వహిస్తున్న ఐపీఎస్ అధికారి ప్రణబ్ మొహంతీ తెలిపారు. భీమాకు లై డిటెక్టర్ పరీక్షలు చేయించాలని కర్ణాటక విధానసభలో సభ్యులు సోమవారం డిమాండ్ చేశారు. అతడు చూపించిన అన్ని ప్రదేశాల్లో అధికారులు తవ్వకాలు జరిపారని, ఒక ప్రదేశంలో మినహా మరెక్కడా కళేబరాలు, అస్థిపంజరాలు లభించలేదని హోంమంత్రి పరమేశ్వర్ తెలిపారు. యూట్యూబర్లు ఇకపై తప్పుడు కథనాలను ప్రసారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రహం అనుగ్రహం

19–8–2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, బహుళపక్షం
ఏకాదశి: సా. 4-10 తదుపరి ద్వాదశి; ఆర్ద్ర: రా. 2-40 తదుపరి పునర్వసు; వర్జ్యం: ఉ. 11-49 నుంచి 1-20 వరకు;
అమృత ఘడియలు: సా. 5-09 నుంచి 6-40 వరకు;
దుర్ముహూర్తం: ఉ. 8-16 నుంచి 9-07 వరకు; తిరిగి రా. 10-54 నుంచి 11-40 వరకు; రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.5.46; సూర్యాస్తమయం: సా.6.21; సర్వఏకాదశి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ	ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	31.0	24.3	అనంతపురం	28.5	23.3
నెల్లూరు	30.2	25.4	గుంటూరు	28.0	26.0
శ్రీకాకుళం	30.0	26.0	విజయనగరం	28.0	25.0
రాజమహేంద్రవరం	30.0	24.0	విశాఖపట్నం	28.0	24.4
ఒంగోలు	29.4	24.2	తాడేపల్లిగూడెం	27.7	25.3
కడప	29.0	25.0	కర్నూలు	27.3	22.8
విజయవాడ	28.7	25.0	హైదరాబాద్	25.8	21.0
నరసాపురం	28.6	24.8	సూర్యాపేట	25.5	25.0
			నిజామాబాద్	25.2	22.1
			కరీంనగర్	25.0	22.0
			హనుమకొండ	24.8	22.0

బీచ్‌శాండ్ తవ్వకాలకు మార్గం సుగమం

- పిల్‌ను ముగించిన హైకోర్టు
- త్వరలో ధరల బిడ్లు తెరవనున్న ఏపీఎండీసీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో బీచ్‌శాండ్ తవ్వకాలకు మార్గం సుగమమైంది. మూడు లీజులకు సంబంధించి హైకోర్టులో వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) కారణంగా.. ఇంతకాలం తవ్వకాలకు ముందడుగు పడలేదు. తాజాగా హైకోర్టు ఆ కేసును ముగించడంతో.. టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి ప్రాజెక్ట్ డెవలపర్‌ను ఎంపిక చేసేందుకు అవకాశం ఏర్పడింది. శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని రెండు లీజుల్లో 909.85 హెక్టార్లు, విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో 90.15 హెక్టార్లు కలిపి మూడు బీచ్‌శాండ్ లీజుల్లో తవ్వకాలకు ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)కు గతంలో కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. దీంతో ఇక్కడ ఖనిజ తవ్వకాలు, నిర్వహణ కోసం ప్రాజెక్ట్ డెవలపర్ అండ్ ఆపరేటర్ (డీపీఓ) ఎంపికకు ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లను ఆహ్వానించారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలే బీచ్‌శాండ్ తవ్వకాలు జరపాల్సి ఉంటుందని, ప్రైవేటు సంస్థలకు తవ్వకాలు అప్పగిస్తున్నారంటూ విశాఖపట్నానికి చెందిన ఒకరు గత ఏడాది ఆరంభంలో హైకోర్టులో పిల్ వేశారు. దీంతో టెండర్ల ప్రక్రియ కొనసాగించవచ్చని, బిడ్లను మాత్రం ఖరారు చేయవద్దంటూ హైకోర్టు ఆదేశించింది. అప్పటి నుంచి ముందడుగు పడలేదు. ఏపీఎండీసీ పర్యవేక్షణలోనే బీచ్‌శాండ్ తవ్వకాలు జరుగుతాయంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌంటరు వేయడం, కేసు కొనసాగించాల్సిన అవసరంలేదని పిల్ వేసిన వ్యక్తి కూడా పేర్కొనడంతో.. ఇటీవల హైకోర్టు ఈ కేసును ముగించింది.

✦ మూడు లీజుల్లో బీచ్‌శాండ్ తవ్వకాలకు మూడేసి సంస్థలు అర్హత సాధించాయి. గతంలో ఏపీఎండీసీ అధికారులు టెక్నికల్ బిడ్లను పరిశీలించగా.. ఒక్కోదానికి మూడేసి సంస్థలకు అర్హతలున్నట్లు తేల్చారు. హైకోర్టు తీర్పుతో త్వరలో ధరల బిడ్లు తెరిచి ప్రాజెక్ట్ డెవలపర్‌ను ఎంపిక చేయనున్నారు.

బరిలో అదానీ సంస్థ

ఈ టెండర్లలో అదానీ సంస్థ మూడు లీజుల్లోనూ బరిలో ఉంది. అదానీకి చెందిన అల్లూవియర్ హెవీ మినరల్స్ లిమిటెడ్ సంస్థ బిడ్లు వేయగా, ఇది సాంకేతిక అర్హత సాధించింది. ప్రాజెక్ట్ డెవలపర్‌గా ఈ సంస్థ ఎంపికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది.

అణుధార్మిక ఖనిజాలు..

బీచ్‌శాండ్‌లో మోనజైట్, ఇల్మినైట్, రూటైల్, లుకోక్సెన్, జిర్కాన్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి ఖనిజాలు ఉంటాయి. ఇందులో మోనజైట్ అణుధార్మికత కలిగినది. దీనిని కేంద్ర సంస్థ అయిన ఇండియన్ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ లిమిటెడ్ (ఐఆర్ఈఎల్) వద్ద రిజిస్టర్ చేసుకున్న సంస్థలకు మాత్రమే విక్రయించాలి. మిగిలిన ఖనిజాల్లో అణుధార్మికత పరిమితి తక్కువగా ఉంటే ఇతరులకు విక్రయించుకోవచ్చు. విదేశాలకు ఎగుమతి చేయాలన్నా ఐఆర్ఈఎల్ సర్టిఫికేషన్ ఉండాలి. ఆ లీజుల్లో తవ్వితీసిన బీచ్ శాండ్ నుంచి ఆయా ఖనిజాలను వేరుచేసి, వాటిని శుద్ధి చేసేందుకు ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు తొలి దశలోనే రూ.2 వేల కోట్ల వరకు వ్యయమవుతుంది. ఇక్కడ లభించే ఖనిజాలను విక్రయించే సమయంలో వచ్చే ధరలో 8 శాతం ఏపీఎండీసీకి చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టు పూర్తైతే ఏపీఎండీసీకి ఏటా రూ.100-150 కోట్ల వరకు రాబడి వచ్చే అవకాశం ఉంది.

కాకాణికి షరతులతో బెయిల్

ఈనాడు, అమరావతి: క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు, గిరిజనులను బెదిరించి కులం పేరుతో దూషించిన కేసులో మాజీ మంత్రి, వైకాపా నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి (ఏ4)కి కఠిన షరతులతో హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు సింగిల్ జడ్జి సోమవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు. 'రూ.2 లక్షల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలి. పోలీసులు అభియోగపత్రం దాఖలు చేసే వరకు ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు దర్యాప్తు అధికారి (ఐఓ) ముందు హాజరవ్వాలి. దర్యాప్తు పూర్తయ్యే వరకు, అభియోగపత్రం దాఖలు చేసే వరకు నెల్లూరు జిల్లాలో ప్రవేశించడానికి వీల్లేదు. ఐఓ అనుమతి లేకుండా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను దాటి వెళ్లరాదు. పాస్‌పోర్టును దర్యాప్తు అధికారికి అప్పగించాలి. దిగువ కోర్టులో సాక్షులను విచారించకుండా పదే పదే వాయిదాలు కోరినా కోర్టు విధించిన షరతులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినా సుమోటోగా బెయిలు రద్దవుతుంది' అని న్యాయమూర్తి ఆదేశించారు. వైకాపా హయాంలో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి, టన్నుల కొద్దీ క్వార్ట్జ్ ఖనిజాన్ని తవ్వి తరలించారన్న అభియోగంపై ఈ ఏడాది ఫిబ్రవరి 16న పొదలకూరు పోలీసులు కాకాణిపై కేసు నమోదు చేశారు. మే 25న అరెస్టు చేశారు. దిగువ కోర్టు బెయిలు నిరాకరించడంతో కాకాణి హైకోర్టులో అప్పీల్ చేశారు. ఇటీవల వాదనలు ముగియడంతో న్యాయమూర్తి.. సోమవారం నిర్ణయాన్ని ప్రకటించారు.



విశాఖ జిల్లాలో గంభీరం జలాశయం నుంచి కిందకు ప్రవహిస్తున్న వరదనీరు



కాకినాడ జిల్లా గొల్లప్రోలులో జగనన్న కాలనీవాసుల కష్టాలివి. వర్షాలకు సుద్దగెడ్డ వాగు పొంగిపొర్లుతుండటంతో ప్రవాహంలో ప్రమాదకరంగా రాకపోకలు

కరిగి నీరైన మేఘం.. తోడైన వాయుగుండం

(మొదటి పేజీ తరువాయి)

సీతారామరాజు జిల్లా పాడేరులో 13.7, అనకాపల్లి జిల్లా చీడికాడలో 12.6, దేవరాపల్లిలో 12.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఉత్తరాంధ్రలోని 44 ప్రాంతాల్లో 10 సెం.మీ.కు పైగా వర్షం కురిసింది. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు అత్యధికంగా అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో 7.3 సెం.మీ., విజయనగరం జిల్లా సంతకవిటిలో 6.6, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో 6 సెం.మీ. వర్షం కురిసింది. రాష్ట్రవ్యాప్తంగా 1.83 లక్షల ఎకరాల్లో పంటలు నీట మునిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వెయ్యి కిలోమీటర్లకు పైగా రోడ్లు పాడయ్యాయి.

పొంగి ప్రవహిస్తున్న వాగులు

కాకినాడ జిల్లా గొల్లప్రోలులో సుద్దగెడ్డ ఉద్ధృతంగా ప్రవహించడంతో గ్రామానికి అవతల ఉన్న జగనన్న కాలనీ నుంచి రాకపోకలు స్తంభించాయి. ఒక గర్భిణిని బోటులో ఆసుపత్రికి తరలించారు. అనకాపల్లి జిల్లా బీఎన్ రోడ్డులో విజయరామరాజుపేట వద్ద తాచేరు వంతెనపై వరద నీటి ప్రవాహంతో వడ్డాది-చోడవరం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నదులు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. విజయనగరం జిల్లా వేపాడ మండలం సోంపురం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీటి ఉద్ధృతి పెరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం రాత్రి కారులో వివాహానికి వెళ్లి వస్తూ ఈ అండర్ బ్రిడ్జి వద్ద చిక్కుకున్న నలుగురిని ఎస్.కోట అగ్నిమాపకశాఖ అధికారులు రక్షించారు. విశాఖ నగరంలోని సింధియా వద్ద ఐవోసీ ఆయిల్ టెర్మినల్ ప్రాంతం పూర్తిగా నీట మునగడంతో చమురు లోడింగ్ నిలిచిపోయింది.



విశాఖపట్నంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి చెరువులా మారిన ఇందిరా ప్రియదర్శిని స్టేడియం

వాగు దాటుతుండగా ఒకరి గల్లంతు

అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడలో భారీ వర్షం కురవడంతో ఇళ్లలోకి వరద నీరు చేరింది. హుకుంపేట మండలం అడ్డుమండ గ్రామానికి చెందిన కంబిడి కుమారస్వామి(41) దిగుమొదపుట్టు గ్రామ సమీపంలో వాగు దాటుతుండగా వరద ఉద్ధృతికి గల్లంతయ్యాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలిస్తున్నారు. చింతూరు-రామచంద్రపురం మండలాల మధ్య 30వ నంబరు జాతీయ రహదారిపై వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో సుమారు 50 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఐటీడీఏ ఏర్పాటుచేసిన పడవలో జనం రాకపోకలు సాగిస్తున్నారు.

వరి, పత్తికి అధిక నష్టం

ఎడతెరిపిలేని వర్షాలతో పొలాలు నీట మునిగాయి. కొన్నిచోట్ల నాలుగైదు రోజులుగా మొక్కలు నీటిలోనే నానుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 14 జిల్లాల్లోని 106 మండలాల పరిధిలో.. 828 గ్రామాల్లో భారీవర్షాల ప్రభావం ఉంది. 1.83 లక్షల ఎకరాల్లోని పంటలు ముంపు బారిన పడ్డాయని ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. ఇందులో వరి 1.59 లక్షల ఎకరాలు, పత్తి 19 వేల ఎకరాల వరకు నీట మునిగాయి. మినుము, పెసర, వేరుశనగ, కంది, మొక్కజొన్న, సజ్జ పంటలు కూడా కొంతమేర మునిగిపోయాయి. గుంటూరు, బాపట్ల, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, ఏలూరు జిల్లాల్లో పంటనష్టం అధికంగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

రైళ్ల రద్దు.. మళ్లింపు

కొత్తవలస-కిరండూల్ మార్గంలో ముందుజాగ్రత్తగా సోమవారం విశాఖ-కిరండూల్-విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను రాయగడ మీదుగా మళ్లించారు. విశాఖ-కిరండూల్ ప్యాసింజర్‌ను అరకు వరకు, కిరండూల్-విశాఖ ప్యాసింజర్‌ను కొరాపుట్ వరకు పరిమితం చేశారు. విశాఖ-కిరండూల్, కిరండూల్-విశాఖ ప్యాసింజర్లు మంగళవారం రద్దు చేశారు.

మూడో నంబరు హెచ్చరిక

రాష్ట్రంలోని కృష్ణపట్నం, వాడరేవు, నిజాంపట్నం, మచిలీపట్నం, కాకినాడ, గంగవరం, విశాఖపట్నం, కళింగపట్నం పోర్టుల్లో మూడో నంబరు హెచ్చరిక కొనసాగుతోంది. ఈ నెల 24న (ఆదివారం) వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని ఐఎండీ పేర్కొంది.


నేడు తీరం దాటనున్న వాయుగుండం

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ వాయుగుండంగా బలపడిందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. మంగళవారం మధ్యాహ్నానికి దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర మధ్యలో గోపాల్‌పూర్ సమీపంలో తీరం దాటుతుందని అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో మంగళ, బుధవారాల్లో కోస్తా జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. మంగళవారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో, బుధవారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో గురువారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు సూచించారు.

జలగండంలో పోశమ్మగండి

దేవీపట్నం, న్యూస్‌టుడే: గోదావరిలో వరద ఉద్ధృతి పెరుగుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం సాయంత్రానికి అడుగు మేర నీటిమట్టం పెరగడంతో ఆలయం పూర్తిగా నీట మునిగింది. పోశమ్మగండి నుంచి డి.రావిలంక వరకు రహదారి జలదిగ్బంధంలో చిక్కుకుంది. సీతపల్లి వాగుకు వరద ప్రవాహం పెరగడంతో పోలీసులు రాకపోకలను నిషేధించారు.

మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి గోదావరి వరద



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద వరద ప్రవాహం

పోలవరం, న్యూస్‌టుడే: గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు మధ్యలో కుంట వద్ద శబరి వచ్చి కలవడంతో గోదావరికి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద పెరిగే అవకాశం ఉందని జలవనరులశాఖ అధికారులు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద సోమవారం రాత్రికి నీటిమట్టం 31.15 మీటర్లకు చేరింది. 48 గేట్ల ద్వారా 6.89 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళుతున్నాయి. మంగళవారం నాటికి ధవళేశ్వరం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.

శ్రీశైలానికి భారీగా వరద



జలాశయం పది గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలానికి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల ప్రాజెక్టు నుంచి 2,38,237 క్యూసెక్కులు, సుంకేసుల జలాశయం నుంచి 87,158 క్యూసెక్కులు, హంద్రీ నది నుంచి 3,750 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి చేరుతోంది. శ్రీశైలం జలాశయం 10 రేడియల్ క్రస్టుగేట్లను ఎత్తి 3,04,690 క్యూసెక్కులు, శ్రీశైలం కుడి, ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 66,099 క్యూసెక్కులను నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నీటిమట్టం సోమవారం సాయంత్రం 6 గంటలకు 881.60 అడుగులు, నీటినిల్వ 197.0114 టీఎంసీలుగా నమోదైంది.



సచివాలయంలో సోమవారం నిర్వహించిన సీఆర్డీఏ అథారిటీ 51వ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి నారాయణ, అధికారులు

అమరావతికి అభివృద్ధి సిరులు

(మొదటి పేజీ తరువాయి)

అనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోవాలి. సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానిస్తూ వై ఆకారంలో మరో రోడ్డు మంగళగిరి వైపు కలపనున్నాం. అవుటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం చూస్తోంది' అని మంత్రి తెలిపారు.

రాజధాని ఎక్కడ మునిగిందో చూపాలి

అమరావతి మునిగిపోయిందని తప్పుడు ప్రచారం చేస్తున్న వైకాపా నేతలు.. ఎక్కడ మునిగిందో చూపాలని నారాయణ సవాల్ చేశారు. 'ఐకానిక్ టవర్ల నిర్మాణం కోసం చుట్టూ గుంతలు తవ్వాం. వర్షం వస్తే వాటిలో నీళ్లు నిలవకుండా ఎలా ఉంటాయి? మూడున్నరేళ్లలో రాజధాని మొదటి దశ పనులు పూర్తి చేస్తాం. ఏడాదిన్నరలో 300 కి.మీ. రహదారులు అందుబాటులోకి వస్తాయి. మార్చి 31 నాటికి 4 వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి అధికారులకు అప్పగిస్తాం. వైకాపా నేతలు వచ్చి చూస్తే రాజధానిలో ఏం పనులు జరుగుతున్నాయో తెలుస్తుంది' అని ఆయన హితవు పలికారు.

సీఆర్డీఏ నిధులతో విజయవాడలో వరదనీటి కాలువల పూర్తి

వైకాపా ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన విజయవాడలోని వరదనీటి కాలువలు, గుంటూరులో యూజీడీ పనులు సీఆర్డీఏ నిధులతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చామని మంత్రి చెప్పారు. త్వరలోనే అంచనాలు రూపొందించి టెండర్లు పిలవనున్నామన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులు కూడా గత ప్రభుత్వం మళ్లించేసిందని నారాయణ మండిపడ్డారు.

ఈ సీజన్‌లోనే రాజధానికి ఒకరూపం తీసుకురావాలి: సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: అమరావతిలో ఈ సీజన్‌లోనే నిర్మాణాలు పూర్తి చేసి, రాజధానికి ఒక రూపం తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పనుల వివరాలు ప్రజలకు తెలియజేసేలా ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో పెట్టాలని సూచించారు. సచివాలయంలో సోమవారం నిర్వహించిన సీఆర్డీఏ 51వ అథారిటీ సమావేశంలో సీఎం మాట్లాడారు. 'ప్రత్యేక వాహక సంస్థ (ఎస్పీవీ) ద్వారా చేపట్టే స్పోర్ట్స్ సిటీ లాంటి ప్రాజెక్టులు అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలి. రాజధానిలో కాలుష్య రహిత పరిశ్రమలు, పెట్టుబడులు వచ్చేలా చూడాలి. అమరావతికి త్వరలో ప్రతిష్ఠాత్మక బయో ఇంజినీరింగ్ యూనివర్సిటీ రానుంది. దేశంలోని మరే ప్రాంతానికీ లేని భౌగోళికపరమైన సానుకూలతలు అమరావతికి ఉన్నాయి. అందుకే ఇక్కడ చేపట్టే నిర్మాణాలన్నీ ఐకానిక్‌గా ఉండాలి. ప్రతి ప్రాజెక్టు పరిధిలోనూ ఆర్థిక కార్యకలాపాలు జరిగేలా ప్రణాళికలు ఉండాలి' అని పేర్కొన్నారు. 'కృష్ణా నదిపై నిర్మించే ఐకానిక్ వంతెనకు అద్భుతమైన డిజైన్‌ను ఎంపిక చేయాలి. సంప్రదాయ కూచిపూడి నృత్య భంగిమ సహా వేర్వేరు నూతన డిజైన్లను పరిశీలించాలి' అని ఆదేశించారు.

ఈకలు కరవై.. ఆట బరువై!

(మొదటి పేజీ తరువాయి)

ఈకలతో తయారైన వాటితో పోల్చితే ఇవి ఎక్కువ కాలం మన్నుతాయి. రేటు కూడా తక్కువే. మరోవైపు, ఇవి వేగంగా ఎగరడం వల్ల ప్రతిస్పందించే సమయం తగ్గుతుంది. కచ్చితత్వం 14% తక్కువగా ఉంటుందని క్రీడాకారులు చెబుతున్నారు. వీటిని ప్రాక్టీస్, అమెచ్యూర్ గేమ్స్‌లో వాడతారు. "రెండు రోజుల కిందట చెన్నై నుంచి ఫెదర్‌కాక్‌లు బ్యారెల్ రూ.3,100 చొప్పున తెప్పించాం. ఆరు నెలల్లోనే ధర రూ.1,200 పెరిగింది. ఇది రూ.4,000కు చేరొచ్చని దుకాణదారులు చెబుతున్నారు" అని విజయవాడకు చెందిన బ్యాడ్మింటన్ కోచ్ భాస్కర్ తెలిపారు. "నైలాన్‌కాక్‌లు వాడుతుంటాం. మావిస్-350 రకం బ్యారెల్(6) రూ.1,300గా ఉంది. ఫెదర్‌కాక్‌తో పోల్చితే వీటి ఫ్లైట్‌లో తేడా ఉంటుంది. పోటీలకు ఫెదర్‌కాక్‌లే వాడాలి" అని వెల్లడించారు.

మోదీతో శుభాంశు శుక్లా భేటీ

(మొదటి పేజీ తరువాయి)

కనిపించింది. అంతరిక్షం నుంచి తాను తీసిన కొన్ని చిత్రాలను ట్యాబ్లెట్ కంప్యూటర్‌లో చూపిస్తూ వాటి గురించి శుక్లా వివరించారు. అంతరిక్ష అనుభవాలు, శాస్త్ర-సాంకేతిక రంగ పురోగతి, గగన్‌యాన్ మిషన్ వంటివాటిపై శుభాంశుతో చర్చించానని, ఆయన సాహసాన్ని చూసి దేశం గర్విస్తోందని మోదీ 'ఎక్స్'లో తెలిపారు.

2040లో చందమామపైకి భారత వ్యోమగామి

(మొదటి పేజీ తరువాయి)

అనుమతించిన తర్వాత సంబంధిత వాణిజ్యం 800 కోట్ల డాలర్లకు చేరింది. వచ్చే దశాబ్ది నాటికి ఇది 4,500 కోట్ల డాలర్లకు చేరుతుంది. వ్యోమమిత్ర అనే రోబోను వచ్చే ఏడాది అంతరిక్షంలోకి పంపించనున్నాం. 2027లో తొలిసారిగా మానవసహిత అంతరిక్ష యాత్ర చేపట్టనున్నాం. 2040లో చంద్రుడిపై భారత వ్యోమగామి పాదం మోపి.. త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసి వికసిత భారత్ ఖ్యాతిని చాటుతారు. 2035 కల్లా మనకూ సొంత అంతరిక్ష కేంద్రం ఉంటుంది' అని జితేంద్ర సింగ్ వివరించారు.

ప్రతిపక్షాల వాకౌట్

బిహార్ ఓటరు జాబితాలో సవరణలను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు లోక్‌సభలో నినాదాలు చేశాయి. జితేంద్ర సింగ్ ప్రసంగిస్తున్న సమయంలోనూ ఇవి కొనసాగాయి. వాకౌట్ చేసిన ప్రతిపక్షాల తీరును ఎన్డీయే నేతలు తప్పుబట్టారు. 'మీకు భాజపాపై, ప్రభుత్వంపై కోపం ఉండవచ్చు. వ్యోమగామిపైనా మీరు కోపంగా ఉండటం ఆశ్చర్యకరం. ఆయనొక వ్యోమగామి మాత్రమే కాకుండా క్రమశిక్షణగల వాయుసేన సైనికుడు. ఆయనకు ఏ పార్టీతో సంబంధం లేదు' అని జితేంద్ర చెప్పారు. ఒక వైద్యునిగా విపక్షాల స్థితిని తాను అర్థం చేసుకోగలనన్నారు.

ఇలాంటివాటిపైనా రాజకీయాలా?: రాజ్‌నాథ్

దేశం అభివృద్ధి చెందడం ప్రతిపక్షాలకు ఇష్టంలేదని, వాటితీరు ఏమాత్రం అమోదయోగ్యం కాదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. దేశానికి గర్వకారణమైన అంశాల్లోనైనా రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రశ్నోత్తరాల సమయానికి అడ్డుపడిన సభ్యులపై స్పీకర్ ఓంబిర్లా ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్ష నేతలు ప్రశ్నలడిగితే ప్రజలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. విపక్ష నిరసనలతో సభ వాయిదా పడినందువల్ల అసంపూర్తిగా మిగిలిన చర్చ మంగళవారం కొనసాగే అవకాశం ఉంది. ప్రతిపక్షాల ఆందోళనతో రాజ్యసభ కూడా వాయిదాపడింది. గందరగోళం మధ్యనే భారతీయ ఓడరేవుల బిల్లును సభ ఆమోదించింది. విపక్షాలు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తూ అరాచకంగా వ్యవహరిస్తున్నాయని సభాపక్ష నేత జె.పి.నడ్డా విమర్శించారు.

జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన?

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారని పలు విపక్ష నేతలు ఈ సందర్భంగా పేర్కొన్నట్టు సమాచారం. ఓట్ల చోరీపై పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు సీఈసీకి వ్యతిరేకంగా అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టాలని కొందరు ప్రతిపక్ష ఎంపీలు సూచించారు. ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంలో, అనుమానాలు నివృత్తి చేయడంలో ఎన్నికల కమిషన్ (ఈసీ) విఫలమైన దరిమిలా పోరాటాన్ని మరింత తీవ్రం చేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టే విషయం ఇంకా చర్చల దశలో ఉందని, ప్రతిపక్షాలు మళ్లీ సమావేశమై దీనిపై స్పష్టమైన నిర్ణయం తీసుకుంటాయని ఇండియా కూటమి వర్గాల సమాచారం.

పూర్తిగా విఫలమైన ఈసీ

ఎన్నికల సంఘం రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతల నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు ఆరోపించాయి. భాజపా అధికార ప్రతినిధిలా మాట్లాడుతున్న సీఈసీపై పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు వెనకాడబోమని ఆ పార్టీలు స్పష్టం చేశాయి. కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, ఆర్జేడీ, సీపీఎం, ఆమ్ ఆద్మీపార్టీ, శివసేన (యూబీటీ) పార్టీల ప్రతినిధులు సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు నిష్పాక్షికంగా నిర్వహించాలన్న నిబద్ధత కలిగిన అధికారుల నేతృత్వంలో ఎన్నికల సంఘం లేదని స్పష్టమైందని ఆ పార్టీల ప్రతినిధులు ఆరోపించారు. ప్రతి పౌరునికీ రాజ్యాంగం అందించిన ఓటు హక్కును పరిరక్షించడంలో ఈసీ విఫలమైందని కాంగ్రెస్ ప్రతినిధి గౌరవ్ గొగోయ్ అన్నారు.

ముందు సీఈసీ అఫిడవిట్ ఇవ్వాలి

గయాజీ: ఎన్నికల సంఘం రూపొందించిన ఓటరు జాబితాలో ఎలాంటి అవకతవకలూ లేవని సుప్రీంకోర్టులో సీఈసీ ముందుగా అఫిడవిట్ దాఖలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఆ తర్వాత తామూ అవకతవకలపై ప్రమాణపత్రం దాఖలు చేస్తామని తెలిపింది. "ఓటర్ అధికార్ యాత్ర ప్రారంభించాం కాబట్టి సీఈసీ విలేకరుల ముందుకు వచ్చి మాట్లాడారు. దీంతో ఎన్నికల ప్రధానాధికారి అంటూ ఒకరున్నారన్న విషయం దేశానికి తెలిసింది" అని కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేడా ఎద్దేవా చేశారు. అఫిడవిట్ దాఖలు చేయండంటూ రాహుల్‌ను సీఈసీ బెదిరించారని, వాటికి తాము భయపడేది లేదని స్పష్టం చేశారు. తాము బహిర్గతం చేసిన విషయాలకు ఎన్నికల సంఘం గణాంకాలే ప్రాతిపదిక అనీ, కమిషన్ తన గణాంకాలను తానే విశ్వసించడం లేదని ఆయన అన్నారు.

బీసీల ఓట్లు తొలగిస్తున్న ఈసీ

ఎన్నికల కమిషన్ బీసీలకు చెందిన ఓట్లను తొలగించి భాజపాకు ప్రయోజనం కలిగిస్తోందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. మౌర్య, పాల్, బఘేల్, రాథోడ్ వంటి సామాజిక వర్గాలకు చెందినవారి పేర్లను తొలగించి భాజపాకు ప్రయోజనం కలిగిస్తున్నారని పార్లమెంటు ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన అన్నారు. గత ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ అతి కొద్ది మెజారిటీతో ఓడిపోయిన నియోజకవర్గాలను గుర్తించి అక్కడి ఓటరు జాబితాలను విశ్లేషించగా ఈ విషయం వెల్లడైందని అఖిలేశ్ అన్నారు.

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రిటైరయ్యాక ఎన్డీఏ ప్రభుత్వం అందించే ఎలాంటి పదవినీ చేపట్టబోనని అఫిడవిట్ ఇవ్వాలని బిహార్ శాసనసభలో ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ డిమాండ్ చేశారు.

అక్రమ చొరబాటుదార్లను రక్షించేందుకే: ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటు సమావేశాల నిర్వహణకు విఘాతం కలిగిస్తున్నాయని భాజపా ఆరోపించింది. అక్రమ చొరబాటుదారుల్ని రక్షించి వారి ఓట్లతో ఎన్నికలు గెలిచేందుకే ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన ఓటరు జాబితా సవరణపై కాంగ్రెస్ ప్రశ్నలు లేవనెత్తుతోందని భాజపా అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా అన్నారు.

ఓట్ల చోరీకి ఎస్ఐఆర్ ఒక ఆయుధం: రాహుల్



బిహార్‌లోని ఔరంగాబాద్‌లో జరిగిన ఓటర్ అధికార్ యాత్రలో రాహుల్

ఔరంగాబాద్: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ఓటు చౌర్యానికి ఒక 'సరికొత్త ఆయుధం' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సోమవారం ఆరోపించారు. ఓటు చౌర్యాన్ని నిర్మూలించి ఒక ఓటరుకు ఒక ఓటు సూత్రాన్ని పరిరక్షిస్తామని అన్నారు. ఎలాంటి అవకతవకలు చేసినా ఈసీ మీద ఎవరూ ఎటువంటి చర్యలూ తీసుకోకుండా రక్షణ కల్పిస్తూ మోదీ ప్రభుత్వం 2023లో చట్టం తీసుకొచ్చిందని రాహుల్ తన "ఓటర్ అధికార్ యాత్ర" సందర్భంగా పేర్కొన్నారు. ఎస్ఐఆర్‌లో ఓటు కోల్పోయిన వారిలో బలహీన వర్గాలకు చెందినవారు, మహిళలు, మాజీ సైనికులు ఉన్నారని అన్నారు. ఆయన వెంట ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ తదితరులు ఉన్నారు.

తొలగించిన 65 లక్షల పేర్లు ప్రచురించిన ఈసీ

పట్నా: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)లోభాగంగా తొలగించిన 65 లక్షల మంది పేర్లను ఎన్నికల కమిషన్ సోమవారం బహిర్గతం చేసిందని అధికారులు వెల్లడించారు. జాబితాలో తమ పేర్లు లేనివారు ప్రచురిత జాబితా నుంచి అందుకు సంబంధించిన సమాచారం పొందవచ్చని బిహార్ ఎన్నికల ముఖ్య అధికారి వినోద్ సింగ్ గుంజియల్ అన్నారు. ఓటరు గుర్తింపు కార్డు సంఖ్యను ఉపయోగించి ఈ సమాచారం పొందవచ్చన్నారు. జాబితాలో పేరు లేని వారు తమ పేరును చేర్చేందుకు ఆధార్ కాపీని సమర్పిస్తే సరిపోతుందని ఈసీ ఒక ప్రకటనలో తెలిపింది. అర్జీలు సమర్పించిన పత్రాలను సంబంధిత ఓటరు నమోదు అధికారి (ఈఆర్ఓ) ఏడు రోజుల్లోగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తారని పేర్కొంది.

'చలో కరేడు' ఉద్రిక్తం

- అనుమతి లేదంటూ అడ్డుకున్న పోలీసులు
- వామపక్ష నేతల అరెస్ట్

కందుకూరు పట్టణం, ఉలవపాడు, వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: బలవంతపు భూసేకరణ తగదని రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలంలో చేపట్టిన 'చలో కరేడు' ఉద్రిక్తతకు దారితీసింది. ఎక్కడికక్కడ ఉద్యమకారులను నిలువరించి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. కరేడులో ఇండోసోల్ సోలార్ సంస్థకు భూసేకరణ ప్రకటన వెలువడినప్పటి నుంచి ఆ ప్రాంత రైతులు వ్యతిరేకిస్తున్నారు. దీనిపై రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో సోమవారం 'చలో కరేడు' కార్యక్రమానికి పిలుపునిచ్చారు. పోలీసులు అనుమతించకపోవడంతో ఆదివారం రాత్రి కొందరు నాయకులు గ్రామానికి చేరుకొని రైతులతో సమావేశమయ్యారు. సోమవారం ఉదయం ర్యాలీగా పోలేరమ్మ అరుగుల వద్దకు చేరుకున్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, అజయ్, సాగర్ తదితరులు మాట్లాడారు. పచ్చని పొలాలను ప్రాజెక్ట్ పేరిట ధ్వంసం చేయొద్దన్నారు. చలో కరేడులో పాల్గొనేందుకు వస్తున్న నాయకులను కరేడు ర్యాంపు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితర నాయకులను అదుపులోకి తీసుకుని కందుకూరు, వలేటివారిపాలెం పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

కాగ్ నివేదికల్నీ తారుమారు చేసి చూపుతున్న బుగ్గన

ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ విజయ్‌కుమార్ ధ్వజం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ వసూళ్లు అంచనాలకు మించి వస్తున్నాయంటూ కాగ్ ఇచ్చిన నివేదికనూ వైకాపా నేత, మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తారుమారు చేసి చూపిస్తున్నారంటూ ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. మంగళగిరిలో సోమవారం ఆయన మాట్లాడారు. "వైకాపా హయాంలో 2023 జులైలో రాష్ట్రానికి రూ.58 వేల కోట్ల ఆదాయంగా వచ్చిందని, రెండేళ్ల తర్వాత కూటమి ప్రభుత్వంలో రూ.49 వేల కోట్లే వచ్చిందంటూ బుగ్గన విమర్శలు చేస్తున్నారు. 2023 జూన్, జులై నెలల్లో కేంద్రం సుమారు రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు గ్రాంటు రూపంలో ఇచ్చింది. దీన్ని చూపుతూ తమకు ఎక్కువ ఆదాయం వచ్చిందని బుగ్గన తప్పుడు లెక్కలు చెబుతున్నారు" అని పేర్కొన్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు 2023 జులైలో రూ.3,200 కోట్ల ఆదాయం వస్తే.. 2025లో రూ.3,587 కోట్లు వచ్చిందని, ఎక్సైజ్ శాఖకు నాడు రూ.4,900 కోట్లు వస్తే. . ఇప్పుడు రూ.5,681 కోట్లు వచ్చిందని వివరించారు.

నిద్ర లేకపోతే.. బరువు తగ్గలేం



అధిక బరువును వదిలించుకునేందుకు వ్యాయామం, ఆహార నియమాలు ఎంత ముఖ్యమో.. నిద్ర కూడా అంతే ముఖ్యం. తగినంత నిద్ర లేకపోతే శరీరంలో లెప్టిన్ అనే హార్మోన్ స్థాయిలు తగ్గిపోతాయి. అదే సమయంలో గ్రెలిన్ అనే హార్మోన్ స్థాయిలు పెరుగుతాయి. ఫలితంగా.. కడుపు నిండిన భావన కలగదు. ఇంకా ఎక్కువ ఆహారం తీసుకోవాలనిపిస్తుంది. రోజూ రాత్రి దాదాపు 8 గంటలు నిద్రిస్తే ఈ హార్మోన్ల స్థాయిలు నియంత్రణలో ఉండి.. బరువు తగ్గడం సులువవుతుంది.

– జానీ బ్రౌన్, హెల్త్ కోచ్

ఉక్రెయిన్‌పై త్రైపాక్షిక భేటీ

(మొదటి పేజీ తరువాయి)



చర్చల కోసం శ్వేతసౌధానికి విచ్చేసిన ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్‌లెయన్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడెరిక్ మెర్జ్, నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రుట్టెలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

కూటమి తరహాలో భద్రతపరమైన హామీలు ఇవ్వాలా అనేది ఇంకా చర్చించలేదు" అని ట్రంప్ చెప్పారు. భారత్-పాకిస్థాన్ సహా ఆరు యుద్ధాలను ఇప్పటికే తాను ఆపానని, ఉక్రెయిన్ సమస్య కాస్తంత సంక్లిష్టంగా ఉందని వ్యాఖ్యానించారు. ట్రంప్ సతీమణి మెలనియాకు జెలెన్‌స్కీ సతీమణి ఒలెనా జెలెన్‌స్కా రాసిన లేఖను వొలొదిమిర్ అందజేశారు.

క్రిమియాను ఉక్రెయిన్ మర్చిపోవాలి: జెలెన్‌స్కీతో చర్చలకు ముందు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. 12 సంవత్సరాల క్రితం రష్యా ఆక్రమించిన క్రిమియాను ఉక్రెయిన్ మరిచిపోవాలన్నారు. నాటోలో ప్రవేశించాలన్న ఆకాంక్షనూ ఆ దేశం వదులుకోవాలని అన్నారు. ఈ మేరకు తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో పోస్టు పెట్టారు. "జెలెన్‌స్కీ తక్షణమే యుద్ధం విరమించొచ్చు.. కావాలనుకుంటే కొనసాగించవచ్చు. కానీ, ఒబామా ఇచ్చేసిన క్రిమియాను మాత్రం తిరిగి పొందలేరు. నాటో సభ్యత్వమూ పొందలేరు" అని పేర్కొన్నారు. తనకు మద్దతుగా వచ్చిన ఐరోపా నేతలకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు చెబుతూ.. "ఉక్రెయిన్‌ను రక్షించుకుంటానన్న నమ్మకం నాకు ఉంది. అదే సమయంలో మా భద్రతకు హామీ కూడా పొందుతాననే భావిస్తున్నాను. రష్యా ప్రారంభించిన యుద్ధాన్ని అదే ఆపేయాలి" అని అన్నారు. "ఉక్రెయిన్ శాంతికి హామీ ఇవ్వాలని చాలా ఐరోపా దేశాలు కోరుకుంటున్నాయి. దీనికి రష్యా అంగీకరిస్తుంది. కానీ, అదే రక్షణ హామీ మా దేశానికీ అవసరమే" అని రష్యా ప్రతినిధి మిఖాయిల్ ఉల్యానోవ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.


ఈనాడు

ప్రజాసంక్షేమానికి జీఎస్టీ సంస్కరణ

ప్రజల ఆర్థిక పరిస్థితులు బాగుపడకుండా ఏ దేశమూ సంపన్న రాజ్యం కాలేదు. జీడీపీ ఎంత పెరిగినా, ఆ ప్రగతి తలసరి ఆదాయాల్లో ప్రతిఫలించకపోతే- అలాంటి అభివృద్ధి అర్థవంతమైనది కాజాలదు. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిన ఇండియా- తలసరి రాబడుల పరంగా 194 దేశాల జాబితాలో 143వ స్థానంలో ఉన్నట్లు ఐఎంఎఫ్ వెల్లడించింది. ఈ దురవస్థ తప్పినప్పుడే నిజమైన వికసిత భారతం ఆవిష్కృతమవుతుంది. అరకొర ఆదాయాలతో బతుకు పోరాటంలో చిక్కిశల్యమవుతున్న సామాన్యులకు కాస్త సాంత్వన లభించాలంటే సుంకాల భారాన్ని తగ్గించకతప్పదు. పన్నులను కుదిస్తే వినియోగం అధికమవుతుంది. ఫలితంగా వస్తు సేవలకు గిరాకీ ఎగబాకుతుంది. దానివల్ల ఉత్పత్తి పెరగడమే కాదు, ఉపాధి అవకాశాలూ విస్తృతమవుతాయి. తద్వారా అంతిమంగా దేశార్థిక వ్యవస్థే లాభపడుతుంది. వస్తుసేవల పన్నును హేతుబద్ధీకరిస్తే వచ్చే ఏడాదికి భారత జీడీపీలో 0.6శాతం వృద్ధి నమోదవుతుందని తాజాగా ఓ నివేదిక లెక్కగట్టింది. ఆ మేరకు జనభారతం లబ్ధి పొందాలంటే ముందు వస్తు సేవల వర్గీకరణలో అసంబద్ధతలు నివారించాలి. 'ఇన్వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్'లో సమస్యలను పరిష్కరించి, పన్ను చెల్లింపు విధానాలను సులభతరం చేయాలి. కాబట్టి జీఎస్టీ విధివిధానాలను సమగ్రంగా సంస్కరించడం అత్యావశ్యకం!

రాష్ట్రానికో తీరుగా వేళ్లూనుకుని, దేశాభివృద్ధికి ప్రతిబంధకమవుతున్న పన్నుల అవ్యవస్థను చక్కదిద్దాలన్న సంకల్పంతో ఎనిమిదేళ్ల కిందట కేంద్రం జీఎస్టీని ఆచరణలోకి తీసుకొచ్చింది. 'ఒకే దేశం-ఒకే పన్ను' మూలంగా తమ రాబడులు తగ్గుతాయేమోనన్న రాష్ట్ర ప్రభుత్వాల భయసందేహాల నడుమ నాలుగు శ్లాబుల వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. అది సహేతుకంగా లేదని, దాన్ని రెండు శ్లాబులకు కుదించాలని ఆర్థికవేత్తలు చిరకాలంగా సూచిస్తున్నారు. ఈ మేరకు దీపావళిలోపు జీఎస్టీ ప్రక్షాళనను పట్టాలెక్కించబోతున్నట్లు ప్రధాని మోదీ పంద్రాగస్టు ప్రసంగంలో తీపికబురు వినిపించారు. వ్యవసాయ ఉపకరణాలు, ప్రాణరక్షక ఔషధాలు, బీమా ప్రీమియంలపై పన్నుల బాదుడును తగ్గించాలన్న డిమాండ్లు ఎప్పటినుంచో ఉన్నాయి. పెట్టుబడి ఖర్చులు పెరగడం, మార్కెట్లో అనిశ్చితి నెలకొనడంతో ఒత్తిడికి గురవుతున్న ఎంఎస్ఎంఈలకు జీఎస్టీ సంస్కరణలు కచ్చితంగా ఉపశమనం కలిగిస్తాయి. పేదలు, దిగువ మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా వినియోగించుకునే వస్తు సేవలపై పన్నులు తగ్గితే- జనం చేతిలో కాస్త డబ్బులాడతాయి. తద్వారా వారి కొనుగోలు సామర్థ్యం అధికమై జనజీవన ప్రమాణాలు మెరుగుపడతాయి!

పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరుగుతుండటంతో జీఎస్టీ వసూళ్లు సైతం దూసుకుపోతున్నాయి. 2020-21లో రూ.11.37లక్షల కోట్లుగా నమోదైన ఆ రాబడులు... 2024-25లో రూ.22.08లక్షల కోట్లకు చేరాయి. కానీ, జీఎస్టీతో అవినీతి తగ్గి పారదర్శకత పాదుకుంటుందన్న తొలినాళ్ల స్వప్నాలు మాత్రం ఇప్పటికీ పూర్తిగా సాకారం కాలేదు. బోగస్ రిజిస్ట్రేషన్లు, దొంగ ఇన్వాయిసులు, టర్నోవర్‌ను తక్కువగా చూపించడం వంటివాటితో చాలామంది పన్ను ఎగవేస్తున్నారు. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్లలోనూ భారీగా చేతివాటాలకు పాల్పడుతున్నవారూ పోగుపడ్డారు. ఈ ప్రబుద్ధులందరూ కలిసి 2020-25 మధ్యలో ఖజానాకు రావాల్సిన రూ.7.07లక్షల కోట్లను ఎగ్గొట్టారు! ముమ్మర తనిఖీలు, అధునాతన సాంకేతికతల ద్వారా ఎగవేతదారులను గుర్తించి, పన్ను మొత్తాలను రాబట్టడంపై ప్రభుత్వ యంత్రాంగం దృష్టిసారించాలి. ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తూ జీఎస్టీని క్రమబద్ధీకరించడం ఎంత ముఖ్యమో- ఆర్థిక అవకతవకలను అరికట్టడమూ అంతే ప్రధానం!



బుద్ధుడు ఒక మతం కనిపెడదామని బయల్దేరలేదు. మనుషుల కష్టాలకు కారణమేంటో తెలుసుకుందామని ఇల్లు వదిలాడు. జీవితాన్ని దానికి సహజమైన ఎత్తుపల్లాలతో జీవిస్తేనే మనలో సహానుభూతి పెరుగుతుంది. ఏదీ శాశ్వతం కాదు అన్న స్పృహ ఉంటే దేనికీ అతిగా బాధపడం.

– సత్య నాదెళ్ల

నిరంతర సాధన

'సాధనమున పనులు సమకూరు ధరలోన' అన్నాడు వేమన. 'సాధన చేయుమురా నరుడా సాధ్యము కానిది లేదురా' అన్నారో సినీకవి. భగీరథుడి అకుంఠిత సంకల్ప దీక్షతోనే దివినుంచి భువికి దిగింది భాగీరథి. రాజర్షి పదవి నుంచి బ్రహ్మర్షి పదవిని అందుకోవడానికి విశ్వామిత్రుడికి నిరంతర సాధనే తోడైంది.

సాధన అనేది కేవలం కొన్ని ప్రత్యేక సమయాలలో చేసే అభ్యాసం మాత్రమే కాదు, అది అనుక్షణం ప్రతి పనిలోనూ జరగాల్సిన మానవ ప్రయత్నం. ఏ పని సిద్ధించాలన్నా సాధన అవసరం. అందుకు కావాల్సింది ఓపిక. కార్యం పట్ల నిబద్ధత ఉంటేనే ఓపిక వస్తుంది. సాధన ఎంత చిత్తశుద్ధితో జరిగితే కార్యసిద్ధి అంత త్వరగా కలుగుతుంది. మనోనిగ్రహం లభించాలంటే రోజుకు ఒక గంటో రెండు గంటలో మనసును నియంత్రించి, మిగిలిన సమయంలో దాన్ని విచ్చలవిడిగా వదిలేయడం కాదు. ప్రతిక్షణం మనసును గమనిస్తూ దాని కదలికలను కనిపెడుతూ ఉన్నప్పుడే దాన్ని దారిలోకి తేగలం. అలా తెచ్చుకుని, మనం చేసే ఏ చిన్న పనైనా కౌశలంతో చేయడమే ఒక యోగం. గీతాచార్యుడూ అదే చెప్పాడు.



అంతర్యామి

గురువు దగ్గరికి కొత్తగా ఒక శిష్యుడు వచ్చాడు. అతణ్ని పూజామందిరం శుభ్రం చేయమన్నారు. తనకు ఇంత చిన్న పని అప్పగించారేంటని అనుకుంటూ హడావుడిగా పని పూర్తిచేశాడు. గురువు మందిరానికి వెళ్లి చేత్తో తడిమితే దుమ్ము అంటుకుంది. శిష్యుణ్ని పిలిచి 'నేను చెప్పాను, నువ్వు చేశావు. అంతేకానీ జరగాల్సిన రీతిలో పని జరగలేదు. ఆధ్యాత్మిక గ్రంథాలు చదవడం, ప్రవచనాలు వినడం, నియమిత సమయాలలో జప ధ్యానాలు చేసుకుపోవడమే సాధన కాదు. మనం చేసే ప్రతి చర్యలోనూ సాధన ప్రతిఫలించాలి. ఒక పని ఎలా చెయ్యాలో అలా చెయ్యడమే ఉత్తమ సాధకుడి లక్షణం. పైపైన చెత్త మాత్రమే ఊడ్చావుగాని లోతుగా పనిచేయలేకపోయావు. దీన్ని చిన్న పనిగా భావించావు. సాధన మొదట చిన్నపనులతోనే ప్రారంభమవుతుంది. మందిరాన్నే శుభ్రపరచలేని వాడివి, మనసును ఎలా శుభ్రపరచుకుంటావు? మనసు స్థితిని బట్టే మన ఇంద్రియాలు పనిచేస్తుంటాయి. ఈ పని జరగాల్సిన రీతిలో జరగలేదంటే మనసు నీ స్వాధీనంలో లేదన్నమాట. హడావుడి, ఆత్రుత, అస్థిరత సాధనకు శత్రువులు. ఓపిక, పట్టుదల, నిబద్ధత సాధనకు మిత్రులు' అని చెప్పారు. ఆయన సూక్ష్మ పరిశీలనాశక్తికి శిష్యుడు ఆశ్చర్యపోయాడు.

విద్యార్థులు పాఠశాల స్థాయిలో చేసే చిన్న చిన్న ప్రయోగాలే భావి జీవితంలో వారు సాధించబోయే పెద్ద విజయాలకు నాంది పలుకుతాయి. ఆ సమయంలో వారు చూపే ఓపిక, ఏకాగ్రత, శ్రద్ధ, పట్టుదల, సూక్ష్మ పరిశీలన వంటివి వారిని ఉన్నతులుగా నిలబెడతాయి. అందుకే చిన్న వయసునుంచే వారిలో ఆ లక్షణాలను ప్రోత్సహించాలి. సాధన అనేది వ్యక్తిగతంగానూ, సమష్టిగా సమాజ ఉన్నతికీ దోహదపడేదిగా ఉండాలి. అలాంటి సాధన ఒకరోజులో చేసి ఆపేది కాదు, అది నిరంతర ప్రక్రియ.

– నెయిగాపుల కృష్ణ

మెరుపు వరదలు నేర్పుతున్న గుణపాఠాలు

ఉత్తరకాశీలో ఇటీవల సంభవించిన మెరుపు వరదలు ఎన్నో ప్రశ్నలను లేవనెత్తాయి. వాతావరణ మార్పులు, విచక్షణారహిత అభివృద్ధి పనులతో హిమాలయాలకు పొంచి ఉన్న ముప్పును బయటపెట్టాయి. పర్వత ప్రాంత అభివృద్ధి ప్రక్రియలో గుణాత్మక మార్పులు రాకపోతే విధ్వంసం తీవ్రత మరింతగా పెరిగే ప్రమాదం ఉంది.

ఆగస్టు ఐదో తేదీన ఖీర్‌గంగా నది ఎగువ పరీవాహక ప్రాంతంలో కుండపోత వానతో వరద పోటెత్తింది. పెద్దయెత్తున బురద నీరు ధరాలీ గ్రామాన్ని ముంచెత్తింది. ఇళ్లు, హోటళ్లు, దుకాణాలు కొట్టుకుపోయాయి. పలువురు చనిపోయారు. వందల మంది గల్లంతయ్యారు. 2013లో కేదార్‌నాథ్ మొదలు 2021లో చమోలీ వరకు హిమాలయ ప్రాంతంలో తరచూ విపత్తులు సంభవిస్తూనే ఉన్నాయి. భారీ వర్షాలు లేదా హిమానీ నదాలు కరగడానికి తోడు, అక్కడి సున్నిత పర్యావరణ వ్యవస్థ కారణంగా నష్టం పెరుగుతోంది. ఇలాంటి ప్రాంతాల్లో భారీ నిర్మాణాలు సమస్య తీవ్రతను పెంచుతున్నాయి. ఈ క్రమంలో మనదేశం పర్వతప్రాంత అభివృద్ధి అజెండాలో వాతావరణ మార్పులు వంటి సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలి. లేనిపక్షంలో హిమాలయాల్లో ఈ తరహా దుర్ఘటనలు కొనసాగుతూనే ఉంటాయి.

హెచ్చరికలపై నిర్లక్ష్యం

ఇండియాలో 1901-2015 మధ్య విపత్తులు మూడురెట్లు పెరిగినట్లు ఓ అధ్యయనం స్పష్టం చేస్తోంది. వేడెక్కుతున్న అరేబియా సముద్రం మరింత తేమతో కూడిన రుతుపవనాల గాలులకు ఆజ్యం పోస్తోంది. అవి హిమాలయాలను ఢీకొట్టి స్వల్ప వ్యవధిలో తీవ్రస్థాయి కుండపోతలకు దారితీస్తున్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రపంచ సగటుతో పోలిస్తే, హిమాలయాలు రెండురెట్లు వేగంగా వేడెక్కుతుండటంతో హిమానీనదాలు కరిగే ప్రమాదం పెరుగుతోంది. పర్వత వాలు ప్రాంతాలు బలహీనపడుతున్నాయి. భారీ వర్షాలు, వేగంగా మంచు కరగడం వంటివి కొండచరియలు జారడానికి, వరదలకు, మంచుప్రవాహాలకు దారి తీస్తున్నాయి.

ఉత్తరకాశీ అనేది భాగీరథి ఎకో సెన్సిటివ్ జోన్(ఈఎస్‌జెడ్) పరిధిలో ఉంది. సున్నిత పర్యావరణాన్ని పరిరక్షించేందుకు 4,157 చదరపు కి.మీ. ప్రాంతాన్ని 2012లో ఈఎస్‌జెడ్‌గా గుర్తించారు. భారీ నిర్మాణాలు, గనుల తవ్వకాలు, సహజ ప్రవాహాలను దెబ్బతీసే కార్యకలాపాలపై ఈఎస్‌జెడ్‌లో ఆంక్షలను అధికారులు విధిస్తారు. క్షేత్రస్థాయిలో వీటినెవరూ లెక్కచేయట్లేదు. నదుల ఒడ్డున బహుళ అంతస్తుల హోటళ్లు, రెస్టారెంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పర్వత వాలులను తవ్వి రోడ్లు నిర్మిస్తున్నారు. నిపుణుల హెచ్చరికలను పెడచెవిన పెడుతూ జలవిద్యుత్ ప్రాజెక్టులు కొనసాగుతూనే ఉన్నాయి. పర్యావరణ భద్రతను విస్మరిస్తూ వాణిజ్య ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారనేందుకు ధరాలీ వరద విషాదమే నిదర్శనం. తీవ్రస్థాయి వాతావరణ పరిస్థితులే విపత్తులు మారణహోమంగా మారుతున్నాయనేందుకు ఇదే సరైన తార్కాణం. ముందు జాగ్రత్తలు లేకుండా మౌలిక సదుపాయాలను పెంచుకుంటూ పోతుండటంతో హిమాలయ ప్రాంతంలో ఆర్థిక, మానవ నష్టాలు పెరిగిపోతున్నాయి. కేదార్‌నాథ్ వరదల్లో ఆరువేలకుపైగా మంది మరణించగా, ఏడువేలకోట్ల రూపాయలకుపైగా నష్టం సంభవించింది. చమోలీ గ్లేసియర్ విపత్తు రెండు జలవిద్యుత్ ప్రాజెక్టులను తుడిచిపెట్టేసింది. రెండొందలకుపైగా కార్మికులు చనిపోగా, రూ.1500 కోట్లదాకా నష్టం వాటిల్లినట్లు అంచనాలున్నాయి. వాతావరణ సంబంధ విపత్తులతో ఇండియాకు ఏటా 87 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతోందన్నది ప్రపంచబ్యాంకు అంచనా.

ఉత్తరాఖండ్‌లో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పాతకాలంనాటి పర్యావరణ మదింపు అంచనాలపైనే ఆధార పడుతున్నాయి. కొత్త తరహా వాతావరణ సమస్యలపై దృష్టిపెట్టడం లేదు. దీనికితోడు విపత్తు నిర్వహణ చేష్టలుడిగింది. దానికి బదులుగా ప్రమాదం జరిగిన తర్వాత సహాయక చర్యలు, పునర్నిర్మాణంపైనే అధికంగా దృష్టి పెడుతున్నారు. ప్రణాళిక, డిజైన్, ఆమోదం స్థాయిలో వాతావరణ ముప్పు అంచనాలను పరిగణనలోకి తీసుకోవట్లేదు. ఇలాంటి పాలనపరమైన అంతరాలను సత్వరమే పూడ్చాల్సి ఉంది. ఈఎస్‌జెడ్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి. నదుల వరద మైదానాలు, కొండ వాలుల్లో శాశ్వత నిర్మాణాలు చేపట్టకుండా నిరోధించాలి. రహదారుల వెడల్పు, జలవిద్యుత్తు, హోటళ్ల వంటి ప్రతి పెద్ద ప్రాజెక్టుపై వాతావరణ, భౌగోళిక విపత్తు మదింపు చేపట్టాలి. తీవ్రస్థాయి వర్షపాతం, కొండచరియలు జారడం, గ్లేసియర్లు కరగడం వంటి ప్రమాద అవకాశాలను గుర్తించాలి. వీటిపై ఉదాసీనంగా వ్యవహరించకూడదు. ముప్పును ముందుగానే పసిగట్టడం, హెచ్చరిక వ్యవస్థలపై పెట్టుబడులు పెంచడం ముఖ్యం. హిమాలయాల్లో భారత వాతావరణ విభాగం (ఐఎండీ) డాప్లర్ రాడార్ నెట్‌వర్క్ విస్తృతిని



పెంచడం, నదుల్లో సెన్సర్ల ఏర్పాటు, మారుమూల ప్రాంతాలదాకా కమ్యూనికేషన్ వ్యవస్థల నిర్మాణం వంటివాటి ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చు. ఇస్రో, జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం వంటి సంస్థలు ముప్పు సంబంధిత ప్రాంతాలను గుర్తించే అవకాశం ఉంది. వీటి నివేదికలను క్షేత్రస్థాయికి చేర్చాలి. ఉత్తరకాశీ ప్రాంతంలో ముప్పు పొంచిఉన్న గ్రామాలు పదేపదే నష్టాల బారిన పడకుండా వాటిని వేరేచోటికి తరలించాలి. నష్టపరిహార ప్యాకేజీ, ప్రత్యామ్నాయ జీవనోపాధులను కల్పించే ప్రక్రియలో సంబంధిత వర్గాలకు భాగస్వామ్యం కల్పించాలి. స్థానిక సంప్రదాయ గృహనిర్మాణ పద్ధతులు, నీటినిర్వహణ విధానాలపై అవగాహన పెంచుకోవాలి.

జాతీయ స్థాయి సమస్య...

ఉత్తరాఖండ్‌కు సంబంధించినంత వరకూ పర్యాటక రంగం ఆర్థిక చోదక శక్తిగా ఉపకరిస్తూనే, కష్టనష్టాలకూ కారణమవుతుంది. హోటళ్లు, రిసార్టులు హిమాలయ అందాలతో ప్రయోజనం పొందుతున్నా, వాటి సంరక్షణను పట్టించుకోవట్లేదు. ఉత్తరకాశీ వరదలను కేవలం ఆ ప్రాంతానికే పరిమితమైన స్థానిక సమస్యగా చూడకూడదు. జాతీయ హెచ్చరికలుగానే పరిగణించాలి. దీర్ఘకాలిక ప్రయోజనాలను విస్మరించి, స్వల్పకాలిక అభివృద్ధికే ప్రాధాన్యం ఇవ్వడం, వాతావరణ మార్పులను ఈనాటి వినాశహేతువుగా కాకుండా, భవిష్యత్తు సమస్యగా పరిగణించడం వంటివి ప్రాణాంతకమైనవి. భారత్ పర్వతప్రాంత అభివృద్ధి నమూనాలను పునస్సమీక్షించుకోకపోతే, హిమాలయాల్లో విపత్తులు ఆగవు. ప్రతి రుతుపవనాల సీజన్ విషాదంగానే మిగిలిపోతుంది. అందుకని, హిమాలయాల్లో ప్రతి అభివృద్ధి పనిలో వాతావరణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిందే!




అపర్ణా రాయ్
పర్యావరణ, ఇంధన రంగ నిపుణులు, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్

ఎవరి జీవితంలోనైనా కష్టాలు తప్పవు. వాటివెంటే కన్నీళ్లూ వరదలెత్తుతాయి. తలొంచితే కొట్టుకుపోవడమే. ఎదురొడ్డితేనే గెలుపు. కానీ, జీవితంలో ప్రతి మలుపులో ఓటమే వెంటాడితే! ఎంతకని పోరాడాలి? అలాగని నిర్వేదంలో కూరుకుపోయి ఆగిపోకుండా ఓటమికి గెలుపు దక్కకుండా పోరాడి, విజయాన్ని సొంతం చేసుకునేవారే యోధులు.

అది 1952. ఫిన్లాండ్ ఒలింపిక్స్‌లో రెజ్లింగ్‌లో ఖషబ దాదాసాహెబ్ జాదవ్ కాంస్య పతకం సాధించారు. స్వతంత్ర భారతంలో తొలి వ్యక్తిగత పతకమది. దేశం ఉప్పొంగిపోయింది. మహారాష్ట్రలోని కారద్‌లో జాదవ్‌కు స్వాగతం పలికేందుకు రైల్వేస్టేషన్ కిక్కిరిసిపోయింది. అందులో ఎనిమిదేళ్ల చిన్నారి కూడా ఉన్నాడు. ఎలాగైనా

నిజమైన ఛాంపియన్!



తనుకూడా దేశానికి పతకాన్ని సాధించి పెట్టాలన్న సంకల్పం ఆ పిల్లాడిలో అప్పుడే బలపడింది. ఆ బాలుడి పేరు మురళీకాంత్ రాజారాం పేట్కర్. పెద్దయ్యాక ఏం కావాలనుకుంటున్నారో చెప్పమని ఒకరోజు బడిలో మాస్టారు పిల్లలను అడిగారు. ఒలింపిక్ బంగారు పతక విజేతను అవుతానంటూ మురళీకాంత్ చెప్పడంతో అంతా గొల్లుమన్నారు. ఆ విషయం గ్రామంలోనూ పాకడంతో గేలి చేశారు.

గ్రామంలో రెజ్లింగ్ శిక్షణ దొరకడంతో మురళీకాంత్ సాధన మొదలైంది. పోటీల్లో గెలుపు బాట పట్టాడు. ఓసారి ఊరి సర్పంచి కొడుకునే ఓడించాడు. పెద్దమనుషులపై గెలవడం చాలా పెద్ద విషయం. సర్పంచి మనుషులు దాడికి దిగారు. ఊరొదిలి పారిపోక తప్పలేదు. అది మొదటి దెబ్బ. పుణెలో మేనత్త ఆశ్రయమిచ్చి, సైన్యంలో చేర్పించారు. అక్కడ రెజ్లింగ్ లేదు. మరో శరాఘాతం. హాకీ స్టిక్ చేతికొచ్చింది. కానీ, జట్టులో స్థానం దక్కలేదు. మళ్లీ నిరాశ. అయితేనేం, బాక్సింగ్‌లో సత్తా చూపమంటూ ఓ సీనియర్ వెన్నుతట్టారు. మురళీకాంత్ స్వల్పకాలంలోనే బాక్సింగ్‌లో రాణించారు. 1964లో టోక్యోలో జరిగిన అంతర్జాతీయ సర్వీసెస్ స్పోర్ట్స్‌మీట్‌లో భారత సైన్యం తరపున పాల్గొని 15 మ్యాచ్‌లు గెలిచారు. ఫైనల్‌లో ఓటమితో తీవ్ర నిరాశ... తిరిగి వచ్చాక సికింద్రాబాద్‌లో పోస్టింగ్ వచ్చింది. తర్వాత కశ్మీర్‌లో పోస్టింగ్. 1965 భారత్-పాకిస్థాన్ యుద్ధం మొదలైంది. సియాల్‌కోట్ సెక్టార్‌లోని వీరి శిబిరంపై శత్రువిమానాల దాడి జరిగింది. మురళీకాంత్ ఒంట్లో తొమ్మిది బుల్లెట్లు దిగాయి. తనపై నుంచి ఓ వాహనం కూడా వెళ్లడంతో కాళ్లు చచ్చుపడిపోయాయి. కోమాలోకి వెళ్లిపోయారు. కోలుకోవడానికి రెండేళ్లు పట్టింది. వెన్నెముకలో దిగిన ఒక బుల్లెట్‌తోనే జీవితం గడపకతప్పదని ముంబయి నేవీ ఆస్పత్రి డాక్టర్లు తేల్చేశారు. కోలుకోలేని దెబ్బ! ఫిట్‌నెస్ కోసం ఈత కొట్టాలన్న వైద్యుల సూచన మరోసారి ఆశలు రేపింది. కఠోర సాధనతో స్విమ్మింగ్‌లో నైపుణ్యం సొంతమైంది. చివరికి తనదైన రోజు రానేవచ్చింది. 1972లో జర్మనీలో వేసవి పారాలింపిక్స్‌లో 50 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో మురళీకాంత్ బంగారు పతకం సాధించారు. భారత్ నుంచి తొలి పారాలింపిక్ స్వర్ణపతక విజేతగా నిలిచారు. పదేపదే ఓడించాలనుకున్న జీవితంపై కసిదీరా గెలిచిన మురళీకాంత్‌కు 2018లో 'పద్మశ్రీ' వరించింది. 2025 జనవరిలో 'అర్జున అవార్డు(జీవన సాఫల్యం)'ను అందుకున్నారు. ఈ విజయగాథతో గతేడాది బాలీవుడ్‌లో 'చందూ ఛాంపియన్' అనే స్ఫూర్తిదాయక సినిమా కూడా వచ్చింది. గెలుపు బాటలో విధి వేటను తప్పించుకుంటూ పట్టువదలకుండా పోరాడేవారే ఛాంపియన్లు కాగలరు మరి!

– డి. శ్రీనివాస్

ఎప్పుడు నియమిస్తారు?

మన దేశంలో రెండు కోట్ల మందికి పైగా పశుపోషణపై ఆధారపడి బతుకుతున్నారు. మొత్తం జనాభాలో 8.8శాతం మందికి ఆ రంగం ఉపాధి కల్పిస్తోంది. గణాంకాల ప్రకారం 2019నాటికే దేశీయంగా 53.67 కోట్ల పశువులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పశువైద్యుల అవసరం చాలా ఉంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలన్నీ కలిపి 38.91 వేల పశువైద్యుల పోస్టులు మంజూరైతే, అందులో దాదాపు పదకొండు వేలకు పైగా ఖాళీగా పడి ఉన్నాయి. ఆయా రాష్ట్రాల్లో మంజూరైన పోస్టులు, ఖాళీలు...

రాష్ట్రం	మంజూరైన పోస్టులు	ఖాళీలు
ఆంధ్రప్రదేశ్	2743	340
బిహార్	2067	860
గుజరాత్	810	432
ఝార్ఖండ్	774	237
కర్ణాటక	3317	1156
మహారాష్ట్ర	4685	3072
ఒడిశా	1909	611
పంజాబ్	1508	555
రాజస్థాన్	3691	1367
తమిళనాడు	3030	299
తెలంగాణ	1224	46
ఉత్తర్ ప్రదేశ్	1984	506
పశ్చిమ్ బెంగాల్	1333	119

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

సుంకాల సుడిగుండంలో రొయ్యల రైతులు

డాలర్ పంటగా పేరొందిన రొయ్యల సాగు రైతులకు తీవ్ర నష్టాలు తెచ్చిపెడుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే మన ఎగుమతులపై 25శాతం సుంకాలు విధించారు. రాబోయే రోజుల్లో దాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించారు. ఒకవైపు రొయ్యల ఉత్పత్తి వ్యయం కట్టుతప్పుతోంది. దానికి తోడు మార్కెట్లో ధరలు పతనమవడం ఆక్వా రైతులను కడగండ్లలోకి నెడుతోంది.

ఇండియాలో లక్షల ఎకరాల్లో ఆక్వాసాగు జరుగుతోంది. 2023-24లో సముద్ర ఆహార ఉత్పత్తులతో కలిపి భారత్ 132 దేశాలకు మొత్తం 17.81 లక్షల టన్నుల ఆక్వా ఎగుమతులు జరిపింది. వాటి విలువ రూ.60 వేల కోట్లు. అందులో అమెరికా వాటా 3.29 లక్షల మెట్రిక్ టన్నులు. వాటి విలువ రూ.22వేల కోట్లు. భారతదేశం ప్రధానంగా ఘనీభవించిన రొయ్యలు, చేపలు, ఇతర మత్స్య ఉత్పత్తులను అమెరికా, చైనా, జపాన్, వియత్నాం తదితర దేశాలకు పంపిస్తోంది. వీటిలో పరిమాణం పరంగా 40శాతం, ఎగుమతి విలువ పరంగా 66శాతం వాటా రొయ్యలదే. అమెరికాకు ఇండియా మత్స్య ఎగుమతుల్లో 90 శాతానికి పైగా వాటా రొయ్యలదే! వాటి విలువ రూ.20వేల కోట్లకు పైగా ఉంటుంది.

ఉపాధి అవకాశాలపై ప్రభావం

దేశీయంగా ఆంధ్రప్రదేశ్, గుజరాత్, పశ్చిమ్ బెంగాల్‌లు అత్యధికంగా రొయ్యలను ఉత్పత్తి చేస్తున్నాయి. ఇండియాలో ఏటా సుమారు తొమ్మిది లక్షల టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతుంటే, అందులో 70శాతం వాటా ఆంధ్రప్రదేశ్‌దే. ఏపీలో ఉత్పత్తి అయ్యే రొయ్యల్లో 29శాతం అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. గతంలో వేసవి వచ్చే సరికి చెరువులను ఎండబెట్టి జూన్, జులై మాసాల్లో రొయ్యల సాగు చేపట్టేవారు. ఇప్పుడు ఏడాది పొడవునా వాటిని పెంచి సరఫరా చేస్తున్నారు. రొయ్యల ఎగుమతులు ఇండియాకు భారీగా విదేశ మారకద్రవ్యాన్ని ఆర్జించి పెడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి ఎన్నికైన తరవాత ఈ ఏడాది ఏప్రిల్‌లో రొయ్యలపై దిగుమతి సుంకం పెంచడంతో వాటి ధరలు పతనమయ్యాయి. అనంతర పరిణామాల్లో పరిస్థితులు కుదుటపడ్డాయి. ట్రంప్ మళ్లీ సుంకాల భారం మోపడంతో రొయ్యల రైతులు ప్రస్తుతం విలవిల్లాడుతున్నారు. ఇండియా ఎగుమతులపై ట్రంప్ విధించిన 25శాతం ప్రతీకార సుంకాలు మొన్న ఆగస్టు ఏడు నుంచి అమలులోకి



వచ్చాయి. ఆగస్టు 27 నుంచి మరో 25 శాతం టారిఫ్‌లు అమలులోకి వస్తాయని ఆయన ప్రకటించారు. భారత్ ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో సింహభాగం వాటా అమెరికాదే. సుంకాల దెబ్బతో ఇండియా నుంచి అమెరికాకు ఆక్వా ఎగుమతులు అమాంతం తగ్గిపోయే ప్రమాదముంది. అగ్రరాజ్యం నుంచి ఆర్డర్లు సన్నగిల్లవచ్చు. ట్రంప్ చర్యలతో రూ.17వేల కోట్ల విలువైన రొయ్యల ఎగుమతులకు తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు భారత సముద్ర ఆహార ఎగుమతి సంఘం ఇటీవల కేంద్రానికి తెలియజెప్పింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆక్వా రంగంలోని ఎంతోమంది రైతుల మనుగడ కష్టంగా మారుతుంది. పెద్దసంఖ్యలో కార్మికులు ఉపాధి అవకాశాలు కోల్పోయే ప్రమాదముంది. అమెరికా-ఇండియా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై మరో విడత చర్చలు త్వరలో జరగబోతున్నాయి. అవి ఒక కొలిక్కి వస్తే తప్ప సుంకాల భారంపై స్పష్టత రాకపోవచ్చు.


అన్నీ అగచాట్లే...

ఇప్పటికే వాతావరణ మార్పులతో రొయ్యలకు రోగాల తాకిడి పెరిగింది. దాంతో అవి పూర్తిస్థాయిలో పెరగకుండానే పట్టుబడి జరపాల్సి వస్తుండటంతో రైతులకు నష్టాలు తప్పట్లేదు. ప్రస్తుతం రొయ్యల మేత ధర విపరీతంగా పెరిగింది. దిగుబడేమో పడిపోయింది. ఒక్కో చెరువులో లక్ష రొయ్య పిల్లలను వదిలితే 60-80వేలు వచ్చే పరిస్థితీ లేదు. ఇలాంటి తరుణంలో ధరలు కూడా పతనం కావడం మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా మారింది. ప్రతీకార సుంకాన్ని సాకుగా చూపి కొనుగోలుదారులు అన్ని రొయ్య కౌంట్లపై కిలోకు రూ.30-50 వరకు తగ్గిస్తున్నారు. కొత్త సుంకాల నేపథ్యంలో రొయ్యలను అమెరికాకు ఎగుమతి చేయాలంటే భారీగా పన్ను చెల్లించాల్సి వస్తుంది. దాంతో పాటు యాంటీ డంపింగ్ డ్యూటీ, కౌంటర్ వెయిలింగ్ డ్యూటీని కట్టాల్సి ఉంటుంది. ట్రాన్స్‌పోర్ట్, ప్యాకింగ్ ఖర్చులు అదనం. మరోవైపు రొయ్యల ధరలు తగ్గితే అది రైతులకు అదనపు కుదుపు అవుతుంది. దీనివల్ల వాటి సాగుదారులకు పెట్టుబడి ఖర్చులూ తిరిగి రావు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు రొయ్యల రైతులకు అండగా నిలవాలి. ట్రేడర్లు, ఏజెన్సీలను నియంత్రించడంతో పాటు శీతల గిడ్డంగులు నిర్మించి సాగుదారులు నష్టపోకుండా చూడాలి. వారికి గిట్టుబాటు ధర దక్కేలా తగిన చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ లక్ష్మప్ప బోయిని
సహాయ సంచాలకులు, మత్స్య శాఖ, వనపర్తి

హాయ్! బుజ్జీ!!


నక్క బుద్ధి!



దేవగిరి పొలిమేరలో ఉండే అడవిలో పులి, నక్క, కుందేలు, కోతి స్నేహంగా ఉండేవి. ఏ జీవికి ఇబ్బంది కలిగినా మిగతావి తోడుగా ఉండేవి. ఒకసారి నక్క మనసులో ఒక దురాలోచన పుట్టింది. కుందేలు, కోతి లేని సమయం చూసి పులి దగ్గరికి వెళ్లి.. 'పులిరాజా! కుందేలు, కోతి నీ కంటే చాలా చిన్న జీవులు. వాటిని నీతో సమానంగా చూడటం ఏం బాలేదు. దాని వల్ల నీ విలువ కూడా తగ్గిపోతుంది. అందుకే మనం ఇద్దరం కలిసి ఒక పని చేద్దాం. వాటి మీద దాడి చేసి తినేద్దాం' అంది. దాని మాటలు విన్న పులి మౌనంగా ఉండిపోయింది. అక్కడి నుంచి వెళ్లిపోయి.. రాత్రంతా అదే విషయం గురించి ఆలోచించసాగింది. 'నక్క చెప్పిందే నిజమైతే.. అప్పుడు నక్క కూడా నా కంటే చిన్న జీవే కదా! అలా అయితే దాన్నే ముందు తినాలి కదా!' అనుకుంది పులి.

మరుసటి రోజు ఉదయాన్నే ఎప్పటిలా పులి దగ్గరికి వచ్చింది నక్క. అప్పుడు.. దాని ఆలోచనను నక్కకు వివరించింది పులి. దాంతో నక్క ఒక్కసారిగా భయపడిపోయింది. కాసేపు ఆలోచించి.. 'అదేంటి? నాకు ఆహారం దొరుకుతుందని ఉపాయం వెతికితే.. నేనే ఆహారమయ్యేలా ఉన్నాను. అయినా నా ఆలోచన తప్పు. స్నేహంగా కలిసి ఉన్న మిత్రులను తినాలనుకోవడం సరైంది కాదు' అని మనసులోనే అనుకుంది. అప్పుడు పులి.. 'స్నేహితుల మధ్య ఎవరు బలవంతులు, ఎవరు బలహీనులు.. ఎక్కువ, తక్కువలు.. అనే తేడాలు ఉండకూడదు. మనమంతా ఒకేచోట ఉండేవాళ్లం. ఇలా చిన్నా పెద్దా అంటూ భేదాలు చూపించుకోవడం సరికాదు' అంది. దాని మాటలు విన్న నక్కకు తప్పు తెలిసొచ్చింది. వెంటనే వెళ్లి.. కుందేలు, కోతికి క్షమాపణలు చెప్పింది.

– డా॥ పూసపాటి వేదాద్రి



కృష్ణమ్మ హొయలు.. నగర వెలుగులు



ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణమ్మ ఉరకలేస్తున్న వేళ.. ఇంద్రకీలాద్రి దిగువన బెజవాడ నగరం విద్యుత్తు కాంతులతో ఇలా వెలుగులీనుతోంది. గుంటూరు నుంచి విజయవాడ వైపు వచ్చే వారధి పై నుంచి రాత్రివేళ కనిపిస్తున్న ఈ సుందర దృశ్యం చూపు తిప్పుకోనివ్వదు.

పక్షికి 'ఆహా'రం... చేపకు ప్రాణ సంకటం



నోటికందిన చేప తృటిలో జారిపోతున్న వేళ ఆ పక్షి వేట ఆరాటాన్ని కెమెరాలో బంధిస్తే.. ఈనాడు కెమెరా కంటికి చిక్కిన ఇలాంటి అరుదైన దృశ్యాలు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మీకోసం..

- ఈనాడు, అమరావతి

తవ్వారు.. తేల్చారు..!

సాంకేతిక ఆధారాలతో 'యుపిక్స్' దర్యాప్తు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

హాలీవుడ్ సినిమాలకు గ్రాఫిక్స్ వర్క్స్ పేరుతో 'యుపిక్స్' భారీ కుంభకోణం జరిగింది. ఆరేళ్లలో రూ. వందల కోట్లు సేకరించారు. ఏడాదిలోనే రెట్టింపు పెట్టుబడులు ఇస్తామంటే.. రూ.593 కోట్లు కట్టారు. చివరకు రూ.201 కోట్ల మేర నష్టపోయారని పోలీసులు తేల్చారు. ఏప్రిల్ 14న తొలి కేసు నమోదవగా.. పక్కా దర్యాప్తుతో ఇటీవల నిందితులను అరెస్టు చేశారు. ఇంతటి భారీ కుంభకోణంలో నిందితులను గుర్తించడం, బాధితుల వివరాలు సేకరించాలంటే ఒక సవాలే. తిరుగులేని సాంకేతిక ఆధారాలతో నిందితులను పట్టుకోవాలని సీపీ రాజశేఖరబాబు నిర్ణయించారు. దీని కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేశారు.

నాలుగు నెలలు శ్రమించి.. విజయవాడతో పాటు గుంటూరు జిల్లాలో వందలాది మంది బాధితులు ఉన్నారు. నరసరావుపేటలో ఎక్కువ మంది బాధితులు ఉన్నట్లు లెక్కతేలారు. కేసు నమోదు చేసిన సత్యనారాయణపురం పోలీసులతో పాటు సైబర్ క్రైం పోలీసులను సిట్‌లో చేర్చారు. సాంకేతిక నైపుణ్యం ఉండి. . ట్రాఫిక్ తదితర విభాగాల్లో పని చేస్తున్న కానిస్టేబుళ్లను సైతం తీసుకున్నారు. దాదాపు 15 మంది అధికారులు, సిబ్బంది 'యుపిక్స్' గుట్టు తేల్చేందుకు రంగంలోకి దిగారు. నాలుగు నెలలు కసరత్తు చేశారు. 344 మందికి 'యుపిక్స్'తో సంబంధాలు ఉన్నాయని తేల్చారు. కుంభకోణం ఆర్థిక మూలాలు గుట్టు రట్టు చేసేందుకు వారందరి చరవాణులను స్వాధీనం చేసుకున్నారు. అప్పటికే కొందరు తమ చరవాణుల్లో ఉన్న ఆధారాలను తొలగించగా సిట్ సభ్యులు పూర్తి సమాచారాన్ని వెలికి తీశారు. ఫోన్ కాల్స్, బ్యాంకు లావాదేవీలు, ఫొటోలు, డాక్యుమెంట్లు, వీడియోలను రికవరీ చేశారు. వాటిని విశ్లేషించి.. ఎవరెవరు ఎంతెంత పెట్టుబడులు పెట్టారు? ఏ మేరకు లాభం పొందారు? ఎంత మంది నష్టపోయారు? తదితర విషయాలను సేకరించారు. ఆరు సంవత్సరాల్లో యుపిక్స్‌లో రూ.593 కోట్లు పెట్టుబడులు పెట్టారని తేల్చారు. కొందరు రూ.392 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసేసుకున్నారు. 183 మంది రూ.201 కోట్ల మేర నష్టపోయారని స్పష్టమైంది. సరైన అనుమతులు లేని సంస్థలో పెట్టుబడులు పెట్టి.. లాభాలు తీసుకున్న వారు ఆ సొమ్మును వెనక్కి ఇవ్వాలని పోలీసులు చెబుతున్నారు. తిరిగి ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒక వ్యక్తి రూ.10కోట్లు తిరిగి ఇచ్చేందుకు అంగీకరించారు. మరో వ్యక్తి.. రూ.16 కోట్లు వరకు సిబ్బందికి జీతాలు చెల్లించేశానని బుకాయిస్తున్నారు. సూత్రధారుల స్థిరాస్తులను పోలీసులను స్తంభింపజేశారు. ఆ సొమ్మును న్యాయస్థానం ద్వారా బాధితులకు ఇచ్చేందుకు యత్నిస్తున్నారు.



సిట్ బృందంతో సీపీ రాజశేఖర్‌బాబు, డీసీపీ తిరుమలేశ్వర్‌రెడ్డి, ఏసీపీ స్రవంతిరాయ్

కొండ జారితే.. గూడు గల్లంతే!

2.8 లక్షల మంది నివాసమక్కడే

ఏటా వర్షాకాలం.. గుండెల్లో భయం

☛ మూడు రోజుల కిందట కురిసిన వర్షానికి 49వ డివిజన్ బ్రైజర్‌పేటలోని పెద్దిరాజువీధి కొండ ప్రాంతాల్లో బండరాళ్లు జారి ఇళ్లపై పడ్డాయి. వాటిలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

☛ టైలర్‌పేటలోని వీరయ్య వీధిలోని కొండ ప్రాంతంలో రాళ్లు, మట్టి జారి ఇళ్లపై పడ్డాయి. ముందే ఆ ఇళ్లల్లో నుంచి జనాలను తరలించేయడంతో ప్రాణాపాయం తప్పింది. ☛ రెండు నెలల కిందట అకాల వర్షాల సమయంలో విజయవాడలోని రామరాజ్యనగర్‌లోని ఇళ్లపై కొండ చరియలు జారిపడి ఇళ్లు దెబ్బతిన్నాయి.


– ఈనాడు, అమరావతి



ఇటీవల టైలర్‌పేటలోని ఇళ్లపై కూలిన మట్టి, రాళ్లు

విజయవాడలోని ఐదో వంతు జనాభా కొండలపైనే ఉంటోంది. 2011 లెక్కల ప్రకారం నగర జనాభా 10.34లక్షలు. ప్రస్తుతం 15 లక్షలకు పెరిగినట్టు అంచనా. కొండలను ఆనుకుని 16 డివిజన్లు ఉన్నాయి. కొండలపై 67వేల మంది ఇళ్లు నిర్మించుకోగా.. 2.80 లక్షల మందికి పైగా నివసిస్తున్నారు. ఏటా వర్షాకాలం వచ్చిందంటే కొండ ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది.

గత ఐదేళ్లలో.. విజయవాడలోని కొండ ప్రాంతాల పైనుంచి ఎర్ర మట్టి, రాళ్లు, గోడలు జారిపడి, ఇళ్లు కూలిపోయిన ఘటనలు ఏటా జరుగుతూనే ఉన్నాయి. మూడు రోజుల కిందట కురిసిన వర్షానికి చాలా ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. సగం గోడలు కూలి.. సగం నాని ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యాధరపురం కొండ ప్రాంతంలో గత ఏడాది రాళ్లు జారి పడి ఒకరు చనిపోయారు. అనేక మంది గాయపడ్డారు. క్రీస్తురాజపురం, గొల్లపాలెం గట్టు ప్రాంతాల్లో కొండరాళ్లు జారిపడ్డాయి. పలు ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పలువురు గాయపడ్డారు. జనాన్ని ముందుగానే ఖాళీ చేయిస్తుండడంతో ప్రాణాపాయం తప్పుతోంది.



ఇంద్రకీలాద్రి కొండ పైభాగం వరకూ ఇళ్లు

✦ **రక్షణ గోడపై నిర్లక్ష్యం..** గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఐదు ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణం కోసం నగరపాలక సంస్థలో ప్రతిపాదనలు పెట్టారు. వాటిలో ఒక్కటీ ఆమోదించలేదు.

✦ **500కు పైగా ఇళ్లు ప్రమాదకరంగా..** మొగల్రాజపురం, క్రీస్తురాజపురం కొండప్రాంతాలు, ఇంద్రకీలాద్రి కొండ చుట్టుపక్కల, విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్, మల్లిఖార్జునపేట ఉప్పరవాగు, బ్రహ్మంగారి మఠం, గొల్లపాలెంగట్టు, టైలర్‌పేట, బ్రైజర్‌పేట.. తదితర చోట్ల దాదాపు 500లకు పైగా ఇళ్లు ప్రమాదకరంగా ఉన్నట్లు అధికారులు గతంలోనే గుర్తించారు. ఆ ప్రాంతాల్లో ఆక్రమణలు, ప్రమాదకరంగా ఉన్న కొండరాళ్లను తొలగించాలి. ఇక్కడ రక్షణగోడలు తక్షణమే నిర్మించాలి. ప్రమాదకరమైన స్థితిలో నివసిస్తున్నవారిని తరలించి, ప్రత్యామ్నాయ ఇళ్లు కేటాయించాలి.

కూటమి ప్రభుత్వం వచ్చాక.. కొండప్రాంతాల్లో గాంధీహిల్ దిగువన, గొల్లపాలెం గట్టు ప్రాంతాల్లోని రెండుచోట్ల రక్షణ గోడల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపి రూ.2 కోట్లు నగరపాలక సంస్థ కేటాయించింది. ఈ పనులు పక్కాగా చేపట్టి.. రక్షణ గోడలను పటిష్ఠపరిస్తే.. కొంతవరకూ పరిస్థితి మెరుగవుతుంది.

గండ్లు పూడిస్తేనే.. గండం తప్పేది

మండలంలోని వినగడప సమీప కట్లేరు వంతెన వద్ద మళ్లింపు రహదారి వరదల తాకిడికి పూర్తిగా ధ్వంసమైంది. రూపురేఖలు లేకుండా దారి పొడవునా రాళ్లు వరద నీటిలో కొట్టుకుపోయాయి. దీంతో అటుగా పాదచారులు సైతం వెళ్లలేని పరిస్థితి ఉంది. ఏడు రోజులుగా మళ్లింపు రోడ్డుపై వరద ప్రవహిస్తోంది. వర్షం, వరద తగ్గుముఖం పట్టి మళ్లింపు రోడ్డుకు ఏర్పడిన గండ్లు పూడ్చివేసి మరమ్మతులు చేస్తేనే రాకపోకలు పునరుద్ధరించే అవకాశం ఉంది. అధికారులు వంతెన వద్ద త్వరగా మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

-న్యూస్‌టుడే, గంపలగూడెం



కట్లేరు వంతెన వద్ద ధ్వంసమైన మళ్లింపు రహదారి



పనితీరుకు ప్రశంస

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ జి.లక్ష్మీశ సోమవారం పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా ప్రశంసాపత్రం అందుకుంటున్న విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర. చిత్రంలో జేసీ ఇలక్కియా.

- ఎన్టీఆర్ కలెక్టరేట్

కొండపల్లి నాట్య బొమ్మ.. చూడచక్కనమ్మా



మిశ్రమాన్ని కర్రతో ఒత్తి..



ఆ తర్వాత అచ్చుల్లో వేసి..



బొమ్మ విడిభాగాలు ఒక్కొక్కటిగా..



సహజ సిద్ధ రంగులద్దుతూ..

అందాన్ని వర్ణించాలంటే కొండపల్లి బొమ్మతో పోల్చుతారు. అందులో కొండపల్లి నాట్య బొమ్మ (డ్యాన్సింగ్ డాల్) అంటే ప్రతిఒక్కరికీ ఎంతో ఇష్టం. అందమైన నాట్య బొమ్మలను ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు సమీపంలోని కొండపల్లిలో తయారు చేస్తారు. వాస్తవానికి ఓ ప్రత్యేకమైన కర్రతో బొమ్మలు తయారు చేస్తారు. నాట్య బొమ్మ మాత్రం ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రంపపు పొడి, చింత పిక్క పొడితో రూపుదిద్దుకుంటుంది.



ముందుగా ఆ మూడింటిని కలిపి ముద్దగా తయారు చేస్తారు. మొదట చపాతి మాదిరిగా కర్రతో ఒత్తుతారు. దాని అచ్చులో వేసి బొమ్మ శరీర భాగాలను విడివిడిగా తయారు చేస్తారు. అచ్చు వేసిన భాగాలు ఆరిన అనంతరం ఒక్కొక్కటి చేర్చి బొమ్మ ఆకృతి తీసుకువస్తారు. దానిని సహజ సిద్ధమైన రంగులు అద్దుతారు. అంతే చూడచక్కని కొండపల్లి నాట్య బొమ్మ సిద్ధమవుతుంది.

- ఈనాడు అమరావతి, కొండపల్లి, న్యూస్‌టుడే

రేషన్ పంపిణీలో చేతివాటం!

☛ పెనమలూరు నియోజకవర్గంలో ఓ దుకాణంలో తాత్కాలిక డీలరు బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ డ్వాక్రా మహిళ రేషన్ దందాకు తెరతీశారు. తన దుకాణం పరిధిలో దాదాపు 20శాతం కార్డుదారులకు ప్రతి నెలా 1న కేజీకి రూ.10 చొప్పున బియ్యం డబ్బులు ఫోన్‌పే చేస్తున్నారు. తర్వాత వారు సావకాశంగా వచ్చి వేలిముద్ర వేసి వెళ్తారు. ఇలా ప్రతి నెలా వందల కేజీల బియ్యం దారి మళ్లిస్తున్నారు. ప్రారంభంలో ఐదారుగురితో మొదలైన ఈ వ్యవహారం ప్రస్తుతం 200కు పైగా కార్డుదారులకు ఫోన్‌పే చేసే వరకు వచ్చింది.

☛ విజయవాడ నగరంలోని మధురానగర్‌లో తాత్కాలిక డీలర్ నిర్వహిస్తున్న దుకాణంలో భారీగా అక్రమ రేషన్ బియ్యాన్ని తాజాగా అధికారులు గుర్తించారు. రికార్డుల ప్రకారం దుకాణంలో 1,119 కేజీల బియ్యం మాత్రమే ఉండాలి. తనిఖీల సమయంలో 2,200 కిలోల బియ్యం ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా 1,081 కేజీల బియ్యం అదనంగా ఉండడంతో డీలర్లపై సెక్షన్ 6ఏ కేసు నమోదు చేశారు.

ఈనాడు అమరావతి: రేషన్ దుకాణాల్లో తాత్కాలిక డీలర్ల దందా హద్దులు దాటుతోంది. చాలా మంది దుకాణాల దగ్గరే బియ్యం బేరాలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన బియ్యం దర్జాగా దుకాణాల్లోనే నిల్వ చేస్తున్నారు. ఇసుమంతైనా భయం లేకుండా బియ్యం అమ్మిన కార్డుదారులకు ఫోన్‌పేలో సొమ్ము చెల్లిస్తున్నారు. ప్రభుత్వం డీలర్ల నియామకాల్లో జాప్యం చేయడం..బాధ్యతలు తాత్కాలికమే కావడంతో అందినకాడికి దోచుకోవాలన్న ఆలోచనలతో రేషన్ అక్రమాలు చేస్తున్నారు.



మధురానగర్‌లో అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం నిల్వలు

అంశం	ఎన్టీఆర్	కృష్ణా
రేషన్ కార్డులు	5,90211	5,22,589
రేషన్ దుకాణాలు	957	1,059
వెలుగు సిబ్బందివి..	82	237
ఏడాదిలో కేసులు	67	63

అందిన కాడికి దోచేయ్.. సాధారణంగా డీలర్లను తొలగించినా, చనిపోయినా వారి స్థానంలో పక్క దుకాణం డీలర్‌కు అప్పగించాలి. పని భారం నేపథ్యంలో డ్వాక్రా సంఘాల సభ్యులు డీలర్ల నియామకం చేపట్టే వరకు తాత్కాలిక డీలర్లుగా విధులు నిర్వహిస్తారు. తెర మీద దుకాణాలు డ్వాక్రా సంఘం సభ్యుల పేరుతో నిర్వహిస్తున్నా.. తెర వెనుక కథ నడిపేది మాత్రం వారి భర్తలే. తాత్కాలిక డీలరు కార్డుదారులకు ఇచ్చే సమయంలో అందినంత వెనకేసుకుందాం అన్న ఉద్దేశంతో భారీగా రేషన్ బియ్యం తరలిస్తున్నారు. కేజీ రూ.10కి కొనుగోలు చేసి రూ.16వరకు నల్లబజారులో అమ్ముతున్నారు.

ఫిర్యాదు చేస్తేగాని కదలరు..

★ అక్రమంగా కొనుగోలు చేసిన బియ్యాన్ని పంపిణీ ముగిసే వరకు దుకాణాల్లోనే నిల్వ చేస్తున్నారంటే అధికారులు అలసత్వం అర్థమవుతోంది. స్థానికులు, సామాజిక స్పృహ ఉన్న వారు ఫిర్యాదు చేస్తే గానీ తనిఖీలకు కదలరు. ఆధారాలతో పట్టుబడిన వారిపై కేసు నమోదు చేయడానికి ఎక్కడలేని తాత్సారం చేస్తారు. ప్రతి నెలా రేషన్ సరఫరా చేసే సమయంలో తనిఖీలు చేయడం అధికారులు మర్చిపోయారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 319 దుకాణాలకు డీలర్లు లేరు. దుకాణాల పునర్విభజన చేస్తే 102 కొత్త దుకాణాలు ఏర్పడతాయి. మొత్తం 402 మంది డీలర్లను ఎంపిక చేయాల్సి ఉండగా ప్రభుత్వం నియమక ప్రక్రియ దాదాపు పూర్తి చేసినా చివరి దశలో నిలిచిపోయింది. ఫలితంగా తాత్కాలిక బాధ్యతలు నిర్వహిస్తున్న వారిలో ఎక్కువ మంది అక్రమాలకు పాల్పడుతున్నారు.

చెక్కు చెదరలేదు.. చుక్కనీరు లేదు..

ఫలితానిస్తున్న మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం



నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని సోమవరంలో నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్ల వల్ల ఫలితం కనిపిస్తోంది. ఇటీవల జోరున వర్షం కురిసినా చుక్కనీరు నిలువకుండా డ్రెయిన్లలో నీరంతా భూగర్భంలోకి ఇంకిపోయింది. తక్కువ ఖర్చుతో పైలట్ ప్రాజెక్టుగా ఈ గ్రామంలోని ఎస్సీ కాలనీలో నాలుగు సిమెంటు రహదారుల వెంట ఈ తరహా డ్రెయిన్లు నిర్మించారు. వీటిలో ఇంకుడుగుంతలు నిర్మించడంతో భారీ వర్షానికి సైతం రహదారులు, కాలువలో చుక్కనీరు నిలువకుండా భూగర్భంలోకి ఇంకాయి. గతంలో చిన్నపాటి వర్షానికి రహదారివెంట కాలువల్లో నీరు నిలిచి బురదగా మారేది. ప్రస్తుతం నీరంతా భూగర్భంలోకి ఇంకిపోవడంతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉన్నాయని కాలనీ ప్రజలు సంతృప్తి చెందుతున్నారు. మరో డ్రెయిను నిర్మాణ దశలో ఉంది. మిగిలిన గ్రామాల్లోనూ మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తే మురుగు సమస్య పరిష్కారంతో పాటు భూగర్భ జలాలు పెరిగే వీలుంది.

వానొచ్చినా.. తగ్గని వినతులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : వర్షం పడుతున్నా లెక్క చేయక.. ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి విజయవాడ కలెక్టరేట్‌కు వచ్చారు. పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ జి. లక్ష్మీశ నేతృత్వంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో మొత్తం 93 అర్జీలు ఇచ్చారు. వీటిలో రెవెన్యూ శాఖకు అధికంగా 25 వినతులు వచ్చాయి. మున్సిపల్‌కు 13, విద్య 10, పోలీస్ 9, ఆరోగ్య శాఖ 7, జలవనరులకు నాలుగు వినతులు అందాయి. విభిన్న ప్రతిభావంతులు, డీఆర్డీఏ, ఇంటర్ విద్య, పంచాయతీరాజ్ శాఖలకు మూడేసి, విద్యుత్తు, పౌరసరఫరాలు, బ్యాంకు సేవలకు రెండేసి, వ్యవసాయ, కళాశాల విద్య, దేవాదాయ, గృహాలు, మార్కెటింగ్, రిజిస్ట్రేషన్, ఆర్ అండ్ బీ తదితర శాఖలకు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయి. కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీల పరిష్కారంలో ఎట్టి పరిస్థితుల్లోనూ, ఏ రూపంలోనూ నిర్లక్ష్యం కన్పించకూడదన్నారు. జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా అధికారిణి జి.జ్యోతి, కేఆర్సీ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్, జేసీ

జిల్లా అంతటా వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో చిరు జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. గంపలగూడెం 16 మి.మీ., ఎ. కొండూరు 5.4, విస్సన్నపేట 5.2, తిరువూరు, జి.కొండూరు 4.8, రెడ్డిగూడెం 3.6, పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం 3.2, మైలవరం, కంచికచర్ల 2.4, చందర్లపాడు 2.2, వీరులపాడు 1.8, జగ్గయ్యపేట 1.6, వత్సవాయి 1.2, నందిగామ 0.6, విజయవాడ గ్రామీణ 5.4, నగరంలోని పటమట 4.4, గాంధీనగర్, భవానీపురం 4.3, అజిత్‌సింగ్‌నగర్‌లో 4 మిల్లీ మీటర్ల వర్షం పడింది.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టుల ఎత్తివేత

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: కొండపల్లి రైల్వేస్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి మరమ్మతుల దృష్ట్యా పలు రైళ్లకు తాత్కాలికంగా హాల్టు సౌకర్యాన్ని ఎత్తివేస్తున్నట్లు అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ★ 12749/12750 బీదర్, మచిలీపట్నం (అక్టోబరు 19వ తేదీ నుంచి నవంబరు 18 వరకు) ★ 17201/17202 గుంటూరు, సికింద్రాబాద్ ★ 67215/67216 విజయవాడ, భద్రాచలం ★ 67768 విజయవాడ, డోర్నకల్ ★ 17405/17406 తిరుపతి, ఆదిలాబాద్ (అక్టోబరు 18వ తేదీ నుంచి నవంబరు 17వరకు) హాల్టు సౌకర్యాన్ని ఎత్తివేయనున్నట్లు పేర్కొన్నారు.

20 వరకు అన్నదాత సుఖీభవ దరఖాస్తుల స్వీకరణ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా అందించే అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హత ఉండి, ఇంకా లబ్ధిపొందని రైతులు ఈ నెల 20వ తేదీలోగా ఆయా రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులకు దరఖాస్తు చేసుకోవచ్చని డీఏవో విజయకుమారి సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. ఇంతకు ముందు పరిశీలన లేదా ధ్రువీకరణలో తిరస్కరణకు గురైన దరఖాస్తుదారులు, ఈ-కేవైసీ చేసుకోని కారణంగా ఆమోదం పొందలేని వారు రైతు సేవా కేంద్రాల్లో తమ ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గత నెల 27వ తేదీ వరకు స్వీకరించిన ఫిర్యాదులను పరిశీలించి, అర్హులను గుర్తించి నిధులు జమ చేసినట్టు ఆమె పేర్కొన్నారు.

పొలాలను ముంచెత్తిన తారకరామ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విజయవాడ గ్రామీణ మండలం కొత్తూరు తాడేపల్లిలో తారకరామ కాలువ కింద సాగులో ఉన్న 250 ఎకరాల్లోని వరి నాట్లు ముంపునకు గురైనట్టు ఆయకట్టు రైతులు అలిగినేని శ్రీపద్మ, జొన్నలగడ్డ సాంబశివరావు, చెరుకూరి కుటుంబరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సోమవారం నగరంలోని కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశ దృష్టికి తెచ్చారు. కాలువ కట్టపై నుంచి పొంగడంతో లేత వరినాట్లు మునిగినట్టు చెప్పారు. ముంపు నీటిని తొలగించి, పంటలను రక్షించాలని కోరారు. తొమ్మండ్రు వాగు, గుర్రాల వాగులకు డ్రాప్‌లు నిర్మించి నీటికి అడ్డుకట్ట వేయాలని పేర్కొన్నారు. చిన్న తూము స్థానే పెద్ద తూము ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



కొత్తూరు తాడేపల్లిలో ముంపునకు గురైన పొలాలు

బార్లకు నోటిఫికేషన్ విడుదల

ఎన్టీఆర్ జిల్లాలో 130, కృష్ణాలో 39

ఈనాడు, అమరావతి: కొత్త బార్ పాలసీలో భాగంగా రెండు జిల్లాల్లో కలెక్టర్లు సోమవారం గెజిట్ నోటిఫికేషన్లు విడుదల చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 130, కృష్ణా జిల్లాలో 39 బార్లకు ప్రకటన ఇచ్చారు. గత వైకాపా హయాంలో తెచ్చిన వేలం విధానాన్ని మార్చి లాటరీ విధానంలో కేటాయించనున్నారు. 2025-28 బార్ విధానంలో వచ్చే నెల 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. ఇది 2028 ఆగస్టు 31 వరకు అమల్లో ఉంటుంది. లైసెన్సు ఫీజును గతంలో ఒకేసారి చెల్లించాల్సి వచ్చేది. కొత్త విధానంలో దీనిని సరళీకరించి ఏడాదికి ఆరు వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు కల్పించారు. ప్రతి రెండు నెలలకోసారి చెల్లించాలి. మూడు స్లాబుల్లో ఫీజు నిర్ణయించారు. 1. 5లక్షల జనాభా లోపు నగర పంచాయతీల్లో ఏడాదికి రూ.35లక్షలు. 2. 50లక్షల పైన.. 5 లక్షలు లోపు జనాభా ఉన్న పురపాలికల్లో .. రూ.55లక్షలు. 3.5 లక్షలు జనాభా పైన ఉన్న నగరపాలికలు.. రూ. 75లక్షలుగా రుసుము నిర్ణయించారు. ఇది ఏటా 10 శాతం చొప్పున పెరుగుతుంటుంది. ఓపెన్ కేటగిరీ బార్లకు ఈనెల 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 28న డ్రా తీస్తారు. గీత కులాలకు ఈనెల 20వ గెజిట్ ప్రకటన విడుదల చేస్తారు. 28వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు. ఈ నెల 30న వీటికి డ్రా తీయనున్నారు.


నగరంలో అత్యధికంగా 117

ఎన్టీఆర్ జిల్లాలోని 130 బార్లలో అత్యధికంగా విజయవాడ నగరపాలిక పరిధిలోనే 117 ఉన్నాయి. ఆ తర్వాత ఎక్కువగా కొండపల్లి పురపాలికలో 8 బార్లు ఏర్పాటు కానున్నాయి. జగ్గయ్యపేట, నందిగామలో రెండేసి చొప్పున, తిరువూరులో ఒకటి కేటాయించారు. కృష్ణా జిల్లాలో ఎక్కువగా తాడిగడప పురపాలికలో 14, జిల్లా కేంద్రం మచిలీపట్నం కార్పొరేషన్‌లో 10, గుడివాడలో 10, పెడన 1, ఉయ్యూరులో 1 ఉన్నాయి. టూరిజం కేంద్రాల కింద మంగినపూడిలో 1, అవనిగడ్డలో రెండు చొప్పున కేటాయించారు.

గీత కులాలకు కేటాయింపు: ఓపెన్ విభాగంలోని బార్లు కాకుండా రెండు జిల్లాల్లో గీత కులాలకు కొన్ని బార్లు కేటాయించారు. వీటి కోసం సోమవారం ఆయా జిల్లాల కలెక్టర్లు ఉపకులాల వారీగా బార్ల కేటాయింపు కోసం డ్రా తీశారు. ఎన్టీఆర్ జిల్లాలో గీత కులాలకు 10 బార్లు కేటాయించారు. ఇందులో గౌడ ఉపకులానికి 7 (విజయవాడ నగరం), గౌడ్ ఉపకులానికి 3 (కొండపల్లి పురపాలికలో టూరిజం కేంద్రంలో భాగంగా 1, విజయవాడ కార్పొరేషన్‌లో 2)

★ కృష్ణా జిల్లాలో గీత కులాలకు 4 కేటాయించారు. వీటిలో గౌడ ఉపకులానికి 3 (తాడిగడప, గడివాడ, మచిలీపట్నం.. ఒక్కొక్కటి చొప్పున) గౌడ్ ఉపకులానికి 1 (తాడిగడప పురపాలిక).

ఆనాటి మధురం.. ఈనాడు పదిలం


పక్షుల గుంపు.. కంటికి ఇంపు


సూర్యోదయం వేళ.. జాలరి వల


నీటిలో నావ.. తరగని తోవ


రవి మురిసె.. మేఘం మెరిసె..


రాలిన ఆకులు.. చేరిన చిలుకలు



ఫొటోగ్రాఫ్ ఓ కళ.. ప్రకృతి అందాలు, కళలు, భావాలు, మరలి రాని మధుర క్షణాలు బంధిస్తుంది. వందల పదాల అర్థాన్ని ఓ చిత్రం ద్వారా వివరిస్తుంది. అందమైన దృశ్యాలను ఆవిష్కరిస్తుంది. మధుర క్షణాలను కట్టి పడేస్తుంది. గత స్మృతులను గుర్తు చేస్తుంది. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా 'ఈనాడు' అందిస్తున్న సౌందర్య చిత్ర మాలిక.

-ఈనాడు, అమరావతి


నదీ తీరం.. పచ్చల హారం


జంగమా.. నీ చెంతనే గంగమ్మ..


ఎత్తయిన భవంతులు.. పచ్చని సొబగులు...


వి'నీల' తరంగిణి..

పత్తాలేని విత్తనాల కంపెనీ
కౌలు రైతులకు కుచ్చుటోపీ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : వరి విత్తనాల పేరిట ఓ కంపెనీ కౌలు రైతులను నిండా ముంచింది. ఆ సంస్థకు బెంగళూరు, హైదరాబాద్, ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో కార్యాలయాలు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెంలో ఏజెంట్లను నియమించుకుని మోసానికి పాల్పడినట్టు మెండెం జమలయ్య నేతృత్వంలో బాధిత రైతులు కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో జేసీ ఎస్.ఇలక్కియాకు సోమవారం ఫిర్యాదు చేశారు. జి.కొండూరు మండలం హెచ్.ముత్యాలంపాడుకు చెందిన పాటిబండ్ల శివరామకృష్ణ, వెలగలేరుకు చెందిన గొర్రె రాజశేఖర్, గజ్జలకొండ గోపీ, దోబా శ్రీనివాసరావు, విజయవాడ గ్రామీణ మండలం కొత్తూరు తాడేపల్లికి చెందిన టి.దుర్గారావులు.. వెలగలేరులో 50 ఎకరాల్లో ఎఫ్-28 రకం వరి విత్తనాలను 2024 డిసెంబరులో వేశారు. నాలుగు నెలల పంట కాలం తర్వాత ఈ ఏడాది మే నెలలో ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున విత్తనాలను హైదరాబాద్‌లోని బ్రాంచి కార్యాలయానికి పంపారు. తొలుత ఎకరాకు రూ.30,000ల చొప్పున పెట్టుబడి అని చెప్పి తీరా రూ.20,000ల చొప్పున మాత్రమే కంపెనీ ఇచ్చింది. విత్తనాలను సరఫరా చేసింది. తీరా వీటిని పండించి, విత్తనాలు అందజేస్తే.. తమకు రావాల్సిన రూ.20 లక్షలు ఇవ్వడం లేదని బాధిత రైతులు ఆరోపించారు. ఇప్పటి వరకు వేచి చూసి, తాము మోసపోయామని గ్రహించి నేరుగా కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.


జేసీ ఇలక్కియాకు వివరిస్తున్న జమలయ్య. పక్కనే డీపీవో విజయకుమారి, బాధిత రైతులు

ఉత్తమ సేవలకు ప్రశంసలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ జి.లక్ష్మీశ ప్రశంసా పత్రాలు అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున పురస్కారాల ప్రదానం వాయిదా పడిన క్రమంలో సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వీటిని అందజేసి, అభినందించారు. మొత్తం 376 మంది అధికారులు, సిబ్బంది ఉత్తమ పురస్కారాలు పొందారు. కలెక్టర్ మాట్లాడుతూ.. టీమ్ ఎన్టీఆర్ కృషితో ఎన్నో మెగా ఈవెంట్లను విజయవంతం చేసినట్లు పేర్కొన్నారు. జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు. విజయవాడ నగర పాలకసంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్డీవోలు కావూరి చైతన్య, కె.బాలకృష్ణ, కె.మాధురి తదితరులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.


కలెక్టర్ లక్ష్మీశ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, సమగ్ర శిక్షా ఏపీసీ మహేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ నాంచారరావు, డ్వామా పీడీ ఎ.రాము, ఎక్సైజ్ శాఖాధికారి శ్రీనివాసరావు


డీఈఆర్వో ఎన్.వి.మోహనరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, ఏపీఎస్ వేమూరి ప్రసాద్ (సమాచార శాఖ), డీపీవో విజయకుమారి, హౌసింగ్ పీడీ రజనీకుమారి, సీపీవో వై.శ్రీలత, వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఎల్డీఎం కె.ప్రియాంక, జలవనరుల శాఖ ఎస్ఈ ఆర్.మోహనరావు (కుడి నుంచి ఎడమకు)

విజయనగరం నింజాస్, అమరావతి క్రషర్స్ ఆధిక్యం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పటమటలోని సీహెచ్ఆర్‌కే వీఎంసీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 'యువ ఆంధ్రా ఛాంపియన్‌షిప్-2025' కబడ్డీ లీగ్ పోటీల్లో తొలి రౌండ్ ముగిసింది. పూల్ 'ఎ'లో విజయనగరం నింజాస్ జట్టు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో.. రెండు జట్లపై విజయం సాధించి.. ఒక జట్టుపై ఓడింది. పాయింట్ల ఆధారంగా ప్రథమ స్థానంలో నిలిచింది. పూల్ 'బి'లో అమరావతి క్రషర్స్ జట్టు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో విజయం సాధించి పాయింట్ల ఆధారంగా అగ్ర స్థానంలో నిలిచింది. రెండో రౌండ్ లీగ్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా అమరావతి క్రషర్స్ జట్టు 45-31 తేడాతో కృష్ణా డిఫెండర్స్‌పై, వైజాగ్ కమెండోస్ జట్టు 43-38 తేడాతో తిరుపతి రైడర్స్ జట్టుపై, విజయనగరం నింజాస్ జట్టు 51-41 తేడాతో భీమవరం గార్డియన్స్ జట్టుపై, కాకినాడ క్రాకెన్స్ జట్టు 43-42 తేడాతో కర్నూలు నైట్స్ జట్టుపై, విజయనగరం నింజాస్ జట్టు 39-30 తేడాతో కాకినాడ క్రాకెన్స్ జట్టుపై విజయం సాధించాయి. జాతీయ మాజీ కబడ్డీ పసిడి పతక విజేత, ద.మ.రైల్వే విశ్రాంత టీటీఐ కె.రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై.. 'ఉత్తమ రైడర్, ఉత్తమ డిఫెండర్'గా ఎంపికైన క్రీడాకారులకు నగదు బహుమతి అందజేశారు.



'బెస్ట్ రైడర్'కు నగదు బహుమతి అందిస్తున్న రాంబాబు

బ్రాయిలర్ ధరలు (కిలో / కి రూ.లలో)

లైవ్‌లో: బ్రాయిలర్ ఫారం రిటైల్ ధర -119 ఆల్జీబ్ ధర 141 చికెన్ విత్ స్కిన్ - 204, విదౌట్ స్కిన్ - 233. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్. బ్రాయిలర్ ఫారం లైవ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 విదౌట్ స్కిన్ - 250.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

విజయవాడ నెక్ ధర ... 100 గుడ్లకు రూ. 520 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.99/-.

జగన్మాత సేవలో సీఎం కార్యదర్శి రాజమౌళి దంపతులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను సీఎం కార్యదర్శి రాజమౌళి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


రాజమౌళి దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

సంచార జాతుల అభ్యున్నతికి 'స్ఫూర్తి'


మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్

భవానీపురం: సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న స్ఫూర్తి పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తెలిపారు. భాజపా జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విజయవాడలోని వెన్యూ కల్యాణ మండపంలో నిర్వహించే ఆ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, నాయకులు పాల్గొంటారని తెలిపారు. సంచార జాతుల కులవృత్తులు, కళల ప్రదర్శన కార్యక్రమాలు.. శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం కళాకారులు, ఉద్యమ నాయకులకు అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. నాయకులు చిట్టిబాబు, గోవింద్, పట్నాయక్, నరసింహారావు పాల్గొన్నారు.


కలెక్టర్ లక్ష్మీశకు ప్రతిజ్ఞ పత్రాలు అందజేస్తున్న వర్ధమాన్ వికాస్ సంస్థ ప్రతినిధులు, బిల్డర్ల అసోసియేషన్ ప్రతినిధులు

పీ-4లో భాగస్వామ్యం

ఎన్టీఆర్ కలెక్టరేట్: పేదరిక నిర్మూలనం కోసం ప్రభుత్వం చేపట్టిన పీ-4 విధానంలో మార్గదర్శకులుగా ఉండేందుకు పలువురు ముందుకు వచ్చారు. వర్ధమాన్ వికాస్ సంస్థ 500, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (విజయవాడ సెంటర్) 74 బంగారు కుటుంబాలను మార్గదర్శకం చేయడానికి ముందుకు వచ్చాయి. నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశ సోమవారం ప్రతిజ్ఞా పత్రాలు అందజేశారు. వర్ధమాన్ వికాస్ సంస్థ సభ్యులు సీతల్ జైన్, దీక్షిత జైన్, దీక్షిత చౌహాన్, ప్రవీణ్ జైన్, యోగేష్ జైన్, మోనికా జైన్, ప్రియా జైన్, స్తుతి జైన్, యష్మీజైన్, బిల్డర్ల అసోసియేషన్ ఛైర్మన్ జె.వెంకటేశ్వరరావు, సభ్యులు ఎన్.టి.వెంకటేశ్వరరావు, బి.రాఘవరావు, వి.వెంకటేశ్వరరావు, ఎన్.నరేంద్ర తదితరులు పీ-4లో భాగస్వాములయ్యారు.

ముక్కులో కణితి తొలగింపు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి ఈఎన్‌టీ వైద్యులు మానసిక దివ్యాంగుడి ముక్కులో కణితి తొలగించి ఉపశమనం కలిగించారు. తిరువూరు మండలం వావిలాల గ్రామానికి చెందిన చిన్ని కృష్ణయ్య (48) ముక్కులో కణితి కారణంగా అనారోగ్యం పాలయ్యారు. ఆయన మానసిక దివ్యాంగుడు. కొన్ని ప్రైవేటు ఆసుపత్రులను సంప్రదించారు. వైద్యం ఖరీదు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 2న చేరగా.. ఈఎన్‌టీ వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. అతని ముక్కు లోపల కణితి ఉందని, శస్త్రచికిత్స చేస్తే సుమారు ఏడు రక్తం సీసాలు అవసరమని గ్రహించారు. ఈ నెల 6న శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేశారు. సోమవారం అతన్ని డిశ్చార్జి చేశారు. సూపరింటెండెంట్ డా.ఏవీ రావు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈఎన్‌టీ విభాగాధిపతి డా.కొణిదే రవి మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు ఎంతో ఖర్చుతో కూడిన వైద్య సేవల్ని ఉచితంగా అందిస్తున్నామని, ఇదే వైద్యానికి ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.12 లక్షల వరకు వసూలు చేస్తారని తెలిపారు. ఇలాంటి పరిస్థితి ప్రతి పది వేల మందిలో ఒకరికి వస్తుందని, శస్త్రచికిత్సకు పాథాలజీ విభాగాధిపతి డా.విజయశ్రీ బృందం సహకారం అందించిందని తెలిపారు. వైద్యులు లీలా ప్రసాద్, వినయ్‌కుమార్, శాంతిలత తదితరులు పాల్గొన్నారు.


చిన్ని కృష్ణయ్యతో సూపరింటెండెంట్ డా.ఏవీ రావు, ఈఎన్‌టీ విభాగాధిపతి డా.కొణిదే రవి తదితరులు

కృష్ణా వరద తగ్గుముఖం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నది దిగువన, ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం సోమవారం తగ్గుముఖం పట్టింది. ఉదయం 7 గంటలకు ఎగువ నుంచి 2,90,122 క్యూసెక్కులు వచ్చింది. 2,87,088 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు ఎగువ నుంచి 2,81,045 క్యూసెక్కులు రాగా, సముద్రంలోకి 2,78,213 క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రానికి వరద మరింత తగ్గింది. 6 గంటలకు ఎగువ నుంచి 2,51,783 క్యూసెక్కులు రాగా, సముద్రంలోకి 2,48,450 క్యూసెక్కులను విడుదల చేశారు. రాత్రి 10 గంటల వరకు ఇదే పరిస్థితి నెలకొంది. కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు 3,333 క్యూసెక్కులు ఇస్తున్నారు.

నగరాల కులస్థులకు అండగా ప్రభుత్వం

గొల్లపూడి, న్యూస్‌టుడే: నగరాల కులస్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి చర్యలు చేపడుతుందని ఏపీ నగరాల కార్పొరేషన్ ఛైర్మన్ మరుపిళ్ల తిరుమలేశ్వరరావు పేర్కొన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఆయన్ను ప్రభుత్వం ఇటీవల ఏపీ నగరాల కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించగా..సోమవారం గొల్లపూడిలోని బీసీ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తిరుమలేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడలో నగరాల కులస్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారని గుర్తింపుగా పదవిని ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి పత్రాన్ని బీసీ సంక్షేమ శాఖ ఎండీ ఉమాదేవికి అందజేశారు.


ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి ధ్రువీకరణ పత్రాన్ని బీసీ సంక్షేమ శాఖ ఎండీ ఉమాదేవికి అందజేస్తున్న తిరుమలేశ్వరరావు


బాధితుల సమస్య వింటున్న డీసీపీ ఉదయరాణి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 57 ఫిర్యాదులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు 57 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ ఉదయరాణి బాధితుల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. దివ్యాంగులు, వృద్ధుల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భూ, ఆస్తి వివాదాలపై 35, చిన్న వివాదాలు 9, కుటుంబ కలహాలు 4, కొట్లాట 4, దొంగతనాలు 3, మోసం 1, మహిళా సంబంధ నేరాలపై ఒక్కోటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. వీటిని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు పంపించి.. సత్వరం పరిష్కరించాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు.

బాలుడికి బండి ఇచ్చిన తండ్రిపై కేసు
రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మధురానగర్: బాలుడికి ద్విచక్రవాహనం ఇచ్చి.. రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన వ్యక్తిపై గుణదల పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. భానునగర్‌కు చెందిన పెదపూడి రాజారావు (25) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నారు. శనివారం ఉదయం అల్పాహారం కోసం బి.ఆర్.టి.ఎస్. రోడ్డు దాటుతుండగా.. అతి వేగంగా వచ్చి ఒక ద్విచక్రవాహనం ఢీకొంది. తలకు తీవ్రమైన గాయమైంది. స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. తలలో రక్తం గడ్డ కట్టటంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనాన్ని ఒక బాలుడు నడుపుతున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మధురానగర్ పప్పులమిల్లు ప్రాంతానికి చెందిన ఓ బాలుడు.. వాహనం నడిపినట్లు గుర్తించారు. మైనర్‌కు ద్విచక్రవాహనం ఇచ్చిన బాలుడి తండ్రిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



✤ పాత తిరువూరులో నివాసముంటున్న జి.భవాని ఇంటి వద్ద డ్రెయినేజీలో నీరు నిలిచి దోమలు బెడద ఎక్కువైందని చేసిన ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. ✤ పట్టణంలోని 18వ వార్డులో చెత్త, మట్టి పేరుకుపోయి నీరు నిల్వ ఉందని స్థానికుడైన కె.నాగేంద్ర మేమున్నాం మీకుతోడుగాకు తెలిపిన సమస్యపై పారిశుద్ధ్య అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. -న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

స్పందనకు వందనం

పాపన్న పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, నటుడు సుమన్

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డు కూడలి వద్ద నియోజకవర్గ తెదేపా బీసీ నాయకులు, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న 17వ శతాబ్దంలో ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని ఇప్పటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెదేపా, బీసీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్..ప్రింటర్ అందజేత



దాతలతో ఉపాధ్యాయులు

పోలిశెట్టిపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని పోలిశెట్టిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు 1987-88లో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.62వేల విలువైన ల్యాప్‌టాప్, ప్రింటర్ సోమవారం వితరణగా అందించారని హెచ్ఎం పి.శోభన్‌బాబు తెలిపారు. దాతలైన సదరు పూర్వ విద్యార్థులు సీహెచ్.రామారావు, మల్లికార్జునాచారిలకు పీఎంసీ ఛైర్మన్ కె.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

మధిర శాఖ కాల్వకు సాగర్‌జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం 72వ కి.మీ నియంత్రిక నుంచి సోమవారం ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు 250 క్యూసెక్కుల సాగర్‌జలాలు విడుదలైనట్లు ఏఈ కె.మహేష్‌బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 131 క్యూసెక్కులు చేరాయి.

కౌన్సిలర్లకు శిక్షణ తరగతులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: కొండపల్లి పురపాలికకు చెందిన కౌన్సిలర్లకు ఒక రోజు శిక్షణ తరగతులను పురపాలిక కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. పురపాలిక విశ్రాంత కమిషనర్ సాయిబాబా పాల్గొని కౌన్సిలర్ల విధులు, హక్కులు బాధ్యతలతో పాటు నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, కౌన్సిలర్లు ఆయనను సత్కరించారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు లబ్ధి

మైలవరం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పెద్ద ఎత్తున మంజూరు చేస్తున్న ఆర్థిక సాయంతో పేదలకు ఎంతో మేలు కలుగుతోందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 44 మందికి మంజూరైన రూ.24,96,737 విలువైన చెక్కులను ఆయా గ్రామాల నాయకులతో కలిసి స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా తాజాగా 172 మందికి రూ.94,96,795ల చెక్కులను, 28 మందికి రూ.45.50 లక్షల విలువైన ఎల్ఓసీ పత్రాలను అందజేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆదుకునేలా.. ఆయువు నిలిపేలా

మైలవరం, న్యూస్‌టుడే

అపత్కాలంలో గుండెపోటు నుంచి కాపాడుతున్న స్టెమీ

★ నెల కిందట మైలవరం ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగిని అకస్మాత్తుగా ఛాతీలో నొప్పితో విలవిల్లాడిపోయారు. వెంటనే ప్రత్యేక గదికి తరలించి..చకాచకా గుండె సామర్థ్యాన్ని పరీక్షించే యంత్రాలను అమర్చారు. నిమిషాల వ్యవధిలోనే కోలుకునేలా చేశారు. ఒక సాధారణ ఆస్పత్రిలో గుండెపోటు నుంచి ఎలా బయట పడేశారా అనుకుంటున్నారా.. ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. 'స్టెమీ' కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆస్పత్రుల లోనూ అమలు చేయడం ద్వారా అపత్కాలంలో గుండె సమస్యతో బాధపడుతున్న వారిని నావలా ఒడ్డుకు చేరుస్తోంది.

★ గ్రామీణ ప్రాంతాల్లో గుండె సంబంధిత సమస్యలు వస్తే వైద్యానికి హుటాహుటిన విజయవాడకు తరలివెళ్లాల్సిందే. ఈ లోగా బాధితుల ప్రాణాలకు భరోసా అంతంత మాత్రమే. కానీ, నొప్పి వచ్చిన తొలి గంటలో ప్రాణాపాయం బయట పడేసేలా ప్రభుత్వం చేపట్టిన వినూత్న కార్యక్రమమే స్టెమీ. జిల్లాలోని పెద్ద ఆస్పత్రులలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించారు. ప్రమాదకర పరిస్థితుల్లో వచ్చే వారికి ఊపిరి పోస్తున్నారు.

ఆపదలో ఉపయోగించుకోవచ్చు: స్టెమీ కార్యక్రమం ద్వారా జిల్లాల్లో గుర్తించిన ఆస్పత్రులకు ప్రాణాపాయం నుంచి రక్షించే ఇంజెక్షన్లు అందుబాటులోకి తెచ్చారు. అందులో భాగంగా ఆయా ప్రభుత్వాస్పత్రుల్లో, గుండెపోటు వచ్చిన వారికి ప్రాథమిక చికిత్స నిమిత్తం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎవరికైనా ఆయాసం, దడ, ఛాతి నొప్పి, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలతో ఆస్పత్రికి వస్తే, స్టెమీ విభాగంలో ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహిస్తారు. గుండెపోటు నిర్ధరణ అయితే రూ.45 వేల విలువైన 'టెనెక్టిప్లేస్' అనే ఇంజెక్షన్‌ను ఉచితంగా ఇస్తారు. ప్రాణాపాయం నుంచి కాపాడి, మెరుగైన చికిత్స నిమిత్తం రోగిని నిపుణుల పర్యవేక్షణకు తరలిస్తారు. గ్రామీణ ప్రాంత ప్రజానీకానికి అందుబాటులోకి వచ్చిన అవకాశాన్ని ఆపద సమయంలో ఉపయోగించుకోవచ్చని, మైలవరం ప్రభుత్వాస్పత్రిలో నాలుగు నెలల వ్యవధిలో నలుగురికి ఈ ఇంజెక్షన్ ఇవ్వగా, ప్రస్తుతం అంతా సురక్షితంగా ఉన్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ వి.జయప్రకాశ్ తెలిపారు.



జిల్లాలో..

స్టెమీ విభాగాలున్న ఆస్పత్రులు: 6
ఉపయోగించుకున్న బాధితులు: 35 మంది
అందుబాటులో ఇంజెక్షన్లు: ఒక్కో చోట 6 వరకు

అందుబాటులో ఉన్నాయి

- మాధవీదేవి, డీసీహెచ్ఎస్

జిల్లాలో ప్రభుత్వాస్పత్రులు స్టెమీ విభాగాలను ఏర్పాటు చేసిన చోట్ల ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఆయా ఆస్పత్రుల్లో ఇప్పటి వరకు ఇంజెక్షన్లు అందించి, రిఫరల్ చేసిన బాధితులందరూ క్షేమంగా ఉన్నారు. గుండెపోటు లక్షణాలుగా భావిస్తే వెంటనే ఆస్పత్రులకు వెళ్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చు. జిల్లాలో అత్యధికంగా విస్సన్నపేట ఆస్పత్రిలో 15 మందికి ఇంజెక్షన్లు ఇచ్చి కాపాడారు.

సబ్జెక్టులపై పట్టు సాధించాలి

మైలవరం, న్యూస్‌టుడే: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు ప్రధాన సబ్జెక్టులపై పట్టు సాధించాలని గిరిజన సంక్షేమశాఖ సంయుక్త సంచాలకులు (జేడీ) సీఏ మణికుమార్ సూచించారు. గిరిజన సంక్షేమశాఖ సహకారంతో నిర్వహిస్తున్న లీలావతి ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. విద్యలో రాణించడానికి భాషాబేధాలు, వర్గ వైషమ్యాలు అడ్డురావని చెప్పారు. అట్టడుగు స్థాయి నుంచి సైతం ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని వివరించారు. ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ, ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక నేడు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 9 గంటలకు ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో పి.ప్రభాకరరావు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధి వేతనదారులు, ఉపాధిహామీ మేట్లు హాజరు కావాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విజేతలైన విద్యార్థులతో హెచ్ఎం, పీఈటీ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జంప్ రోప్ పోటీల్లో సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 16, 17 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలి [illegible] కళాశాలలో నిర్వహించిన పోటీల్లో ఈ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎస్.పరిమళ డబుల్ అండర్, [illegible] సింగిల్ [illegible], ఏడో తరగతి విద్యార్థిని ఎం.వైశాలి సింగిల్ రోప్ విభాగంలో జిల్లా నుంచి ఆడి బంగారు పతకాలు సాధించారు. సెప్టెంబరులో మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరిగే జాతీయ పోటీల్లో వారు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం సాయికుమారి, క్రీడా ఉపాధ్యాయులు దీవెనతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.


రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



గంపలగూడెం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, వేదికపై తెదేపా నాయకులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిందని, [illegible] చూడటంతో రైతులకు అవసరమైన సేవలు అందలేదని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆరోపించారు. అప్పటి సీఎం బీమా సంస్థలకు పంటల బీమా ప్రీమియం చెల్లించకుండా రైతులను మోసం చేశారన్నారు. సోమవారం గంపలగూడెం సహకార సంఘం ఛైర్మన్ కేవీవీ.సత్యనారాయణ(సత్యంబాబు), సభ్యులుగా బి.అంజయ్య, జె.రమేష్ ప్రమాణ స్వీకారం చేయగా ఆయన పాల్గొని మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం వచ్చేపాటు ఆర్థిక విధ్వంసం సృష్టించిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న ప్రతిసారి రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడ్డారన్నారు. భారత పత్తి సంస్థ కొనుగోలు కేంద్రం అందుబాటులో లేక పత్తి విక్రయానికి గుంటూరు వెళుతున్న రైతుల అవస్థలను గుర్తించానని, [illegible] మార్కెట్ యార్డులో శాశ్వతంగా పత్తి కొనుగోలుకు సీసీఐ కేంద్రం అందుబాటులో ఉండేలా కృషి చేస్తున్నామన్నారు. మిరప రైతులకు [illegible] గిడ్డంగుల నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. తెలుగు రైతు జిల్లాధ్యక్షుడు సీహెచ్.రాజశేఖర్, ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఆర్.లక్ష్మీబాల, సర్పంచి కె.పుల్లమ్మ, తెదేపా మండల మాజీ అధ్యక్షుడు ఆర్.వీరారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ బాధ్యతల స్వీకారం



గుంటుపల్లి సంఘం ఛైర్మన్‌ను సత్కరిస్తున్న వసంత కృష్ణప్రసాద్

ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని మూలపాడు, గుంటుపల్లిలకు చెందిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు చెందిన త్రిసభ్య కమిటీలు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించాయి. మూలపాడు పీఏసీఎస్ ఛైర్మన్‌గా కొలికపల్లి శ్రీనివాసరావు, సభ్యులుగా ఏడుకొండలు, నూనె వత్ బేబీ, గుంటుపల్లి పీఏసీఎస్ ఛైర్మన్‌గా చెరుకూరి రామకృష్ణ, సభ్యులుగా రత్నవరపు రామకృష్ణ, నర్రా సాంబశివరావులు బాధ్యతలు స్వీకరించారు. వారిని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ సత్కరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కార్యకర్తలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం [illegible] రైతుల కోసం త్రిసభ్య కమిటీలు [illegible] పని చేయాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచించారు. వెలగలేరు సొసైటీ త్రిసభ్య కమిటీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి సోమవారం ఆయన హాజరై మాట్లాడారు. సొసైటీ అధ్యక్షుడు మంచినీళ్ల రాజశేఖర్, సభ్యులు సానం నాగేశ్వరరావు, చింతా బాబురావును ఆయన అభినందించారు. జంపాల సీతారామయ్య, ఉయ్యూరు వెంకటనరసింహారావు, ఆలూరి రాజబాబు పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని తెల్లదేవరపల్లి సొసైటీ ఛైర్మన్‌గా వీరమాచినేని కృష్ణ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి తెదేపా రాష్ట్ర నాయకుడు బడ్డే వెంకటేశ్వరరావు హాజరై రైతులకు మరిన్ని సేవలు అందించాలని సూచించారు. కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ వి.లక్ష్మీ ప్రసాద్, తెదేపా నేతలు [illegible] తదితరులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని చంద్రాల సహకార సంఘానికి నూతనంగా నియమించిన రాయల సత్యనారాయణ నేతృత్వంలో త్రిసభ్య కమిటీ సభ్యులు సోమవారం సంఘ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కమిటీ సభ్యులను అభినందించారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని కొండపర్వ నూతన సొసైటీ ఛైర్మన్‌గా పామర్తి లక్ష్మీ నారాయణ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు.

కొండపల్లిలో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఆగదు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: కొండపల్లిలో వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నందున నెల రోజులు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఆగదని మండల రైల్వే అధికారి తెలిపారు. అక్టోబరు 19 నుంచి నవంబరు 18వ తేదీ వరకు గుంటూరు-సికింద్రాబాద్-గుంటూరు మధ్య నడిచే రైలు(17201/17202) కొండపల్లి స్టేషన్‌లో ఆగదని పేర్కొన్నారు.

రోడ్లపై మురుగు..అడిగేవారు కనుమరుగు

మండలంలోని కొత్తపల్లి బీసీ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. మురుగు పారుదలకు సరైన సదుపాయం లేక రోజుల తరబడి రహదారులపై నిల్వ ఉంటోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు తమ సమస్యను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలోని పలు రహదారుల్లో పాదచారులు సైతం రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీలు బాగుజేయించాలని కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, కొత్తపల్లి(గంపలగూడెం)



కొత్తపల్లి బీసీ కాలనీలో సిమెంట్ మార్గంలో పేరుకుపోయిన బురద

నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం

విద్యుత్తు శాఖాధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యంతో పలు విద్యుత్తు నియంత్రికలు, కరెంటు స్తంభాలకు పిచ్చి మొక్కల తీగలు అల్లుకుపోతున్నాయి. దీంతో సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు ఆవేదన పడుతున్నారు. దీనికి తోడు హెచ్చుతగ్గుల వల్ల ఇళ్లలోని బల్బులు, ఫ్యాన్లు, మిక్సీలు లాంటి గృహోపకరణాలు పాడైపోతున్నాయని వాపోతున్నారు. మండలంలోని చాట్రాయి -నరసాపురం మార్గం, గ్రామ పంచాయతీ నరసాపురం, కలగర, తాతకుంట్ల గ్రామం, విసన్నపేట, తెల్లదేవరపల్లి, పుట్రేల, వేమిరెడ్డిపల్లి, కలగర, పలు ప్రాంతాల్లోని విద్యుత్తు నియంత్రికలు, కరెంటు స్తంభాలు, తీగలకు పిచ్చి తీగలు అల్లుకుపోయాయి. - న్యూస్‌టుడే, విస్సన్నపేట



తాతకుంట్లలో విద్యుత్తు నియంత్రికను కమ్మేసిన పిచ్చి మొక్కల తీగలు

చినుకు పడితే చిత్తడే..

చెవుటూరు గ్రామంలో మేరీమాత విగ్రహాల సెంటర్ సమీపంలో ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. చినుకు పడితే రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు నిలిచి పోయి పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మరో వైపు రహదారిపై వాహనాలు వేగంగా వెళ్తున్నపుడు పక్కన నడుస్తున్న పాదచారులపై మురుగు నీరు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులకు పలుమార్లు మొర పెట్టుకున్నా ఎలాంటి ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు



చెవుటూరులో ఆర్అండ్‌బీ రోడ్డుపైన గుంతల్లో వర్షపు నీరు

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కలెక్టర్ లక్ష్మీశ ఆదేశానుసారం గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు, మండల వ్యవసాయ సంచాలకులు కె శశికళ ఆధ్వర్యంలో మండల పరిధి గ్రామాల్లో ఎరువుల దుకాణాలు, సొసైటీలు, రైతు సేవా కేంద్రాల వద్ద యూరియా కృత్రిమ కొరతపై ప్రచారం చేశారు. కలెక్టర్ కంట్రోల్ రూమ్ ఫోన్ నం 91549 70454 ను ప్రదర్శించారు. అలాగే వేరే ఉత్పత్తుల అమ్మకంతో యూరియా విక్రయాలకు ముడిపెట్టవద్దని డీలర్లకు సూచించారు. రైతు పంట సాగుకు కావలసిన యూరియా సొసైటీలలో అందుబాటులో ఉంచుతామన్నారు.



విసన్నపేట: ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న మండల వ్యవసాయ సంచాలకులు కె శశికళ, సిబ్బంది

విద్యార్థులకు కంచాల వితరణ

జి.కొండూరు, న్యూస్‌టుడే: కుంటముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన సొసైటీ అధ్యక్షుడు సుఖవాసి శ్రీహరి 160 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన కంచాలు, గ్లాసులు రూ.32 వేలతో సోమవారం వితరణ చేశారు. మైలవరం లయన్స్‌క్లబ్ సభ్యుడు మేడసాని కిషోర్ ఆయన కుమారుడు చిద్విల్ సాయి పుట్టినరోజు సందర్భంగా పాఠశాలకు రూ.10 వేలతో బీరువా అందజేశారు. దాతలకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో మైలవరం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చనుమోలు నాగభూషణం, క్లబ్ సమన్వయకర్త జాస్తి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు ఎస్‌కే ఎన్ఎం.షరీఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కంచాలు, గ్లాసులు అందజేస్తున్న శ్రీహరి, పక్కన షరీఫ్ తదితరులు

ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి



తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తూ...

విస్సన్నపేట, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం ఉచిత బస్సు ప్రయాణం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఆటో రంగంపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని సీఐటీయూ ఆధ్వర్యంలో విస్సన్నపేట తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం ఆందోళన చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ ఆకుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ..ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం కాగా ఆటో కార్మికులకు ఎన్నికల హామీ మేరకు ఇస్తామన్న హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కె లక్ష్మీకల్యాణికి వినతిపత్రం అందజేశారు. నాయకులు గోనెల మురళి, మధు, ఆదాం, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు శిక్ష ఖరారు

మైలవరం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాల దొంగతనానికి పాల్పడిన ఇద్దరికి జైలు శిక్ష ఖరారు చేస్తూ సోమవారం స్థానిక కోర్టు న్యాయమూర్తి ఎం.శైలజ తీర్పునిచ్చినట్లు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. 2024లో మైలవరంలో రెండు ద్విచక్ర వాహనాల దొంగతనంపై రెండు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. సీపీ రాజశేఖరబాబు ఆదేశాలతో ఆయా కేసులను దర్యాప్తు చేయగా, జి.కొండూరు మండలం గంగినేనిపాలేనికి చెందిన మాదగోని నాగతిరుపతిబాబు, పల్లపు మారేశ్వరరావులను నిందితులుగా గుర్తించి, గతేడాది సెప్టెంబరులో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. న్యాయస్థానం విచారణలో నేరం రుజువు కావడంతో వారిద్దరికీ మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని వివరించారు.

సర్దార్ సర్వాయి పాపన్నకు నివాళి

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని మండలంలోని పెనుగొలనులో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రామస్థులు, చిన్నారులు నివాళులర్పించారు. పాపన్న 12 వేల మంది సైనికులతో మొగల్ సామ్రాజ్యవాదులపై తిరుగుబాటు చేశారని ఆయన స్ఫూర్తిని కొనియాడారు.

రఘునందన్‌కు సత్కారం

తిరువూరు, న్యూస్‌టుడే: విజయవాడలో ఆదివారం రాత్రి నూతన సాహితీ సంస్థ, విశ్వసాహితీ కళావేదిక ఆవిర్భావ సభలో తిరువూరుకు చెందిన కవి రేపాక రఘునందన్‌ను నిర్వాహకులు సత్కరించారు. విముక్తి గీతం అనే వచన కవితను గానం చేసిన ఆహూతుల ప్రశంసలు అందుకున్న రఘునందన్‌ను గజల్ శ్రీనివాస్, సాహితీవేత్త జీవీ.పూర్ణచంద్, కళావేదిక నిర్వాహకురాలు కె.రమాదేవి శాలువతో సత్కరించి, జ్ఞాపిక ప్రశంసాపత్రం అందజేశారు.

బాధిత కుటుంబానికి సాయం

కంభంపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కంభంపాడులో తెదేపాకు చెందిన బాలమర్తి రాములు అనారోగ్యంతో మృతి చెందడంతో అతని కుటుంబానికి పార్టీ నాయకులు ఆదివారం చేయూత అందించారు. కొప్పుల శౌరి, మలమంటి ఏలియాబాబు, కొంగల కృష్ణ 25కిలోల బియ్యం, కొంత నగదు అందజేశారు.

ప్రతిభావంతులకు ప్రశంసాపత్రాలు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు, గంపలగూడెం మండలాల్లో పోలీస్, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖల్లో ప్రతిభ చూపిన పలువురు ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని సోమవారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ విజయవాడలోని తన కార్యాలయంలో ప్రశంసాపత్రాలు అందజేశారు. తిరువూరు మండలం మల్లేల గ్రామీణ పశువైద్యశాల లైవ్‌స్టాక్ అధికారి మిరియాల గోపాలకృష్ణ, మండలంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేసిన కానిస్టేబుల్ ఎస్‌కే.బాషా, గంపలగూడెంలో వీఆర్వో సీహెచ్.సీతామహాలక్ష్మి ప్రశంసాపత్రాలు అందుకున్నారు.



కలెక్టర్ లక్ష్మీశ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నసీతామహాలక్ష్మి, బాషా, గోపాలకృష్ణ

నేతాజీ వర్ధంతి

తిరువూరు, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. బోసు బొమ్మ కూడలిలోని ఆయన విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. పి.శ్రీనివాసరావు, జి.కృష్ణమోహన్, జి.మోహన్‌రావు పాల్గొన్నారు.

15 కి.మీ దారి..ప్రాణాంతకంగా మారి

✤ పనులు చేపట్టక మంజూరైన నిధులు రద్దు..

ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే

మచిలీపట్నం - నూజివీడు - కల్లూరు(ఎంఎన్‌కే) రహదారిలో ఎ.కొండూరు నుంచి విస్సన్నపేట వరకు ఆర్అండ్‌బీ రోడ్డుపై మోకాలి లోతు గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఎ.కొండూరు అడ్డరోడ్డు నుంచి విస్సన్నపేట అంబేడ్కర్ విగ్రహం వరకు 15 కి.మీ దూరం మేర ఈ సమస్య తీవ్రంగా ఉన్నా పాలకులు పట్టించుకోవడం లేదు. గత ఆరేళ్లుగా రెండు మండలాల ప్రజలతో పాటు అటుగా రాకపోకలు సాగిస్తున్న ప్రజలు అధికారుల దృష్టికి తమ ఇబ్బందులను తీసుకువచ్చినా స్పందన కొరవడింది. ఐదేళ్ల పాటు వైకాపా ప్రభుత్వం ఈ రోడ్డును బాగుజేయకుండా నిర్లక్ష్యం చేసింది.

గుత్తేదారులు చేతులెత్తేశారు..

అప్పట్లో ఎంఎన్‌కే రహదారి అభివృద్ధికి రూ.35 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియలో గుత్తేదారును ఎంపిక చేశారు. అయినా అడిగేవారు కరవై సదరు గుత్తేదారు పనులు ప్రారంభించలేదు. దీంతో ఆ నిధులు రద్దయినట్లు తెలుస్తోంది. అదే మార్గంలో కుమ్మరికుంట్ల వద్ద వాగుపై వంతెన కూలిపోయి నాలుగేళ్లు కావస్తోంది. అక్కడ కూడా మళ్లింపు రోడ్డు నిర్మించి తాత్కాలికంగా రాకపోకలు కొనసాగిస్తున్నారు. భారీ వర్షం కురిసినప్పుడు వాగులో వరద ఉప్పొంగితే వంతెన వద్ద ప్రయాణాలు గంటల తరబడి నిలిచిపోతాయి. అక్కడ వంతెన నిర్మాణానికి పూర్వ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా గుత్తేదారు నిర్మించకుండా చేతులెత్తేశాడు. అప్పట్లో రహదారి, వంతెన నిర్మాణాలు పూర్తి చేసినా ప్రభుత్వం టెండర్ల మేరకు సొమ్ము ఇస్తుందో లేదోనన్న భయంతో గుత్తేదారు పనులు చేపట్టలేదు.



ఎ.కొండూరు రహదారిలో 12వ కి.మీ వద్ద ఇలా

కూటమి ప్రభుత్వంపై ఆశలు

ఎ.కొండూరు అడ్డరోడ్డు నుంచి విస్సన్నపేట వరకు రహదారిపై గుంతల్లో వాహనాలు అదుపు తప్పి కిందపడిపోవడంతో పదుల సంఖ్యలో చోదకులు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. ఈ ఏడాది కూడా అడ్డరోడ్డుకు సమీపంలోని ఓ గుంతలో ద్విచక్రవాహనం అదుపుతప్పిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. కూటమి ప్రభుత్వంలోనైనా రహదారి అభివృద్ధి జరుగుతుందని గిరిజన తండాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

బార్ లైసెన్సుల జారీకి 28న లాటరీ

ఈనాడు, అమరావతి: 'కొత్త బార్ లైసెన్సుల జారీ కోసం ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులు స్వీకరిస్తాం. 28న లాటరీ తీసి లైసెన్సుదారును ఎంపిక చేస్తాం' అని ఎక్సైజ్ కమిషనర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. తాజా బార్ పాలసీలో గతంతో పోలిస్తే నాన్ రిఫండబుల్ దరఖాస్తు రుసుములు, లైసెన్సు రుసుములను తగ్గించామని చెప్పారు. లైసెన్సు జారీ అయిన తర్వాత 15 రోజుల్లోగా రెస్టారెంట్ ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మంగళగిరిలోని ఎక్సైజ్ కమిషనరేట్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈసారి దరఖాస్తుల ద్వారా రూ.170 కోట్ల మేర ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నామన్నారు. 'గీత కార్మిక కులాల వారి కోసం అదనంగా 84 బార్లు నోటిఫై చేశాం. వీటికి లైసెన్సుల జారీకి ఈ నెల 20 నుంచి దరఖాస్తులు స్వీకరించి.. 30న లాటరీ తీస్తాం' అని నిషాంత్ వెల్లడించారు.

అటవీభూమిలో మొక్కలు నాటాలని నిర్ణయం

'ఈనాడు' కథనానికి స్పందన

ఈనాడు, తిరుపతి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం సింహాచలకండ్రిగలోని రక్షిత అటవీ ప్రాంతంలో మొక్కలు నాటాలని అధికారులు నిర్ణయించారు. నెలాఖరులోగా ఆ ప్రాంతంలోని కంప చెట్లు తొలగించి.. వచ్చే నెలలో మొక్కలు నాటడానికి సన్నద్ధమవుతున్నారు. 'రక్షిత అడవినే భక్షించాలని..!' శీర్షికతో సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై రెవెన్యూ, అటవీశాఖ అధికారులు స్పందించారు. అటవీశాఖ భూమిని సంరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

20 నుంచి డిగ్రీ ప్రవేశాల రిజిస్ట్రేషన్లు

ఈనాడు, అమరావతి: డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలకు ఈ నెల 20 నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ఉన్నత విద్యామండలి ప్రకటించింది. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాలను అదే రోజున వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెస్తామని వెల్లడించింది. రిజిస్ట్రేషన్లకు ఐదారు రోజులు సమయం ఇవ్వనున్నారు.



కలిసి పనిచేస్తేనే దీర్ఘకాలిక వృద్ధి

మీరు వ్యాపారం చేస్తున్నట్లయితే.. పని భారం మొత్తం మీ మీదే వేసుకోకండి. దానివల్ల త్వరగా చేతులెత్తేసే అవకాశాలు పెరుగుతాయి. విశ్వసనీయ వ్యక్తులను ఎంచుకొని, వారికి కొన్ని బాధ్యతలు అప్పగించండి. అప్పుడే ఆశించిన స్థాయిలో వృద్ధి కనిపిస్తుంది. వేగంగా ఎదగాలనుకుంటే ఒంటరిగా పనిచేయడం మంచిదే. కానీ వృద్ధి పథంలో దీర్ఘకాలం పయనించాలంటే మాత్రం.. ఇతరులతో కలిసి పనిచేయండి.

– షనా మడలూలి, లైఫ్ కోచ్

యువ ఆవిష్కర్తల వేదిక.. ఇన్నోవేషన్ హబ్

- మంగళగిరిలోని టెక్ మయూరిలో సిద్ధం
- రేపు సీఎం చేతుల మీదుగా ప్రారంభం



రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయనున్న మయూరి టెక్ పార్క్ ★ ఇన్నోవేషన్ హబ్‌లో ఏర్పాట్లు ఇలా

న్యూస్‌టుడే – ఏఎన్‌యూ (గుంటూరు): రాష్ట్రాన్ని ఇన్నోవేషన్ హబ్‌గా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సంకల్పం సాకారమవుతోంది. యువతలోని వినూత్న ఆలోచనలకు మెరుగుపెట్టి.. వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ వేదిక కానుంది. గుంటూరు జిల్లా మంగళగిరిలోని మయూరి టెక్ ప్రాంగణంలో దాదాపు 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ హబ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 20న ప్రారంభించనున్నారు. యువ ఆవిష్కర్తల ప్రాజెక్టులకు మరింతగా మెరుగులద్దేందుకు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లోని విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ఇన్నోవేషన్ హబ్‌లకు తీసుకొచ్చి యువ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతారు. ఇందుకోసం విశాఖ, అనంతపురం, తిరుపతి, రాజమహేంద్రవరం, అమరావతి హబ్‌లు ఆవిష్కాంధ్ర పేరుతో పని చేస్తాయని ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో సూర్యతేజ తెలిపారు. వినూత్న ఆలోచనలతో వచ్చే విద్యార్థులకు ప్రభుత్వం, పరిశ్రమల నుంచి సహకారం అందించడంతోపాటు అవసరమైన ప్రత్యేక శిక్షణను ఐఐటీ, బిట్స్, ఐఐఎం, టాటా గ్రూప్, ఎల్‌అండ్‌టీ, జీఎంఆర్ తదితర సంస్థలు ఇస్తాయి. రాష్ట్రవ్యాప్తంగా 3 వేల స్టార్టప్‌లు పని చేస్తున్నాయి. వీటికి తోడుగానే ఆవిష్కాంధ్ర ఉంటుంది. ఈ నెల 20న ప్రారంభోత్సవ కార్యక్రమం పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు ప్రత్యక్షంగా వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను సీఎం పరిశీలిస్తారని సూర్యతేజ చెప్పారు.

నేడు ఆత్మకూరులో పీ4 కార్యక్రమం

ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 19, 20 తేదీల్లో మంగళగిరిలో పర్యటించనున్నారు. 19న ఆత్మకూరు సమీపంలోని సీకే కన్వెన్షన్‌లో నిర్వహించే పీ4 కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. 20న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాల ఏర్పాట్లను కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్ సోమవారం పరిశీలించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల మొదటిరోజే.. సీఎం పట్టువస్త్రాల సమర్పణ

తిరుమల, న్యూస్‌టుడే: ఈ ఏడాది శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో మొదటి రోజే సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తితిదే ఈవో జె.శ్యామలరావు తెలిపారు. సోమవారం శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలపై అదనపు ఈవో వెంకయ్య చౌదరి, కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్‌వో మురళీకృష్ణతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ.. సెప్టెంబరు 28న గరుడ వాహన సేవ, అక్టోబరు 2న చక్రస్నానం జరగనుందని, ఈ సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందని చెప్పారు. రద్దీని ముందుగా అంచనావేసి జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వాహనాల రాకపోకలు అంచనావేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని, ఎక్కువ మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా చూడాలని సూచించారు.

సీఎం కార్యక్రమాల సమన్వయకర్తగా మంతెన సత్యనారాయణరాజు



ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్తగా తెదేపా సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజును నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు సహాయ మంత్రి హోదా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మంతెన సత్యనారాయణరాజు 22 ఏళ్లుగా తెదేపాలో క్రియాశీలకంగా ఉన్నారు. 2017-23 మధ్య కాలంలో ఎమ్మెల్సీగా పని చేశారు. శాసనమండలిలో మూడు రాజధానుల బిల్లు పాస్ కాకుండా అడ్డుకోవడంలో తనవంతు పాత్ర పోషించారు. తెదేపా అధినేత చంద్రబాబు పాల్గొన్న గత ఎన్నికల్లో సభలను మంతెన సమన్వయం చేశారు. పార్టీకి అత్యంత విధేయుడిగా ఉన్న రాజును తన కార్యక్రమాల సమన్వయకర్తగా నియమించి సీఎం చంద్రబాబు గౌరవించారు. తనను సమన్వయకర్తగా నియమించిన ముఖ్యమంత్రిని కలిసి సత్యనారాయణరాజు ధన్యవాదాలు తెలిపారు. ఈ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానన్నారు.

రెండు జిల్లాల్లో వీఏఏల బదిలీల రద్దు

- నేతల సిఫార్సుల వల్ల ఎక్కువగా జరిగాయి
- అక్కడ మళ్లీ చేపట్టండి: హైకోర్టు

ఈనాడు, అమరావతి: ఉమ్మడి కర్నూలు, కృష్ణా జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో పనిచేసే గ్రామ వ్యవసాయ సహాయకుల (వీఏఏ) బదిలీలకు ప్రజాప్రతినిధులు చాలా ఎక్కువ సిఫార్సులు చేశారని హైకోర్టు పేర్కొంది. అందువల్లే ఆ రెండు జిల్లాల్లో ఎక్కువ బదిలీలు జరిగాయని తేల్చింది. కర్నూలులో 115 మంది, కృష్ణాలో 102మంది బదిలీలకు ప్రజాప్రతినిధులు సిఫార్సు చేయడమే కాకుండా.. వారికి ఏ స్థానంలో పోస్టింగ్ ఇవ్వాలో కూడా నిర్దేశం చేశారని గుర్తుచేసింది. ఆ రెండు జిల్లాల్లో బదిలీలను రద్దు చేసింది. తాజాగా కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కార్యనిర్వాహక వ్యవస్థకు ఉద్యోగులకు మధ్య ప్రజాప్రతినిధులు వారధిలాంటి వారని.. సహేతుకమైన కారణం ఉంటే బదిలీకి సిఫార్సు చేయవచ్చని వెల్లడించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ న్యాపతి విజయ్ ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చారు. మిగతా జిల్లాల బదిలీల విషయంలో దాఖలైన వ్యాజ్యాల్లో జోక్యానికి నిరాకరించారు. అక్కడ నిబంధనలను ఉల్లంఘించేలా, భారీస్థాయిలో ప్రజాప్రతినిధుల సిఫార్సులు లేవన్నారు. సంబంధిత వ్యాజ్యాలను కొట్టేశారు.

★ తమ సీనియారిటీ, ఐచ్ఛికాలను విస్మరించి ఎంపీ, ఎమ్మెల్యేల సిఫార్సు మేరకు బదిలీలు చేశారని పేర్కొంటూ వివిధ జిల్లాలకు చెందిన వీఏఏలు హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. వారి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేశారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేల బదిలీ సిఫార్సు లేఖలను కోర్టు ముందు ఉంచారు.

★ ప్రభుత్వ న్యాయవాది (జీపీ) వాదనలు వినిపిస్తూ.. బదిలీల విషయంలో ప్రజాప్రతినిధులు సిఫార్సు చేయకూడదంటూ నిషేధం ఏమి లేదన్నారు.

★ ఇరువైపు వాదనలు విన్న న్యాయమూర్తి ప్రజాప్రతినిధుల సిఫార్సులకు ఆయా జిల్లా కలెక్టర్లు (నియామక, బదిలీ అథార్టీ) ఉన్నది ఉన్నట్లు ఆమోదం తెలిపితే బదిలీలలో పారదర్శకత తెచ్చేందుకు, ఆశ్రిత పక్షపాతాన్ని నిరోధించడం కోసం గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ముఖ్య కార్యదర్శి తీసుకొచ్చిన జీవో ఉద్దేశం నెరవేరదన్నారు. బదిలీ మార్గదర్శకాలను ఉమ్మడి కర్నూలు, కృష్ణా జిల్లాల కలెక్టర్లు విస్మరించారని స్పష్టం చేశారు.

మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన 21 నుంచి

ఈనాడు, అమరావతి: మెగా డీఎస్సీలో ప్రతిభ చూపిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను ఈ నెల 21 లేదా 22 నుంచి ప్రారంభించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. డీఎస్సీ ఫలితాలను విడుదల చేసిన విద్యాశాఖ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) మార్కుల సవరణకు ఆదివారం వరకు అవకాశం కల్పించింది. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన టెట్ మార్కులను పరిశీలించి, అనంతరం స్కోర్ కార్డులను విడుదల చేసింది. గతంలో ఇచ్చినట్లు డీఎస్సీలో టాపర్లు, కటాఫ్ మార్కులు, మెరిట్ లిస్టులు ఇవ్వకుండా నేరుగా సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాల వారీగా జాబితాలు ప్రకటించి, సర్టిఫికెట్ల పరిశీలనకు అభ్యర్థులను ఆహ్వానిస్తారు. పరిశీలన అనంతరం తుది జాబితాను రూపొందిస్తారు. సెప్టెంబరు నెల మొదటి వారంలోపు జాబితాలను సిద్ధం చేయనున్నారు. రెండో వారంలో పోస్టింగ్‌లు ఇవ్వాలని భావిస్తున్నారు.

మిథున్‌రెడ్డి సహా మద్యం నిందితుల బెయిల్ పిటిషన్లు డిస్మిస్

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం నిందితులకు కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వీరు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లను విజయవాడలోని ఏసీబీ కోర్టు తోసిపుచ్చింది. వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి (ఏ4), ధనుంజయరెడ్డి (ఏ31), కృష్ణమోహన్‌రెడ్డి (ఏ32), గోవిందప్ప బాలాజీ (ఏ33)లు దాఖలు చేసుకున్న పిటిషన్లపై గత వారం ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. వాటిపై న్యాయాధికారి భాస్కరరావు సోమవారం ఉత్తర్వులను వెలువరించారు. ఈ కేసులో కొందరు నిందితులు ఇంకా పరారీలో ఉన్నారని, వారిని అరెస్టు చేయాల్సి ఉందని.. దర్యాప్తు కీలక దశలో ఉన్నందున వీరికి బెయిల్ ఇవ్వవద్దని ప్రాసిక్యూషన్ తరఫున జేడీ రాజేంద్రప్రసాద్ వాదించారు. ప్రాసిక్యూషన్ వాదనలతో ఏకీభవిస్తూ బెయిల్ పిటిషన్లను కోర్టు డిస్మిస్ చేసింది.

★ మరో నిందితుడు సజ్జల శ్రీధర్‌రెడ్డి (ఏ6) గత వారం దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సోమవారం వాదనలు జరగాల్సి ఉంది. ఆయన తరఫు న్యాయవాది హాజరుకాకపోవడంతో 20వ తేదీకి వాయిదా వేశారు.

ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేత: ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి, ఓఎస్డీ సత్యప్రసాద్‌లు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై కూడా కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. వీటిని న్యాయాధికారి కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జగన్‌కు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ ఫోన్

ఈనాడు, అమరావతి: భాజపా సీనియర్ నేత, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం వైకాపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ఎంపిక చేసిన నేపథ్యంలో ఆయన ఏకగ్రీవ ఎన్నికకు మద్దతునివ్వాలని కోరారు. జగన్ కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

'పాడనా తెలుగు పాట'కు ఆహ్వానం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలుగు చలనచిత్ర అపూర్వ గీతాలను వెలికితీయడం, వాటిని యువతకు చేరవేయడం లక్ష్యంగా ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో రానున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా 'పాడనా తెలుగు పాట' ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల, ఎస్పీ బాలు స్మారక వేదికపై తెలుగు పాటకు నీరాజనంగా ప్రతిభావంతులైన గాయనీ, గాయకులకు కరోకే (ట్రాక్) పద్ధతిలో గానం చేసే అవకాశాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. "మంచి సాహిత్యం కలిగిన రెండు తెలుగు చలనచిత్ర గీతాలను ఫోన్‌లో కరోకే (ట్రాక్) పద్ధతిలో ఆడియో రూపంలో రికార్డు చేసి సెప్టెంబరు 10వ తేదీ లోపు మెయిల్‌లో పంపాలి. అర్హత పొందిన గాయకులకు ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై గానం చేసేందుకు నిర్వాహకులు అధికారిక ఆహ్వానం పంపిస్తారు. పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రం, తెలుగు మహాసభల పతకం అందజేస్తారు. పూర్తి వివరాలతో పాటు, అభ్యర్థి ఫొటో, రెండు పాటల ఆడియోలు ammapandu2026@gmail.com కు పంపాలి" అని గజల్ శ్రీనివాస్ వెల్లడించారు.

కోట శ్రీనివాసరావు సతీమణి కన్నుమూత



రుక్మిణి

హైదరాబాద్, న్యూస్‌టుడే: దివంగత సినీ నటుడు కోట శ్రీనివాసరావు సతీమణి రుక్మిణి (75) సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆదివారం అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఆమెను వెంటనే కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కోట శ్రీనివాసరావు గత నెల 13న తుదిశ్వాస విడవగా.. అప్పటి నుంచి ఆమె ఆరోగ్యం మరింతగా క్షీణించినట్లు తెలుస్తోంది. సోమవారం మధ్యాహ్నం మహాప్రస్థానంలో అంత్యక్రియలు జరిగాయి.

పర్యాటకాభివృద్ధిలో ఫొటోగ్రఫీ పాత్ర కీలకం



ఫొటో ఆల్బమ్ విడుదల చేస్తున్న బాలాజీ, బుద్ధప్రసాద్, గంగరాజు తదితరులు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : పర్యాటకం అభివృద్ధిలో ఫొటోగ్రఫీ కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత సంస్కృతి సమితి సౌజన్యంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం బాలోత్సవ భవన్‌లో ప్రపంచ గిరిజన దినోత్సవం, ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల స్థితిగతులు, జీవన విధానాలు తెలియజేసేది ఫొటోగ్రఫీ అన్నారు. ఈ రంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. చరవాణులతో ఫొటోలు తీసినా.. కెమెరాతో తీసినంత స్పష్టత ఉండదన్నారు. గిరిజనుల జీవన విధానాలను కళ్లకు కట్టిన నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకుడు టి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. భారతదేశం వేదికగా ఫొటోగ్రఫీలో గిరిజనులపై పోటీలు నిర్వహించడం తొలిసారిగా పేర్కొన్నారు. 16 రాష్ట్రాల నుంచి 487 ఎంట్రీలు రాగా.. 40 ఫొటోలు ఎంపికైనట్లు తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీని జాతీయ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన శ్రీనివాసరెడ్డిని అభినందించారు. పర్యాటకాన్ని ఫొటోగ్రఫీ ద్వారా చిత్రీకరించి.. ప్రపంచానికి చాటాలని పేర్కొన్నారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ.. చిన్నపాటి కెమెరా నుంచి ఇప్పటి అత్యాధునిక కెమెరాలను వాడుకునే స్థాయికి ఎదిగిన ఫొటోగ్రఫీ రంగం ద్వారా సేవలందిస్తూ.. మొదటిసారిగా గిరిజన సంస్కృతిని వెలుగులోకి తెచ్చిన నిర్వాహకులను అభినందించారు. తొలి మూడు స్థానాల్లో గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. వేడుకలకు సంబంధించిన పలు ఫొటో క్యాటలాగ్‌లు, ఆల్బమ్‌లు ఆవిష్కరించారు. జీఆర్కే పోలవరపు సాంస్కృతిక సమితి నిర్వాహకుడు గోళ్ల నారాయణరావు, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు సుందర్ కొపల్లి, ఏపీ సృజనాత్మకత సంస్కృతి సమితి డైరక్టర్ అండ్ సీఈవో ఆర్ మల్లికార్జునరావు, ఫొటోగ్రాఫర్లు, ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

విత్ హోల్డ్ బకాయిలకు విముక్తి

★ తెదేపా పాలనలో చేసిన పనులకు నిధులివ్వని వైకాపా

★ కూటమి చొరవతో విడుదలకు కేంద్రం పచ్చజెండా

జిల్లా	మొత్తం చేపట్టిన పనుల విలువ (రూ.కోట్లలో)	విత్ హోల్డ్ బిల్లుల బకాయిలు (రూ.కోట్లలో)
ఎన్టీఆర్	40	8.5
కృష్ణా	17.15	3.5
మొత్తం	57.15	12

ఈనాడు, అమరావతి

2014-19 తెదేపా పాలనలో ఉపాధి హామీ నిధులతో చేసిన పనుల విత్ హోల్డ్ నిధులు వైకాపా ఐదేళ్ల పాలనలో విడుదల కానివ్వలేదు. ప్రభుత్వం నుంచి రూ.కోట్లలో బకాయిలు రావాల్సిన నేపథ్యంలో వందల మంది గుత్తేదారులు ఆర్థికంగా చితికిపోయారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత విశ్వ ప్రయత్నం చేసి నిధులు ఇవ్వడానికి కేంద్రాన్ని ఒప్పించారు.

వైకాపా నిర్వాకంతోనే: తెదేపా పాలన ప్రారంభంలో నిధులు సవ్యంగా విడుదలయ్యాయి. 2018 నుంచి చేసిన పనులకు నిధులు విడుదల కాకుండానే ఎన్నికలు రావడంతో ప్రభుత్వం మారింది. నిబంధనల ప్రకారం వైకాపా సర్కారు ఈ నిధుల విడుదలకు కృషి చేయాల్సి ఉన్నా కనీసం పట్టించుకోలేదు. తెదేపా పాలనలో చేసిన పనులు కావడంతో గుత్తేదారులంతా తెదేపా సానుభూతిపరులే అన్న తప్పుడు ఉద్దేశంతో పైసా కూడా నిధులు విడుదల కాకుండా చేసింది. అదే సమయంలో ఉపాధి పనుల సాఫ్ట్‌వేర్ టీసీఎస్ నుంచి ఎన్ఐసీకి మారడాన్ని సాకుగా చూపి పూర్తిగా గాలికొదిలేసింది.

ఐదేళ్లు ఆర్థిక అవస్థలు: వైకాపా పాలనలో గుత్తేదారులు కార్యాలయాల చుట్టూ తిరిగినా.. వినతులు, విన్నపాలు చేసినా నాటి పాలకులు పట్టించుకోలేదు. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖకు లేఖ రాసి బకాయిలు విడుదల చేయాలని కోరితే అన్నీ సవ్యంగా ఉంటే వెంటనే బిల్లులు మంజూరవుతాయి. కానీ వైకాపా పాలకులు కావాలనే ఆ దిశగా ప్రయత్నం చేయలేదు. దీంతో గుత్తేదారులు ఆర్థికంగా చితికిపోయారు. చాలా మంది అప్పులు తెచ్చి పనులు చేసిన వారు ఇప్పటికీ వడ్డీలు చెల్లిస్తున్నారంటే పరిస్థితులు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తోంది. కూటమి అధికారం చేపట్టిన వెంటనే కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి నిధులు విడుదల చేసే ఏర్పాటు చేశారు.

ఏమిటీ బిల్లులు..

ఉపాధి హామీ నిధులతో వివిధ పనులు చేస్తుంటారు. పనులు పూర్తి అయినప్పటికీ గుత్తేదారులకు చెల్లించాల్సిన బిల్లుల్లో 21 శాతం మొత్తాన్ని నిలుపుదల చేస్తారు. అవే విత్ హోల్డ్ బిల్లులు. వీటిని క్వాలిటీ కంట్రోల్ పరిశీలన, సామాజిక తనిఖీ పూర్తి అయ్యాక అన్నీ సవ్యంగా ఉంటే అప్పుడు విడుదల చేస్తారు.

రూ.12కోట్లు నిలిపేశారు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సీసీ రహదారులు, డ్రెయిన్లు, మినీగోకులాలు, శ్మశానాల్లో దహన వాటికలు, పశుగ్రాస క్షేత్రాలు, ఉద్యాన ఉత్పత్తులకు ప్యాక్ హౌసులు, చెత్త నుంచి సంపద కేంద్రాలు, వ్యక్తిగత మరుగుదొడ్లు వంటి అనేక పనులు చేపట్టారు. ఇందులో 90 మొత్తం రూ.57.15కోట్ల విలువైన పనులకు సంబంధించిన విత్ హోల్డ్ బకాయిలు రూ.12కోట్లు రావాల్సి ఉంది. ఎన్టీఆర్ జిల్లాలోనే రూ.8.5కోట్ల మేర బకాయిలుండగా 700 మందికి పైగా గుత్తేదారులున్నారు. కృష్ణా జిల్లాలో రూ.3.5కోట్లకు దాదాపు 400 మంది వరకు గుత్తేదారులున్నారు.

నేటి నుంచి ఎంబీబీఎస్ సీట్లకు ఐచ్ఛికాలు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ప్రస్తుత (2025-26) విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి సంబంధించి అభ్యర్థులు కళాశాలల ఐచ్ఛికాలు పెట్టుకునేందుకు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం రాత్రి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటికే విశ్వవిద్యాలయానికి దరఖాస్తు చేసుకొని తాత్కాలిక ప్రాధాన్య క్రమంలో ఉన్న అభ్యర్థులంతా ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లో వన్ టైమ్ ఐచ్ఛికాలు పెట్టుకోవాలి. బాలురు 34, బాలికలు 35 వైద్య కళాశాలలకు వరుస క్రమంలో ఐచ్ఛికాలు ఇవ్వాలి. తుది ప్రాధాన్య జాబితా మంగళవారం వెల్లడించనున్నారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం పరిధిలో 2030 సీట్లు, ఎస్వీయూ పరిధిలో 1625, రాష్ట్ర వ్యాప్త కళాశాలైన విజయవాడ సిద్ధార్థలో 149, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం నిమ్రా మైనారిటీ కళాశాలలో 75, కర్నూలు జిల్లా ఫాతిమా కళాశాలలో 50 సీట్లతో కలిపి మొత్తం 3929 సీట్లు మొదటి విడత కౌన్సెలింగ్‌కు అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు తమ వెబ్‌సైట్ పాస్‌వర్డ్‌లను ఎవరికీ చెప్పవద్దని, ప్రైవేటు ఏజెన్సీల వలలో పడ వద్దని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి సూచించారు.

22న ఇంద్రకీలాద్రిపై ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతం

విద్యాధరపురం: ఇంద్రకీలాద్రిపై ఈ నెల 22న నిర్వహించనున్న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతానికి సంబంధించిన దరఖాస్తులను మహిళల నుంచి సోమవారం స్వీకరించారు. తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి మాత్రమే ఉచిత వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. మహామండపం ఆరో అంతస్తులో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు వ్రతంలో పాల్గొనే వారికి అవసరమైన పూజా సామగ్రిని దేవస్థాన అధికారులు అందజేస్తారు. పూజ అనంతరం వారిని రూ.100 క్యూలైన్లో అమ్మవారి దర్శనం చేయించేందుకు ఏర్పాటు చేశారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు నిర్వహించే వ్రతంలో పాల్గొనాలి అనుకునే వారికి టికెట్ రుసుము రూ.1500గా నిర్ణయించారు. వ్రతంలో పాల్గొన్న వారికి కుంకుమ, జాకెట్టు ముక్క, గాజులు, అమ్మవారి ప్రసాదం, శక్తి కంకణం అందజేయనున్నట్లు తెలిపారు.

ఘాట్ల వద్దకు వెళ్లకండి.. అప్రమత్తంగా ఉండండి



పురపాలిక అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: కృష్ణానదికి తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో విజయవాడ ప్రకాశం బ్యారేజీతో పాటు ఇబ్రహీంపట్నం ఫెర్రీ, సంగమం వద్ద నీటి మట్టం పెరిగింది. దీంతో పురపాలిక అధికారులు పలు చోట్ల హెచ్చరికలు బోర్డులను ఏర్పాటు చేశారు. పర్యాటకులు, పొరపాటున కూడా నదిలో దిగవద్దని, చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరిక చేశారు. దీంతో మత్స్యకారులు పడవలను ఒడ్డుకు చేర్చారు. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాన్ని చూసేందుకు వస్తున్న పర్యాటకులు కూడా సూచించిన ప్రాం తాల నుంచే నీటిని చూడాలని హెచ్చరికలు జారీ చేశారు. తహసీల్దారు వెంకటేశ్వర్లు, కమిషనర్ రమ్యకీర్తనలు ఆయా ప్రాంతాలను నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

భారత వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలకు క్రీడాకారులు



క్రీడాకారులతో భానుమూర్తిరాజు, శ్రీనివాసరావు తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని బలేవాడిలో ఈ నెల 25 నుంచి భారత్ స్కూల్ గేమ్స్ బాల బాలికల అండర్-15 జట్ల ఎంపిక పోటీలో పాల్గొనే రాష్ట్ర జట్లను సోమవారం పటమటలోని కేబీసీ జడ్పీహెచ్ స్కూల్ మైదానంలో ఎంపిక చేశామని ప్రధానోపాధ్యాయుడు వీవీఎన్ సత్యనారాయణ తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 46 మంది బాలురు, 41 మంది బాలికలు పోటీలకు హాజరైనట్లు చెప్పారు. జాతీయ స్కూల్ గేమ్స్ సమాఖ్య మార్గదర్శకాలకు అనుగుణంగా పోటీలు నిర్వహించి ప్రతిభ గల వారిని ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, వ్యాయామోపాధ్యాయులు ఎల్.దుర్గారావు, ఎస్.రమేష్ మైదానం ఏర్పాటు, భోజన, వసతి సమకూర్చారని వివరించారు. పోటీలను రాష్ట్ర స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యదర్శి జి.భానుమూర్తిరాజు పర్యవేక్షించినట్లు తెలిపారు.

★ **బాలుర విభాగంలో** అట్టాడ చరణ్, సుందర మహంతి సాయి సిద్ధార్థ (విశాఖ), వేములూరి కార్తీక్ (పశ్చిమ గోదావరి), ముడే చరణ్‌నాయక్ (అల్లూరి సీతారామరాజు), వసంతపల్లి నిరంజన్, షేక్ దస్తగిరి బాబా (చిత్తూరు), పోలిశెట్టి భార్గవ్ (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ), బట్టుల గౌతమ్‌కుమార్ (కాకినాడ) ఎంపికయ్యారు.

★ **బాలికల విభాగంలో** నూతక్కి సువర్ణ, సాధినేని నేహ (గుంటూరు), ఎప్పలపల్లి కుమారి, దున్న దేవిశ్రీ (తిరుపతి), గండి సృజన మహిమ (విశాఖ), రంగరాజు మేధశ్రీ (ఎన్టీఆర్), జడ్డు దీపిక, కంకిపాటి దేవి (విశాఖ) ఎంపికయ్యారు.

జంగం కులస్థుల సంక్షేమానికి కృషి



గొల్లపూడిలోని బీసీ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఛైర్మన్ వాసునూరి చంద్రశేఖర్

గొల్లపూడి, న్యూస్‌టుడే: జంగం కులస్థుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఏపీ జంగం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ వాసునూరి చంద్రశేఖర్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కలిగిరి మండలం కోటలకు చెందిన చంద్రశేఖర్‌ను ఏపీ జంగం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఇటీవల ప్రభుత్వం నియమించగా.. సోమవారం విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బీసీలకు తెదేపా ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని, ఏవిధమైన సంక్షేమం అందలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జంగం కులస్థులకు గుర్తింపు తీసుకొచ్చేలా పదవులు కేటాయించిందన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం పెద్దలు చప్పిడి గంగాధరం, పైడికొండల నాగేశ్వరరావు, బాలయ్య, ఆనందరావు, ఎం.రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులతో వర్సిటీ ఉపకులపతి ఆచార్య పీవీ రావు, బోస్ తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: సిద్ధార్థ అకాడమీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఆహ్వాన పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నీ సోమవారం ప్రారంభమైంది. కానూరులోని సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగే పోటీలను వర్సిటీ ఉపకులపతి ఆచార్య పీవీ రావు ప్రారంభించారు. టోర్నీలో మొత్తం ఎనిమిది జట్లు తలపడగా.. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ మేకా రమేష్ తెలిపారు. తొలి రోజైన సోమవారం జరిగిన మ్యాచ్‌ల్లో జైన్ వర్సిటీ (బెంగళూరు) జట్టు 86-62 తేడాతో లయోలా కళాశాల (చెన్నై) జట్టుపై, హిందూస్థాన్ వర్సిటీ (తమిళనాడు) జట్టు 86-62 తేడాతో క్రైస్ట్ కళాశాల (కేరళ) జట్టుపై, ఎస్‌బీ కళాశాల (కొట్టాయం) జట్టు 66-61 తేడాతో సిద్ధార్థ అకాడమీ (విజయవాడ) జట్టుపై, హిందూస్థాన్ వర్సిటీ (తమిళనాడు) జట్టు 86-62 తేడాతో క్రైస్ట్ కళాశాల (కేరళ) జట్టుపై, క్రైస్ట్ వర్సిటీ (బెంగళూరు) జట్టు 75-44 తేడాతో సిద్ధార్థ అకాడమీ జట్టుపై, ఎస్ఆర్ఎం వర్సిటీ (చెన్నై) జట్టు 54-47 తేడాతో ఎస్‌బీ కళాశాల (కొట్టాయం) జట్టుపై, క్రైస్ట్ కళాశాల (కేరళ) జట్టు 60-59 తేడాతో లయోలా కళాశాల (చెన్నై) జట్టుపై విజయం సాధించాయి. కార్యక్రమంలో ప్రొ-వైస్ ఛాన్సలర్ ఏవీ రత్నప్రసాద్, ఇండియన్ టీమ్ కోచ్ జీఆర్ఎల్ ప్రసాద్, జాతీయ బాస్కెట్‌బాల్ సమాఖ్య కోశాధికారి చెంగల్రాయుడు, శాప్ మాజీ ఛైర్మన్ పోలినేని అంకమ్మ చౌదరి, జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జీఎస్‌సీ బోస్, సిద్ధార్థ అకాడమీ అకడమిక్ అడ్వైజర్ ఎల్‌కే మోహన్‌రావు, డీన్ రాజేష్ సి.జంపాల తదితరులు పాల్గొన్నారు.



భారత్‌లో నా నాలుగేళ్లు..!

చదువు, మెరుగైన సంపాదనకోసం దేశ సరిహద్దులు దాటేవారు చాలామందే. క్రిస్టెన్ ఫిషర్... కూడా అంతే. అయితే తను అవకాశాల కోసం కాదు... సంస్కృతి మీద ప్రేమతో స్వదేశాన్ని వదిలింది. ఇంతకీ తనను అంతగా ఆకర్షించిన దేశమేంటో తెలుసా... మన భారత్.

క్రిస్టెన్‌ది అమెరికా. ఎనిమిదేళ్ల క్రితం సరదాగా భారత్‌కి వచ్చింది. ఇక్కడ గడిపిన మూడునెలల్లో భారతీయ కట్టడాల అందాలు, సంస్కృతీ సంప్రదాయాలతో ప్రేమలో పడింది. స్వదేశానికి వెళ్లి, ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చినా ఇక్కడ గడిపిన క్షణాలను మర్చిపోలేకపోయింది. దీంతో ఆస్తులన్నీ అమ్ముకొని వచ్చి దిల్లీలో స్థిరపడింది. 'దేశం కాని దేశంలో జీవించడమంటే సవాళ్లు మామూలే. కానీ భారత్‌మీద కలిగిన ప్రేమ వాటన్నింటినీ దాటేలా చేసింది. కాబట్టే, హిందీ నేర్చుకున్నా. స్థానిక వంటకాలకు అలవాటు పడ్డాం. చాలా మంది స్నేహితులను ఏర్పరచుకోవడమే కాదు, సొంతంగా వ్యాపారాన్నీ ప్రారంభించా. అన్నట్టూ మా మూడో పాప ఇక్కడే పుట్టింది' అని సంతోషంగా చెబుతుంది క్రిస్టెన్. అంతే కాదు, తనకు మొదట్నుంచీ ఒక స్పెషల్ చైల్డ్‌ని దత్తత తీసుకోవాలని ఉండేదట. కాళ్లు సరిగా లేని రెండేళ్ల భారతీయ పాపాయిని దత్తత తీసుకోవడమే కాదు, ఆ పాపకి సర్జరీనీ చేయించింది. 'ఇది నా ప్రయాణం' అంటూ క్రిస్టెన్ తన కథనంతా ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్ రూపంలో పంచుకోగా నెటిజన్ల మనసు గెలవడమే కాదు... వైరలైంది కూడా.

మహిళాసాధికారత, ఫ్రెండ్లీ పోలీసింగ్... వంటి మాటల్ని చెప్పడమే కాదు... ఆచరణలో చూపించాలనుకున్నారు నిర్మల్ పోలీసు బాస్ జానకీ షర్మిల. ఇందుకోసం తమ జిల్లాలో మహిళా పోలీసులను కార్యాలయ విధులకే పరిమితం చేయకుండా కీలకబాధ్యతలు అప్పగించారు. దాంతో వారంతా సివంగులై, పోలీస్ అక్కలుగా తమ నారీ శక్తిని చాటుతున్నారు.



సివంగులై... నారీశక్తి సంపన్నులై..!



ఆపదలో ఆదుకునే కమాండోలు...

జిల్లాలో కడెం, గడ్డెన్న, స్వర్ణ ప్రాజెక్టులు, ఆ పక్కనే శ్రీరాంసాగర్, గోదావరి నదితోపాటు అనేక చెరువులు ఉన్నాయి. మామూలు రోజుల్లో ఇక్కడి నీటి ప్రవాహం ఆకర్షిస్తుంది. వర్షాల వేళ భయపెడుతుంది. అలాంటి నీటిలో చిక్కుకున్నవారిని కాపాడాలంటే ఎంతో తెగింపు, మరెంతో ధైర్యం కావాలి. ఆపదల్లో చిక్కుకున్నవారికి రక్షణగా సివంగి బృందం పని చేస్తోంది. ఇందుకోసం ఇప్పటికే 16 మంది మహిళా కానిస్టేబుళ్లకు 45 రోజుల పాటు కమాండో తరహా శిక్షణ అందించారు. తాజాగా బాసర గోదావరిలో తాడు విసరడం, మునిగిపోయే వారిని పైకి లాగడం, బోట్ల సహాయంతో రక్షించడం, ప్రథమ చికిత్స అందించడం వంటి అంశాల్లో నిపుణులుగా మార్చారు. గతంలో మామడ అటవీ ప్రాంతంలో తప్పిపోయిన నలుగురి మహిళల్ని గుర్తించి వెనక్కి తీసుకొచ్చిందీ వీరే కావడం విశేషం.

'నారీశక్తి'ని చాటుతూ...

పెట్రోకార్, డయల్ 100, పాయింట్ బుక్ తనిఖీ, ఎండ్ ఆపరేటర్ వంటి పలు విధులను సాధారణంగా మగ పోలీసులే నిర్వహిస్తుంటారు. బాధ్యతల్లో కాస్త కఠినత్వం, సమయం సందర్భంతో సంబంధం లేకుండా వెళ్లాల్సి రావడమనే కారణాలతో వీటిని మహిళలకు కేటాయించేవారు కాదు. కానీ, 'నారీ శక్తి' పేరిట జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో వారంలో ఒకరోజు విధిగా మహిళా పోలీసులు ఈ తరహా విధులను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, ప్రజలకు అవగాహన, వాహన నోటీసులు చేపడుతున్నారు. గంజాయి గస్తీ పేరిట ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. భైంసా, ఖానాపూర్, లక్ష్మణచాంద, నిర్మల్ పరిధిలో డయల్ 100కు వచ్చిన కాల్స్ ఆధారంగా ఆత్మహత్యకు యత్నించిన పలువురిని మహిళా సిబ్బంది కాపాడటం గమనార్హం.

అండగా ఉండేందుకు.. 'పోలీసు అక్క'

కేజీబీవీల్లో సాధారణంగా పేద విద్యార్థినులుంటారు. తల్లిదండ్రులెవరైనా అనాథలే, తల్లీతండ్రీ ఎవరో ఒకరు దూరమైనవాళ్లో, వివిధ కారణాలతో బ్రేకప్ అయినవారో నివసిస్తుంటారు. ఇలాంటి వారికి ప్రాధాన్యమిస్తుంటారు. ఇలాంటి చోట్ల వారు వేధింపులకు గురవ్వకుండా ప్రతి కేజీబీవీకి ఒక మహిళా పోలీసు కానిస్టేబుల్‌ను కేటాయించారు. ఆమె ఓ అక్కలా వారంలో ఒకరోజు వాళ్లతో కలిసి తినడం, నిద్రించడం చేస్తారు. ఇలా వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తారు. ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులపై అవగాహన కల్పిస్తున్నారు. మానసిక ధైర్యం అందించడంతో పాటు అవసరాన్ని బట్టి కౌన్సెలింగ్ చేయిస్తారు. వారు భవిష్యత్తు లక్ష్యాలపై దృష్టిపెట్టేలా మార్గనిర్దేశం చేస్తారు.



అవకాశమిస్తే... అద్భుతాలు చూడొచ్చు

– డా. జి. జానకీ షర్మిల, ఎస్పీ

ఆడవాళ్లను తక్కువగా చూడొద్దు. సహకారం అందించగలిగితే ఎన్ని కఠిన పరిస్థితులు ఎదురైనా వారు రాణించగలుగుతారు. మా టీమ్ సివంగి, పోలీస్ అక్క, నారీశక్తి కార్యక్రమాలే దీనికి నిదర్శనం. కేవలం ఉద్యోగుల్లా కాకుండా రక్షకులుగా ఎదిగేందుకు, స్వావలంబనతో నాయకత్వ ప్రదర్శన చేపట్టేందుకు వారికి అవకాశం కల్పించాం. దాన్ని అందిపుచ్చుకుంటున్నారు. పోలీసు దుస్తుల్లో ఉన్న మహిళలను చూస్తే సమాజంలోని స్త్రీలకూ భరోసా పెరుగుతుంది. నిర్భయంగా, స్వేచ్ఛగా తమ సమస్యలు చెప్పుకొనేందుకు ముందుకొస్తారు. నేరరహిత సమాజ నిర్మాణంలో ఇది అవసరమని బలంగా నమ్ముతున్నా. మహిళా పోలీసుల శక్తిని చాటి చెప్పాలనుకున్నా.

– పెంటు రమేశ్, నిర్మల్

వసుంధర

vasundhara@eenadu.in

బిడ్డను ఇవ్వనంటున్నారు?

మా చెల్లికి ఆరేళ్ల క్రితం పెళ్లయ్యింది. గతేడాది తన భర్త రోడ్డు ప్రమాదంలో మరణించారు. అప్పటి నుంచి అత్తమామలు తనని వేధిస్తున్నారు. ఇప్పుడు మా చెల్లినీ, ఆమె బిడ్డను... పెళ్లికి ఇచ్చిన వస్తువులతో సహా తిరిగి తీసుకురావాలనుకుంటున్నాం. అయితే, వాళ్లు... బిడ్డను మాత్రం ఇవ్వం. కావాలంటే మీ అమ్మాయిని తీసుకెళ్లండి అంటున్నారు. ఇప్పుడు మేమేం చేయాలి?

– ఓ సోదరి

మీ చెల్లి బిడ్డను తీసుకునే హక్కు వారికి లేదు. ది గార్డియన్ అండ్ వార్డ్స్ యాక్ట్-1890 ప్రకారం తండ్రి, తల్లి సహజ సంరక్షకులు. తండ్రి లేకపోతే పూర్తి హక్కులతో తల్లే గార్డియన్ అవుతుంది. కొడుకు పోయిన దుఃఖంలో ఉండి కూడా అత్తింటివారు ఆమెను వేధించడానికి కారణమేంటి? మీ చెల్లికి పెళ్లప్పుడు ఇచ్చిన కట్నకానుకల్ని మీరు అడిగి తీసుకోవచ్చు. ఒకవేళ ఆమె తనను తాను పోషించుకోలేని స్థితిలో ఉంటే హిందూ అడాప్షన్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్‌లోని సెక్షన్-19 ప్రకారం తనకీ, తన కొడుక్కీ మెయింటెనెన్స్ ఇవ్వమని మామగారిని అడగవచ్చు. అయితే, సెక్షన్-23 ప్రకారం ఎంత మెయింటెనెన్స్ ఇవ్వాలనేది ఆయన ఆర్థిక పరిస్థితిని బట్టి నిర్ణయం అవుతుంది. లేదంటే మిమ్మల్ని వేధింపులకు గురి చేస్తున్నారని గృహహింస చట్టంలోని సెక్షన్-12 ప్రకారం కోర్టులో పిటిషన్ వేయవచ్చు. కోర్టుకి మీరు సమర్పించిన సాక్ష్యాల ఆధారంగా సెక్షన్ 20 కింద మీ ఆర్థిక అవసరాలకు తగ్గట్లు ఇవ్వమని ఆర్డర్ ఇవ్వొచ్చు. అంతేకాదు, సెక్షన్-21 కింద కస్టడీ ఆర్డర్స్, సెక్షన్-22 కింద మీకు రావలసిన కట్న కానుకలతో సహా శాశ్వత పరిహారం కూడా కోరవచ్చు. ముందుగా మధ్యవర్తులను కూర్చోబెట్టి మాట్లాడితే సమస్య పరిష్కారం అవుతుందేమో చూడండి.

ఆ పెళ్లికి చట్టబద్ధత కావాలంటే...

మా అక్క ఐర్లాండ్‌లో ఉంటోంది. ఆ జాతీయుడిని పెళ్లి చేసుకోవాలనుకుంటోంది. దానికి చట్టబద్ధత కావాలనుకుంటే ఇక్కడ హిందూ సంప్రదాయ పద్ధతిలో పెళ్లి చేసుకుంటే సరిపోతుందా? మరి ఇంకేవైనా అనుమతులు కావాలా? – ఓ సోదరి

మీ అక్క ఐర్లాండ్ దేశస్థుడిని తనకు నచ్చిన పద్ధతిలో వివాహం చేసుకోవచ్చు. అయితే, ఇండియన్ లా ప్రకారం చట్టబద్ధత కావాలంటే మాత్రం స్పెషల్ మ్యారేజ్ యాక్ట్- 1954 వర్తిస్తుంది. విదేశాల్లో ఉన్న భారతీయులు ఎవరైనా ఇతర దేశస్థుల్ని పెళ్లి చేసుకోవాలనుకుంటే ఈ చట్టం ప్రకారం రిజిస్టర్ చేయించుకోవాలి. ముఖ్యంగా స్పెషల్ మ్యారేజ్ యాక్ట్‌లోని సెక్షన్-4లో ఉన్న నిబంధనలకు లోబడి అంటే అప్పటికే పెళ్లి అయ్యి ఉండకూడదు.. వివాహ సమ్మతిని ఇచ్చే మానసిక స్థితి కలిగి ఉండాలి. అబ్బాయిలకు 21, అమ్మాయిలకు 18 సంవత్సరాలు నిండి ఉండాలి. రిజిస్ట్రేషన్‌కి ముందు నెలరోజులు భారతదేశంలో ఉండాలి. అప్పుడు మ్యారేజ్ రిజిస్ట్రార్ సంబంధిత తల్లిదండ్రులకు నోటీసులిచ్చి వారి అభ్యంతరాలను పరిశీలిస్తారు. ఈ వివాహ రిజిస్ట్రేషన్ భారతదేశంలోనే జరుగుతుంది. ఒకవేళ భవిష్యత్తులో విడాకులు, పిల్లల కస్టడీ, నల్లిటీ ఆఫ్ మ్యారేజ్ లాంటి సమస్యలు ఎదురైతే... ఈ స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ ప్రకారమే జరుగుతాయి.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

ఇయర్ ఫోన్ కాస్త తీస్తారా?



ఒకప్పుడు ఫోన్ ఛార్జింగ్ పెట్టడం మర్చిపోతే కంగారు పడేవారు అమ్మాయిలు. ఇప్పుడు ఇయర్ ఫోన్స్, ఇయర్ పాడ్స్ ఛార్జింగ్ లేకపోయినా అదే పరిస్థితి. బయట అడుగుపెడితే తప్పనిసరిగా అవసరమయ్యే వస్తువుల్లో ఇవీ చేరాయి మరి. ఆటో, బస్సు ఏదెక్కినా ఇవే నేస్తాలు. వాకింగ్‌కి వెళ్లినా, అంతెందుకు, వంట చేస్తున్నా కూడా బోర్ కొడుతోందంటూ వీటిని చెవిలో పెట్టేసుకుంటున్నారు. ఇక, ఆఫీసు సంగతైతే చెప్పనక్కర్లేదు. కొద్దిదూరం వెళ్లినా బ్లూటూత్‌తో పనిచేస్తాయి. అస్తమానూ ఫోన్ చేత్తో పట్టుకుని తీసుకెళ్లాల్సిన పనుండదనీ వీటిని చెవిలో దూర్చే ఉంచుతున్నారు. ఇక వర్క్ ఫ్రమ్ హోమ్... ఏకధాటిగా సాగే మీటింగ్‌లప్పుడూ ఇవి పనిచేయాల్సిందే. సౌకర్యం అని భావిస్తున్నారు కానీ... వాటితో ఎంత ప్రమాదమో గమనిస్తున్నారా? ఇటీవల ఒకామె ఏకధాటిగా కొన్ని గంటలు ఇలాగే ఇయర్ పాడ్స్‌ని చెవిలో ఉంచుకుందట. ఫలితం వినికిడి సమస్య ఎదురైంది. బోర్ కొడుతోంది, చెవిలో పాటలు మోగుతోంటే ఇంకాస్త మెరుగ్గా పనిచేయగలుగుతా అనుకుని ఇలాగే కొనసాగిస్తే చెవి మాత్రమే కాదు, మెదడు సంబంధిత సమస్యలూ వస్తాయి. కాబట్టి, చెవిలోంచి తీయండి. సౌండ్ కూడా వీలైనంత తక్కువ ఉండేలా చూసుకోండి. అత్యవసరమైతే గుర్తుంచుకొని అయినా ప్రతి అరగంటకోసారి పక్కన పెట్టండి. కనీసం 5-10 నిమిషాలు విరామం తీసుకున్నాకే తిరిగి పెట్టుకోండి. అలాగే వీటి శుభ్రతపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టండి. రోజూ ఇయర్ బడ్‌తోకానీ మెత్తని వస్త్రంతోకానీ తుడుస్తూ ఉంటే ఇన్‌ఫెక్షన్లూ దరిచేరవు. జాగ్రత్త వహిస్తారు కదూ!

'అమ్మ' పగ్గాలు ఆమెకి!

'మీ టూ' మొదలు, హేమా కమిటీ నివేదిక వరకూ అనేక సంచలనాలకు కేంద్ర బిందువైంది మలయాళ సినీ పరిశ్రమ. ఈ నేపథ్యంలో 'అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్(అమ్మ)'కు శ్వేతా మేనన్ అధ్యక్షురాలు కావడం కీలక పరిణామం. ఓ మహిళ ఈ పీఠాన్ని దక్కించుకోవడం ఇదే మొదటిసారి!

శ్వేత పుట్టింది చండీగఢ్‌లో. తండ్రి వైమానిక దళంలో అధికారి. 13 ఏళ్లకే సినిమాల్లోకి అడుగుపెట్టిన శ్వేత, 1991లో 17వ ఏట 'అనస్వరం'లో మమ్ముట్టి సరసన నటించింది. 1994లో 'ఫెమినా మిస్ ఇండియా ఆసియా పసిఫిక్' టైటిల్‌ని గెల్చుకుని జాతీయస్థాయి గుర్తింపు పొందింది. మోడల్‌గానూ రాణించింది. మలయాళంతోపాటు హిందీ, తమిళం, తెలుగుల్లో 100కుపైగా సినిమాల్లో నటించింది. మాలీవుడ్‌లో తన సెకండ్ ఇన్నింగ్స్‌లో నటిగా విజయవంతమైంది. పాలేరి మాణిక్యం(2009), సాల్ట్ అండ్ పెప్పర్(2011) సినిమాలకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ నటి అవార్డులు అందుకుంది.

అక్రమాలపై గొంతెత్తి...

అక్రమాలపై గొంతు విప్పడంలోనూ ముందుంటుంది శ్వేత. అనుమతి లేకుండా ఓ ఫార్మా కంపెనీ ప్రచారానికి తన ఫొటో వాడటంపైన 2011లో శ్వేత కేసు పెట్టడంతో ఆ కంపెనీ ఎండీని అరెస్టు చేశారు. ఒక ఎంపీ తనతో అసభ్యంగా ప్రవర్తించారంటూ 2013లో పోలీసు కేసు పెట్టింది. సదరు ఎంపీ క్షమాపణలు చెప్పడంతో కేసును ఉపసంహరించుకుంది. ఓ యువ నటిపై అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న నటుడు, నిర్మాత విజయ్ బాబుపై 'అమ్మ' నాయకత్వం చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ 2022లో 'అమ్మ' అంతర్గత ఫిర్యాదుల కమిటీ సభ్యత్వానికి రాజీనామా చేసింది. నటీమణులు మాలా పార్వతి, కుకూ పరమేశ్వరన్ ఆమె బాటలోనే నడిచారు. 2017లో నటి భావన మేనన్ కిడ్నాప్, దాడి కేసు సంచలనమైంది. ఆపై పరిశ్రమలో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడుల గురించి 'హేమా కమిటీ నివేదికలో బహిర్గతమైన నేపథ్యంలో 'అమ్మ' అధ్యక్షుడిగా మోహన్‌లాల్ సహా కమిటీ సభ్యులంతా ఏడాది కిందట రాజీనామా చేశారు. ఆ నివేదికలోని అంశాల్ని మరింత బలంగా వినిపిస్తూ వచ్చిన శ్వేత... చివరకు ఎన్నికల బరిలో దిగింది. ఈ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు ఈమెను ప్రత్యర్థులు కొన్ని కేసుల్లో ఇరికించే ప్రయత్నమూ చేశారు. ప్రస్తుతం వాటిపై హైకోర్టు స్టే ఇచ్చింది. నిజ జీవితంలోనూ సవాళ్లూ, ఒత్తిళ్లకు ఎదురు నిలిచి, గెలిచి అసలైన కథానాయిక అనిపించుకుంది శ్వేత.



ఈ ఎన్నికల్లో కుకూ ప్రధాన కార్యదర్శిగా, లక్ష్మీ ప్రియ ఉపాధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. దీంతో కొత్త కార్యవర్గంపైన అంచనాలు ఎక్కువయ్యాయి. మహిళలపైన ఉన్న వివక్షను పోగొట్టడం సహా, ఎన్నో సంస్కరణలు వస్తాయని ఆశిస్తున్నారు. ఇక్కడి మార్పు ప్రభావం సినిమా పరిశ్రమపైనే కాదు, అన్ని పరిశ్రమల్లోనూ ఉంటుందనడంలో సందేహం లేదు.

మీకు తెలుసా

పురుషుల్లో సాధారణ హృదయ స్పందనలు నిమిషానికి 70- 72 మధ్య ఉంటే... మహిళల్లో 78- 82 మధ్య ఉంటాయట. మగవారితో పోలిస్తే మహిళల్లో గుండె పరిమాణం చిన్నగా ఉండటమే ఇందుకు కారణమట.

బంగారం - వెండి

18న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,02,430	93,150	1,17,379
విజయవాడ	99,830	95,530	1,17,800
ప్రొద్దుటూరు	1,00,700	92,640	1,17,300
రాజమహేంద్రవరం	1,01,180	92,750	1,27,000
విశాఖపట్నం	1,00,820	92,750	1,25,000
తమిళనాడు	-----	92,750	1,27,000

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.









నగా నట్రా

మినీ హారం... చూడముచ్చటగా!

అమ్మాయిలకు ఆభరణాలంటే ఎంతిష్టమో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఎన్నిరకాలున్నా కొత్త రకం నగ కోసం వెతుకుతూనే ఉంటారు. అందుకే, తయారీదారులు కూడా ఎప్పటికప్పుడు నయా డిజైన్లతో మార్కెట్‌లోకి వస్తుంటారు. సరికొత్త ట్రెండ్‌లను సృష్టిస్తుంటారు. అలా ఇప్పుడు మినీ హారాలు సందడి చేస్తున్నాయి. ఎన్నో రకాలు ఉండగా... ఈ మినీ హారమేంటనేగా మీ సందేహం. చోకర్‌లూ, కంటెలు, నెక్లెస్‌లు, కాలర్‌బోన్ పై వరకూ ఉంటే, హారం కాస్త పొడవుగా ఉంటుంది. దాంతో వీటిని ఒకదానికొకటి జతగా ఎంచుకోవడం అలవాటైపోయింది. కానీ, ఇప్పుడు ఈ స్టైల్‌కి భిన్నంగా మినీ హారం ఉంటోంది. నెక్లెస్ కంటే పొడవుగా, హారం కంటే పొట్టిగా... ఈ రెండింటి అవసరాలనూ తీర్చేటట్లుగా డిజైన్ చేస్తున్నారు. ఇవి చీరల మీదకే కాదు, లెహెంగాలు, పట్టు కుర్తీలు... ఇలా అన్నింటి మీదకూ నప్పేస్తున్నాయి. మీరూ వాటినోసారి చూడండి.











జంగిల్ కథలు... చూడాల్సిందే!

అనగనగా ఓ అడవి. అదంతా చిరుత పులుల సామ్రాజ్యం. రాజస్థాన్‌లోని ఝాలానాలో ఉంది. దానికి రాజు బహాదూర్. అతనికో కొడుకు రాణా, మహా సోమరి. క్రమేణా అన్నీ నేర్చుకుంటాడు. బలశాలిగా మారతాడు. తరవాత రాజ్యాన్ని సొంతం చేసుకునేందుకు తండ్రిమీదే యుద్ధం ప్రకటిస్తాడు. ఇదంతా 'రైజ్ ఆఫ్ రాణా' అనే డాక్యుమెంటరీ ఫిల్మ్ కథ. ఓ యువ చిరుత ఎదిగే క్రమాన్నీ అధికారం, ఆధిపత్యంకోసం తండ్రి చిరుతను సవాల్ చేయడాన్నీ ఎంతో హృద్యంగా చిత్రీకరించి వార్తల్లో నిలిచిందీ వైల్డ్ ఫొటోగ్రాఫర్ కమ్ చిత్ర దర్శకురాలు ఐశ్వర్యా శ్రీధర్.



మహారాష్ట్రలోని పన్వేల్‌లో పుట్టి పెరిగింది ఐశ్వర్య. మధ్య తరగతి తమిళ కుటుంబం. చిన్నప్పటి నుంచీ ప్రకృతిలో గడపడం ఇష్టం. తండ్రి శ్రీధర్ రంగనాథన్ ప్రకృతి ప్రేమికుడు. ఆయనతో కలిసి తరచూ మహారాష్ట్రలోని రత్నగిరి అడవుల్లోకి ట్రెక్కింగ్‌కి వెళ్లేది. అలా పదమూడేళ్ల వయసులోనే ఫొటోగ్రఫీతో ప్రేమలో పడింది. అక్కడ కనిపించే ప్రతి అందాన్నీ పక్షుల్నీ జంతువుల్నీ కెమెరాలో బంధించేది. శాంక్చువరీ ఆసియాకు చెందిన యంగ్ నేచురలిస్ట్ అవార్డు సహా లండన్, నేచురల్ హిస్టరీ మ్యూజియం అందించే 'వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్(2020)' వరకూ ఎన్నో అవార్డుల్ని గెలుచుకుంది. అప్పట్లో ఓసారి ట్రెక్కింగ్‌కి వెళ్లినప్పుడు- చిన్నపాటి గెలాక్సీని తలపిస్తూ మిణుగురులు ఓ చెట్టును అలుముకున్న దృశ్యాన్ని క్లిక్‌మనిపించిన ఫొటోకి ఈ అవార్డుని అందుకుంది. దీన్ని అందుకున్న తొలి భారతీయ మహిళ కూడా.



తాడోబా, కన్హా, పెరియార్, గిర్, సాత్పురా... ఇలా ఆమె వెళ్లని అభయారణ్యం, జాతీయ ఉద్యానవనం లేదనే చెప్పాలి. ఓసారి తాడోబా నేషనల్ పార్కుకి వెళ్లినప్పుడు- తల్లి పులి చిన్న నీటిగుంట దగ్గర కూర్చుని విశ్రాంతి తీసుకుంటోంది. పది నెలల వయసున్న పులిపిల్లలు ఆ నీళ్లలో ఆడుతున్నాయి. ఉన్నట్టుండి అది మావైపు అడుగులేసింది. ఒక్క క్షణంలోనే మాకు అరవై అడుగుల దూరంలో గడ్డిమేస్తోన్న అడవిదున్న మీదకి ఉరికి, దాని వెనక కాళ్లను విరిచి ఓ చిన్న కేక వేసింది. పిల్లల్ని పిలిచి మిగిలిన పని పూర్తిచేయమన్నదే ఆ పిలుపు వెనకున్న అర్థం. పులి తన పిల్లలకు నేర్పే తొలి పాఠం అన్నమాట. తల్లి సందేశం అందుకున్న ఆ పిల్లలు తరవాత ఆ జంతువును కొరికి చంపేశాయి' అంటూ తన తొలి నాటి అనుభవాల్ని చెబుతుంటుంది ఐశ్వర్య. ఇదే కాదు, ఇలాంటి ఎన్నో భయానక ఘటనల్ని ఆమె తన కెమెరాలో చిత్రీకరిస్తుంటుంది.

ఆ మూడు జంతువులతో...

'పంజె- ద లాస్ట్ వెట్ ల్యాండ్' పేరుతో తీసిన మరో డాక్యుమెంటరీ జాతీయ సైన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌'తోపాటు అనేక చలనచిత్రోత్సవాల్లోనూ, దూరదర్శన్‌లోనూ ప్రదర్శితమైంది. తాజా చిత్రం 'రాణా' ఐరోపా వీక్షకుల్ని ఆకట్టుకుంటోంది. 'క్వీన్ ఆఫ్ తారు'లోని మాయా అనే పులినీ అద్భుతంగా చిత్రించింది. ఇలా మనదేశంలోని పులి, సింహం, చిరుతల గురించి చిత్రాలు తీస్తూ వాటి భావోద్వేగాలనూ తెలివితేటల్నీ చిత్రీకరిస్తోంది ఐశ్వర్య. ఇందుకోసం అడవిలోనే ఎంతో ఓపికగా ఏళ్ల పాటు జీవిస్తుంటుంది. చిత్తడి నేలల సంరక్షణలో ఆమె చేసిన కృషికి ప్రిన్సెస్ డయానా ఫౌండేషన్ అవార్డునీ అందుకుంది. బాంబే స్టూడియోస్ సీఈఓ, నేషనల్ జియోగ్రఫిక్ అన్వేషకురాలు, కవయిత్రి కూడా. 'అడవి కేవలం క్రూర మృగాల ఆవాసం కాదు. ఎన్నో వాస్తవిక కథలకు వేదిక. మానవ చొరబాటుతో ఆ అడవి ప్రాణులకు నష్టం కలగకుండా వాటి సంరక్షణ పట్ల అవగాహన కలిగించడమే తన ధ్యేయ'మంటోందీ యంగ్ వైల్డ్ ఫొటోగ్రాఫర్.

(నేడు వరల్డ్ ఫొటోగ్రఫీ డే)

వినాయకుడి మండపానికి రూ.474 కోట్ల బీమా



ముంబయి: గణపతి నవరాత్రి ఉత్సవాల కోసం ముంబయిలో ఏర్పాటు చేసిన ఓ గణేశ్ మండపానికి ఏకంగా రూ.474.46 కోట్లకు బీమా చేయించినట్లు సమాచారం. ఇక్కడి మతుంగా ప్రాంతంలో గల జీఎస్‌బీ సేవామండల్ వినాయక చవితి వేడుకలను నిర్వహిస్తోంది. ఈసారి విఘ్నేశ్వరుడి మండపానికి రూ.474.46 కోట్లకు బీమా చేయించారట. ఇక్కడి విగ్రహాన్ని భారీ ఎత్తున బంగారం, వెండి ఆభరణాలతో అలంకరించనుండటమే అందుకు కారణం. గణేశుడి ఈ మండపానికి రూ.400.58 కోట్లకు బీమా చేయించారు. ప్రస్తుతం పూజారులు, నిర్వాహకులు, సహాయకులు, భద్రతా సిబ్బందికి రూ.375 కోట్ల వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకున్నారు. గణపయ్యను అలంకరించే బంగారం, వెండి, ఆభరణాలకు రూ.67 కోట్ల బీమా వర్తించనుంది. అగ్ని ప్రమాదం, భూకంపం ముప్పు వంటి వాటికోసం ప్రత్యేకంగా మరో రూ.2కోట్ల బీమా తీసుకున్నారు. పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్ కోసం సుమారు రూ.30 కోట్లు కేటాయించారు.

సూరత్‌లో రూ.25 కోట్ల వజ్రాల చోరీ



సూరత్: గుజరాత్‌లో రూ.25 కోట్ల విలువైన వజ్రాల చోరీ జరిగింది. సూరత్‌లోని కపోద్రా ప్రాంతంలో డీకే అండ్ సన్స్ డైమండ్ కంపెనీ ఆఫీస్ కమ్ పాలిషింగ్ యూనిట్‌లో ఈ నెల 15 నుంచి 17 మధ్య ఈ సంఘటన జరిగింది. కంపెనీకి వరుసగా మూడురోజులు సెలవులు ప్రకటించడంతో దుండగులు మొదటగా కంపెనీ కింది అంతస్తులోని ప్రధాన ప్రవేశమార్గాన్ని బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించారు. ఆ తర్వాత లోహ బీరువా గల మూడో అంతస్తుకు వెళ్లి దానిని గ్యాస్ కట్టర్‌తో కత్తిరించి వజ్రాలను దోచుకెళ్లారు. సెలవుల అనంతరం సోమవారం కంపెనీ యూనిట్ యజమాని కార్యాలయానికి వెళ్లగా ఈ విషయం బయటపడింది. దాదాపు రూ.25 కోట్లు విలువ చేసే వజ్రాలు దోపిడీకి గురైనట్టు ప్రాథమిక దర్యాప్తులో అంచనా వేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ అలోక్ కుమార్ తెలిపారు.

జవాన్‌పై టోల్‌గేట్ సిబ్బంది దాడి

● టోల్ ఏజెన్సీకి రూ.20 లక్షల జరిమానా



మేరఠ్: ఆర్మీ జవాన్‌పై టోల్‌గేట్ సిబ్బంది దాడి చేసిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. రాష్ట్రానికి చెందిన కపిల్ కవాడ్ సైనికుడిగా పని చేస్తున్నారు. సెలవులకు సొంత రాష్ట్రానికి వచ్చి తిరిగి ఆదివారం రాత్రి శ్రీనగర్‌కు బయల్దేరారు. కుటుంబసభ్యులతో కలిసి దిల్లీ విమానాశ్రయానికి వెళ్తున్న సమయంలో మేరఠ్‌లోని భూని టోల్‌గేట్ వద్ద వాహనాలను ముందుకు పంపడంలో అక్కడి సిబ్బంది ఆలస్యం చేస్తుండటాన్ని ప్రశ్నించారు. ఈ విషయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో టోల్ సిబ్బంది కపిల్‌ను స్తంభానికి కట్టేసి.. కర్రలతో కొట్టారు. జవాను ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడికి పాల్పడిన ఆరుగురు సిబ్బందిని అరెస్టు చేశారు. ఈ దాడిని ఖండించిన ఎన్‌హెచ్‌ఏఐ టోల్ వసూలు ఏజెన్సీకి రూ.20 లక్షల జరిమానా విధించింది.

రహదారి దారుణంగా ఉంటే టోల్ ఎందుకు కట్టాలి

ప్రశ్నించిన సుప్రీంకోర్టు

దిల్లీ: కేరళలోని త్రిశ్శూర్‌లో 65 కిలోమీటర్ల పొడవున్న జాతీయ రహదారిపై ప్రయాణానికి 12 గంటలు పట్టే పరిస్థితి ఉన్నప్పుడు రహదారి వాడకందారులు టోల్ రుసుము ఎందుకు చెల్లించాలని సుప్రీంకోర్టు సోమవారం ప్రశ్నించింది. పల్లియెక్కర టోల్ ప్లాజా వద్ద టోల్ సేకరణను నాలుగు వారాల పాటు సస్పెండ్‌చేస్తూ కేరళ హైకోర్టు వెలువరించిన ఉత్తర్వులను సవాలుచేస్తూ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ), గురువాయూర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లు దాఖలుచేసిన పిటిషన్ విచారణకు చేపడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ రహదారిపై ఒక లారీ బోల్తా పడిన కారణంగా రాకపోకలు స్తంభించిపోయాయి. “రహదారి ఒక చివర నుంచి మరో చివరకు చేరడానికి సాధారణంగా ఒక గంట పడుతుంది. కానీ వాడకందారులకు 12 గంటలు పడుతున్నప్పుడు ఆ వాడకందారు రూ.150 టోల్ రూపంలో ఎందుకు చెల్లించాలి?” అని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు.



గతం చేతిలో బందీగా మారొద్దు

జీవితంలో
అనునిత్యం సానుకూల
ఆలోచనా ధోరణిని కలిగి
ఉండాలనుకుంటున్నారా? అయితే
అందుకు అత్యుత్తమ మార్గం ఏంటో
తెలుసా..? నిన్నటి చేతిలో బందీగా
మారకుండా, నిరంతరం ముందుకు
సాగుతూ ఉండటమే! మీ గతానికి
మీరు అవసరం లేదు. కానీ
భవిష్యత్తుకు అవసరం. గతం గురించి
చింతిస్తూ కూర్చోకుండా.. భవిష్యత్తుకు
వైతాళికుడిగా మారండి.
– క్రిస్, మైండ్‌సెట్ కోచ్

రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాలు లక్ష్యం

‘ప్రధానమంత్రి వికసిత్ భారత్ ఉపాధి యోజన’ ప్రారంభం



దిల్లీ: ఉద్యోగాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. ‘ప్రధానమంత్రి వికసిత్ భారత్ ఉపాధి యోజన’ పేరిట పోర్టల్‌ను ప్రారంభించింది. సంస్థల యజమానులు, తొలిసారి ఉద్యోగంలో చేరేవారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ఈ ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకానికి కేంద్ర క్యాబినెట్ జులై 1న ఆమోదం తెలిపింది. పథకం ద్వారా రూ.లక్ష కోట్లతో రెండేళ్ల కాలం (2025 ఆగస్టు 1 - 2027 జులై 31)లో 3.5 కోట్లకుపైగా ఉద్యోగాలు కల్పించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పథకంలో పార్ట్-ఏ, పార్ట్-బీ అని రెండు భాగాలు ఉంటాయి. పార్ట్-ఏ కింద మొదటిసారి ఉద్యోగంలో చేరిన వారికి, పార్ట్-బీ కింద యజమానులకు ప్రోత్సాహకాలు అందుతాయి.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

భవిష్యత్తు తరం సంస్కరణలపై ప్రధాని కీలక భేటీ

దిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ ప్రకటించిన భవిష్యత్తు తరం సంస్కరణల రూపకల్పనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ మొదలుపెట్టింది. సంబంధిత ప్రణాళికలపై చర్చలు జరిపేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన సోమవారం కీలక సమావేశం జరిగింది. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, శివరాజ్ సింగ్ చౌహాన్, పీయూష్ గోయల్, లలన్ సింగ్‌లతో పాటు వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, ఆర్థికవేత్తలు ఇందులో పాల్గొన్నారు. ప్రజల జీవన సౌలభ్యం, వ్యాపార సౌలభ్యం, శ్రేయస్సులకు ఊతమిచ్చేలా అన్ని రంగాల్లోనూ వేగవంతంగా సంస్కరణలు చేపట్టేందుకు కేంద్రం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ ‘ఎక్స్’లో పేర్కొన్నారు.

అలాస్కాలో ఏమైందంటే..

మోదీకి ఫోన్ చేసి వివరించిన పుతిన్



దిల్లీ: ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు అలాస్కా వేదికగా ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిపిన చర్చల వివరాలను తెలిపేందుకు భారత ప్రధాని నరేంద్రమోదీకి సోమవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఫోన్ చేశారు. మాస్కో నుంచి చమురును కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై ఇటీవల అమెరికా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. యుద్ధాన్ని ఆపేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే ఆ సుంకాలను అగ్రరాజ్యం తొలగించే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్‌తో జరిగిన చర్చల సారాంశాన్ని మోదీతో పుతిన్ పంచుకోవడం గమనార్హం. రష్యా అధ్యక్షుడు మాట్లాడిన విషయాన్ని ప్రధాని ‘ఎక్స్’ వేదికగా తెలిపారు. “నా స్నేహితుడు పుతిన్ ఫోన్ చేశారు. అలాస్కాలో ట్రంప్‌తో జరిగిన సమావేశానికి సంబంధించిన వివరాలు పంచుకున్నారు” అని పేర్కొన్నారు.



దిల్లీలో ప్రధాని మోదీని కలిసిన ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్

రాధాకృష్ణన్‌కు మద్దతివ్వండి

● ఖర్గేకు రాజ్‌నాథ్ ఫోన్

● దిల్లీ చేరుకున్న ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి

దిల్లీ, పట్నా: ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ప్రకటించిన ఎన్డీయే ఆ ఎన్నికను ఏకగ్రీవం చేయాలని భావిస్తోంది. ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఫోన్ చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఎన్డీయే అభ్యర్థికి మద్దతివ్వాలని ఖర్గేను రాజ్‌నాథ్ కోరినట్లు సమాచారం. రెండుసార్లు తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి లోక్‌సభ ఎంపీగా విధులు నిర్వర్తించిన రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని ఇప్పటికే విపక్షాలకు భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా విజ్ఞప్తి చేశారు.

రాజ్‌నాథ్ పర్యవేక్షణ.. ఏజెంట్‌గా కిరణ్ రిజిజు

ఎన్డీయే తరఫున ఉపరాష్ట్రపతి ఎన్నికను రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పర్యవేక్షిస్తారని తెలిసింది. పోలింగ్ ఏజెంట్‌గా పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వ్యవహరిస్తారని సమాచారం. మరోవైపు సోమవారం దిల్లీ చేరుకున్న రాధాకృష్ణన్.. ప్రధాని నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సాయంత్రం జరిగిన ఎన్డీయే నేతల భేటీలో రాధాకృష్ణన్‌ను సన్మానించారు.

ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థిపై నేడు ప్రకటన!

● ప్రచారంలో డీఎంకే నేత తిరుచ్చి శివ, ఇస్రో శాస్త్రవేత్త పేర్లు



తిరుచ్చి శివ

దిల్లీ: ప్రతిపక్షాల తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎవరనేది మంగళవారం తేలనుంది. తమ అభ్యర్థిని నిర్ణయించేందుకు విపక్ష నేతలు ఈ నెల 19న మధ్యాహ్నం 12.30కు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో మరోసారి భేటీ కానున్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా దక్షిణ భారతదేశానికి చెందిన వ్యక్తిని ఎంపిక చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. తమ తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్‌ను ఎన్డీయే ప్రకటించిన నేపథ్యంలో ఇండియా కూటమి కూడా దక్షిణాది వ్యక్తికి అవకాశం ఇవ్వచ్చని అంచనా. వాస్తవానికి సోమవారం సాయంత్రం కూడా పలువురు ప్రతిపక్ష నేతలు ఖర్గేతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తమిళనాడుకు చెందినవారితో పాటు పలువురి పేర్లపై చర్చ జరిగింది. దేశంలోని రెండో అత్యున్నత రాజ్యాంగ పదవికి రాజకీయాలతో సంబంధంలేని వ్యక్తిని అభ్యర్థిగా నిలబెట్టాలని ఇండియా కూటమి నాయకులు భావిస్తున్నారని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు తమిళనాడుకు చెందిన ఓ శాస్త్రవేత్త(ఇస్రో) పేరును డీఎంకే సీనియర్ నేతలు సమావేశంలో ప్రతిపాదించినట్టు తెలిపాయి. తమిళనాడుకే చెందిన డీఎంకే నేత తిరుచ్చి శివ పేరు కూడా ప్రచారంలో ఉంది. దీనిపై మాట్లాడేందుకు నిరాకరించిన శివ.. ఈ విషయంలో తమ పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ కూడా అభ్యర్థిని ప్రతిపాదించేందుకు ప్రయత్నిస్తోంది. సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, టీఎంసీ ఎంపీ డెరిక్ ఓబ్రియెన్, ఎస్పీ నేత రాంగోపాల్ యాదవ్, డీఎంకే నేత కనిమొళి, జేఎంఎం లోక్‌సభ నేత విజయ్ హన్సదా తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ముంబయిని ముంచెత్తిన వర్షాలు

8 గంటల్లో 177 మి.మీ. వర్షపాతం ● రెడ్ అలర్ట్ జారీ



ముంబయిలో నీట మునిగిన రహదారి

ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయితోపాటు శివారులోని పలు జిల్లాలను సోమవారం భారీ వర్షాలు ముంచెత్తాయి. దీంతో పలు ప్రాంతాలు, రహదారులు జలదిగ్బంధం కావడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ముంబయిలో 8 గంటల వ్యవధిలో 177 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ చెప్పారు. నగరంలోని పలు ప్రాంతాల్లో 9 గంటల వ్యవధిలో 100 మి.మీ.కు పైగా వర్షం కురిసినట్లు భారత వాతావరణ విభాగం(ఐఎండీ) తెలిపింది. వర్షాల కారణంగా గత రెండ్రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఏడుగురు మరణించినట్లు ఫడణవీస్ వెల్లడించారు. ముంబయిలో 21వ తేదీ వరకూ వర్షాలు మరింత ఉద్ధృతంగా కురిసే పరిస్థితి ఉండటంతో ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఠాణె, పాల్ఘర్ జిల్లాలకూ అదే హెచ్చరిక చేసింది. దీంతో పాఠశాలలు, కళాశాలలకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. కొంకణ్ ప్రాంతంలోని పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్లు అధికారులు పేర్కొన్నారు. నవీ ముంబయిలో ఒక వ్యక్తి గల్లంతైనట్లు అధికారులు చెప్పారు. నాందేడ్ జిల్లాలో సుమారు 200 మంది వరదల్లో చిక్కుకుపోయినట్లు తెలిపారు.

చిన్న నేరాలకు శిక్షల నుంచి ఊరట

● లోక్‌సభలో జన్ విశ్వాస్ బిల్లు 2.0

● పరిశీలనకు సెలెక్ట్ కమిటీకి నివేదన



లోక్‌సభలో విపక్ష సభ్యుల ఆందోళన

దిల్లీ: చిన్నచిన్న నేరాలను నేరరహితం (డీక్రిమినలైజ్) చేసేందుకు ఉద్దేశించిన జన్ విశ్వాస్ బిల్లు 2.0ను కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. మొత్తం 288 నేరాలను దీనిలో చేర్చింది. 2023లో ఇలా 183 నేరాలను జన్ విశ్వాస్ బిల్లు ద్వారా తొలగించారు. సులభతర జీవనాన్ని ప్రోత్సహించి, వ్యాపార అనుకూల వాతావరణాన్ని మెరుగుపరిచేందుకు ఇప్పుడు రెండో బిల్లును ప్రవేశపెడుతున్నట్లు వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. బిహార్‌పై విపక్షాల నిరసనల మధ్య ఈ బిల్లును సమగ్ర పరిశీలన నిమిత్తం లోక్‌సభ సెలెక్ట్ కమిటీకి నివేదించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు మొదలయ్యే మొదటిరోజున నివేదిక అందించాల్సి ఉంటుంది. 1988 మోటారు వాహనాల చట్టం, 1950 రోడ్డు రవాణా సంస్థల చట్టం, 2009 తూనికలు-కొలతల చట్టం, 1940 ఔషధాలు-సౌందర్య ఉత్పత్తుల చట్టం వంటివాటి కిందికి వచ్చే కొన్ని నేరాలకు శిక్షలు తొలగించడం బిల్లు ఉద్దేశం. పరిధితో సంబంధం లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడైనా వాహనాల నమోదు, గడువు ముగిసిన తర్వాత డ్రైవింగ్ లైసెన్సు పునరుద్ధరణకు దరఖాస్తు చేస్తే అది జరిగే తేదీ నుంచి వర్తించేలా చెల్లుబాటు గడువు నిర్ణయించడం వంటివి దీనిలో ఉన్నాయి. దీనికోసం 355 నిబంధనల్ని సవరించనున్నారు. మొత్తంగా 10 మంత్రిత్వ శాఖలకు చెందిన 16 కేంద్ర చట్టాల్లో సంస్కరణలను బిల్లులో ప్రతిపాదించారు. తొలిసారి నిబంధనలను ఉల్లంఘించినవారికి సూచనలు, హెచ్చరికలు జారీచేయడం దీనిలో ఒకటి. చిన్నచిన్న, సాంకేతికపరమైన, ప్రక్రియలతో ముడిపడిన నేరాలకు జైలుశిక్ష బదులు అపరాధ రుసుం విధించడం మరొకటి. న్యాయవ్యవస్థపైనా భారం తగ్గించేలా వీటిని నిర్ణయిస్తారు.

ఎస్ఐఆర్‌పై పార్లమెంటు ఆవరణలో నిరసన

బిహార్ ఎస్ఐఆర్ అంశంపై ఇండియా కూటమి ఆధ్వర్యంలో పలువురు విపక్ష సభ్యులు పార్లమెంటు ఆవరణలో నిరసనలు తెలిపారు. వీరికి రాజ్యసభ విపక్షనేత మల్లికార్జున ఖర్గే నేతృత్వం వహించారు. కాంగ్రెస్, తృణమూల్, వామపక్షాలు, ఆర్జేడీ, సమాజ్‌వాదీ తదితర పార్టీల సభ్యులు పాల్గొన్నారు.

దిల్లీలో 32 పాఠశాలలకు బాంబు బెదిరింపులు

తనిఖీల్లో ఏమీ దొరకలేదన్న పోలీసులు



బాంబు బెదిరింపుతో దిల్లీలోని ద్వారకలో ఓ పాఠశాల వద్ద గుమిగూడిన విద్యార్థుల తల్లిదండ్రులు

దిల్లీ: దేశరాజధాని దిల్లీ బాంబు సోమవారం బెదిరింపులతో ఉలిక్కిపడింది. నగరంలోని 32 పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో ముందు జాగ్రత్త చర్యగా విద్యార్థులను ఇళ్లకు పంపించారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.25 వరకూ ఆయా స్కూళ్ల నుంచి బాంబు బెదిరింపుల ఈ-మెయిళ్లపై తమకు ఫోన్లు వచ్చాయని దిల్లీ అగ్నిమాపక విభాగం వెల్లడించింది. వెంటనే బాంబు నిర్వీర్యక దళం, డాగ్ స్క్వాడ్‌లతో కలిసి దిల్లీ పోలీసు బృందాలు పాఠశాలలకు చేరుకుని తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా ఎటువంటి అనుమానిత వస్తువులూ దొరకలేదని పోలీసులు తెలిపారు. చివరకు అవన్నీ ఉత్తుత్తి బెదిరింపులని తేలినట్టు వెల్లడించారు. ద్వారక ప్రాంతానికి చెందిన పాఠశాలలకు ఎక్కువ బెదిరింపులు వచ్చాయన్నారు. బాంబు బెదిరింపు మెయిళ్లు వచ్చిన ఐపీ అడ్రస్‌లను గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

దిల్లీలో ఎలక్ట్రానిక్స్ స్టోర్‌లో మంటలు నలుగురు సిబ్బంది మృతి

దిల్లీ: పశ్చిమ దిల్లీలో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఓ ఎలక్ట్రానిక్స్ దుకాణంలో మంటలు చెలరేగడంతో నలుగురు సిబ్బంది మరణించారు. మరొకరు గాయపడ్డారు. నాలుగు అంతస్తుల భవనంలోని మొదటి అంతస్తులో గల మహాజన్ ఎలక్ట్రానిక్స్‌కు చెందిన గిడ్డంగిలో తొలుత మొదలైన మంటలు తర్వాత రెండో అంతస్తుకు వ్యాపించాయి. దీంతో చెలరేగిన పొగ నుంచి తప్పించుకోలేక నలుగురు సిబ్బంది స్పృహకోల్పోయారు. వారిని స్థానిక ఆసుపత్రికి తరలించగా ఊపిరాడక అప్పటికే వారు మరణించినట్టు వైద్యులు ప్రకటించారు. మరో వ్యక్తికి చికిత్స అందిస్తున్నారు. అయిదు అగ్నిమాపక శకటాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. ప్రమాదానికి కారణం తెలియరాలేదు.

ఎయిరిండియా విమానంలో మళ్లీ సాంకేతిక లోపం

రద్దైన జ్యూరిక్-దిల్లీ సర్వీసు

ముంబయి: ఎయిరిండియా విమానంలో మళ్లీ సాంకేతిక సమస్య తలెత్తింది. జ్యూరిక్ నుంచి దిల్లీ వెళ్లాల్సిన ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య రావడంతో ఈ నెల 17న నిలిపివేశామని అధికారులు తెలిపారు. ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ విమానాలను ఏర్పాటు చేశామన్నారు. వారి కోసం బస కల్పిస్తున్నామని, రద్దు చేసుకున్న టికెట్లపై పూర్తి నగదు చెల్లిస్తామన్నారు. ఉచిత రీషెడ్యూల్ ఆప్షన్లను కూడా ప్రయాణికులకు అందిస్తామన్నారు. టేకాఫ్ సమయంలో ఇంజిన్‌లో సమస్య తలెత్తిందని ఓ ప్రయాణికుడు పేర్కొన్నారు. గత రెండు రోజుల్లో కనీసం రెండు విమానాలను ఎయిరిండియా రద్దు చేయడం గమనార్హం.

నేపాల్‌కు యుద్ధవాహనాల అందజేత

కాఠ్‌మాండూ: ద్వైపాక్షిక రక్షణ సహకారం బలోపేతంలో భాగంగా నేపాల్ ప్రధాన సైన్యాధికారి జనరల్ అశోక్ రాజ్ సిగ్దెల్‌కు సైనిక అవసరాలకు ఉపయోగపడే జంతువులు, వైద్య పరికరాలు, వాహనాలను భారత విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రం మిస్రీ సోమవారం అందజేశారు. రెండు రోజుల అధికార పర్యటనలో భాగంగా మిస్రీ ఆదివారం నేపాల్ వెళ్లారు. “ఇరు దేశాల సైనిక సత్సంబంధాలను బలపరుచుకోవడానికి తేలికపాటి యుద్ధ వాహనాలు, అత్యవసర వైద్య పరికరాలు, సైనిక జంతువులను నేపాల్‌కు అందజేస్తున్నాం” అని తెలిపారు.

సీనియర్‌ను కత్తితో పొడిచి చంపిన బాలుడు!

ఉత్తర్‌ప్రదేశ్‌లో దారుణ ఘటన

గాజీపుర్: ఇద్దరు విద్యార్థుల మధ్య చెలరేగిన గొడవ వారిలో ఒకరి హత్యకు దారితీసిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. గాజీపుర్ జిల్లాలోని సదర్ కోత్వాలీ ప్రాంతంలోని మహారాజ్‌గంజ్‌లో గల ఓ ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మధ్య తీవ్ర వాగ్వాదం చేలరేగింది. ఈ క్రమంలో పదో తరగతి విద్యార్థిపై, తొమ్మిదో తరగతి విద్యార్థి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో పదో తరగతి బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనలో మృతుడితో పాటు మరో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. మరణించిన బాలుడు యూసుఫ్‌పుర్ ముహమ్మదాబాద్ నివాసిగా పోలీసులు గుర్తించారు. నిందితుడైన మైనర్ విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు.

కృష్ణబిల జిగేల్ గుట్టు వీడింది!

భారత్, ఇజ్రాయెల్ శాస్త్రవేత్తల ఘనత




దిల్లీ: భూమికి 28వేల కాంతి సంవత్సరాల దూరంలోని ఒక కృష్ణబిలం నుంచి వెలువడుతున్న ఎక్స్‌రే సంకేత తీరు వెనుక గుట్టును భారత్, ఇజ్రాయెల్ శాస్త్రవేత్తలు విప్పారు. మన దేశం ప్రయోగించిన ఖగోళ పరిశీలక ఉపగ్రహం.. ఆస్ట్రోశాట్ ఇందుకు సాయపడింది. ఈ కృష్ణబిలం నుంచి వెలువడే ఎక్స్‌రే వెలుగుల్లో రెండు దశలు ఉన్నాయి. ఒకటి.. ప్రకాశవంతంగా ఉండగా, రెండోది మసకమసకగా ఉంటోంది. ఒక్కో దశ కొన్ని వందల సెకన్లు సాగుతోంది. దీనిపై గువాహటి ఐఐటీ, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు చెందిన యు.ఆర్.రావు ఉపగ్రహ కేంద్రం, ఇజ్రాయెల్‌లోని హైఫా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. కృష్ణబిలాలు పొరుగునున్న నక్షత్రాల నుంచి వాయువులను స్వాహా చేస్తుంటాయి. ఈ క్రమంలో తీవ్ర వేడి, ఎక్స్‌రేలను వెలువరిస్తుంటాయి.

తాజా కృష్ణబిలం నుంచి వస్తున్న ఎక్స్‌రేలు వేగంగా వెలుగుతూ, ఆరిపోతూ తళుకులీనడాన్ని తొలిసారిగా తాము గమనించినట్లు ఐఐటీ గువాహటి పరిశోధకుడు శాంతబ్రత దాస్ పేర్కొన్నారు. దేదీప్యమాన దశలో సెకనుకు దాదాపు 70సార్లు ఇలా జరుగుతున్నట్లు వివరించారు. ప్రకాశవంతంగా లేని దశలో ఇలాంటివి ఉండటంలేదని పేర్కొన్నారు. తళుకులు బలంగా ఉన్నప్పుడు ఈ కృష్ణబిలం చుట్టూ ఉన్న కరోనా కుంచించుకుపోతోందని, గణనీయంగా వేడెక్కుతోందన్నారు. దానికి భిన్నంగా.. మసక దశలో ఉన్నప్పుడు అది విస్తరిస్తూ, తక్కువ ఉష్ణోగ్రతలను కలిగి ఉంటోందని వివరించారు. ఫలితంగా తళుకులు ఉండటంలేదని వివరించారు. దీన్నిబట్టి ఈ కృష్ణబిల కరోనాకు స్థిర ఆకృతి లేదని, అందులోకి వాయువులు ప్రవహించే తీరును బట్టి అది మారుతోందని తేల్చారు. కృష్ణబిలాల ఎదుగుదల, వాటి నుంచి వెలువడే శక్తి, పరిసరాలపై ప్రభావం వంటి అంశాల్లో మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి ఈ పరిశోధన వీలు కల్పిస్తుందని వివరించారు.

వారి పరిస్థితి దయనీయం

● సైనిక శిక్షణలో వైకల్యం పొందిన వారిపై సుప్రీం



దిల్లీ: సైనిక శిక్షణ కాలంలో తగిలిన గాయాల కారణంగా అంగవైకల్యం సంప్రాప్తించి ఉద్యోగానికి అనర్హులుగా మారే అభ్యర్థుల స్థితిగతులపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. ఈ అభ్యర్థుల దయనీయ స్థితిపై ఒక పత్రికలో వచ్చిన వార్తను జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడుకున్న ధర్మాసనం తనంతతానుగా విచారణకు స్వీకరించింది. “ధీశాలురైన ఇలాంటి అభ్యర్థులు మన సైన్యానికి సేవలందించాలి. ఎన్నో పోటీ పరీక్షల్లో విజయం సాధించి సైనిక శిక్షణకు ఎంపికయ్యే ఈ అభ్యర్థులకు గాయాలో, అంగవైకల్యమో ఆటంకం కాకూడదు” అని ధర్మాసనం పేర్కొంది. సైనిక శిక్షణ కేంద్రాల్లో కఠిన శిక్షణను ఎదుర్కొనే ఈ అభ్యర్థులకు బీమా సదుపాయం కల్పించాలని ధర్మాసనం కేంద్రాన్ని కోరింది. “ప్రతి శిక్షణార్థికీ బీమా సదుపాయం కల్పించాలి. ఎందుకంటే శిక్షణ కాలంలో శాశ్వత వైకల్యం సంప్రాప్తించే అవకాశాలు వీరికి చాలా ఎక్కువ. వైకల్యం సిద్ధించాక వారిని వదిలేస్తే వారి నైతిక స్థైర్యం దెబ్బతింటుంది” అని న్యాయమూర్తులు అన్నారు. ప్రస్తుతం అలాంటి వారికి అందిస్తున్న నెలవారీ పరిహారం రూ.40 వేలు. దీన్ని ఇంకా పెంచే అవకాశాలను పరిశీలించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటిని న్యాయస్థానం ఆదేశించింది. ఇలాంటి వారికి సైన్యంలో డెస్కు ఉద్యోగాలిచ్చే విషయం పరిశీలించాలని కోరింది. ఒక పత్రిక వెలువరించిన వార్తా కథనం ప్రకారం, 1985 నుంచి ఇప్పటి వరకూ దాదాపు 500 మంది ఆఫీసర్ క్యాడెట్లు శిక్షణ కాలంలో తలెత్తిన వైద్య కారణాల రీత్యా ఉద్యోగం పొందలేకపోయారు. ఇలాంటి వారికి నెలనెలా రూ.40 వేల ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నారని, వీరు మాజీ సైనికోద్యోగులు పొందే సదుపాయాలకు అనర్హులని పత్రిక పేర్కొంది. కోర్టు ఈ అంశంపై తదుపరి విచారణను సెప్టెంబరు 4కు వాయిదా వేసింది.

పోలీసు సంస్కరణలపై సుప్రీం విచారణ

దిల్లీ: పోలీసు సంస్కరణలతో పాటు రాష్ట్ర డీజీపీల తాత్కాలిక నియామకాలపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. రాష్ట్రాల డీజీపీలను తాత్కాలిక ప్రాతిపదికపై నియమించరాదని అత్యున్నత న్యాయస్థానం 2006లో తీర్పు వెలువరించింది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ)ని ముఖ్యమంత్రి, శాసనసభలో ప్రతిపక్షనేత, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా గల త్రిసభ్య కమిటీ ఎంపిక చేయాలని కోరుతూ మాజీ డీజీపీ ప్రకాశ్ సింగ్ దాఖలుచేసిన పిటిషన్‌ను కూడా విచారణకు స్వీకరిస్తున్నామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజరియాలతో కూడిన ధర్మాసనం ప్రకటించింది. ఈ విషయానికి సంబంధించిన వివిధ అంశాలన్నిటిపై విచారణ జరుపుతామని ప్రధాన న్యాయమూర్తి అన్నారు.



రాష్ట్రపతి భవన్‌లో సోమవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును మర్యాదపూర్వకంగా కలిసిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్


డిసెంబరులో మయన్మార్‌లో ఎన్నికలు

బ్యాంకాక్: మయన్మార్ సైన్యం ఎట్టకేలకు దేశ పార్లమెంటుకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. డిసెంబరు 28 నుంచి ఎన్నికలు జరుగుతాయని తెలిపింది. 2021లో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోసి పగ్గాలు చేపట్టిన సైన్యం.. అప్పటి నుంచి ఎన్నికలు నిర్వహిస్తామని పలుమార్లు ప్రకటించినా...ఆలస్యం చేస్తూ వచ్చింది. గత నాలుగున్నరేళ్లుగా మయన్మార్ అంతర్యుద్ధంతో అట్టుడుకుతోంది. దేశంలో సగం కంటే తక్కువ భూభాగం మాత్రమే సైన్యం చేతుల్లో ఉంది. చాలా పట్టణాలను తిరుగుబాటుదారుల ఆక్రమించారు. మరి వారి అధీనంలో ఉన్న ప్రాంతాల్లో ఎన్నికలెలా నిర్వహిస్తారన్న దానిపై స్పష్టత లేదు. తమకు నచ్చిన పార్టీని గద్దెనెక్కించేందుకే సైన్యం ఈ ఎన్నికల ప్రక్రియను తెరపైకి తెచ్చిందన్న విమర్శలు చెలరేగుతున్నాయి. మయన్మార్‌లో 60 వరకు పార్టీలు ఉన్నాయి. ఇందులో సైన్యం మద్దతు ఉన్న యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ కూడా ఉంది. 2021లో అధికారంలోకి వచ్చిన అంగ్‌సాన్ సూచీకి చెందిన నేషనల్ లీగ్ ఫర్ డెమొక్రసీ పార్టీని ఈ ఎన్నికల్లో పాల్గొనకుండా సైన్యం నిషేధం విధించింది. దీంతో మొత్తం ఎన్నికల ప్రక్రియపైనే అనుమానాలు తలెత్తుతున్నాయి. 80 ఏళ్ల సూచీని సైన్యం నిర్బంధించింది. పలు కేసుల్లో ఆమెకు సైనిక న్యాయస్థానాలు 27 ఏళ్ల వరకు జైలుశిక్షలు విధించాయి.

నైజీరియాలో పడవ బోల్తా.. 40 మంది గల్లంతు

ఇంటర్నెట్ డెస్క్: నైజీరియాలో ఓ పడవ బోల్తా పడి 40 మంది గల్లంతయ్యారు. వాయవ్య సోకోటో రాష్ట్రంలోని స్థానిక మార్కెట్‌కు వెళ్తుండగా 50 మంది ఉన్న పడవ బోల్తా పడింది. వారిలో 40 మంది గల్లంతయ్యారని, మిగిలిన పది మందిని రక్షించినట్లు జాతీయ అత్యవసర నిర్వహణ సంస్థ తెలిపింది. గల్లంతైన వారికోసం భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. మూడు వారాల క్రితం ఉత్తర-మధ్య నైజీరియాలోని నైజర్ రాష్ట్రంలో ఇదే విధంగా సుమారు 100 మందితో ప్రయాణిస్తున్న పడవ బోల్తా పడటంతో 13 మంది మరణించారు.

చుట్టుముట్టూ హైదరాబాద్... నట్టనడుమ గోల్కొండ



గతంలో గోల్కొండ కోట నగరానికి దూరంగా ఉండేది. ప్రస్తుతం ఆ కోట చుట్టూ నివాసాలు రావడంతో దాన్ని నగరం చుట్టుముట్టినట్టు కనిపిస్తోంది. జూబ్లీహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌పై నుంచి కనిపించిన దృశ్యమిది.

నీలో బందీ కావాలని.. లోకానికి చూపాలని

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

తరం ఏదైనా.. కిసిక్కు



చార్మినార్ వద్ద కుటుంబంలోని నవతరంతో కలిసి స్వీయ చిత్రం తీసుకుంటున్న వృద్ధురాలు



కొంగ విద్యలు.. చేప కొరకే

ఇందిరాపార్కులోని కొలనులో నీటి కొంగ. చేపను తన పదునైన ముక్కుతో పొడిచి నీటిలో పడకుండా అదిమిపట్టి గుటుక్కుమనిపిస్తుండగా తీసిన చిత్రమిది.



ఫ్రెండ్స్.. మీలాగే తాగుతున్నానా?

ఈ చిత్రాన్ని చూస్తుంటే మనుషులను కోతులు ఎంత పక్కాగా అనుసరిస్తున్నాయో అర్థమవుతోంది కదూ! పంక్తిలో ఒబ్బిడిగా భోజనం చేయడం, పూజల్లో అల్లరి చేయకుండా కూర్చున్న వీడియోలు అప్పుడప్పుడూ చూస్తుంటాం. ఇక్కడ కనిపించిన కోతికి దాహం వేసి ఓ పర్యాటకుడి నీళ్ల సీసా లాక్కుంది. బాటిల్‌ను నలిపేస్తూ.. నీరు ఒంపేస్తూ తాగకుండా నేర్పుగా మనిషిలాగే పట్టుకుని తాగింది. కొండపల్లి ఖిల్లా దగ్గర కనిపించిన ఈ దృశ్యం 'ఈనాడు'కు చిక్కింది.

– ఈనాడు, అమరావతి

ట్రాక్‌పైకి సౌరభారత్



హరిత ఇంధనానికి పెద్దపీట వేయాలని భావిస్తున్న రైల్వే మంత్రిత్వ శాఖ ఓ కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. రైలు పట్టాల మధ్య సౌర ఫలకాలను అమర్చడం ద్వారా సౌర విద్యుత్తును ఉత్పత్తిచేసి వారాణాసిలోని 'బెనారస్ లోకోమోటివ్ వర్క్స్' (బీఎల్‌డబ్ల్యూ) చరిత్ర సృష్టించింది. ఎప్పుడు కావాలంటే అప్పుడు వీటిని విడదీసేలా ఏర్పాట్లు చేశారు. పట్టాల నిర్వహణ పనులు చేపట్టేటప్పుడు వీటిని పక్కకు తొలగించి, మళ్లీ బోల్టులతో బిగించుకోవచ్చు. వీటిని అమర్చడానికి రైళ్ల రాకపోకల్ని పెద్దగా ఆపాల్సిన పనేమీ ఉండదు. బీఎల్‌డబ్ల్యూ ప్రాంగణంలోని 19వ లైనులో అమర్చిన ఫలకాలను మూడురోజుల క్రితం ప్రారంభించారు. రైళ్ల రాకపోకల సమయంలో వచ్చే ప్రకంపనలకు ఇవి కదిలిపోకుండా ప్రత్యేక పదార్థంతో కాంక్రీటు స్లీపర్లకు అతికించారు. ఒక కిలోమీటరు దూరానికి అమర్చే ఫలకాల ద్వారా 880 యూనిట్ల విద్యుత్తు ప్రతిరోజూ ఉత్పత్తి అవుతుంది. –వారణాసి

ఆంబోతు నివాళి



ఎవరైనా మరణిస్తే బంధుమిత్రులు చూడడానికి వస్తారు. ఇక్కడ ఒక ఆంబోతు అదే పనిచేసి ఆశ్చర్యపరిచింది. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం మీగడంపాడుతండాకు చెందిన గిరిజన రైతు రూపావత్ చిన్నానాయక్ (54) అనారోగ్యంతో ఆసుపత్రిలో శనివారం రాత్రి మృతి చెందారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. ఇంటి వద్ద ఉంచిన మృతదేహం వద్దకు ఆ ప్రాంతంలో తిరిగే ఆంబోతు తెల్లవారుజామునే వచ్చింది. ఫ్రీజర్‌లో ఉంచిన చిన్నా మృతదేహాన్ని చూస్తూ అక్కడే తిరుగుతూ అక్కడే పడుకొని ఆప్యాయత ప్రదర్శించింది. అదిలించినా వెళ్లకుండా 2 గంటల పాటు అక్కడే ఉంది. సాధారణంగా యజమాని చనిపోతే.. పెంపుడు జంతువులు కన్నీరు కార్చడం అక్కడక్కడ చూస్తుంటాం. ఇక్కడ చిన్నానాయక్‌కు ఆ ఆంబోతుతో ఏ బంధమూ లేకున్నా ఇలా ఆత్మీయత ప్రదర్శించడం గ్రామస్థులను ఆశ్చర్యానికి గురిచేసింది.

– న్యూస్‌టుడే, నేరేడుచర్ల

నే ఆడితే లోకమే ఊగదా..!



అనంతపురంలో సోమవారం ఉదయం మబ్బులు పట్టి చిరు చినుకులు పడుతుండగా శ్రీసత్యసాయి జూనియర్ మహిళా కళాశాల ఆర్చ్ పైభాగాన ఉన్న కలశంపై ఓ నెమలి వాలింది. ప్రకృతి అందానికి మైమరచి పురివిప్పి నాట్యమాడింది. రెండు గంటల పాటు అక్కడే ఉండి కనువిందు చేసింది.

– ఈనాడు అనంతపురం



వారిని స్నేహితులుగా మార్చుకోకపోవడమూ మంచిదే!

శత్రువులు ఉండటం కూడా ఒకరకంగా మంచిదే! ఎందుకంటే- వారు లేకపోతే మనల్ని సోమరితనం ఆవహిస్తుంది. వారుంటే.. నిరంతరం అప్రమత్తంగా ఉంటాం. మెదడుకు పని పెడుతూ, మెరుగైన వ్యూహాలు రచిస్తుంటాం. కాబట్టి కొన్నిసార్లు.. శత్రువులను స్నేహితులుగా మార్చుకోవడం కంటే, శత్రువులుగా ఉండనివ్వడమే మంచిది!


– రాబర్ట్ గ్రీన్, రచయిత

ముంబయికి చేరిన మరాఠా యోధుని ఖడ్గం

ముంబయి: 17-18 శతాబ్దాల మధ్యకాలంలో మరాఠా సామ్రాజ్యాన్ని దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించిన యోధుడు ఒకటో రఘుజి భోంస్లేకి చెందిన ఖడ్గాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం సేకరించింది. లండన్‌లో జరిగిన ఒక వేలంపాటలో చేజిక్కించుకున్న ఈ ఖడ్గాన్ని సోమవారం ఉదయం ముంబయికి తీసుకొచ్చారు. ఇది దేశ వారసత్వ సంపదను పునరుద్ధరించేందుకు ఉద్దేశించిన చర్య అని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ అన్నారు. ఖడ్గాన్ని పి.ఎల్.దేశ్‌పాండే అకాడమీలో భద్రపరిచామని, సాంస్కృతిక శాఖ మంత్రి ఆశీశ్ షెలార్ అన్నారు. ఈ ఖడ్గాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లేందుకు ఒక బైక్ ర్యాలీ నిర్వహించాలని ముందు నిర్ణయించారు కానీ భారీ వర్షాల కారణంగా దాన్ని రద్దు చేశారు. ఛత్రపతి షాహు మహారాజ్‌కు సేనాపతిగా పనిచేసిన రఘుజీ భోంస్లే నాగ్‌పుర్ సామ్రాజ్య స్థాపకునిగా ప్రసిద్ధుడు. ఆయన మరాఠా సామ్రాజ్యాన్ని బెంగాల్, ఒడిశా తదితర ప్రాంతాలకు విస్తరించారు.

చుట్టూ అందరూ... ఎవరికీ చెందరు!

వర్క్‌ఫ్రం హోం ఉద్యోగులది చిత్రమైన పరిస్థితి.
ఇంట్లో అందరితో ఉన్నా...
ఒక్క క్షణం కూడా తీరుబాటుండదు!
ఇక్కడ ఆఫీసుకు, ఇంటికి మధ్య సరైన సమయ విభజన చేసుకోకపోతే ఒత్తిడి చిత్తు చేస్తుంది. తస్మాత్ జాగ్రత్త!




ఇప్పుడు 'వర్క్ ఫ్రం హోం' చాలా మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు సాధారణంగా మారిపోయింది. దీనివల్ల కార్యాలయానికి వెళ్లే ప్రయాణ సమయం తగ్గిపోవడం, ఇంట్లో సౌకర్యంగా పని చేసే అవకాశం వంటి ప్రయోజనాలున్నా... పని, వ్యక్తిగత జీవితం మధ్య గీత చెరిగిపోవడంతో ఒత్తిడి తీవ్రంగా పెరిగిపోతోంది. ఇంట్లోనే ఉంటున్నా కుటుంబసభ్యులకు సమయం వెచ్చించలేని పరిస్థితి. ఎప్పుడూ ఆఫీస్ పనంటూ కంప్యూటర్ ముందు కూర్చుని ఉంటున్నారంటూ కుటుంబసభ్యులు విసుక్కుంటున్న సందర్భాలు వర్క్‌ఫ్రం హోం ఉద్యోగులకు తరచూ ఎదురవుతుంటాయి. భార్యాభర్తలు ఇద్దరూ వర్క్ ఫ్రం హోం అయితే ఇక చెప్పాల్సిన పని లేదు. ఎవరి గదిలో వారు తలుపులు బిగించుకుని కూర్చోవడమే. ఈ పరిస్థితుల్లో సమయ నిర్వహణ అనేది చాలా కీలకం. కొన్ని ప్రణాళికలు... కొంచె మనసు ఉంటే చాలు. అటు పని, ఇటు కుటుంబాన్ని చక్కగా సమన్వయం చేసుకోవచ్చని అంటున్నారు నిపుణులు.

నెగెటివ్స్ లేకుండా...

కార్యాలయానికి వెళ్లి వచ్చిన తర్వాత గంట, రెండు గంటలు మాత్రమే కుటుంబంతో గడిపే సమయం ఉండడంతో పాజిటివ్స్‌ను ప్రదర్శిస్తారు. కానీ, నిత్యం ఇంట్లోనే ఉండడంతో నెగెటివ్స్ కూడా బయటకు వస్తూ ఉంటాయి. ఇలా జరగకుండా ఉండాలంటే పని, కుటుంబం, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇచ్చేలా సమయాన్ని కేటాయించుకోవాలి. కొన్నిసార్లు మల్టీటాస్కింగ్ చేస్తూ ఉంటారు. ఒక పక్కన పని చేస్తూ మరోపక్క పాటలు వినడం, మరో పని ఏదో పెట్టుకోవడంలాంటివి చేస్తూ ఉంటారు. ఇది సరైంది కాదు. ఏదైనా ఒక్కదాని పైనే శ్రద్ధ పెట్టి చేయాలి.

– డాక్టర్ కర్రి రామారెడ్డి, మానసిక వైద్య నిపుణులు, రాజమహేంద్రవరం



- ఉదయం ఏ సమయంలో పని మొదలు పెడతాం.. మధ్యాహ్నం విరామం ఎప్పుడు.. పని ఎప్పుడు ముగిస్తుందనే ప్రణాళిక వేసుకోవాలి. ఇవన్నీ స్థిరమైన సమయాలుగా నిర్ణయించుకోవాలి.
- మంచం, సోఫాపై కూర్చుని పని చేస్తే ఏకాగ్రత కుదరకపోవచ్చు. ఇంట్లో ఒక చోటును కార్యాలయంగా కేటాయించుకుంటే మనసు సైతం ఆ మూడ్‌లోకి వెళ్తుంది.
- మొదట చేయాల్సిన ఆ రోజు పని జాబితా సిద్ధం చేసుకోవాలి. అత్యవసరమైన పనులను మొదట పూర్తిచేసి, తక్కువ ప్రాధాన్యం ఉన్న వాటిని ఆ తర్వాత చేయాలి.
- గంటల కొద్దీ పని చేస్తే పనిలో నాణ్యత తగ్గుతుంది. గంటకోసారి 5-10 నిమిషాలు విరామం తీసుకోవాలి.
- సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్, వాట్సప్ నోటిఫికేషన్లు పనిపై ఏకాగ్రతను దెబ్బతిస్తాయి. పని వేళల్లో నోటిఫికేషన్లు ఆఫ్ చేసుకోవడం మంచిది.
- వర్క్ ఫ్రం హోంలో కుటుంబం దగ్గరగా ఉంటుంది. కానీ, అందుకు సమయాన్ని కేటాయించకపోతే దూరం పెరుగుతుంది. పని ముగిసిన తర్వాత గాడ్జెట్ల నుంచి దూరంగా ఉండాలి.
- కుటుంబ సమయాన్ని ఆఫీసు పనులు మింగేసే పరిస్థితి రాకుండా చూసుకోవాలి. భోజనం చేసేటప్పుడో.. కుటుంబసభ్యులతో మాట్లాడుతున్నప్పుడో ల్యాప్‌టాప్ తెరవకూడదు.
- పని గంటలు, కార్యాలయం సమావేశాల గురించి కుటుంబసభ్యులకు ముందే చెప్పడం మంచిది. దాంతో వారు అర్థం చేసుకుంటారు.
- పని మధ్యలో చిన్న విరామం తీసుకున్నప్పుడు ఇంట్లోని పిల్లలు, పెద్దలను పలకరిస్తే కుటుంబ బంధాలు బలపడతాయి..
- వారాంతాల్లో కుటుంబాన్ని బయటకు తీసుకువెళ్లేందుకు ప్రణాళిక వేసుకోవాలి. పిల్లల హోంవర్క్‌ను చూడడం, సమయం దొరికితే వంట ఇంట్లో సహాయం చేయడం వంటివి చేయాలి.

-ఈనాడు, అమరావతి

వజ్రాల వేట.. అక్కడే ఎందుకు?



వజ్రకరూర్‌లోని ప్రాసెసింగ్ యూనిట్‌లో కింబర్‌లైట్ రాళ్లు

వర్షాకాలంలో అనంతపురం జిల్లా వజ్రకరూర్, కర్నూలు జిల్లా జొన్నగిరి చుట్టుపక్కల ఉండే పొలాల్లో రైతుల కంటే వజ్రాలు వెతికేవారే ఎక్కువగా కనిపిస్తారు. ఏటా జూన్ నుంచి సెప్టెంబరు వరకు వజ్రాల వేట సాగిస్తారు. ఈ రెండు ప్రాంతాల్లో ఏటా 40 నుంచి 50 వజ్రాలు దొరుకుతాయని స్థానికులు చెబుతున్నారు. అయితే ఇక్కడే వజ్రాలు ఎందుకు లభిస్తాయనే ప్రశ్నకు వినిపించే ఏకైక సమాధానం కింబర్‌లైట్.

అసలేంటి కింబర్‌లైట్?

భూమి లోపలి భాగంలోని శిలావరణం (దాదాపు 150 నుంచి 450 కిలోమీటర్ల లోతు)లో లావా రూపంలో ఉండే కింబర్‌లైట్ అధిక పీడనం కారణంగా క్రమంగా భూమి పైపొరలకు చేరుకుని విస్ఫోటనం చెందుతుంది. ఈ క్రమంలో మార్గమధ్యలో ఉండే వజ్రాలను తనతో పాటు పైకి తీసుకొస్తుంది. విస్ఫోటనం అనంతరం ఘనీభవించిన కింబర్‌లైట్‌లోనే వజ్రాలు ఉండిపోతాయి. అలాంటి కింబర్‌లైట్ రాళ్లను ప్రాసెస్ చేసి వజ్రాలను వెలికితీస్తారు. భూమిపై అధిక వర్షాలు, వరదల కారణంగా కింబర్‌లైట్ రాళ్లు కోతకు గురై వాటిలోని కొన్ని వజ్రాలు సహజసిద్ధంగా బయటపడతాయి. అందుకే కింబర్‌లైట్ రాళ్లు ఉన్న ప్రాంతాల్లో వజ్రాలు దొరికేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి.

బ్రిటీష్ కాలంలోనే మైనింగ్..


ఉమ్మడి అనంతపురం జిల్లాలో 45 చోట్ల కింబర్‌లైట్ నిక్షేపాలను పరిశోధకులు గుర్తించారు. వీటిలో డైమండ్‌గ్రేడ్ అధికంగా ఉన్న క్షేత్రాలు 10 వరకు ఉన్నాయి. వెంకటాంపల్లి పరిధిలోని కింబర్‌లైట్ క్షేత్రంలో అత్యధికంగా 10.68 డైమండ్ గ్రేడింగ్ కలిగిన వజ్రాలను కనుగొన్నారు. ఇది మధ్యప్రదేశ్‌లోని పన్నా డైమండ్ మైనింగ్‌లోని గ్రేడింగ్(8.3) కంటే ఎక్కువ. బ్రిటిష్ కాలంలోనే వజ్రకరూరు పరిసర ప్రాంతాల్లో మైనింగ్ చేసినట్లు ఆధారాలు ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1961లో కేంద్ర ప్రభుత్వం వజ్రకరూర్‌లో వజ్రాల ప్రాసెసింగ్ యూనిట్‌ను స్థాపించింది. అప్పటి నుంచి భూవైజ్ఞానిక శాస్త్రవేత్తలు ఇక్కడ పరిశోధనలు చేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లోని రాళ్లు, మట్టిని కర్మాగారానికి తెచ్చి వజ్రాన్వేషణ సాగిస్తున్నారు. అయితే 2017 నుంచి పరిశోధనలు నిలిపివేశారు. తెలంగాణలోనూ గద్వాల, నారాయణపేట, మద్దూరు, కోటకొండ ప్రాంతాల్లో కింబర్‌లైట్ నిక్షేపాలు ఉన్నట్లు ఉస్మానియా యూనివర్సిటీ జియాలజీ విభాగం గుర్తించింది.

– ఈనాడు, అనంతపురం

తండా యువకుడి కవిత సీబీఎస్ఈ పాఠమైంది..



నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి తండాకు చెందిన రమేశ్ కార్తిక్‌నాయక్ రాసిన కవిత పాఠమైంది. ఆయన రచించిన 'చక్‌మక్' (చెకుముకి రాయి) ఆంగ్ల కవితా సంపుటిలోని 'ది రోస్ ల్యాండ్' కవితను సీబీఎస్ఈ బోర్డు ఈ ఏడాది 8వ తరగతి ఆంగ్ల సిలబస్‌లో ఆరో పాఠంగా చేరుస్తూ.. సోమవారం సమాచారం అందజేసింది.



'ది రోజ్ ల్యాండ్' కవిత.. బంజారా తెగకు చెందిన తల్లీ కొడుకుల జీవన ప్రయాణ ఇతివృత్తంతో సాగుతుంది. తల్లి చెప్పినా వినకుండా ఓరోజు వారు పనిచేసే తోటకు బాలుడు బయల్దేరి వెళ్తాడు. గులాబీ తోట నుంచి సాగే అతడి ప్రయాణం, ప్రకృతితో ముడిపడిన గత, వర్తమాన అనుభూతుల్ని పంచుతూ సాగుతుంది. బాల్యంలో చుట్టుముట్టే భయాలు, ఊహా లోకపు మాయలు దాటుకుని వెళ్తుంటుంది. జింకల పాదముద్రలు, నెమలి ఈకలు, మామిడి చెట్టు ఫలాలు, దేవతగా పూజలందుకునే రాయి వంటి ఘట్టాలు బంజారా తెగ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. నేలతల్లితో వారికున్న లోతైన బంధాల్ని విడమర్చి చెబుతూ కవిత ముగుస్తుంది. రమేశ్ రచించిన 'లైఫ్ ఆన్ పేపర్' కవితను బళ్లారికి చెందిన విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పీజీ పాఠ్యాంశంగా ఎంచుకుంది. ఇదే కవిత 'ది మ్యూస్ ఇండియా యంగ్ రైటర్' అవార్డునూ తెచ్చిపెట్టింది. ఈ యువ బంజారా రచయిత.. 'ధవలో గోర్' (స్త్రీ శోకం) కథా సంపుటితో కేంద్ర సాహిత్య అకాడమీ 'యువ పురస్కారం-2024' అందుకున్నారు.

– న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

డౌటుందా... యాప్ ఉంది!



ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థికి పాఠశాలలో చెబుతున్న లెక్కలు అర్థం కాలేదు. నేరుగా ఓ యాప్‌లోకి వెళ్లారు. సందేహాలు నివృత్తి చేసుకున్నారు. ఇలా విద్యార్థుల ఎన్నో ప్రశ్నలకు యాప్‌లే సమాధానాలు ఇస్తున్నాయి.

పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోర్డుపై రాస్తూ బోధిస్తున్నంత సేపు తరగతులు బాగానే అర్థమైనట్లుగా ఉంటాయి. తీరా ఇంటికొచ్చి హోంవర్కు చేసుకుందామనుకుంటే ఒక్కముక్క కూడా గుర్తుండదు. బోలెడన్ని సందేహాలు పుట్టుకొస్తాయి. ఒక్క లెక్కల్లోనే కాదు, సైన్స్, ఇంగ్లిష్, సోషల్ ఇలా అన్ని సబ్జెక్టుల్లోనూ ఇలాగే ఉంటుంది. ప్రతి సందేహానికీ టీచర్లనో, మరొకరినో పదేపదే అడగడానికి విద్యార్థులు మొహమాట పడుతుంటారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు చాలా యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటితో సబ్జెక్టులను సులువుగా అర్థంచేసుకోవచ్చు.. వాటిపై ఉన్న భయాన్ని తగ్గించుకోవచ్చు. ఇప్పటికే పిల్లలకు చదువు చెప్పేందుకు రకరకాల ఆన్‌లైన్ వేదికలు, యూట్యూబ్ ఛానళ్లూ అంటూ చాలానే ఉన్నాయి. అవి తరగతులు, పాఠాల వారీగా ఉంటాయి. వాటిలో మనకు కావాల్సిన విషయాన్ని తెలుసుకునేందుకు కాస్త సమయం పట్టొచ్చు. వాటితో పోలిస్తే యాప్‌లలో కేవలం అవసరమైన సందేహాలను మాత్రమే అడిగి తెలుసుకోవచ్చు.



డౌట్‌బడ్డీ: ఈ యాప్‌లో వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకుంటే హోంవర్కు చేస్తున్నప్పుడు, ఏదైనా లెక్క అర్థం కానప్పుడు దాన్ని ఫొటో రూపంలో అప్‌లోడ్ చేస్తే సమాధానం ఇస్తుంది. ఆ ప్రశ్నను టైప్ చేసి సందేహాన్ని నివృత్తి చేసుకునే వెసులుబాటు కూడా ఉంది. సందేహాలను ఉచితంగా అడిగి తెలుసుకోవచ్చు. అలా అడిగినవన్నీ యాప్‌లోని మై డౌట్స్ అనే చోట నిల్వ ఉంటాయి. కాబట్టి కావాల్సినప్పుడల్లా చూసుకోవచ్చు. చిన్న పిల్లలకే కాదు ఐఐటీ, జేఈఈ, నీట్ పరీక్షలు రాసే వాళ్లకి కూడా ఉపయోగపడుతుంది.

బ్రెయిన్లీ: దాదాపు డౌట్‌బడ్డీ లాగే పనిచేస్తుంది. కేవలం లెక్కలు, సైన్స్‌లోని సందేహాలకు మాత్రమే సమాధానాలు దొరుకుతాయి.

డౌట్‌నెట్: ఇదొక ఆన్‌లైన్ వేదిక.. అందులోకి వెళ్లి ప్రశ్నను టైప్ చేస్తే.. వీడియో రూపంలో సమాధానం ఇస్తుంది. వాట్సప్ ద్వారా కూడా తెలుసుకోవచ్చు. ప్రశ్నను ఫొటో తీసి వాట్సప్‌లో అప్‌లోడ్ చేస్తే జవాబు వీడియో లింక్ రూపంలో వస్తుంది.



ఈ సరళ్: ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్, ఆ తర్వాత రాసే ఆయా పోటీ పరీక్షలకూ ఉపయోగపడుతుంది. దీనికి కొంత డబ్బు చెల్లించాల్సి వస్తుంది.

స్వయం: ఇది కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఆన్‌లైన్ పోర్టల్. ఇక్కడ ఏ అంశం గురించైనా లెక్కకు మించి కోర్సులు చదువుకోవచ్చు. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పోర్టల్ కావడంతో ఇందులో చదివినవారికి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం దక్కుతుంది. ధ్రువపత్రానికి మంచి గుర్తింపు లభిస్తుంది.

టాపర్: పాఠాలను వీడియోల రూపంలో అందిస్తోంది. ఆయా సబ్జెక్టుల్లోని డౌట్లను స్కాన్ చేసి సమాధానాలు తెలుసుకోవచ్చు. టీచర్ల ద్వారా తెలుసుకోవాలనుకుంటే కొంత రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

దీక్ష: 1-12 తరగతుల విద్యార్థులు వివిధ కారణాలతో పాఠశాలలకు వెళ్లలేకపోయినా.. ఆ రోజుల్లోని పాఠాలను చదువుకునేలా, తమ సందేహాలను నివృత్తి చేసుకునేలా ఈ యాప్‌ను రూపొందించారు. ఎన్సీఈఆర్టీతో పాటు రాష్ట్ర సిలబస్‌కు సంబంధించిన వేల సంఖ్యలో పాఠ్యపుస్తకాలు యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. ఆడియో, వీడియో, క్విజ్‌లు, అసెస్‌మెంట్స్, క్వశ్చన్ బ్యాంకులూ ఉన్నాయి.

-ఈనాడు డిజిటల్, హైదరాబాద్

ఉప ముఖ్యమంత్రి అధికార దుర్వినియోగంపై సీబీఐతో విచారణ జరిపించండి

మాజీ ఐఏఎస్ విజయకుమార్ హైకోర్టులో వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: హరిహర వీరమల్లు సినిమా, వాణిజ్య కార్యక్రమాలను ప్రమోట్ చేసుకునేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రభుత్వ నిధులు, అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని, ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ మాజీ ఐఏఎస్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయకుమార్ హైకోర్టులో పిటిషన్ వేశారు. సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. సీబీఐ, ఏసీబీ తరఫు న్యాయవాదుల పేర్లను కేసు విచారణ జాబితాలో(కాజ్‌లిస్ట్‌లో) చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ప్రతివాదులకు నోటీసులు ఇవ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. ఈ దశలో ఎలాంటి నోటీసులు ఇవ్వటం లేదని స్పష్టంచేసింది. వ్యాజ్యంపై ప్రాథమిక విచారణ అనంతరం తగిన ఉత్తర్వులు ఇస్తామని తెలిపింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి శోభాయాత్రలో విషాదం

- ట్రాలీకి విద్యుదాఘాతం..
- హైదరాబాద్‌లో ఐదుగురి దుర్మరణం

ఈనాడు, హైదరాబాద్: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో నిర్వహించిన శోభాయాత్ర అంతులేని విషాదం మిగిల్చింది. విద్యుత్ తీగల మీద నుంచి వేలాడుతున్న కేబుల్ వైర్.. ఊరేగింపు నిర్వహిస్తున్న ట్రాలీకి తగలడంతో విద్యుదాఘాతం సంభవించి ఐదుగురు మరణించారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి 1.45 గంటల సమయంలో ఘటన జరిగింది. ఈ దుర్ఘటనలో రామంతాపూర్ శారదానగర్‌కు చెందిన కాటుపల్లి శ్రీకాంత్‌రెడ్డి(35), హబ్సిగూడకు చెందిన రుద్ర వికాస్(39), చెట్టబోయిన సురేశ్ యాదవ్(34), ఓల్డ్ రామంతాపూర్‌కు చెందిన పిలాల్ల కృష్ణయాదవ్(21) ఘటనాస్థలంలో మరణించారు. హబ్సిగూడ రవీంద్రనగర్‌కాలనీకి చెందిన బద్దం రాజేందర్‌రెడ్డి(48)ని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. గోల్నాకకు చెందిన గణేశ్ పరిస్థితి విషమంగా ఉంది.

అల్ప్రాజోలం తయారీ గుట్టు రట్టు

- రూ.23.88 కోట్ల విలువైన ముడిసరకు స్వాధీనం
- 8 మందిని అరెస్టుచేసిన డీఆర్ఐ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని ఓ డ్రగ్స్ తయారీ సంస్థలో అల్ప్రాజోలం (మత్తు మాత్రలు) తయారీ గుట్టును కేంద్ర ప్రభుత్వానికి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు రట్టు చేశారు. రూ.23.88 కోట్ల విలువైన 119.4 కేజీల రసాయన మిశ్రమాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాధ్యులైన 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. 'అచ్యుతాపురం నాన్ సెజ్‌లోని ఎవరెస్ట్ డ్రగ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో నిషేధిత అల్ప్రాజోలం మాత్రల తయారీ చేస్తున్నట్లు సమాచారమందింది. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, కాకినాడకు చెందిన అధికారులు బృందంగా ఏర్పడి రెండు రోజులపాటు కంపెనీలో తనిఖీలు చేపట్టారు. మాత్రల తయారీకి సిద్ధంగా ఉన్న 87.8 కేజీల సరకు, 3,600 లీటర్ల ముడి ద్రవం, రెండు రియాక్టర్లు, ఒక సెంట్రిఫ్యూజ్, ఒక డ్రైయర్‌తో పాటు పలు పత్రాలు దొరికాయి. ఈ కంపెనీ నిర్వహణకు కారణమైన 8 మందిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మాస్టర్ మైండ్స్, కెమిస్టులు, ఫైనాన్షియర్లు, కొనుగోలుదారులు అందరూ ఒకేచోట చిక్కారు. వీరిపై మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల (ఎన్‌డీపీఎస్)-1985 చట్టప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం' అని డీఆర్ఐ అధికారులు తెలిపారు.



డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్న ముడిసరకు

జైల్లో వ్యూహరచన: డీఆర్ఐ అధికారుల ప్రాథమిక విచారణ ప్రకారం.. అరెస్టైన వారిలో కొందరు ఇప్పటికే డ్రగ్స్ తయారీ, హత్యలు, ఆర్థిక, సైబర్ నేరాలు వంటి పలు ప్రధాన కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినవారు ఉన్నారు. జైల్లో ఉన్నప్పుడే, అధికంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో దీనికి వ్యూహరచన చేశారు. జైలు నుంచి విడుదలయ్యాక నిషేధిత మత్తు తయారీకి డ్రగ్ కంపెనీని గుర్తించడంతో పాటు ఫైనాన్షియర్, కొనుగోలుదారులు, తయారీ నిపుణులను ఎంపికచేసి, ఈ నేరానికి పాల్పడ్డారు. ఇక్కడ తయారయ్యే అల్ప్రాజోలం మాత్రలను తెలంగాణలో కల్లులో వినియోగించేందుకు వీరు ప్రణాళిక రచించారు.




కష్టమైన ఐచ్ఛికాలను నేడు ఎంచుకుంటేనే..

విజయం సాధించాలంటే కేవలం అదృష్టం ఉంటే సరిపోదు. మెరుగైన జన్యువులను కలిగి ఉన్నంత మాత్రాన మంచి శరీరాకృతి దక్కదు. ఆనందం అనేది దానంతటదే రాదు. అవన్నీ.. మనం ఎంచుకునే ఐచ్ఛికాల ఫలితాలే. కష్టపడి పనిచేయడం, క్రమశిక్షణను కలిగి ఉండటం, త్యాగాలు చేయడం వంటి కఠినమైన ఐచ్ఛికాలను నేడు ఎంచుకుంటేనే.. మనం కోరుకునే ఫలితాలను రేపు పొందడం సాధ్యమవుతుంది.

– జేమ్స్ కాల్లెకాట్, కంటెంట్ క్రియేటర్

పులివెందులలో కాలర్ ఎగరేసుకు తిరిగేలా చేశారు



- నాయకులు, కార్యకర్తలకు చంద్రబాబు అభినందన
- విషం చిమ్మడమే వైకాపా సిద్ధాంతం
- ప్రాజెక్టులు కొట్టుకుపోతున్నాయంటూ భయాందోళనలు సృష్టిస్తున్నారు

వాళ్ల తప్పుడు ప్రచారాల్ని తిప్పికొట్టాలని శ్రేణులకు పిలుపు

ఈనాడు, అమరావతి: పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థుల్ని గెలిపించి కాలర్ ఎగరేసుకు తిరిగేలా, అధినాయకత్వం గర్వపడేలా చేశారని పార్టీ నాయకులు, కార్యకర్తల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. '30 ఏళ్ల తర్వాత ఓటు వేసే అవకాశం కల్పించినందుకు దండాలు', 'వివేకానందరెడ్డి కుటుంబానికి న్యాయం చేయండి' అని రాసి స్థానికులు బ్యాలట్ బాక్సుల్లో వేశారంటేనే పులివెందులలో పరిస్థితుల్ని అర్థం చేసుకోవచ్చన్నారు. సామాజిక మాధ్యమాలు, సొంత మీడియా, అనుబంధ టీవీ ఛానళ్ల ద్వారా రాష్ట్రం మీద విషం చిమ్మడాన్నే వైకాపా వాళ్లు పనిగా పెట్టుకొన్నారని.. అదే వారి సిద్ధాంతమని దుయ్యబట్టారు. అమరావతి మునిగిపోయిందని, ప్రాజెక్టులు కొట్టుకుపోతున్నాయని, ఊళ్లకు ఊళ్లే మునుగుతాయంటూ ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని కోసం పొన్నూరును ముంచేశారని, కొండవీటి వాగు ఎత్తిపోతల పంపులు పని చేయడం లేదని, ప్రకాశం బ్యారేజ్‌కు ముప్పు పొంచి ఉందని తప్పుడు వార్తల్ని ప్రసారం చేశారని ధ్వజమెత్తారు. వీటిని ఖండించి ప్రజల్ని చైతన్యపరచకపోతే.. ఇవే నిజమని నమ్మే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు మొదలు గ్రామస్థాయి కార్యకర్తల వరకు పార్టీ శ్రేణులతో చంద్రబాబు సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు, 'సుపరిపాలనలో తొలి అడుగు', పార్టీ సంస్థాగత నిర్మాణం, కమిటీల నియామకం సహా పలు అంశాల్ని వారితో చర్చించారు.

పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవద్దు

'వైకాపా అసత్యప్రచారాల్ని దృష్టిలో పెట్టుకొని నాయకులు మరింత క్రమశిక్షణతో మెలగాలి. మీ వ్యవహారశైలితో ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు తేవద్దు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో నామినేషన్ స్వీకరణ నుంచి పోలింగ్ వరకు అన్ని వ్యవస్థలు చట్టబద్ధంగా పనిచేశాయి. అందుకే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీ చేశారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటేశారు. భవిష్యత్తులో ఏ ఎన్నికైనా కూటమి అభ్యర్థులు ఇలాగే గెలవాలి. ప్రజల అవసరాలు తీర్చి, వారితో మమేకమైతే ఇది సుసాధ్యం' అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

ముఖాముఖి మాట్లాడుతున్నా.. పొరపాట్లు చెబుతున్నా


'ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో ముఖాముఖి మాట్లాడుతున్నాను. స్థానిక పరిస్థితులు, మంచిచెడులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను చర్చిస్తున్నా. పొరపాట్లు ఉంటే సరి చేసుకోవాలి. ప్రజలు మన మీద పెట్టుకున్న ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా పనితీరు ఉండాలి. సంస్థాగత కమిటీల్ని ఈ నెల చివరి నాటికి పూర్తి చేయండి' అని చంద్రబాబు తెలిపారు.

త్వరలోనే మిగతా నామినేటెడ్ పదవులు

'కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం చేయడానికి చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం విజయవంతమయింది. 1.24 కోట్ల కుటుంబాల్ని కలిశాం. నాయకులు ఏ గ్రామానికి, ఏ సమయంలో వెళ్లారో కూడా ఆధునిక సాంకేతికత ద్వారా తెలుసుకున్నాం. ప్రభుత్వం పట్ల ప్రజల్లో సానుకూలత ఉంది. త్వరలోనే మిగతా నామినేటెడ్ పోస్టుల్నీ భర్తీ చేస్తాం. పార్టీ కోసం త్యాగాలు చేసిన వారిని గౌరవిస్తాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

అమరావతిపై పదే పదే అదే విషం

- తాజా వర్షాలకు రాజధాని మునిగిందంటూ వైకాపా దుష్ప్రచారం
- ఆ విష ప్రచారాన్ని భుజానికెత్తుకుంటున్న మరికొందరు
- తాజాగా తిరుపతిలో ఆడిట్ విభాగం అధికారి విద్వేషకర వ్యాఖ్యలు



సుభాష్ చంద్రబోస్ వ్యంగ్యంగా పెట్టిన పోస్టులు

ఈనాడు, అమరావతి, తిరుపతి: రాజధాని అమరావతిపై వైకాపా నాయకుల్లో ఇప్పటికీ అదే అక్కసు.. అదే కడుపుమంట..అమరావతిపై విషం కక్కడమే ఇప్పటికీ వారి ఏకైక ఎజెండా..! ఐదేళ్ల జగన్ పాలనలో అమరావతిని నామరూపాల్లేకుండా చేసేందుకు పన్నిన కుట్రలేవీ పారలేదు. అమరావతి శ్మశానమని, ఎడారి అని, గట్టిగా వర్షం పడితే అమరావతి మునిగిపోతుందని, నిర్మాణాలకు అక్కడి నేల పనికిరాదని... ఆ ఐదేళ్లూ

అప్పటి మంత్రులు, ఆ పార్టీకి తాబేదారులుగా వ్యవహరించినవారు వివిధ మాధ్యమాల్లో విష ప్రచారం చేశారు. ఎగువ నుంచి వరదనీరు పోటెత్తుతున్నా ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిని కిందకి విడుదల చేయకుండా జాప్యం చేసి అమరావతిని ముంచేసేందుకూ కుట్ర పన్నారు. అయినా వారి ఆటలేమీ సాగలేదు. తాజాగా కురిసిన వర్షాలకు అమరావతి మునిగిపోయిందంటూ మళ్లీ వైకాపా వర్గాలు, జగన్‌కు చెందిన పత్రిక, టీవీ ఛానల్ ఉద్దేశపూర్వకంగా విషప్రచారాన్ని భుజాలకెత్తుకున్నాయి. కొందరు ప్రభుత్వ ఉద్యోగులూ సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా అమరావతిపై విషప్రచారానికి పూనుకుంటున్నారు. విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. వాణిజ్య పన్నులశాఖ తిరుపతి ప్రాంతీయ ఆడిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో అసిస్టెంట్ కమిషనర్ (ఎఫ్ఏసీ)గా పనిచేస్తున్న ఎస్.సుభాష్ చంద్రబోస్ అమరావతిపై అవాస్తవాలు ప్రచారం చేస్తూ ఫేస్‌బుక్‌లో సోమవారం వివాదాస్పద పోస్టులు పెట్టడం ఆయన క్రమశిక్షణారాహిత్యానికి అద్దంపట్టింది. అమరావతిలో ప్రస్తుత పరిస్థితి ఏంటో కనీసం చూడకుండా ఇష్టానుసారం కామెంట్లు పెట్టేశారు.

ప్రభుత్వోద్యోగిగా ఉండి ఆ వ్యాఖ్యలేంటి?

అమరావతి మునగలేదని తెలిసినా రాజకీయ స్వార్థంతో వైకాపా నాయకులు దుష్ప్రచారం చేశారంటే, వారి నైజం అదేనని సరిపెట్టుకోవచ్చు. కానీ ప్రభుత్వ అధికారిగా ఉన్న వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో, అది కూడా ప్రభుత్వ ప్రాజెక్టుల్ని, పథకాల్ని విమర్శిస్తూ బాధ్యతా రహితంగా పోస్టులు పెట్టడం సర్వీసు నిబంధనలకు విరుద్ధం. రాజధానిలో శాఖమూరు, కృష్ణాయపాలెం, నీరుకొండల్లో సీఆర్‌డీఏ రిజర్వాయర్లు నిర్మించనుందంటూ వచ్చిన ఒక వార్తను ట్యాగ్ చేస్తూ సుభాష్ చంద్రబోస్ అనే అధికారి 'అమరావతి కోసం మూడు రిజర్వాయర్లెందుకు? అమరావతినే ఒక రిజర్వాయర్‌గా కడితే పోలా? అసలే ఏడాదికి మూడు పంటలు పండే నేల, రిజర్వాయర్ నీళ్లతో పుష్కలంగా ఉండదా' అంటూ తన ఫేస్‌బుక్ ఖాతాలో సోమవారం అత్యంత వ్యంగ్యంగా పోస్ట్ పెట్టారు. అక్కడితో ఆగలేదు.. 'ఒకే ఒక్క వర్షం.. అమరావతి జలమయం' అన్న క్యాప్షన్‌తో 'ఇదే మన డ్రోన్ క్యాపిటల్. ఇదే మన క్వాంటం వాలీ. వెనకబడిన ప్రాంత నిధులు, ప్రజల మీద నిర్మించిన నగరం. అతి పెద్ద రైల్వేస్టేషన్, అతి పెద్ద విమానాశ్రయం కట్టే రాజధాని' అని మరో పోస్ట్ పెట్టారు. అమరావతి నీట మునిగిపోయిందని భ్రమింపజేసేలా... నీరుకొండ-పెదపరిమి మధ్య నీట మునిగిన పొలాల ఫొటోను జతజేశారు. ఆ ప్రాంతాన్ని సోమవారం వైకాపా నేత అంబటి రాంబాబు సందర్శించి ప్రభుత్వంపైనా, రాజధానిపైనా అలాంటి విషపూరిత వ్యాఖ్యలే చేశారు. ఆ ఫొటోనే వాడుతూ సుభాష్ చంద్రబోస్ అదే తరహా వ్యాఖ్యలు చేయడం, పైగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల ప్రజలకు అమరావతిపై ద్వేషం పెంచేలా.. కామెంట్స్ పెట్టడం ఆయన దురుద్దేశాన్ని తేటతెల్లం చేస్తున్నాయి.

భారీ వర్షం కురిస్తే పునాదుల గోతుల్లోకి నీళ్లు రావా?

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందంటే చాలు అమరావతి మునిగిపోయిందంటూ జగన్ మీడియా, వైకాపా నాయకులు ప్రచారం మొదలు పెట్టేస్తున్నారు. తాజాగా అమరావతి, చుట్టుపక్కల ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి కొండవీటివాగు పోటెత్తింది. అమరావతి మీదుగా వెళ్లే ఆ వాగు వెళ్లి ప్రకాశం బ్యారేజీ ఎగువన కృష్ణా నదిలో కలుస్తుంది. అమరావతి 'బ్లూ-గ్రీన్' సిటీ కాన్సెప్ట్‌లో కొండవీటి వాగునీ ఆధునికీకరించనున్నారు. ప్రస్తుతం అమరావతి నిర్మాణ పనులు జరుగుతుండటంతో వాగు ప్రవాహానికి అక్కడక్కడా అడ్డంకులు ఉండటం, వాగు ఆధునికీకరణ పనులు ఇంకా జరగకపోవడంతో వాగులో నీరు వెనక్కి ఎగదన్ని పెదపరిమి-నీరుకొండ మధ్యలో పొలాలు కొంత నీట మునిగాయి. కొన్ని దశాబ్దాలుగా కొండవీటివాగుకు ఒక్కసారిగా వరద నీరు పోటెత్తినప్పుడు తాడికొండ మండలంలో పంటపొలాలు కొంత మునుగుతుంటాయి. నాలుగైదు రోజుల్లో ఆ నీరు వెళ్లిపోతుంది. భవిష్యత్తులో అలాంటి పరిస్థితి తలెత్తకుండా ఉండేందుకే 2019కి ముందే ప్రకాశం బ్యారేజీ వద్ద లిఫ్ట్ నిర్మించారు. పైగా ఇప్పుడు మునిగినవి అమరావతి భూసమీకరణలో తీసుకున్న భూములు కాదు. ఆ భూముల్లో పత్తి పంట స్పష్టంగా కనిపిస్తోంది. అమరావతిలో ఐకానిక్ టవర్స్ నిర్మాణానికి తవ్విన పునాదుల్లో... అది కూడా 1, 2 టవర్లకు సంబంధించిన పునాదుల్లోకి అడ్డుకట్ట వేయకపోవడంతో నీరు చేరింది. అది తప్ప అమరావతిలో ఎక్కడా నీరు చేరలేదు. ఐకానిక్ టవర్స్ పునాదుల్లోకి, అక్కడక్కడా రోడ్డు పక్క గోతుల్లోకి చేరిన నీటిని చూపించి అమరావతి మునిగిపోయిందంటూ జగన్ మీడియా దుష్ప్రచారం మొదలు పెట్టింది.

అరాచకశక్తికి అండదండాలు

- ఐపీఎస్ నుంచి మంత్రి వరకు దాసోహం
- శ్రీకాంత్‌కు పెరోల్ ఇవ్వొద్దన్న ఎస్పీ, జైలు సూపరింటెండెంట్
- ఇవ్వాల్సిందేనని ఇద్దరు ప్రజాప్రతినిధుల సిఫార్సు

ఈనాడు-అమరావతి, నెల్లూరు: అతనో కరడుగట్టిన నేరగాడు.. హత్య కేసులో దోషిగా యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తూ.. జైలు నుంచి పారిపోయాడు. నాలుగున్నరేళ్లకు పైగా బయటే ఉండి తన నేర సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నాడు. హత్యలు, దాడులు, కిడ్నాప్‌లు, సెటిల్‌మెంట్లు, బెదిరింపులు, గంజాయి స్మగ్లింగ్.. ఇలా అనేక నేరాలకు తెగబడ్డాడు. 4 జిల్లాల పరిధిలో దాదాపు 200 మందితో ఓ గ్యాంగ్‌ను ఏర్పరుచుకున్నాడు. ఏ కాంట్రాక్టు పనికి ఎవరు టెండర్లు వేయాలో కూడా అతనే నిర్ణయించేవాడు. జైల్లో ఖైదీగా ఉంటూనే దందాలు నడిపిస్తున్నాడు. తానుంటున్న జైలుకు సూపరింటెండెంట్‌గా తాను కోరుకున్న అధికారినే నియమించుకోగలిగే స్థాయికి చేరాడంటే ఆశ్చర్యపోనక్కరలేదు.

ఆ ఖైదీ.. తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన శ్రీకాంత్. అతడి ప్రియురాలు నెల్లూరుకు చెందిన అరుణ. ఇంతటి కరడుగట్టిన నేరగాడికి పెరోల్ ఇవ్వొద్దని స్వయంగా తిరుపతి జిల్లా ఎస్పీ, నెల్లూరు కారాగారం సూపరింటెండెంట్ నివేదిక ఇవ్వగా.. ఇవ్వాల్సిందేనంటూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఇద్దరు సిఫార్సు చేశారు. ఓ మంత్రి వాటిని ఎండార్స్ చేస్తూ 'ఎగ్జామిన్ అండ్ సర్క్యులేట్' అంటూ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. ప్రభుత్వంలో ఉన్నత స్థాయిలోని ఓ అధికారి అండదండలు ఉండటంతో.. ఆఘమేఘాలపై శ్రీకాంత్‌కు పెరోల్ జారీ అయిపోయింది. ఈ విషయం బయటకు పొక్కకుండా ఆ జీవోను జీవోఐఆర్ వెబ్‌సైట్‌లో పెట్టలేదు. అరాచకశక్తులకు స్వర్గధామంగా నిలిచిన వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ వ్యవహారం జరిగి ఉంటే ఏమో అనుకోవచ్చు. కానీ ఇలాంటివారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పే కూటమి ప్రభుత్వంలో ఇలా జరగటం విస్మయం కలిగిస్తోంది!!

గతంలో నెల్లూరు జిల్లాలో అరాచకశక్తిగా పేరొందిన ఓ ప్రజాప్రతినిధి అండదండలు, ప్రోద్బలంతో శ్రీకాంత్ తానూ ఓ అరాచకశక్తిగా ఎదిగాడు. ఆ నాయకుడు రాజకీయంగా తనకు ఎదురుతిరిగే వారిని భయపెట్టటం, బెదిరించటం, సెటిల్‌మెంట్లు తదితరాల కోసం శ్రీకాంత్, అతడి అనుచరగణాన్ని పెంచిపోషించారు. 2019లో వైకాపా అధికారంలోకి రావటంతో.. అప్పట్లో ఆ పార్టీలో ఉన్న సదరు నాయకుడు.. సత్ప్రవర్తన కలిగిన ఖైదీ ముసుగులో అతడిని క్షమాభిక్షపై విడుదల చేయించేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ ఆ నాయకుడే అతడిని అన్నీ తానై కాపాడుతున్నారు. గత ఐదేళ్లలో నెల్లూరు నగరంలో జరిగిన పలు హత్యల్లో శ్రీకాంత్ ప్రమేయం ఉందనే ఆరోపణలున్నాయి. అతడు జైల్లో ఉంటూనే దాదాపు 60కి పైగా తీవ్ర హింసాత్మక నేరాలు చేయించాడనే అభియోగాలున్నాయి. గతేడాది ఎన్నికల ముందు తెదేపా నాయకుడు ఒకరిపై జరిగిన హత్యాయత్నంలోనూ శ్రీకాంత్ ప్రమేయం ఉందనే ఆరోపణలున్నాయి. అలాంటి వ్యక్తికి పెరోల్ మంజూరు చేయాలంటూ నెల్లూరు జిల్లా ప్రజాప్రతినిధి సిఫార్సు లేఖ రాశారు. తిరుపతి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధితోనూ లేఖ రాయించారు. గతంలో జైలు నుంచి పారిపోయిన నేరానికి అతడికి ఏడాది శిక్ష పడింది. ఈ కారణంగా క్షమాభిక్ష అవకాశం లేకుండా అతడి పేరు రెమిషన్ రోల్స్ నుంచి తొలగించారు. అయితే వైకాపా హయాంలో 2024 జనవరిలో ఒకసారి, కూటమి ప్రభుత్వం వచ్చాక గతేడాది ఆగస్టులో ఒకసారి పెరోల్‌పై శ్రీకాంత్ బయటికొచ్చాడు. క్షమాభిక్షకు సైతం అర్హుడు కాదని తేల్చిన వ్యక్తికి ప్రజాప్రతినిధులు సాగిలపడటం విస్మయం కలిగిస్తుంది.

ఎప్పుడు కావాలంటే అప్పుడు జైల్లో కలుస్తూ..

■ శ్రీకాంత్ జైల్లో ఉంటూనే తన ప్రియురాలు అరుణ, సహచరులు జగదీశ్, భూపతి, సురేడ, రాజాలతో బయట సెటిల్‌మెంట్లు, నేరాలు చేయిస్తున్నాడని తిరుపతి ఎస్పీ తన నివేదికలో పేర్కొన్నారు. నెల్లూరులోని రౌడీషీటర్లందరూ అరుణ నాయకత్వంలోనే ఉండాలి. ఆమె చెప్పిన పనులే చేయాలి. ఎదురు తిరిగితే ఇబ్బందులే. దాదాపు 200 మంది ముఠాను నడిపిస్తోంది.

■ అరుణ ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు జైల్లో శ్రీకాంత్‌ను కలుస్తుంటుంది.

■ నెల్లూరు కేంద్ర కారాగారానికి సూపరింటెండెంట్‌గా ఎవరు రావాలో కూడా శ్రీకాంతే నిర్ణయిస్తుంటాడు. నరాల సంబంధిత సమస్య పేరిట తరచూ తిరుపతి స్విమ్స్‌కు వెళుతూ దారిలో సెటిల్‌మెంట్లు చేసేవాడు.

రూమ్‌కు సిఫార్సు చేసిన మంత్రి

■ శ్రీకాంత్‌ను నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి ఇటీవల తిరుపతిలోని స్విమ్స్‌కు తీసుకెళ్లారు. ఎస్కార్ట్‌గా వెళ్లిన ఓ ఏఆర్ కానిస్టేబుల్ అతడికి మర్యాదలు చేసేందుకు అంగీకరించలేదు. దీంతో అరుణ.. అప్పట్లో నెల్లూరు జిల్లాలో పనిచేసి ప్రస్తుతం వేరే పోస్టులో కొనసాగుతున్న ఐపీఎస్ అధికారికి ఫోన్ చేసి మాట్లాడించింది. సదరు ఐపీఎస్ అధికారి.. 'అతను మనకు బాగా కావాల్సిన వ్యక్తి. మంచిగా చూసుకో' అని కానిస్టేబుల్‌కు సూచించారు. ■ తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో శ్రీకాంత్‌కు ప్రత్యేకంగా రూమ్ ఇవ్వాలంటూ ఓ మంత్రే స్వయంగా ఫోన్ చేసి చెప్పారు. ■ ఆసుపత్రిలో కూడా అతడిది ఆడింది ఆట అన్నట్లుగా సాగింది.

రూ.280 కోట్లతో మూడు పర్యాటక ప్రాజెక్టులు

- కేంద్ర మంత్రికి డీపీఆర్‌లు అందజేసిన పర్యాటకశాఖ మంత్రి దుర్గేశ్
- లేపాక్షిని యునెస్కో జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ అభివృద్ధికి సంబంధించి రూ.280 కోట్ల అంచనాలతో రూపొందించిన మూడు సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ సోమవారం దిల్లీలో అందజేశారు. రూ.103 కోట్లతో లేపాక్షిలో సాంస్కృతిక కేంద్రం, పర్యాటకులకు మౌలిక సదుపాయాలు, లంబసింగిలో రూ.99.87 కోట్లతో పర్యాటకులకు ఆహ్లాదకర, అద్భుతమైన అనుభూతులు మిగిల్చే ఎక్స్‌పీరియన్స్ సెంటర్, మరో రూ.77.32 కోట్లతో బుద్ధిస్ట్ సర్క్యూట్ సమీపంలో టెంట్ సిటీల ఏర్పాటుకు వీలుగా డీపీఆర్‌లు రూపొందించారు. లేపాక్షికి ప్రపంచ స్థాయి గుర్తింపు లభించేలా యునెస్కో జాబితాలో చేర్చాలని కేంద్ర మంత్రిని దుర్గేశ్ కోరారు. "రాష్ట్ర ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. డీపీఆర్‌లోని అంశాలపై ఆయన చర్చించారు. పర్యాటక పరంగా రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. రూ.100 కోట్లతో అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ఎక్స్‌పీరియన్స్, ఇన్ఫర్మేషన్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించాలని కోరాం. ఇందుకోసం అమరావతిలో ఇప్పటికే ఐదెకరాల భూమి కేటాయించేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లా. రాజమహేంద్రవరంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, అమరావతిలో పర్యాటక భవనం ఏర్పాటు అంశం కూడా చర్చకు వచ్చింది" అని మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు

ఎల్వీ ప్రసాద్ నేత్ర సంరక్షణ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ

పెదవేగి, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా పెదవేగి మండలం వంగూరులో ఎల్వీ ప్రసాద్ నేత్ర సంరక్షణ కేంద్రం నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. స్థల దాతలు, విశ్రాంత ఐఏఎస్ అధికారిణి కాసరనేని దమయంతి, రాజు దంపతులు, ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ ప్రశాంత్‌గర్గ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్ (దెందులూరు), బడేటి చంటి (ఏలూరు), ఆరిమిల్లి రాధాకృష్ణ (తణుకు), గద్దె రామ్మోహనరావు (విజయవాడ తూర్పు), కామినేని శ్రీనివాస్ (కైకలూరు), మాజీ ఎంపీ జేడీ శీలం, రిజర్వ్‌బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు పాల్గొన్నారు. భూమిపూజ అనంతరం రూ.10 కోట్ల విలువైన 10.88 ఎకరాల భూమి పత్రాలను ప్రజాప్రతినిధుల సమక్షంలో దమయంతి, రాజు దంపతులు ప్రశాంత్‌గర్గ్‌కు అందజేశారు. సంరక్షణ కేంద్రానికి కాసరనేని పరిపూర్ణ లక్ష్మీ నేత్ర వైద్యశాలగా నామకరణం చేశారు. కాసరనేని విద్యాసాగర్ కుటుంబ సభ్యులు వైద్యశాలకు అనువైన రహదారుల నిర్మాణానికి భూమిని దానంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌గర్గ్ మాట్లాడుతూ.. ఏలూరు జిల్లా పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 2 లక్షల మందికి అవసరమైన నేత్ర సంరక్షణ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ సంరక్షణ కేంద్రం నిర్మాణానికి దమయంతి, రాజు దంపతులు రూ.2 కోట్లు, విశ్రాంత ఐఏఎస్ అధికారిణి వాణీశ్రీరామ్ రూ.2 కోట్లు, దువ్వూరి సుబ్బారావు రూ.కోటి విరాళం ఇవ్వడం గొప్ప విషయమని కొనియాడారు.

అన్నదాతల మేలుకోరేది కూటమి ప్రభుత్వం: మంత్రి సవిత

పెనుకొండ, న్యూస్‌టుడే: అన్నదాతల మేలుకోరేది కూటమి ప్రభుత్వమని, సీఎం చంద్రబాబు రైతుల పక్షపాతి అని మంత్రి సవిత పేర్కొన్నారు. అన్నదాతా సుఖీభవ, పీఎం కిసాన్ తొలి విడత నిధులు రైతుల ఖాతాల్లో జమ కావడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో సోమవారం రైతులు భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా సోమందేపల్లి నుంచి ట్రాక్టర్ నడుపుతూ రైతులను ఉత్సాహపరిచారు.



ట్రాక్టర్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్న మంత్రి సవిత

మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డిల ప్రమేయంతో చంపబోయారు

- గత ప్రభుత్వంలో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు
- పోలీసులను ఆశ్రయించిన ఎమ్మెల్సీ అభ్యర్థి అంకయ్య చౌదరి

ఈనాడు- కడప, న్యూస్‌టుడే- తంబళ్లపల్లె: వైకాపా హయాంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా అపహరణకు గురైన స్వతంత్ర అభ్యర్థి ఎం.అంకయ్య చౌదరి సోమవారం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె పోలీసులను ఆశ్రయించారు. వైకాపా హయాంలో నిర్వహించిన పోలింగ్ సందర్భంగా.. ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేల ప్రమేయంతో మొత్తం 24 మంది వైకాపా నాయకులు తనను అపహరించి చంపేందుకు ప్రయత్నించారన్నారు. దీనిపై అప్పట్లో తాను ఇచ్చిన రెండు ఫిర్యాదులపై పోలీసులు చర్యలు తీసుకోలేదని తెలిపారు. '2023 మార్చి 13 నాటి ఎన్నికల్లో నేను తంబళ్లపల్లె పోలింగ్ కేంద్రానికి వెళ్లి దొంగ ఓట్లను అడ్డుకున్నాను. దీంతో వైకాపా నాయకులు 30 మంది వరకు నన్ను వెంబడించి ముదివేడు వద్ద అడ్డగించారు. పక్కనున్న మిల్లులో నన్ను బంధించి సెల్‌ఫోన్లు, బంగారు ఆభరణాలు లాక్కున్నారు. కందిమడుగు గ్రామానికి చెందిన డి.చౌడేశ్వర, రెడ్డికోటవాసి జగదీష్, రెడ్డెప్ప, ఎర్రగుండ్లవారిపల్లి శివారెడ్డి, కోసువారిపల్లె కిషోర్‌కుమార్‌రెడ్డి, బేరి శ్రీను, కుక్కరాజుపల్లి ఆనందరెడ్డి, కుమ్మరిపల్లె మదన్‌మోహన్ కారులో నన్ను అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి పెట్రోల్ పోసి సజీవదహనం చేసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో వారు ఎంపీ మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డిలతో ఫోన్లలో మాట్లాడటం వినిపించింది. ఈలోపే అపహరణ ఉదంతం మీడియాలో రావడంతో నన్ను ముదివేడు తీసుకొచ్చారు. నేను మూత్రవిసర్జనకు వెళతానని తప్పించుకుని సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు పరిగెత్తాను' అని అంకయ్య చౌదరి ఫిర్యాదులో పేర్కొన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న అంకయ్య చౌదరి

ఉచిత బస్సు ప్రయాణం జగన్‌కు నచ్చడం లేదు

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

ఈనాడు, అమరావతి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వైకాపా అధ్యక్షుడు జగన్‌కు నచ్చడం లేదని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మండిపడ్డారు. అందుకే వైకాపా వాళ్లు స్త్రీ శక్తి పథకంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. బాలికల నుంచి వృద్ధుల వరకు ఏ మహిళకు ఈ పథకం వర్తించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సచివాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. "ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఘాట్ మార్గాల్లో వెళ్లే బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అనుమతించడం లేదు. తిరుపతి కొండపైకి వెళ్లే బస్సుల్లో ఉచిత పథకం ప్రవేశపెడితే నించొని ప్రయాణించాల్సి ఉంటుంది. ఇది ప్రమాదకరం. కానీ, వైకాపా వాళ్లు ఇంగితం లేకుండా విమర్శలు చేస్తున్నారు" అని వివరించారు.

EENADU Vol: 52, Issue: 10 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఊబకాయానికి తిండి కోత!

ఆధునిక జీవనశైలికి అలవడిన నేటి సమాజాన్ని కలవర పెడుతున్న అతిపెద్ద సమస్య ఊబకాయం. శారీరక శ్రమ తగ్గటం, ఎక్కువసేపు కూర్చొని చేసే పనులు మాత్రమే కాదు.. అవసరానికి మించి తినటమూ దీనికి కారణమవుతోంది. ఆహారం ద్వారా లభించే క్యాలరీల జమ, ఖర్చుల మధ్య లెక్క తప్పటం బరువు మీద గణనీయమైన ప్రభావమే చూపిస్తోంది. అందుకే తిండి మీద ధ్యాసకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఆహార పరంగా తగు జాగ్రత్తలు పాటిస్తే ఊబకాయాన్ని తగ్గించుకోవటం అసాధ్యమేమీ కాదు. కాకపోతే చిత్తశుద్ధితో ప్రయత్నించటమే కీలకం.

తిండి తింటే కండ కలుగును నిజమే. కానీ అతిగా తినటమే సమస్య. ప్రస్తుతం మన జీవనశైలి మారిపోయింది. వ్యాయామం, శ్రమ తగ్గిపోయాయి. ముడి ధాన్యాలకు బదులు బాగా పాలిష్ పట్టిన బియ్యం, మైదా పిండి వాడకం పెరిగింది. సమయం దొరక్కపోవటమో, సౌకర్యమో.. కారణమేదైనా బయటి తిండి తినటమూ ఎక్కువైంది. ఫోన్‌లో క్లిక్ చేయగానే ఇంట్లో ఆహార పదార్థాలు వాలిపోతున్నాయి. నేడు తిండి అందుబాటులో ఉండటం, తినటం ఎక్కువైందనటంలో సందేహం లేదు. దీంతో క్యాలరీల ఖర్చు కన్నా జమ ఎక్కువవుతోంది. నేటి జీవనశైలి ప్రకారం- సాధారణంగా రోజుకు 1,500-1,800 క్యాలరీలు శక్తినిచ్చే ఆహారం సరిపోతుంది. కానీ చాలామంది 2,000 కన్నా ఎక్కువే తీసుకుంటున్నారు. అంటే 200 నుంచి 500 క్యాలరీలు అదనమే అన్నమాట. ఇవి చివరికి కొవ్వుగా మారి, శరీరంలో స్థిరపడి బరువు పెరగటానికి దారితీస్తాయి. ఆహారం తగ్గించుకుంటే బరువూ తగ్గుతుందని ఇది చెప్పకనే చెబుతోంది. ఉదాహరణకు- రోజుకు 1,200 క్యాలరీలే తీసుకున్నారనుకోండి. దాదాపు 300 క్యాలరీల లోటు ఏర్పడుతుంది. అప్పుడు శరీరం శక్తి కోసం కొవ్వును వాడుకోవటం మొదలెడుతుంది. ఫలితంగా బరువూ తగ్గుతుంది.



డా॥ హితశ్రీ రెడ్డి
చీఫ్ డైటీషియన్ (రిటైర్డ్)
నిమ్స్, హైదరాబాద్



సంప్రదాయ ఆహారమే మేలు

మన సంప్రదాయ ఆహారం చాలా సమతులంగా ఉంటుంది. పురాతన కాలం నుంచీ అన్ని పోషకాలు లభించేలా చాలా చక్కగా దీన్ని రూపొందించారు. మన భోజనంలో అన్నం, పప్పు, కాయగూర, ఆకుకూర, సాంబారు లేదా పులుసు, మజ్జిగ లేదా పెరుగు అన్నీ ఉంటాయి. చాలావరకూ తాజా ఆకుకూరలు, కూరగాయలనే వాడతాం. అదీ కూరగా వండుకోవటమే ఎక్కువ. వేపుళ్లు ఎప్పుడో గానీ చేసుకోం. రుచికోసం బోలెడన్ని మసాలా దినుసులు ఉండనే ఉన్నాయి. అన్నం కాస్త తగ్గించి కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు, పండ్ల వంటివి ఎక్కువగా తింటే బరువు పెరగకుండా చూసుకోవటం పెద్ద కష్టమేమీ కాదు. మజ్జిగ, పెరుగులోని మంచి బ్యాక్టీరియా పేగులు ఆరోగ్యంగా ఉండటానికీ తోడ్పడతాయి.

✦ భోజనం ఒక్కటే కాదు, మన అల్పాహారాలూ మంచివే. ఇడ్లీ, దోశ వంటి వాటిల్లో పిండి పదార్థంతో పాటు ప్రొటీన్ కూడా తగినంత అందుతుంది. ఇడ్లీలనైతే ఆవిరి మీదే ఉడికిస్తాం. అసలు నూనె అనేదే ఉండదు.

నూనెతోనూ ముప్పే

అధిక బరువు అనగానే పిండి పదార్థాలు, చక్కెర మీదే దృష్టి పెడుతుంటారు. కానీ ముందుగా చూడాల్సింది నూనె. దీన్ని ఎంత తగ్గించుకుంటే అంత బరువు తగ్గే అవకాశముంది. పిండి పదార్థం, చక్కెరతో పోలిస్తే నూనెలో రెట్టింపు క్యాలరీలుంటాయి. ఒక చెంచా నూనెతోనే 50 క్యాలరీలు లభిస్తాయి.

✦ మామూలుగా నూనె రోజుకు 25-35 గ్రాములకు మించనీయొద్దు. ఊబకాయులైతే 10 గ్రాములకే పరిమితం చేసుకోవాలి. రోజంతా రెండు చెంచాలకు మించనీయొద్దు.

కొద్దిగానే తింటున్నామే..

'మేం కొద్దిగానే తింటాం. అయినా బరువెక్కుతున్నాం' అనేది చాలామంది ఫిర్యాదు. కానీ ఇది నిజం కాదు. ఆహారానికీ బరువుకూ ప్రత్యక్ష సంబంధం ఉందనటంలో ఎలాంటి సందేహం లేదు. అయితే చాలామంది తమ ఆహార అలవాట్లలో కొన్నింటిని పెద్దగా పట్టించుకోరు. అవేవో చిన్నవనే భావిస్తుంటారు. ఉదాహరణకు టీ, కాఫీలే తీసుకోండి. 10 గ్రాముల చక్కెరతో 40 క్యాలరీలు, 100 మి.లీ. చిక్కటి పాలతో 62 క్యాలరీలు లభిస్తాయి. కొందరు నీళ్లు కలపకుండా పూర్తిగా పాలతోనే టీ, కాఫీ కాస్తుంటారు. చాలామందికి వీటితోనే రోజు మొదలవుతుంది. ఆఫీసులకు వెళ్లేవారు అక్కడా టీ, కాఫీ తాగటంతోనే పని ప్రారంభిస్తారు. ఇంట్లో ఉండేవారూ 10, 11 గంటల సమయంలో మరోసారి తాగుతారు. బంధువులు వస్తే మరోసారి. సాయంత్రం ఇంకోసారి. ఇలా మొత్తమ్మీద టీ, కాఫీలతో తెలియకుండానే 300-400 క్యాలరీలు లభిస్తాయి. ఇది అల్పాహారంతో అందే క్యాలరీలతో దాదాపు సమానం! ఏవైనా జబ్బులుంటే తప్పించి ఏమీ తినకుండా బరువు పెరగటానికి అవకాశమే లేదు.

✦ చిక్కటి పాలకు బదులు వెన్న తీసినవి, చక్కెరకు బదులు స్టీవియా వాడుకోవటం మంచిది.



తిండి తగ్గిస్తే ఆకలేయదా?

తక్కువ తింటే శరీరానికి సరిపోతుందో లేదో.. ఆకలేస్తుందేమోననే సందేహం వద్దు. సమతులాహారంతో స్థూల, సూక్ష్మ పోషకాలన్నీ లభించేలా చూసుకుంటే ఆకలేమీ వేయదు. కొంచెం తిన్నా సరిపోయిందనే భావన కలుగుతుంది. ఆహారంలో ఏవైనా పోషకాలు లోపిస్తేనే ఏదో ఒకటి తినాలనిపిస్తుంటుంది.

ఇవి రోజూ అందాల్సిందే

పిండి పదార్థాలు, ప్రొటీన్, కొవ్వుల వంటి స్థూల పోషకాలతో పాటు విటమిన్లు, ఖనిజ లవణాల వంటి సూక్ష్మ పోషకాలూ అత్యవసరం. నిజానికి స్థూల పోషకాలు సరిగ్గా ఒంటపట్టాలంటే సూక్ష్మ పోషకాలే కీలకం. అందువల్ల ఆహారం సమతులంగా ఉండేలా చూసుకోవాలి. బియ్యం, గోధుమ, సజ్జలు, జొన్నలు, రాగుల వంటి తృణ, చిరుధాన్యాలు.. కంది, పెసర, శనగ, రాజ్మా వంటి పప్పులు.. కూరగాయలు, ఆకుకూరలు, నూనె, పాలు, పెరుగు, మజ్జిగ, చక్కెర, బెల్లం, పండ్లు ఆహారంలో ప్రతిరోజూ ఉండాలి. పిండి పదార్థాలు, చక్కెర, బెల్లం, నూనెలు శక్తినిస్తే.. పప్పులు, పాలు, పెరుగు ప్రొటీన్ అందిస్తాయి. ఇక కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు సూక్ష్మ పోషకాలను అందిస్తాయి. వీటితో లభించే పీచు కడుపు నిండిన భావనా కలిగిస్తుంది.

ఈ లెక్కలు చూసుకోవాలి

ఊబకాయులు పిండి పదార్థాలు ఒక మాదిరిగా, ప్రొటీన్ ఒక మోస్తరుగా.. ఆకుకూరలు, కూరగాయలైతే దండిగా.. పండ్లు కొద్దిగా తీసుకోవచ్చు. నూనె, కొవ్వులు బాగా తగ్గించేయాలి. చక్కెర అసలే వాడొద్దు. వీటిని లెక్కల ప్రకారం చూసుకుంటే- తృణధాన్యాలు రోజుకు 100 గ్రాములు మించనీయొద్దు. పప్పులు 30 గ్రాములు, నూనె 10 గ్రాములు, ఆకుకూరలు, కూరగాయలు 500 గ్రాములు (ఉదయం 250 గ్రాములు, రాత్రి 250 గ్రాములు), పండ్లు 100-150 గ్రాములు తీసుకోవాలి.

నమూనా ఆహార నియమం ఇదీ

ఒకేసారి ఎక్కువ మొత్తం కాకుండా రోజంతా విభజించుకొని తినాలి. దీంతో కడుపు ఖాళీగా ఉందనే భావన కలగదు. ఆ సమయానికి తీసుకోవాల్సిన ఆహారం తింటే అనవసరంగా ఆకలేయదు.

ఉదయం అల్పాహారం



- గోధుమ రవ్వ ఉప్మా (దలియా), రెండు ఇడ్లీలు, నూనె వేయకుండా వేసిన దోశ, పొట్టు పెసరపప్పుతో వేసిన దోశ, రాగి జావ.. వీటిల్లో ఏదో ఒకటి అల్పాహారంగా తినాలి. అయితే ఇడ్లీ, దోశలను కొబ్బరి, పల్లీ చట్నీలతో తినొద్దు. వీటిల్లో కనిపించకుండా నూనె ఉంటుంది. బదులుగా టమోటా, పుదీనా, కొత్తిమీర, దోసకాయ చట్నీల వంటివి తీసుకోవచ్చు. సాంబారైతే ఎక్కువ కూరగాయలు, తక్కువ నూనెతో చేసినది వాడుకోవచ్చు.
- కప్పు టీ లేదా కాఫీ (వెన్న తీసిన పాలతో చేసినవి)




ఉదయం 10–11 గంటలకు

- వెన్న తీసిన పాలతో చేసిన మజ్జిగ ఒక గ్లాసు లేదా బటర్ వేయని సూప్ లేదా కొబ్బరి నీళ్లు లేదా సలాడ్ తీసుకోవాలి.

మధ్యాహ్న భోజనం



- ఒకటిన్నర కప్పు అన్నం. ఒక కప్పు పల్చటి పప్పు. ఆకుకూరలు (150 గ్రాములు), కూరగాయల (150-200 గ్రాములు)తో వండిన కూరలు. వెన్న తీసిన పాలతో తోడుపెట్టిన పెరుగు లేదా మజ్జిగ.
- సలాడ్లు కూడా తీసుకోవాలి. వీటిని పెరుగులో కలిపి అయినా తీసుకోవచ్చు.



సాయంత్రం చిరుతిండి

ఒక కప్పు మొలకలు లేదా ఉడికించిన మొక్కజొన్నలు. మొలకల్లో పెసర్లు, బొబ్బర్లు, శనగల వంటివన్నీ ఉండేలా చూసుకోవాలి. ఊబకాయం తగ్గటానికి ఉలవలు చాలా బాగా ఉపయోగపడతాయి. ఇవి త్వరగా మొలకెత్తవు గానీ బాగా నానినా చాలు.

- కప్పు టీ లేదా కాఫీ (వెన్న తీసిన పాలతో చేసినవి).

రాత్రి భోజనం

- మధ్యాహ్న భోజనం మాదిరిగానే తీసుకోవాలి. కాకపోతే అన్నానికి బదులు పుల్కాలు, చపాతీ, రాగి రొట్టె, గోధుమ రవ్వ ఉప్మా, జొన్నరొట్టె వంటి వాటిల్లో ఏదో ఒకటి తినాలి.

రుచి కోసం మసాలా దినుసులు

ఆహారంలో ఉప్పూ తగ్గించాలి. రుచి కోసం కొత్తిమీర, పుదీనా, టమోటా, చింతపండు, ధనియాల పొడి, గరం మసాల పొడి, అల్లం వెల్లుల్లి ముద్ద వంటివన్నీ వాడుకోవచ్చు. నిజానికి వంటలకు నూనె కన్నా వీటితోనే రుచి వస్తుంది.

మాంసాహారులైతే..

- మాంసాహారులైతే పప్పు బదులు గుడ్డు, చికెన్, చేపలు తినొచ్చు. వీటిని కూరగానే వండుకోవాలి. వేపుళ్లు వద్దు. గుడ్డు పచ్చసొన రోజూ తినొద్దు. ఎప్పుడన్నా తింటే ఇబ్బంది లేదు. మాంసానికి దూరంగా ఉండటం మంచిది.
- వారానికి ఒకట్రెండు సార్లు మాంసాహారం తీసుకోవచ్చు. అదీ రోజుకు 75 గ్రాములకన్నా మించనీయొద్దు. అయితే కాలేయం వంటి అవయవాలు తీసుకోవద్దని గుర్తుంచుకోవాలి.
- శాకాహారులకు ప్రొటీన్ కోసం తక్కువ కొవ్వు గల పన్నీరు అందుబాటులో ఉంది. ఇప్పుడు సోయా టోఫు వంటివీ దొరుకుతున్నాయి.

సెప్సిస్ చికిత్సకు కొత్త యాంటీబాడీ

సెప్సిస్ తీవ్ర సమస్య. ఇన్‌ఫెక్షన్‌తో పోరాడే క్రమంలో రోగనిరోధకశక్తి గతి తప్పి, అతిగా స్పందించటం వల్ల తలెత్తే ఇది అవయవాలు, కణజాలాల మీద దాడి చేస్తుంది. సత్వరం చికిత్స అందకపోతే ప్రాణాలకూ ముప్పు వాటిల్లుతుంది. పకడ్బందీగా చికిత్స చేసినా 40% మందిలో మరీ తీవ్ర దశకు చేరుకుంటుంది. దీని మూలంగా ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 11 లక్షల మంది మరణిస్తున్నారని అంచనా. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియా, యూనివర్సిటీ ఆఫ్ మిషిగన్ శాస్త్రవేత్తలు రూపొందించిన కొత్త మోనోక్లోనల్ యాంటీబాడీ ఆశలు రేపుతోంది. ఇది వాపు ప్రక్రియను ప్రేరేపించే సైటోకైన్లను నిలువరించటం ద్వారా సెప్సిస్ నయం కావటానికి తోడ్పడుతుంది. అదీ ఇతరత్రా చికిత్సల మాదిరిగా అవాంఛిత దుష్ప్రభావాలేమీ లేకుండానే. అంతేకాదు, ఇది ఇతర స్వీయ రోగనిరోధక జబ్బుల చికిత్సకూ ఉపయోగపడుతుండటం గమనార్హం. సెప్సిస్‌కు కారణమవుతున్న కణ యంత్రాంగాలనూ తాము గుర్తించామని.. ఇది జబ్బు నిర్ధారణ, పర్యవేక్షణకూ తోడ్పడగలదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



కాలేయ జబ్బును పట్టుకోండి

కొన్నిసార్లు కాలేయ జబ్బులు, కాలేయ వైఫల్యం హఠాత్తుగా తలెత్తొచ్చు గానీ చాలావరకివి దీర్ఘకాల సమస్యలే. అంటే క్రమంగా కాలేయం దెబ్బతింటూ వస్తుందన్నమాట. లక్షణాలూ నెమ్మదిగానే మొదలై, తీవ్రమవుతుంటాయి. తొలిదశలో లక్షణాలు పెద్దగా ఉండవు. ఒకవేళ గుర్తించినా అవి కాలేయ జబ్బుకు సంబంధించినవని పోల్చుకోవటమూ కష్టమే. ఎందుకంటే అవి అస్పష్టంగా ఉంటాయి. కడుపు నొప్పి, ఆకలి వేయకపోవటం, అలసట, విరేచనాల వంటివి ఇతరత్రా జబ్బుల్లోనూ కనిపిస్తుంటాయి మరి. కాలేయం మరింతగా దెబ్బతింటూ వస్తుంటే కామెర్లు (కళ్లు, చర్మం పచ్చబడటం), చర్మం దురద, పొట్ట ఉబ్బరం, పాదాలు లేదా మడమలు ఉబ్బటం, మలం పాలిపోవటం, మూత్రం ముదురురంగులో రావటం, నిస్సత్తువ, తికమక, వాంతి, వికారం, తేలికగా చర్మం కమలటం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. ఇలాంటివి కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించటం మంచిది.



ఊపిరితిత్తి క్యాన్సర్ నిశ్శబ్ద హంతకి!

ప్రపంచవ్యాప్తంగా అతి ఎక్కువగా కనిపించే క్యాన్సర్లలో ఊపిరితిత్తి క్యాన్సర్ ఒకటి. దీని మూలంగా ఏటా 18 లక్షల మంది మృత్యువాత పడుతున్నారు. దీనికి ప్రధాన కారణం ముదిరేవరకూ గుర్తించలేకపోవటం. రొమ్ముక్యాన్సర్ వంటి వాటిల్లో తొలి లక్షణాలు కనిపిస్తుంటాయి. అందువల్ల ముందుగా పసిగట్టే అవకాశముంటుంది. కానీ ఊపిరితిత్తి క్యాన్సర్ అలా కాదు. పైకేమీ తెలియకుండానే లోలోపల వృద్ధి చెందుతూ వస్తుంటుంది. తొలిదశలో గుర్తించటం సవాలేనని చెప్పుకోవచ్చు. ఇందుకు రకరకాల అంశాలు దోహదం చేస్తుంటాయి.

తొలి లక్షణాలు లేకపోవటం

సాధారణంగా ఊపిరితిత్తి క్యాన్సర్ తొలిదశల్లో ఎలాంటి లక్షణాలూ కనిపించవు. ఊపిరితిత్తుల్లో నొప్పిని గుర్తించే గ్రాహకాలు తక్కువగా ఉంటాయి. అందువల్ల కణితి బాగా పెద్దగా అయ్యేంతవరకూ నొప్పి కలగదు. క్యాన్సర్ ముదిరి, మెడ వంటి ఇతర భాగాలకు వ్యాపించేంతవరకూ చాలామంది దీన్ని గుర్తించలేకపోతుంటారు.

ఇతర జబ్బుల లక్షణాలుగా



క్యాన్సర్ లక్షణాలు మొదలైన తర్వాత కూడా అవి ఇతర జబ్బులను పోలి ఉండటం వల్ల బురిడీ కొట్టిస్తుంటాయి. దగ్గు, ఆయాసం, నిస్సత్తువ, ఛాతీలో నొప్పి, పిల్లికూతలు, గొంతు బొంగురు వంటి లక్షణాలను బ్రాంకైటిస్, ఉబ్బసం, సీవోపీడీ వంటి సమస్యలకు చెందినవని పొరపడుతుంటారు. దగ్గినప్పుడు వాంతి పడటాన్ని క్షయగానూ భావిస్తుంటారు. చాలామంది వీటికి చికిత్స తీసుకుంటుంటారు కూడా. చివరికి క్యాన్సర్‌ను గుర్తించే సరికి చాలా ఆలస్యమైపోతుంది.

నెమ్మదిగా ముదరటం కూడా

అడినోకార్సినోమా వంటి క్యాన్సర్ రకాలు చాలావరకూ నెమ్మదిగా వృద్ధి చెందుతుంటాయి. అందువల్ల చివరిదశకు చేరుకునేంతవరకూ జబ్బు, లక్షణాలు బయటపడవు. కొందరిలో అసలు ఎలాంటి లక్షణాలూ ఉండక పోవచ్చు. అందుకే చాలామందిలో బాగా ముదిరిన తర్వాతే ఊపిరితిత్తి క్యాన్సర్ నిర్ధారణ అవుతుంటుంది.

ముందస్తు పరీక్షలు చేయకపోవటం

రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల మాదిరిగా ఊపిరితిత్తి క్యాన్సర్‌ను పట్టుకోవటానికి ముందస్తు పరీక్షలు చేసే కార్యక్రమాలేవీ లేవు. అతిగా, దీర్ఘకాలంగా పొగ తాగటం వంటి ముప్పు కారకాలు గలవారికి మాత్రమే ముందస్తు పరీక్షలు చేస్తుంటారు. ఈ పరీక్షల అర్హత జాబితాలో లేనివారు చాలామంది వీటిని చేయించుకోవటం లేదు. క్యాన్సర్ ముదిరేంతవరకూ నిర్ధారించలేకపోవటానికి ఇదీ ఒక కారణమే.

పొగతాగేవారికే వస్తుందనే భావన



సిగరెట్లు, బీడీలు, చుట్టలు కాల్చేవారికే ఊపిరితిత్తి క్యాన్సర్ వస్తుందని భావిస్తుంటారు. ఇది తప్పు. పొగ తాగేవారికి దీని ముప్పు ఎక్కువన్న మాట నిజమే గానీ పొగ తాగనివారికి రాకూడదనేమీ లేదు. సిగరెట్ల జోలికి వెళ్లని ఎంతోమంది దీని బారినపడుతున్నారు. కానీ పొగ తాగటం లేదు కాబట్టి తమకు రాదని చాలామంది ధీమాతో ఉంటుంటారు. దీంతో ఏవైనా అనుమానిత లక్షణాలు కనిపించినా డాక్టర్‌ను సంప్రదించరు. పొగతాగేవారిలోనూ కొందరు డాక్టర్ దగ్గరికి వెళ్లటానికి సంకోచిస్తుంటారు.

కీమోతో జుట్టు రాలకుండా..

క్యాన్సర్ చికిత్సల్లో కీమోథెరపీతో జుట్టు రాలుతుంటుంది. చికిత్స అనంతరం వెంట్రుకలు తిరిగి మొలిచినప్పటికీ కీమోథెరపీ తీసుకునేవారికి జుట్టు రాలటం చాలా ఆందోళన కలిగిస్తుంది. కొన్నిసార్లు ఆత్మ విశ్వాసాన్నీ దెబ్బతీస్తుంది. అందుకే వెంట్రుకలు రాలకుండా చూడటానికి చల్లటి టోపీ (కోల్డ్ క్యాప్) చికిత్స వాడుతుంటారు. దీన్ని స్కాల్ప్ కూలింగ్ అనీ పిలుస్తుంటారు. ఇది చల్లదనం ద్వారా మాడులోని రక్తనాళాలను సంకోచించేలా చేస్తుంది. ఇలా వెంట్రుకల కుదుళ్లకు కీమో మందు అంత ఎక్కువగా చేరకుండా అడ్డుకుంటుంది. అలాగని అసలే వెంట్రుకలు రాలవని కాదు గానీ కొంతవరకు తగ్గుతుంది.



రెండు రకాలు

ఆటోమేటెడ్ టోపీలు: చికిత్స తీసుకుంటున్నప్పుడు వీటిల్లో గొట్టం ద్వారా చల్లటి నీరు ప్రసారమవుతుంది.

ఫ్రోజెన్ జెల్ టోపీలు: వీటిల్లో గొట్టానికి బదులు డ్రై ఐస్ ఉంటుంది. ఇది చికిత్స చేస్తున్నప్పుడు తిరుగుతూ చల్లగా ఉండేలా చేస్తుంది.

- ఏది వాడుకోవాలనేది వ్యక్తిగత నిర్ణయమే. ధర, సౌకర్యం బట్టి ఎవరికి వారే ఎంచుకోవచ్చు.

ఎంత చల్లన?

చల్లటి టోపీల్లో ప్రసరించే ద్రవం సుమారు 2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో ఉంటుంది. ఇది మాడును 18 నుంచి 22 డిగ్రీల సెల్సియస్ మధ్యలో చల్లగా ఉండేలా చూస్తుంది.

ఎప్పుడు మొదలెట్టాలి?


కీమోథెరపీ తీసుకోవటానికి 30-60 నిమిషాల ముందే చల్లటి టోపీ ధరించాలి. చికిత్స అనంతరమూ 30-60 నిమిషాల సేపు అలాగే ఉంచాలి. తొలిసారి రేడియేషన్ తీసుకుంటున్నప్పటి నుంచే వీటిని వాడుకోవాలి. కీమోతో జుట్టు రాలటమనేది తొలిసారి చికిత్స తర్వాతే మొదలవుతుంది.

ఎవరికి సరిపోతాయి?

చల్లటి టోపీలు అందరికీ సరిపడవు. కొన్ని కీమో మందులు చాలా తీవ్రంగా ఉంటాయి. ఇవి స్వల్పంగా చేరినా వెంట్రుకల కుదుళ్లు దెబ్బతింటాయి. రక్త, మెదడు క్యాన్సర్లు.. పార్శ్వనొప్పి, కాలేయ జబ్బు గలవారు.. ఎముకమజ్జ మార్పిడికి సిద్ధమయ్యేవారు, 18 ఏళ్లలోపు వారికి ఈ టోపీలు వద్దు.

గుండెపోటు తీవ్ర సమస్య. దీనికి మూలం గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనుల్లో కొలెస్ట్రాల్, క్యాల్షియం పూడికలు ఏర్పడటం. దీంతో గుండెకు రక్త ప్రసరణ తగ్గుతుంది. కొన్నిసార్లు ఇవి ఉన్నట్టుండి రక్తనాళం గోడ నుంచి విడిపోవచ్చు. దీంతో రక్తనాళం చిట్లిపోయి, రక్తం గడ్డ కట్టొచ్చు. అప్పుడు రక్త సరఫరా పూర్తిగా నిలిచిపోతుంది. ఇది గుండెపోటుకు దారితీస్తుంది. మరి పూడికలను ముందే గుర్తిస్తే? అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ, గుండెపోటును నివారించుకోవచ్చు కదా. ఇక్కడే కరోనరీ ఆర్టరీ క్యాల్షియం స్కోర్ ఆపద్బాంధవుడిలా ఆదుకుంటోంది.

క్యాల్షియం స్కోర్‌తో కాపాడుకోండి



గుండె ధమనుల్లో ఏర్పడే పూడికల్లో కొవ్వు మాత్రమే కాదు.. క్యాల్షియం కూడా ఉంటుంది. ఇది క్రమంగా గట్టిపడుతూ వస్తుంది (క్యాల్సిఫికేషన్). పూడిక పెద్దగా ఉన్నా కొన్నిసార్లు క్యాల్షియం మోతాదు తక్కువగా ఉండొచ్చు. చిన్న పూడికల్లో ఒక్కోసారి క్యాల్షియం ఎక్కువగా ఉండొచ్చు. ఇది ఎంత ఎక్కువగా ఉంటే పూడిక అంత ప్రమాదకరంగా పరిణమిస్తుంది. దీన్ని కార్డియాక్ సీటీ స్కాన్ పరీక్షతో గుర్తించొచ్చు. ఇది రక్తనాళాల్లో క్యాల్షియం మోతాదును లెక్కించి, స్కోర్‌ను తెలియజేస్తుంది. ఇది సున్నా నుంచి వెయ్యికి పైగా అగట్‌స్టన్ యూనిట్ల వరకూ ఉండొచ్చు. దీని ఆధారంగా గుండెపోటు ముప్పును చాలావరకూ ముందుగానే అంచనా వేయొచ్చు. ఉదాహరణకు- క్యాల్షియం స్కోర్ 0 ఉన్నవారికి పదేళ్ల కాలంలో గుండెపోటు వచ్చే అవకాశం 1-6% మాత్రమే ఉంటే.. 300 కన్నా ఎక్కువగా ఉన్నవారికి 13% నుంచి 26% వరకూ పొంచి ఉంటుంది.

స్కోర్‌ను బట్టి తీవ్రత

- ✦ **0:** ఎలాంటి పూడికలు లేవని అర్థం. వీరికి గుండెపోటు ముప్పు చాలా తక్కువ.
- ✦ **1–10:** క్యాల్షియం మోతాదు చాలా తక్కువగా ఉన్నట్టు. వీరికి గుండెపోటు ముప్పు 10% కన్నా తక్కువే.
- ✦ **11–100:** స్వల్పంగా పూడిక ఉన్నట్టు. గుండెజబ్బు వచ్చే అవకాశం అంత ఎక్కువవేమీ లేదనుకోవచ్చు.
- ✦ **101–300:** ఒక మాదిరి పూడిక ఉందని. వీరికి 3-5 ఏళ్లలో గుండెపోటు ముప్పు కాస్త ఎక్కువ.
- ✦ **300–400, అంతకన్నా ఎక్కువ:** తీవ్ర పూడిక ఉన్నట్టు. వీరికి గుండెపోటు వచ్చే అవకాశం చాలా ఎక్కువ.

ఎవరికీ పరీక్ష?

గుండె క్యాల్షియం స్కోర్ పరీక్ష ఎవర్కైనా ఉపయోగపడుతుంది. అయితే మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, శారీరక శ్రమ అంతగా చేయకపోవటం, కుటుంబంలో ఇప్పటికే ఎవర్కైనా గుండెపోటు వచ్చి ఉండటం, పొగ తాగే అలవాటు, ఊబకాయం వంటి గుండెజబ్బు ముప్పు కారకాలు గలవారికి మరింత మేలు చేస్తుంది. ఈ ముప్పు కారకాల్లో కనీసం ఏ రెండు ఉన్నా 35-40 ఏళ్ల వయసులో ఒకసారి గుండె క్యాల్షియం స్కోర్ పరీక్ష చేయించుకోవటం మంచిది. అయితే గర్భిణులు దీన్ని చేయించుకోవద్దని గుర్తుంచుకోవాలి.

ఎన్నిసార్లు చేయించుకోవాలి?

మూడు నుంచి ఐదేళ్లకోసారి క్యాల్షియం స్కోర్ పరీక్ష చేయించుకోవటం మంచిది. అయితే తొలిసారి సున్నా స్కోర్ వచ్చినవారికి మాత్రమే మాటిమాటికీ చేయించుకోవటం ఉపయోగపడుతుంది. వీరికి ముప్పు ఇంకా తక్కువగానే ఉందో లేదో తెలుసుకోవటానికి తోడ్పడుతుంది. అదే తొలిసారే క్యాల్షియం స్కోర్ ఎక్కువగా ఉన్నట్టు తేలినవారు మాటిమాటికీ పరీక్ష చేయించుకుంటే పెద్ద ఉపయోగమేమీ ఉండదనే చెప్పుకోవచ్చు.


పూడికల తీరులూ తెలుస్తాయి

సీటీ స్కాన్ పరీక్షలో క్యాల్షియం స్కోర్‌తో పాటు పూడికల తీరుతెన్నులూ బయటపడతాయి. కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటే పూడిక మృదువుగా ఉందని అర్థం. అదే క్యాల్షియం ఎక్కువగా ఉంటే గట్టిగా ఉందన్నమాట. కొన్నిసార్లు కొలెస్ట్రాల్, క్యాల్షియం రెండూ కలిసి ఉండొచ్చు. ఇవి చాలా ప్రమాదకరమైనవి. చిట్లిపోయే అవకాశం ఎక్కువ. పూడిక మీది పొర మందమూ స్కాన్ పరీక్షలో తెలుస్తుంది. పొర పలుచగా ఉంటే పూడిక చిట్లిపోయే ప్రమాదం ఎక్కువ.

ముందుగానే జాగ్రత్త పడొచ్చు

క్యాల్షియం స్కోర్ ఎక్కువగా ఉన్నట్టయితే.. ✦ కొలెస్ట్రాల్‌ను తగ్గించే స్టాటిన్లు వేసుకోవటం ✦ మరింతగా వ్యాయామం చేయటం ✦ ఆహారంలో మార్పులు చేసుకోవటం ✦ అవసరమైన పరీక్షలు చేయించుకోవటం ✦ తరచూ డాక్టర్‌ను సంప్రదించటం వంటి జాగ్రత్తలతో పెద్ద ప్రమాదం రాకుండా కాపాడుకోవచ్చు.

కొత్తరకం టైప్ 1 మధుమేహం



టైప్ 1 మధుమేహంలో ఇన్సులిన్ హార్మోన్ ఉత్పత్తి అవదు. దీనికి కారణం గతి తప్పిన రోగనిరోధక వ్యవస్థ క్లోమంలో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే బీటా కణాలను దెబ్బతీయటం. ఇందులో ఆటోయాంటీబాడీలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే కొన్ని ఆఫ్రికా దేశాల్లో టైప్ 1 మధుమేహం గలవారిలో మూడింట రెండొంతుల మందిలో ఆటోయాంటీబాడీలు లేవని యూనివర్సిటీ ఆఫ్ ఎక్స్‌టర్ పరిశోధనలో బయటపడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. వీరిలో ఇన్సులిన్ లోపానికి రోగనిరోధక వ్యవస్థ కారణం కాదనే ఇది సూచిస్తోంది. అలాగే వీరిలో జన్యుపరమైన ముప్పు కారకాలూ కనిపించకపోవటం మరింత విచిత్రం. అందువల్ల దీన్ని పూర్తిగా కొత్తరకం మధుమేహంగా భావిస్తున్నారు. ఆఫ్రికా దేశాల్లో టైప్ 1 మధుమేహానికి చికిత్స తీసుకుంటున్న కొందరిపై ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో ఇది వెల్లడైంది. వీరిలో 65% మందిలో ఆటోయాంటీబాడీలు కనిపించలేదు. జన్యుపరమైన ముప్పు స్కోరూ 18% కన్నా తక్కువగానే ఉంది. అయినప్పటికీ వీరిలో ఇన్సులిన్ లోపం ఉండటం, టైప్ 1 ముప్పు ఎక్కువగా ఉండటం గమనార్హం. పైగా టైప్ 1 లేదా పోషణ లోపంతో వచ్చే మధుమేహం లక్షణాలు కూడా లేవు. అందువల్ల దీన్ని సంప్రదాయ టైప్ 1 మధుమేహం కన్నా భిన్నమైందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీనికి చికిత్స కూడా వేరేగా చేయాల్సి ఉండటం వల్ల మరింతగా అధ్యయనం చేయాల్సి ఉందని చెబుతున్నారు.

ఈనాడు బిజినెస్

13.04 కోట్ల జన్‌ధన్ ఖాతాలు వాడట్లేదు



దిల్లీ: దేశంలో ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన (పీఎంజేడీవై) ఖాతాలు 56.03 కోట్ల వరకు ఉండగా.. ఇందులో 23 శాతం నిరుపయోగంలో ఉన్నాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌద్రీ తెలిపారు. '2025 జులై 31 వరకు మొత్తంగా 56.03 పీఎంజేడీవై ఖాతాలు ఉంటే, అందులో 13.04 కోట్ల ఖాతాలను సదరు ఖాతాదార్లు వాడటం లేద'ని లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా మంత్రి వెల్లడించారు. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 2.75 కోట్ల జన్‌ధన్ ఖాతాలు నిరుపయోగంలో ఉండగా.. ఆ తర్వాతి స్థానాల్లో బిహార్ (1.39 కోట్లు), మధ్యప్రదేశ్ (1.07 కోట్లు) ఉన్నాయి. రెండేళ్లుగా ఎటువంటి లావాదేవీలు నిర్వహించకుంటే ఆ ఖాతాలను నిరుపయోగ ఖాతాగా పరిగణించాలని ఆర్‌బీఐ మార్గదర్శకాలు చెబుతున్నాయి. ఈ విషయాన్ని సదరు ఖాతాదార్లకు ఎస్‌ఎమ్‌ఎస్ లేదా లేఖలు లేదా ఇ-మెయిల్ ద్వారా బ్యాంకులు సమాచారం అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. పసిడి రుణాల్లో నిరర్థక ఆస్తుల నిష్పత్తి 2023లోని 0.2 శాతం నుంచి 2025 మార్చిలో స్వల్పంగా పెరిగి 0.22 శాతానికి చేరింది. ఎగువ, మధ్య విభాగాల్లోని ఎన్‌బీఎఫ్‌సీలకు ఇదే కాలంలో ఇది 1.21 శాతం నుంచి 2.14 శాతానికి పెరిగింది.

4 రోజుల్లో 5 లక్షలకు ఫాస్టాగ్ వార్షిక పాస్‌లు



దిల్లీ: కొత్తగా ప్రవేశపెట్టిన ఫాస్టాగ్ వార్షిక పాస్ సదుపాయాన్ని వినియోగిస్తున్న వారి సంఖ్య నాలుగు రోజుల్లోనే 5 లక్షలను మించిందని ఓ అధికారిక ప్రకటన తెలిపింది. ఈ ఫాస్టాగ్ వార్షిక పాసును ఆగస్టు 15న ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఏడాది ఒకేసారి రూ.3,000 చెల్లిస్తే.. ఆ ఏడాదికాలంలో 200 టోల్ ప్లాజాలను దాటేందుకు వాహన వినియోగదారులు అనుమతి పొందుతారు. దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ హైవేల వద్ద సుమారు 1,150 టోల్ బూత్‌ల్లో ఈ ఫాస్టాగ్ వార్షిక పాస్ చెల్లుబాటు అవుతుంది. గత నాలుగు రోజుల్లో అత్యధికంగా తమిళనాడులో ఈ వార్షిక పాసులను కొనుగోలు చేశారు. ఆ తర్వాతి స్థానంలో కర్ణాటక, హరియాణా ఉన్నాయని ఆ అధికారిక ప్రకటన తెలిపింది. అలాగే ఈ ఫాస్టాగ్ వార్షిక పాస్‌తో ఇప్పటివరకు అత్యధిక లావాదేవీలు తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో నమోదయ్యాయని వెల్లడించింది.

పదేళ్లకు రూ.1000 కోట్ల అద్దె!



బెంగళూరు కార్యాలయ స్థలం కోసం యాపిల్ ఖర్చు

దిల్లీ: ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్ ఇండియా బెంగళూరులో 2.7 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసుకున్నట్లు డేటా అనలిటిక్స్ సంస్థ ప్రాప్‌స్టాక్ వెల్లడించింది. ప్రారంభంలో నెలవారీగా రూ.6.3 కోట్ల అద్దె చెల్లించేలా పదేళ్ల లీజుకు తీసుకుంది. ఏడాదికి 4.5 శాతం చొప్పున అద్దె పెంపుతో మొత్తం ఈ పదేళ్లలో సంస్థ రూ.1,000 కోట్లను అద్దెగా చెల్లించబోతోంది. 2025 ఏప్రిల్ 3 నుంచి 120 నెలల కాలానికి లీజు కుదుర్చుకుంది. మన దేశం నుంచి అతి పెద్ద మొబైల్ ఫోన్ల ఎగుమతిదారుగా గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో యాపిల్ నిలిచింది. సుమారు రూ.1.5 లక్షల కోట్ల విలువైన ఫోన్లను ఎగుమతి చేసింది.

15 శాతానికి విద్యుత్ వాణిజ్య వాహనాలు

టీఐ క్లీన్ మొబిలిటీ ఛైర్మన్ అరుణ్ మురుగప్పన్



ఈనాడు, హైదరాబాద్: వాణిజ్య విద్యుత్ వాహనాల అభివృద్ధి, ఉత్పత్తి కోసం రూ.3,000 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు మురుగప్ప గ్రూపు సంస్థ టీఐ క్లీన్ మొబిలిటీ తెలిపింది. విద్యుత్ ఆటోలు, చిన్న వాణిజ్య వాహనాలు (ఇ-ఎస్‌సీవీ), ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, 55 టన్నుల హెవీ డ్యూటీ ట్రక్కుల్లాంటివి తీసుకొస్తున్నట్లు పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ సంస్థకు చెందిన మోంట్రా విద్యుత్ చిన్న వాణిజ్య వాహనాల విక్రయ కేంద్రాన్ని సోమవారం హైదరాబాద్‌లో టీఐ క్లీన్ మొబిలిటీ ఛైర్మన్ అరుణ్ మురుగప్పన్, హర్ష గ్రూప్ ఛైర్మన్ హర్షవర్ధన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మురుగప్పన్ మాట్లాడుతూ.. 1.7 టన్నుల పేలోడ్ సామర్థ్యంతో మోంట్రా ఏవియేటర్‌ను తీసుకొచ్చామని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఇప్పటికే 13 డీలర్‌షిప్ కేంద్రాలున్నాయని తెలిపారు. శ్రీ రామ్ హర్షతో కలిసి తెలుగు రాష్ట్రాల్లో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. త్వరలోనే విజయవాడ, విశాఖపట్నానికి విస్తరిస్తున్నట్లు తెలిపారు. చిన్న వాణిజ్య వాహన విభాగం (3.5 టన్నుల వరకూ) 5-6 శాతం వార్షిక వృద్ధి సాధిస్తోందని ఇందులో ప్రస్తుతం ఈవీల వాటా 1 శాతం వరకూ ఉందన్నారు. త్వరలోనే ఇది 10-15 శాతానికి చేరుకుంటుందని అంచనా వేశారు. ప్రస్తుతం రూ.650 కోట్లుగా ఉన్న టర్నోవర్‌ను 2029-30 నాటికి రూ.8,700 కోట్లు (1 బిలియన్ డాలర్లు) చేర్చాలనే లక్ష్యంతో ఉన్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జలజ్ గుప్తా వివరించారు. ఏవియేటర్ ఒక ఛార్జింగ్‌తో 170 కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తుందని, 2.5 లక్షల కిలోమీటర్లు/7 ఏళ్ల వరకూ వారంటీని అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

కోడి గుడ్డు

19న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	495
వరంగల్	497
విజయవాడ	520
గోదావరి	520
విశాఖపట్నం	520
చిత్తూరు	558

ఏసీ ధరలు చల్లబడతాయ్



రూ.2,500 వరకు తగ్గొచ్చు

● తయారీ సంస్థల అంచనా ● ప్రతిపాదిత జీఎస్‌టీ రేట్ల కోతతో

దిల్లీ: ప్రతిపాదిత జీఎస్‌టీ రేట్ల కోతతో రాబోయే పండగ సీజనులో అమ్మకాల సందడి నెలకొంటుందని గృహోపకరణాల తయారీ సంస్థలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ఏసీలపై జీఎస్‌టీని ప్రస్తుతమున్న 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించే అవకాశం ఉండటంతో... ఏసీల ధరలు మోడళ్లను బట్టి రూ.1,500- 2,500 వరకు దిగివస్తాయని చెబుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం ఆదాయపు పన్ను రేట్లను, ఆర్‌బీఐ రెపో రేటును తగ్గించినందున.. రాబోయే రోజుల్లో జీఎస్‌టీ తగ్గింపుతో మరింతగా ఏసీ కొనుగోళ్లు పెరుగుతాయని పరిశ్రమ భావిస్తోంది. కొనుగోళ్ల భారం తగ్గనుండటం వల్ల ఖరీదైన, విద్యుత్ ఆదా చేసే మోడళ్ల వైపు కూడా వినియోగదార్లు మొగ్గు చూపుతారని అంటోంది. అలాగే 32 అంగుళాలకు పైగా ఉండే టీవీలు కూడా ప్రస్తుతమున్న 28 శాతం నుంచి 18 శాతం జీఎస్‌టీ శ్లాబ్‌లోకి రావచ్చు.

వెంటనే తగ్గిస్తే మేలు

'జీఎస్‌టీ రేట్లను తగ్గించనుండటం మంచి పరిణామం. అయితే దీనిని ప్రభుత్వం త్వరగా అమలు చేస్తే బాగుంటుంది. ఎందుకంటే సాధారణంగా ఆగస్టులో ఎవరూ ఏసీలను కొనడానికి ఆసక్తి చూపరు. సెప్టెంబరు లేదా అక్టోబరు 1 వరకు ఎదురుచూస్తుంటారు. అందువల్ల జీఎస్‌టీ రేట్లను వెంటనే తగ్గిస్తే.. ఇప్పటికే కొనుగోళ్లను వాయిదా వేసుకున్న వారి నిర్ణయంలో మార్పు రావొచ్చు. జీఎస్‌టీ తగ్గింపుతో 10 శాతం వరకు ఏసీ ధరలు తగ్గుతాయ'ని బ్లూస్టార్ ఎండీ బి. త్యాగరాజన్ అంటున్నారు. 'ప్రతిపాదిత జీఎస్‌టీ రేట్ల కోతతో గృహోపకరణాల వినియోగం, గిరాకీ పెరుగుతుంది. దేశంలో ఏసీల వినియోగం 9-10 శాతం మాత్రమే ఉంది. ఇప్పుడు జీఎస్‌టీని 18 శాతానికి తగ్గిస్తే.. వీటి ధరలు సాధారణ ప్రజలకూ మరింతగా అందుబాటులోకి వస్తాయ'ని గోద్రేజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూపు బిజినెస్ హెడ్ (అప్లయెన్సెస్ బిజినెస్) కమల్ నంది చెబుతున్నారు.

6-7 శాతమే తగ్గొచ్చు

'ఏసీలు, ఇతర గృహోపకరణాలపై జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించినప్పటికీ.. మార్కెట్‌లో వీటి ధర నేరుగా 6-7 శాతమే తగ్గుతుంది. ఉత్పత్తి మూలధర (బేస్ ప్రైస్)పైనే జీఎస్‌టీని విధిస్తుండటమే ఇందుకు కారణం. అందువల్ల మోడళ్లను బట్టి ఏసీలపై రూ.1,500- 2,000 వరకు తగ్గుతుంద'ని పానసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా ఛైర్మన్ మనీశ్ శర్మ పేర్కొన్నారు. '32 అంగుళాల టీవీలను 5 శాతం శ్లాబ్‌లోకి తీసుకొని రావడంపై ప్రభుత్వం ఆలోచన చేయాలి. ఈ విభాగంలో 38 శాతం వరకు కొనుగోళ్లు అసంఘటిత రంగం నుంచే ఉంటుండటం వల్ల 5 శాతానికి జీఎస్‌టీని తగ్గిస్తే ఒక గొప్ప మలుపు అవుతుందని సూపర్ ప్లాస్ట్రానిక్స్ సీఈఓ అవ్నీత్ సింగ్ మార్వా అన్నారు.

18 శాతం శ్లాబే జీఎస్‌టీకి ఆధారం

ప్రతిపాదిత సంస్కరణలు అమల్లోకి వస్తే

దిల్లీ: కేంద్రం ప్రతిపాదించిన రెండు అంచెల వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) నిర్మాణం, ప్రత్యేక 40 శాతం రేటు అమల్లోకి వస్తే.. 18 శాతం పన్ను శ్లాబే జీఎస్‌టీ ఆదాయానికి ప్రధాన ఆధారంగా ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం జీఎస్‌టీ 5, 12, 18, 28 శాతం రేట్లతో నాలుగు అంచెల నిర్మాణాన్ని కలిగి ఉన్న సంగతి విదితమే. కేంద్రం ప్రతిపాదించినట్లు 12, 28 శాతం శ్లాబులు తొలగిస్తే.. 5, 18 శాతం జీఎస్‌టీలో 18 శాతం శ్లాబు నుంచే జీఎస్‌టీ ఆదాయం అధికంగా వస్తుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మధ్య తరగతి, పేదలకు లబ్ధి చేకూరేలా ఆహారం, నిత్యావసర వస్తువులు 5 శాతం పన్ను పరిధిలోకి రాగా, విలాసవంతమైన వస్తువులు 18 శాతం పరిధిలో ఉంటాయని సమాచారం.

20న ఆర్థిక మంత్రితో సమావేశం: పన్ను రేట్లను తగ్గించి, తద్వారా సాధారణ వినియోగ వస్తువుల ధరలను తగ్గించడానికి ప్రతిపాదించిన జీఎస్‌టీ సంస్కరణలకు మద్దతుగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం (20న)రాష్ట్ర మంత్రుల బృందంతో నిర్వహించనున్న కీలక సమావేశంలో ప్రసంగించనున్నారు.


రద్దయిన పాలసీలకు జీవం

ఎల్ఐసీ ప్రత్యేక వెసులుబాటు



ఈనాడు, హైదరాబాద్: ప్రీమియం చెల్లించకపోవడంతో రద్దయిన జీవిత బీమా పాలసీల పునరుద్ధరణకు వీలు కల్పిస్తున్నట్లు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) ప్రకటించింది. ఇందు కోసం అక్టోబరు 17 వరకూ అవకాశం ఉంటుందని తెలిపింది. పాలసీల పునరుద్ధరణ కోసం ఆలస్యపు రుసుములపై ప్రత్యేక రాయితీని ఇస్తోంది. ఇది నాన్-లింక్డ్ బీమా పాలసీలకు 30 శాతం లేదా గరిష్ఠంగా రూ.5,000 వరకూ ఉంటుంది. సూక్ష్మ బీమా పాలసీలకు 100 శాతం రుసుము మినహాయింపు ఇస్తోంది. పాలసీకి ప్రీమియం చెల్లించడం ఆపేసి, అయిదేళ్లు మించకపోతేనే పునరుద్ధరణ సాధ్యం అవుతుంది. వ్యవధి తీరిన పాలసీలకు ఇది వర్తించదు. అనివార్య కారణాలతో సకాలంలో ప్రీమియం చెల్లించలేకపోయిన పాలసీదారులకు ఇది ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని ఎల్ఐసీ వెల్లడించింది. పాత పాలసీలను పునరుద్ధరించుకోవడం వల్ల అవి అందించే ప్రయోజనాలు దూరం కాకుండా ఉంటాయని తెలిపింది.

ఏఏఏఐ బోర్డుకు మళ్లీ ఎన్నికైన 'శ్లోకా' శ్రీనివాస్




హైదరాబాద్: అడ్వర్టయిజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఏఏఐ) డైరెక్టర్ల బోర్డుకు శ్లోకా అడ్వర్టయిజింగ్‌కు చెందిన శ్రీనివాస్ మళ్లీ ఎన్నికయ్యారు. మూడు దశాబ్దాలుగా దేశీయ ప్రకటనల రంగానికి అంకితభావంతో ఆయన అందించిన సేవలకు, సహకారానికి ఇది నిదర్శనమని ఏఏఏఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఒక సంస్థను ప్రారంభించిన దగ్గర నుంచి ఏఏఏఐ బోర్డుకు ఎన్నికయ్యే వరకు ఆయన వృత్తి జీవనం ఎంతో నిబద్ధతతో సాగిందని, ఆయన నాయకత్వ దక్షత ఆదర్శనీయమని పేర్కొంది. ఏఏఏఐ బోర్డుకు మళ్లీ ఎన్నికవ్వడం తనకు లభించిన గౌరవంగా భావిస్తున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు శ్రీనివాసన్ కె స్వామి, ప్రకటనల పరిశ్రమకు చెందిన ఇతర దిగ్గజాలతో కలిసి పనిచేసేందుకు ఎంతో ఉత్సుకతతో ఉన్నట్లు చెప్పారు.

24 శాతం పెరిగిన కార్యాలయాల అద్దె లావాదేవీలు



దిల్లీ: దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో జనవరి-జూన్ మధ్య కార్యాలయాల అద్దె లావాదేవీలు 24 శాతం పెరిగాయి. గత ఏడాది ఇదే కాలంలో 2.25 కోట్ల చదరపు అడుగులతో పోలిస్తే, ఈసారి 2.78 కోట్ల చ. అడుగుల స్థలం అద్దెకు వెళ్లిందని స్థిరాస్తి సేవల సంస్థ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ వెల్లడించింది. బెంగళూరులో 60.2 లక్షల నుంచి 60 లక్షల చ. అడుగులకు తగ్గింది. కోల్‌కతాలో 9 లక్షల నుంచి 8 లక్షల చ.అడుగులకు తగ్గింది. అహ్మదాబాద్‌లో 94 శాతం క్షీణించింది. ఇక్కడ గత ఏడాది 21 లక్షల చ.అడుగుల స్థలం లీజుకు వెళ్లగా ఈసారి ఇది కేవలం 1 లక్ష చ.అడుగులు మాత్రమే ఉంది. ఇక హైదరాబాద్‌లో కార్యాలయాల అద్దె లావాదేవీలు స్థిరంగా ఉన్నాయి. ఇక్కడ 28 లక్షల చదరపు అడుగుల స్థలం అద్దెకు వెళ్లింది. ముంబయిలో 55 లక్షలు, దిల్లీ-ఎన్‌సీఆర్‌లో 52 లక్షలు, పుణేలో 43 లక్షలు, చెన్నైలో 31 లక్షల చ. అడుగుల స్థలాన్ని సంస్థలు అద్దెకు తీసుకున్నాయి. భారత కార్యాలయ మార్కెట్ బలమైన దృఢత్వంతో, దీర్ఘకాలిక అద్దె లావాదేవీలతో అంతర్జాతీయ స్థాయిని అధిగమిస్తూనే ఉందని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అన్షుల్ జైన్ తెలిపారు. జనవరి-జూన్ మధ్య కాలంలో కొత్త కార్యాలయ స్థల సరఫరా ఏడాదికి 14 శాతం మేరకు పెరిగి 2.32 లక్షల చదరపు అడుగులకు చేరిందని నివేదిక వెల్లడించింది.

జులైలో తగ్గిన నిరుద్యోగ రేటు



దిల్లీ: మన దేశంలో నిరుద్యోగ రేటు జులైలో 5.2 శాతానికి తగ్గిందని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. జూన్‌లో ఇది 5.6 శాతంగా ఉంది. మేలో కూడా నిరుద్యోగ రేటు 5.6 శాతంగానే ఉందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే తెలిపింది. జులైలో మహిళల నిరుద్యోగ రేటు 5.1 శాతంతో పోలిస్తే... పురుషుల్లో 5.3 శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగ రేటు 7.1 శాతం నుంచి 7.2 శాతానికి పెరగ్గా, గ్రామీణ ప్రాంతాల్లో అది 4.9 శాతం నుంచి 4.4 శాతానికి తగ్గింది. 15-29 ఏళ్ల వయసు కలిగిన వారిలో నిరుద్యోగ రేటు జూన్‌లో 15.3 శాతం నుంచి జులైలో 14.9 శాతానికి తగ్గింది.


హైదరాబాద్‌లో హావర్త్ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ ప్రారంభం

రాయదుర్గం, న్యూస్‌టుడే: ఐటీ, రియల్ ఎస్టేట్ వంటి రంగాల అభివృద్ధి నేపథ్యంలో హైదరాబాద్‌లో కార్యాలయ, గృహ ఫర్నిచర్ రంగానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ప్రముఖ ప్రీమియం వర్క్ స్పేస్ సొల్యూషన్స్ సంస్థ హావర్త్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ హెన్నింగ్ ఫిగ్ తెలిపారు. హైదరాబాద్‌లోని రాయదుర్గం గౌరా పెల్లాడియంలో ఆ సంస్థ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియెన్స్ సెంటర్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 'భారత్‌లో తమ సంస్థ 1997లోనే వ్యాపారాన్ని ప్రారంభించింది. హైదరాబాద్‌లో డీలర్ ద్వారా తమ ఉత్పత్తులను అందజేస్తున్నాం. కార్పొరేట్ కార్యాలయాలతో పాటు రెస్టారెంట్లు, గృహావసరాల ఫర్నిచర్ వంటి ఉత్పత్తులు విక్రయిస్తున్నాం. ప్రముఖ కార్లు, విమానాల సీటింగ్ వ్యవస్థనూ కల్పిస్తాం. బోయింగ్‌తోపాటు ఫెరారీ, బెంట్లే వంటి సంస్థలు తమ వినియోగదారులుగా ఉన్నార'న్నారు. హావర్త్ ఇండియా ఎండీ మనీష్ ఖండేల్వాల్ మాట్లాడుతూ నగర మార్కెట్ వేగంగా విస్తరిస్తోందని, జీసీసీలకు దేశానికి రెండో రాజధానిగా నిలుస్తుందన్నారు. సంస్థ సేల్స్ విభాగం వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ రావల్ మాట్లాడుతూ రోజుకు సంస్థ 600 ఉత్పత్తులను భారత్‌లో తయారు చేస్తున్నట్లు తెలిపారు.

'భారత్‌లో తయారీ' అంటే అన్నీ ఇక్కడే చేయాలని కాదు!

● అలాగైతే పెట్టుబడులు, ఉత్పాదకతపై ప్రభావం పడొచ్చు

● ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



దిల్లీ: 'మేకిన్ ఇండియా' (భారత్‌లో తయారీ) అనేది 'భారతదేశానికి అవసరమైనవన్నీ ఇక్కడే తయారు చేసే' అంశంగా మారకూడదని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అభిప్రాయపడ్డారు. ఇది దేశంలో పెట్టుబడులను దెబ్బతీస్తుందని, ఉత్పాదకతను ప్రభావితం చేస్తుందని హెచ్చరించారు. భారత ఎగుమతులపై అమెరికా విధించిన 50 శాతం టారిఫ్ అతి ముఖ్యమైన విదేశీ విపణి అయిన అమెరికాలో భారతీయ వస్తువుల ధరలను పెంచుతాయని సుబ్బారావు అభిప్రాయపడ్డారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

'మేకిన్ ఇండియా' అనేది 'భారతదేశానికి అవసరమైనవన్నీ తయారు చేయండి'గా దిగజారితే, చైనా నుంచి పెట్టుబడులను ఆకర్షించే అవకాశాన్ని మనం కోల్పోయే ప్రమాదం ఉంది. స్థిరమైన వృద్ధికి ఒంటరితనం మార్గం కాదని, బహిరంగ విపణి మార్గం అని సుంకాలు మనకు గుర్తు చేస్తున్నాయి. మేకిన్ ఇండియా విజయం పోటీతత్వంపై ఆధారపడి ఉంటుంది. రక్షణ వాదం మీద కాదు. ప్రధాని మోదీ తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో పునరుద్ఘాటించిన ఆత్మనిర్భర్ భారత్ ఆకాంక్షకు రక్షణ, ఇంధన వంటి సున్నితమైన రంగాల్లో వ్యూహాత్మక స్వావలంబన అని అర్థం చేసుకోవాలని, పూర్తి స్వయం సమృద్ధి కాదని వివరించారు. రష్యా చమురు దిగుమతులను మన దేశం వెంటనే తగ్గించడం సాధ్యం కాకపోవచ్చు. అకస్మాత్తుగా రష్యా నుంచి గల్ఫ్‌కు మారితే, ప్రపంచ చమురు ధరలు పెరుగుతాయి. ఎందుకంటే యూఎస్ షేల్ లేదా ఒపెక్ రెండూ సరఫరాను అంత త్వరగా పెంచలేవు'.

యూఎస్ మార్కెట్ నుంచి కొన్ని మందులు వెనక్కి

గ్లెన్‌మార్క్, అలెంబిక్, సన్ ఫార్మా నిర్ణయం



దిల్లీ: అమెరికా మార్కెట్ నుంచి కొన్ని మందులను వెనక్కి తీసుకోవాలని మనదేశానికి చెందిన మూడు ఫార్మా కంపెనీలు నిర్ణయించాయి. ఈ మందుల్లో నైట్రోసమైన్ అనే క్యాన్సర్ కారక మలినాలు కనిపించటంతో యూఎస్ఎఫ్‌డీఏ అభ్యంతరం వ్యక్తం చేసింది. గ్లెన్‌మార్క్ ఫార్మా రెండు మందులను వెనక్కి తీసుకుంటోంది. కార్వెడిలాల్ ట్యాబ్లెట్, థియోఫిల్లిన్ ఈఆర్ ట్యాబ్లెట్లను ఈ సంస్థ వెనక్కి తీసుకునే చర్యలు చేపట్టింది. అదేవిధంగా అలెంబిక్ ఫార్మా, ఇన్సోమ్నియా చికిత్సలో వినియోగించే డాగ్జెపిన్ హెచ్‌సీఎల్ క్యాప్సూల్స్‌ను వెనక్కి తీసుకుంటోంది. సన్ ఫార్మాసూటికల్స్ కూడా స్పిరనోలాక్టోన్ ట్యాబ్లెట్లను వెనక్కి తీసుకోవాలని నిర్ణయించింది. ఇందులో 'అల్యూమినియం' ఉన్నట్లు యూఎస్ఎఫ్‌డీఏ గుర్తించింది. ఇప్పటికే యూఎస్ మార్కెట్లో పంపిణీ వ్యవస్థలోకి వెళ్లిన ఈ మందుల కొన్ని బ్యాచ్‌లను 'క్లాస్-2 రీకాల్' పద్ధతిలో ఈ కంపెనీలు వెనక్కి తీసుకుంటున్నాయి.

పెద్ద ఐపీఓలకు కనీస ఆఫర్ పరిమాణం తగ్గింపు

దిల్లీ: భారీ కంపెనీలకు కనీస పబ్లిక్ ఆఫర్ నిబంధనలను సడలించాలని సెబీ ప్రతిపాదించింది. కనీస ప్రజా వాటా నిబంధనలను అందుకోవడానికి గడువును కూడా పొడిగించనుంది. రూ.5,000 కోట్ల లోపు ఐపీఓల కేటాయింపుల్లో రిటైల్ వాటాను 35 శాతం నుంచి 25 శాతానికి పరిమితం చేయాలని సెబీ ప్రతిపాదించింది. వీటిపై సెప్టెంబరు 8లోపు స్పందనలు తెలియజేయాల్సిందిగా కోరింది.

యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే ప్రతిపాదన లేదు

ఈనాడు, దిల్లీ: యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే ప్రతిపాదనేదీ ప్రస్తుతానికి లేదని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌద్రీ తెలిపారు. 'యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలను నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తుంది. బ్యాంకులు లావాదేవీ విలువపై 0.30% మర్చెంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఛార్జిచేయడానికి 2019 ఆగస్టు 30న జారీచేసిన సర్క్యులర్ బ్యాంకులకు అవకాశం కల్పిస్తోంది.

మార్కెట్లకు జీఎస్‌టీ జోష్



రూ.6.17 లక్షల కోట్లు పెరిగిన మదుపర్ల సంపద

ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.551 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.4,104 కోట్లు

సెన్సెక్స్ ▲676 81274

నిఫ్టీ ▲246 24877

సమీక్ష

కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ సంస్కరణలను ప్రకటించడంతో సోమవారం దేశీయ సూచీలు భారీగా లాభపడ్డాయి. వాహన, వినియోగ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్ 81,000 పాయింట్ల ఎగువన ముగిసింది. భారత సార్వభౌమ రుణ రేటింగ్‌ను ఎస్ అండ్ పీ పెంచడం, అమెరికా-రష్యా చర్చలపై సానుకూలతలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 20 పైసలు బలపడి 87.39 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.62% లాభంతో 66.25 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా సూచీలు నష్టాల్లో ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ సోమవారం రూ.6.17 లక్షల కోట్లు పెరిగి రూ.450.96 లక్షల కోట్లు (5.16 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 718 పాయింట్ల (క్రితం ముగింపు 80,597.66) లాభంతో 81,315.79 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడిన సూచీ. ఇంట్రాడేలో 1168.11 పాయింట్ల లాభంతో 81,765.77 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 676.09 పాయింట్లు పెరిగి 81,273.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 245.65 పాయింట్లు రాణించి 24,876.95 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,852.85- 25,022 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 20 లాభపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్ 5.02%, అల్ట్రాటెక్ 3.71%, బజాజ్ ఫిన్‌సర్వ్ 3.70%, ఎం అండ్ ఎం 3.54%, హెచ్‌యూఎల్ 3.46%, ట్రెంట్ 2.82%, ఏషియన్ పెయింట్స్ 2.29%, అదానీ పోర్ట్స్ 2.08%, టైటన్ 1.86% రాణించాయి. ఐటీసీ 1.26%, ఎల్ అండ్ టీ 1.18%, ఎటెర్నల్ 1.16%, టెక్ మహీంద్రా 1.02%, ఎన్‌టీపీసీ 0.91% నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. వాహన 4.26%, మన్నికైన వినిమయ వస్తువులు 3.08%, వినియోగ 2.74%, స్థిరాస్తి 2.19%, కమొడిటీస్ 1.96%, లోహ 1.95%, సేవలు 1.30% పెరిగాయి. ఐటీ, విద్యుత్, టెక్ నిరాశపరిచాయి. బీఎస్ఈలో 2562 షేర్లు లాభపడగా, 1627 స్క్రిప్‌లు నష్టపోయాయి. 190 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

✦ **వాహన షేర్లు రయ్ రయ్:** వాహనాలపై జీఎస్‌టీ తగ్గొచ్చన్న అంచనాలతో ఈ రంగ షేర్లు దుమ్మురేపాయి. మారుతీ సుజుకీ 8.94%, హ్యుందాయ్ 8.45%, అశోక్ లేలాండ్ 8.12%, అపోలో టైర్స్ 7.28%, టీవీఎస్ 6.58%, హీరో మోటోకార్ప్ 5.90%, బజాజ్ ఆటో 4.52%, ఎంఆర్ఎఫ్ 4.11%, మహీంద్రా 3.54%, ఐషర్ 2.46%, టాటా మోటార్స్ 1.78% చొప్పున లాభాలు నమోదుచేశాయి. వినియోగ షేర్లలో అంబర్ ఎంటర్‌ప్రైజెస్ 7.93%, బ్లూస్టార్ 7.35%, వోల్టాస్ 5.78%, హావెల్స్ 5.12%, వర్ల్‌పూల్ 4.74%, సింఫనీ 3.69% పరుగులు తీశాయి.

✦ సోలార్ పీవీ మాడ్యుల్ తయారీ సంస్థ గోల్డీ సోలార్‌లో రూ.137 కోట్ల పెట్టుబడులను జెరోధా సహవ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ పెట్టారు. ఎంత వాటాను కొనుగోలు చేశారో వెల్లడించలేదు.

✦ క్లాసిక్ ఎలక్ట్రోడ్స్ (ఇండియా) రూ.41.50 కోట్ల ఐపీఓ ఆగస్టు 22న ప్రారంభమై 26న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.82-87 నిర్ణయించారు. ఐపీఓ తర్వాత కంపెనీ షేర్లు ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌పై నమోదుకానున్నాయి.

✦ పునరుత్పాదక ఇంధన సంస్థ క్లీన్ మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్, ఐపీఓ ద్వారా రూ.5,200 కోట్లు సమీకరించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఐపీఓలో భాగంగా రూ.1500 కోట్ల తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో రూ.3,700 కోట్ల షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు.

✦ భారత్‌లో 6 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం కలిగిన స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి జేఎస్‌డబ్ల్యూ స్టీల్, దక్షిణ కొరియా సంస్థ పోస్కో గ్రూప్ జట్టుకట్టాయి. ప్లాంట్ ఏర్పాటు చేయబోయే ప్రాంతం, పెట్టుబడులు, వనరుల లభ్యత, ఇతర కీలక అంశాలపై ఇరు సంస్థలు కలిసి సమగ్ర అధ్యయనం చేయనున్నాయి.

✦ డిపాజిటరీ వ్యవస్థలో ప్లెడ్జ్, రీ-ప్లెడ్జ్ ద్వారా మార్జిన్ ఆబ్లిగేషన్స్ ప్రక్రియకు సంబంధించిన నియమావళి అమలు గడువు తేదీని అక్టోబరు 10కి పొడిగిస్తున్నట్లు సెబీ తెలిపింది. ఇంతకు ముందు దీన్ని సెప్టెంబరు 1 నుంచి అమలు చేయాలని భావించారు.

✦ అంకుర సంస్థల కోసం 100 రోజుల సంస్కరణల అజెండాపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ పనిచేస్తోంది. ఇందులో భాగంగా అంకురాలకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) ప్రక్రియ హేతుబద్ధీకరించడం, పొరుగు దేశాల నుంచి పెట్టుబడులు సరళతరం చేసి మరిన్ని పన్ను ప్రయోజనాలు అందించే ప్రతిపాదనలు ఇందులో ఉన్నాయి.

✦ భారత మ్యూచువల్ ఫండ్‌ల విదేశీ ఆస్తుల విలువ 2024-25లో 5.6 శాతం తగ్గి 8.3 బిలియన్ డాలర్లకు చేరినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. 2023-24లో ఇవి 8.81 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

✦ డెలివరీల కోసం ఇ-స్కూటర్లను అందించేందుకు ఎలక్ట్రిక్ మొబిలిటీ సంస్థ బౌన్స్‌తో స్విగ్గీ భాగస్వామ్యం కుదుర్చుకుంది.

✦ ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ ఎంటీఎన్ఎల్ బ్యాంకు రుణ ఎగవేతలు జులై ఆఖరుకు రూ.8,659 కోట్లుగా ఉన్నాయని నియంత్రణ సంస్థలకు సమాచారమందించింది. ఎంటీఎన్ఎల్ మొత్తం రుణాలు 2025 జులై 31 నాటికి రూ.34,577 కోట్లుగా ఉన్నాయి.



రుక్మిణీ వసంత్

యశ్ చిత్రంలో రుక్మిణి!

రుక్మిణీ వసంత్ వరుసగా భారీ సినిమాల్లో అవకాశాలు అందిపుచ్చుకుంటూ స్టార్ నాయికల లీగ్‌కు అతి చేరువైంది. ఆమె ప్రస్తుతం రిషబ్ శెట్టితో 'కాంతార: చాప్టర్ 1'లో, శివ కార్తికేయన్‌తో 'మదరాసి'లో నటించిన సంగతి తెలిసిందే. ఈ రెండూ త్వరలోనే థియేటర్లలోకి రానున్నాయి. మరో వైపు ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ చిత్రంతో పాటు మరో రెండు పెద్ద సినిమాల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తుంది. ఈ క్రమంలోనే ఇప్పుడామె ఖాతాలోకి 'టాక్సిక్' చేరినట్లు తెలుస్తోంది. 'కేజీఎఫ్' విజయాల తర్వాత హీరో యశ్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్నారు. కియారా అడ్వాణీ కథానాయిక. నయనతార, తారా సుతారియా, హ్యూమా ఖురేషీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పుడీ సినిమాలో రుక్మిణి కూడా చేరనున్నట్లు సమాచారం. ఆమె ఈ చిత్రంలో ఓ ముఖ్య పాత్రలో అలరించనున్నట్లు తెలిసింది. అలాగే కన్నడ నటుడు బాలాజీ మనోహర్ కూడా దీంట్లో ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 19న రానుంది.


ఈనాడు సినిమా

చూస్తుండగానే వారం మొదలైంది. ఈ వారం ఓటీటీలు తమ కోసం ఎలాంటి వైవిధ్యమైన కథల్ని తీసుకొస్తున్నాయో అని ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు సినీప్రేమికులు. ఇలాంటి ప్రేక్షకుల కోసమే భాషతో సంబంధం లేకుండా యాక్షన్‌తో అదరగొట్టే చిత్రాలు, సస్పెన్స్‌తో థ్రిల్‌ను పంచే సిరీస్‌లతో అలరించడానికి సిద్ధమయ్యాయి ఓటీటీలు.

ఓటీటీలో ఈ వారం



ది ట్విస్టెడ్ టేల్ ఆఫ్ అమండా నాక్స్(సిరీస్) | బుధవారం | జియోహాట్‌స్టార్



ది ఆల్టో నైట్స్ (చిత్రం) | గురువారం | జియోహాట్‌స్టార్



హోస్టేజ్ (సిరీస్) | గురువారం | నెట్‌ఫ్లిక్స్



కొత్తపల్లిలో ఒకప్పుడు(చిత్రం) | శుక్రవారం | ఆహా



ఏమా (సిరీస్) | శుక్రవారం | నెట్‌ఫ్లిక్స్



పీస్ మేకర్ సీజన్ 2 (సిరీస్) | శుక్రవారం | జియోహాట్‌స్టార్



బాన్ యాపెటిట్, యువర్ మెజెస్టి (సిరీస్) | శనివారం | నెట్‌ఫ్లిక్స్



ట్వెల్వ్ (సిరీస్) | శనివారం | జియోహాట్‌స్టార్

కామెడీ థ్రిల్లర్‌తో 'మారీశన్'




[illegible]లతో మెప్పిస్తున్న మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్, వడివేలు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మారీశన్'. సుదీశ్ శంకర్ తెరకెక్కించారు. ఈ కామెడీ థ్రిల్లర్‌లో దయాలన్ అనే దొంగ పాత్రలో కనిపించి అలరించారు ఫహాద్. అల్జీమర్స్‌తో బాధపడే వేలాయుధం (వడివేలు) దగ్గర పెద్ద మొత్తంలో డబ్బు ఉందని తెలుసుకొని ఎలాగైనా దాన్ని సొంతం చేసుకోవాలనుకుంటున్నాడు. వేరే ఊర్లో ఉన్న తన స్నేహితుణ్ని కలవడానికి వేలాయుధం వెళ్తున్నాడని తెలుసుకొని.. ఆయనకు మాయమాటలు చెప్పి తన బైక్‌పై ఎక్కించుకుంటారు దయాలన్. ఆ తర్వాత ఏమైందనేదే కథాంశం. ఇప్పటికే థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం శుక్రవారం నెట్‌ఫ్లిక్స్‌లో రాబోతుంది.

అనుబంధాల 'సార్ మేడమ్'



"భార్యాభర్తల అనుబంధం అద్భుతమైనది. కానీ దాన్ని నిలబెట్టుకొనేందుకు పడే పాట్లున్నాయే వామ్మో.. ప్రాణం పోతోంది" అంటూ ఇటీవలే థియేటర్లలో ప్రేక్షకుల్ని పలకరించారు 'తలైవాన్ తలైవి'('సార్ మేడమ్'). ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ వేదికగా శుక్రవారం మీ ఇళ్లలో అలరించడానికి సిద్ధమయ్యారు. విజయ్ సేతుపతి, నిత్యామేనన్ ప్రధాన పాత్రల్లో నటించారు. భార్యాభర్తల అనుబంధాల నేపథ్యంతో పాండిరాజ్ దీన్ని తెరకెక్కించారు. ఆకాశ వీరయ్య, రాణి.. ఎంతో అన్యోన్యంగా ఉంటారు. కానీ ఈ జంట ఓ గొడవ కారణంగా విడాకులు తీసుకునేందుకు సిద్ధపడతారు. మరి తర్వాత ఏమైంది? వీరిద్దరూ తిరిగి ఒక్కటయ్యారా? అనేదే కథాంశం.

పోలీసు... టీచర్ అయితే!



పోలీసులను చూసి ఎందుకు భయపడాలి? వారెందుకు ఖాళీ సమయాల్లో పిల్లలకు పాఠాలు చెప్పకూడదు? అనే సరికొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన చిత్రమే 'సూత్రవాక్యం'. షైన్ టామ్ చాకో ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చి మెప్పించింది. ఇందులో క్రిస్టో జేవియర్ అనే పోలీసు అధికారిగా విధులు నిర్వర్తించడమే కాకుండా.. పిల్లలకు పాఠాలు చెప్పే పాత్రలో కనిపించి ఆకట్టుకున్నారు షైన్ టామ్. విన్సీ ఆలోషియస్, దీపక్ పరంబోర్ తదితరులు నటించిన ఈ చిత్రం గురువారం ప్రముఖ ఓటీటీ ఈటీవీ విన్‌లో అలరించడానికి సిద్ధమైంది.

'#90స్' సిరీస్‌కు మూడు అవార్డులు



ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో విడుదలై ప్రేక్షకుల్ని అలరించిన '#90స్: ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్‌సిరీస్ 24వ సంతోషం సౌత్ ఇండియన్ అవార్డ్స్‌లో సత్తా చాటింది. ఓటీటీ విభాగంలో ఈ సిరీస్‌కి.. దీన్ని తెరకెక్కించిన దర్శకుడు ఆదిత్య హాసన్, బాల నటుడు రోహన్ రాయ్‌కు పురస్కారాలు దక్కాయి. ఈ అవార్డుల వేడుక సినీ ప్రముఖుల మధ్య హైదరాబాద్‌లో ఇటీవల జరిగింది. వైజయంతి మూవీస్ స్థాపించి 50ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో నిర్మాత అశ్వనీదత్‌కు, పాటల రచయితగా 25ఏళ్లు పూర్తి చేసుకున్న భాస్కర భట్లకు ఈ వేడుకలో ఘన సన్మానం చేశారు. అనంతరం దర్శకుడు రాఘవేంద్రరావు చేతుల మీదుగా పురస్కారాలు ప్రదానం చేశారు. అలాగే కోట శ్రీనివాసరావు స్మారక అవార్డును నటుడు బాబు మోహన్‌కు అందించారు. 'కన్నప్ప' చిత్రంతో బాలనటుడిగా తెరకు పరిచయమైన మంచు విష్ణు తనయుడు అవ్రామ్‌కు మోహన్ బాబు, విష్ణు, అశ్వనీదత్ చేతుల మీదుగా అవార్డును అందించారు. ఈ కార్యక్రమంలో మురళీ మోహన్, కాట్రగడ్డ ప్రసాద్, శివాజీ, అనంత శ్రీరామ్, సురేశ్ కొండేటి తదితరులు పాల్గొన్నారు.

ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులతో చిరంజీవి భేటీ

వేతనాల పెంపు కోరుతూ సినీ కార్మికులు సమ్మె బాట పట్టడంతో గత కొన్నిరోజులుగా తెలుగు చిత్రసీమలో చిత్రీకరణలన్నీ స్తంభించిపోయాయి. ఈ అంశంపై చలన చిత్ర వాణిజ్య మండలి, కార్మిక సంఘాలు, నిర్మాతల మధ్య చర్చలు జరుగుతూనే ఉన్నా ఇంత వరకు ఏ ఫలితం రాలేదు. దీంతో ఈ సమస్యను పరిష్కరించేందుకు కథానాయకుడు చిరంజీవి రంగంలోకి దిగారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించి ప్రతి యూనియన్‌తో విడివిడిగా మాట్లాడి, వారి సమస్యల్ని తెలుసుకున్నారు. అనంతరం ఈ భేటీలోని ముఖ్య అంశాల్ని ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్ విలేకర్లతో పంచుకున్నారు. "కార్మికుల వేతనాలు పెంచాలంటూ 15 రోజులుగా సమ్మె చేస్తున్నాం. ఈ రోజు చిరంజీవి మమ్మల్ని పిలిచి మాట్లాడారు. 24విభాగాల నుంచి 72 మందితో చర్చించారు. నిర్మాతలు మా మాట వినకుండా మాపైనే నిందలు వేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చాం. సాధ్యం కాని, అమలు చేయలేని నిబంధనల్ని పెడుతున్నారని తెలియజేశాం. ఏదేమైనా కార్మికులతో పాటు నిర్మాతలు బాగుండాలని వాళ్లు చెప్పిన ఆ రెండు షరతులకు ఒప్పుకుంటే తామే నష్టపోతామని చిరంజీవికి వివరించాం. ఆదివారం డబుల్ కాల్షీట్ గురించి విన్నవించాం. మా సమస్యలన్నీ సానుకూలంగా విని.. 'మీకు ఏ సమస్య వచ్చినా నా వద్దకు రండ'ని చిరు భరోసా ఇచ్చారు. మంగళవారం జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేస్తాం. ఛాంబర్ నుంచి కూడా పిలుపు వచ్చింది. వాళ్లు చర్చలకు పిలిచారు కాబట్టి మేము నిరసన కార్యక్రమాన్ని ప్రస్తుతానికి ఆపేశాం. ఈరోజు వాళ్లతో చర్చలు జరుపుతాం. మేము అడిగినట్లు వేతనాలు వస్తాయని భావిస్తున్నాం" అన్నారు అనిల్.

అందుకే హాలీవుడ్ అవకాశాన్ని వదులుకొన్నా!



ఫహాద్ ఫాజిల్

'ది రెవెనెంట్', 'బర్డ్ మ్యాన్' లాంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు అలెజాండ్రో గొంజాలెజ్ ఇనారిటుతో కలిసి పనిచేసే అవకాశం వచ్చిందని చెప్పారు మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్. అంతే కాదు ఆయనతో ఆ అవకాశాన్ని యాస కారణంగా తాను తిరస్కరించానని వెల్లడించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన దీనికి సంబంధించిన విషయాల్ని పంచుకున్నారు. "దర్శకుడు ఇనారిటు తన ప్రాజెక్ట్ కోసం నన్ను సంప్రదించారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు. దానికి కారణం ఇంగ్లిషులో నేను డైలాగ్స్ చెప్పాల్సిన విధానం. ఆయన అనుకున్నట్లు భాషపై పట్టు రావాలంటే దాన్ని నేర్చుకోవడానికి నేను అమెరికాలో నాలుగు నెలలు ఉండాల్సి ఉంటుందని.. ఆ సమయంలో ఎటువంటి జీతం ఉండదని ఆయన అన్నారు. అందుకే నేను ఆ అవకాశాన్ని వదులుకున్నాను. నా జీవితంలో అన్నీ ఇక్కడే జరిగాయి. ఏవైనా కొత్త మార్పులు జరగాలన్నా ఆ మాయాజాలం కోసం వెతుకుతూ కేరళ వెలుపలకు వెళ్లాల్సిన అవసరం నాకు లేదు. కేవలం నా యాసని మార్చడం కోసం మాత్రమే అంతగా శ్రమించే ఉత్సాహం నాకు లేదు. మలయాళ చిత్రసీమ నాకు చాలా ఇచ్చింది" అంటూ మలయాళ చిత్రపరిశ్రమ పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేశారు.



గౌతమ్

సినిమాగా మురళీ నాయక్ జీవితకథ

వీర జవాన్ మురళీ నాయక్ జీవిత కథ ఇప్పుడు సినిమాగా వెండితెరపైకి రానుంది. గౌతమ్ కృష్ణ టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని కె.సురేశ్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ సినిమాని సోమవారం అధికారికంగా ప్రకటిస్తూ.. హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ.. "ఆపరేషన్ సిందూర్ మన దేశ చరిత్రలో ఒక ముఖ్య అధ్యాయం. ఆ యుద్ధంలో పాల్గొని వీరమరణం పొందిన మురళీ నాయక్ కథ ఈ ప్రపంచానికి కచ్చితంగా తెలియాలి" అన్నారు. ఈ కార్యక్రమంలో మురళీ నాయక్ తల్లిదండ్రులు ముదావత్ శ్రీరామ్ నాయక్, జ్యోతిబాయి పాల్గొన్నారు.

వారం ఆలస్యంగా త్రిబాణధారి



సత్యరాజ్

ఈ నెల 22న థియేటర్లలోకి రావాల్సిన 'త్రిబాణధారి బార్బరిక్' వాయిదా పడింది. సత్యరాజ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాని మోహన్ శ్రీవత్స తెరకెక్కించారు. విజయ్ పాల్ రెడ్డి అడిదెల నిర్మించారు. ఉదయభాను, వశిష్ఠ ఎన్ సింహా, సాంచీ రాయ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని ముందుగా అనుకున్న తేదీకి వారం ఆలస్యంగా ఈ నెల 29న థియేటర్లలోకి తీసుకు రానున్నట్లు నిర్మాతలు సోమవారం ప్రకటించారు. కావాల్సినన్ని థియేటర్లు లభిస్తే.. సినిమాకి విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయన్న ఉద్దేశంతో ఈ వాయిదా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఇన్‌ఫ్యూజన్ బ్యాండ్.

వింటేజ్ ప్రేమ



రక్షిత్, కోమలి

రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్ జంటగా సాయి మోహన్ ఉబ్బన తెరకెక్కించిన చిత్రం 'శశివదనే'. అహితేజ బెల్లంకొండ, అభిలాశ్ రెడ్డి గోదాల నిర్మించారు. శ్రీమాన్, దీపక్ ప్రిన్స్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమాని అక్టోబరు 10న విడుదల చేయనున్నట్లు సోమవారం ప్రకటించారు. "ఆహ్లాదభరితంగా సాగే వింటేజ్ ప్రేమకథతో రూపొందిన చిత్రమిది" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

సుహాస్.. 'హే భగవాన్'



శివాని, సుహాస్, నరేశ్

సుహాస్ హీరోగా గోపి అచ్చర దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. బి.నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. శివాని నగరం కథానాయిక. నరేశ్, సుదర్శన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి 'హే భగవాన్!' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. మంగళవారం సుహాస్ పుట్టినరోజు. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.

రివ్యూలు చదివాకే మా సినిమాకు రండి: అనుపమ



దర్శన, అనుపమ

"నా సినీ ప్రయాణంలోనే అత్యుత్తమ చిత్రం 'పరదా'. రివ్యూలు చదివాకే మా సినిమాకు రండి. ఇది తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అంటోంది నటి అనుపమ పరమేశ్వరన్. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాని ప్రవీణ్ కండ్రేగుల తెరకెక్కించారు. విజయ్ డొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మించారు. దర్శన రాజేంద్రన్, సంగీత, రాగ్ మయూర్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. ఈ సందర్భంగా అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ.. "దర్శకుడు ప్రవీణ్ ఎంతో ప్యాషన్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు" అంది. "ఈ చిత్రానికి తొలి పది నిమిషాలు చాలా కీలకం. దాన్ని ఎవరూ మిస్ అవ్వకండి" అన్నారు దర్శకుడు.

నాకు భూతం పట్టుండాది రా!



సత్యదేవ్

'రావు బహదూర్'గా సినీప్రియుల్ని పలకరించనున్నారు సత్యదేవ్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని వెంకటేశ్ మహా తెరకెక్కిస్తున్నారు. 'ఉమా మహేశ్వర ఉగ్ర రూపస్య' విజయం తర్వాత వీళ్ల కాంబో నుంచి వస్తున్న రెండో సినిమా ఇది. మహేశ్‌బాబు జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర నిర్మిస్తున్నారు. వికాశ్ ముప్పాల, దీప థామస్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను దర్శకుడు రాజమౌళి సోమవారం విడుదల చేశారు. "ఆచారి.. నాకు భూతం పట్టుండాది రా" అంటూ సత్యదేవ్ చెప్పే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిరేకెత్తిస్తూ సాగింది. "అనుమానం పెనుభూతం" అనే అంశం ఈ కథలో కీలకంగా నిలవనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రచార చిత్రంలో భిన్న గెటప్పుల్లో.. చిత్రమైన ఆహార్యంతో సత్యదేవ్ కనిపించిన తీరు ఆసక్తిని కలిగిస్తోంది.

మంచి అనుభూతినిచ్చే మ్యూజికల్ లవ్‌స్టోరీ



ఉమా దేవి

"సంగీత ప్రాధాన్యమున్న ప్రేమకథతో రూపొందిన చిత్రం 'మేఘాలు చెప్పిన ప్రేమకథ'" అన్నారు నిర్మాత ఉమా దేవి కోట. నరేశ్ అగస్త్య, రబియా ఖతూన్ జంటగా నటించిన ఈ సినిమాని విపిన్ తెరకెక్కించారు. రాధిక శరత్‌కుమార్, తనికెళ్ల భరణి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 22న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత ఉమా దేవి మాట్లాడుతూ.. "ఒక వ్యక్తి మరో వ్యక్తిని చూసి ఎలా స్ఫూర్తి పొందుతారు, ప్రేమ ఎలా పుడుతుంది అనేది ఈ కథలో చూస్తారు. తెలుగులో ఇలాంటి మంచి మ్యూజికల్ లవ్‌స్టోరీ వచ్చి చాలా కాలమైంది. సినిమా చూశాక ప్రతి ఒక్కరూ మంచి చిత్రం చూశామనే అనుభూతి పొందుతారు" అన్నారు.

నా జీవితం నీ పాదాల చెంత



టైగర్ ష్రాఫ్, హర్నాజ్

నటుడు టైగర్ ష్రాఫ్, హర్నాజ్ సంధు జంటగా నటించిన చిత్రం 'బాఘీ 4'. ఏ హర్ష దర్శకత్వం వహించిన ఈ సినిమాని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. ఇది 'బాఘీ' ఫ్రాంఛైజీలోని మునుపటి చిత్రాలలానే భారీ యాక్షన్ సన్నివేశాలతో రూపొందుతోంది. సంజయ్ దత్ ప్రతినాయక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో సోనమ్ భజ్వా కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబరు 5న ప్రేక్షకుల్ని అలరించనున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రచార పర్వంలో భాగంగా 'గుజారా' అనే పాటని విడుదల చేసింది. "నేను నీ ప్రేమికుడినయ్యాను. నువ్వే నా ఊపిరికి ఆధారం.. నువ్వు లేకుండా నేను బతకలేను. నా జీవితాన్ని నీ పాదాల చెంత ఉంచాను.." అంటూ సాగే ఈ పాట నాయకానాయికల మధ్య సాగే భావోద్వేగపరమైన ప్రేమ గీతంగా ఆకట్టుకుంటోంది.

బూడిద నుంచి న్యాయం బయటకు!



అలీ ఫజల్

'మీర్జాపూర్' సిరీస్‌లలో తన నటనతో ప్రేక్షకుల్ని మెప్పించారు బాలీవుడ్ నటుడు అలీ ఫజల్. ఇప్పుడాయన మరో ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న సిరీస్ 'రాఖ్'. 'పాతాళ్‌లోక్' ఫేమ్ ప్రోసిత్ రాయ్ దీన్ని రూపొందిస్తున్నారు. తాజాగా ఈ సిరీస్‌ను అధికారికంగా ప్రకటిస్తూ.. ఫస్ట్ లుక్‌ను పంచుకుంది ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో. ''బూడిద నుంచి న్యాయం బయటకు వస్తుంది. 'రాఖ్' వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతుంద"నే వ్యాఖ్యల్ని జోడించింది. ఈ ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్‌లో సోనాలి బింద్రే, అమీర్ బషీర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అప్పట్లో నా నిర్ణయం అందరికీ షాకిచ్చింది

ప్రభాస్ 'ఈశ్వర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన కథానాయిక శ్రీదేవి విజయ్ కుమార్. దశాబ్ద కాలానికి పైగా వెండితెరకు దూరంగా ఉన్న ఆమె.. ఇప్పుడు 'సుందరకాండ' సినిమాతో తెలుగులోకి నాయికగా రీఎంట్రీ ఇవ్వనుంది. నారా రోహిత్ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని వెంకటేశ్ నిమ్మలపూడి తెరకెక్కించారు. ఇది ఈ నెల 27న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది శ్రీదేవి.



శ్రీదేవి

"నేను కథానాయికగా వరుస సినిమాలు చేస్తున్న రోజుల్లోనే పెళ్లి చేసుకున్నా. అప్పట్లో నా నిర్ణయం చూసి అందరూ షాక్ అయ్యారు. కానీ, నిజానికి పెళ్లి విషయంలో మా ఇంట్లో వాళ్లు ముందే ప్రణాళికతో ఉన్నారు. ఆ తర్వాత పాప పుట్టడంతో సినిమాలకు విరామమిచ్చా. మధ్యలో టీవీలో కొన్ని ప్రోగ్రామ్స్ చేశాను. దీన్నివల్లే నాకు తెరకు దూరమయ్యానన్న ఫీలింగ్ ఎప్పుడూ కలుగలేదు. ఇక ఇన్నేళ్లకు మళ్లీ నన్నిలా హీరోయిన్‌గా తెరపై చూసుకోబోతుండటం చాలా ఆసక్తిరేకెత్తిస్తోంది. దర్శకుడు వెంకటేశ్ ఈ కథ చెప్పగానే నేను షాక్ అయ్యా. స్క్రిప్ట్ అంత కొత్తగా అనిపించింది".

వినూత్న కథ.. విభిన్న కోణాలు!

"ఇదొక వినూత్నమైన కథతో రూపొందిన చిత్రం. ఆద్యంతం వినోదాత్మకంగా ఉంటుంది. ఈ చిత్రంతో ఎన్నో ఏళ్ల తర్వాత నాకు మళ్లీ స్కూల్ డ్రెస్ వేసుకునే అవకాశమొచ్చింది. అదొక అద్భుతమైన జ్ఞాపకం. ఆ స్కూల్ డ్రెస్‌లో మా పాపతో కలిసి ఫొటోలు దిగి దాచుకున్నా. ఆ స్కూల్ ఎపిసోడ్ కోసం నేను చాలా కష్టపడ్డా".

కథలో ప్రాధాన్యమున్న పాత్రలతోనే..

"నాకు నటిగా అన్ని రకాల పాత్రలూ చేయాలని ఉంది. ఏ పాత్ర చేసినా కథలో దానికి బలమైన ప్రాధాన్యత ఉండాలి. 'ఈశ్వర్' నుంచి ఇప్పటిదాకా ప్రభాస్‌తో మా ఫ్రెండ్‌షిప్ అలాగే ఉంది. తనిప్పుడు బిగ్ స్టార్ అయిపోయారు. కానీ, అప్పటికి ఇప్పటికీ ఆయనలో ఏ మార్పు లేదు. ఈరోజుకి కూడా తను చిన్న పిల్లాడిలాగే నవ్వుతూ మాట్లాడతారు".

వేటి నుంచి శక్తి ఉత్పత్తి అవుతుందో వాటిని శక్తి వనరులు అంటారు. శక్తికి మూలం సూర్యుడు. శక్తి లభ్యత ఆధారంగా వీటిని తరిగిపోయే, పునరుత్పాదక శక్తి వనరులుగా వర్గీకరించారు. ఆధునిక ప్రగతి శక్తి వనరులపైనే ఆధారపడి ఉంది. విద్యుత్తు, ఇంధనం రూపంలో దాదాపు ప్రతి రంగంలో ఈ వనరుల వినియోగం తప్పనిసరిగా కనిపిస్తోంది. ప్రస్తుత కాలంలో పరిశ్రమలు, వ్యవసాయం, ఇతర రంగాల అభివృద్ధికి శక్తి వనరులు కావాల్సిందే. దేశ ఆర్థిక అభివృద్ధిలోనూ ఇవి కీలకపాత్ర పోషిస్తాయి.

నాటి మృత కళేబరాలే నేటి శిలాజ ఇంధనాలు!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

శక్తి వనరులు

శక్తి వనరుల వినియోగం నేడు దాదాపు అన్ని రంగాల్లో కనిపిస్తోంది. ఒక దేశ ఆర్థిక, ఆధునిక ఉన్నత స్థితికి ఇవి దోహదపడతాయి. శక్తి వనరులను రెండు రకాలుగా వర్గీకరించారు. అవి...

1. తరిగిపోయే శక్తి వనరులు: నేలబొగ్గు, పెట్రోలియం, సహజవాయువు, కలప మొదలైన శక్తి వనరులు వాడేకొద్దీ తరిగిపోతాయి. ఇవి తిరిగి ఉత్పత్తి కావాలంటే చాలాకాలం పడుతుంది. అందుకే వీటిని తరిగిపోయే శక్తి వనరులు లేదా సంప్రదాయ శక్తి వనరులు అంటారు. వీటిని ఎక్కువ మొత్తంలో ఉత్పత్తి చేసి నిల్వ చేయవచ్చు లేదా రవాణా చేయవచ్చు. కానీ వీటి ఉత్పత్తికి పెద్దమొత్తంలో పెట్టుబడి అవసరం. ఈ సంప్రదాయ శక్తి వనరులు చాలా రకాల కాలుష్యాలకు కారకాలుగా మారుతున్నాయి.

2. పునరుత్పాదక శక్తి వనరులు: సౌరశక్తి, పవనశక్తి, సముద్ర అలల శక్తి లాంటివి ప్రకృతిలో పుష్కలంగా లభిస్తాయి. ఇవి తిరిగి ఉత్పత్తి అవుతాయి. కాబట్టి వీటిని పునరుత్పాదక శక్తి వనరులు లేదా తరిగిపోని లేదా ప్రత్యామ్నాయ శక్తి వనరులు అంటారు. వీటిని ఎన్నిసార్లు అయినా పునర్ వినియోగించుకోవచ్చు. సంప్రదాయ శక్తి వనరులతో పోలిస్తే వీటి ఉత్పత్తికి తక్కువ పెట్టుబడి సరిపోతుంది. వీటివల్ల కాలుష్యం దాదాపుగా ఏర్పడదు.

ఉదా: బయోగ్యాస్, బయోమాస్, భూగర్భ ఉష్ణశక్తి

ఇంధనాలు: దహన క్రియ ద్వారా ఉష్ణం, కాంతిని విడుదల చేసే వాటిని ఇంధనాలు అంటారు.

శిలాజ ఇంధనాలు

కొన్ని లక్షల సంవత్సరాల క్రితం మరణించిన జీవుల శిలాజాల నుంచి అధిక ఉష్ణోగ్రత, అధిక పీడనం కారణంగా ఏర్పడే వాటిని శిలాజ ఇంధనాలు అంటారు.

ఉదా: నేలబొగ్గు, పెట్రోలియం, సహజ వాయువు

నేలబొగ్గు: లక్షల సంవత్సరాల క్రితం నేలలో కూరుకుపోయిన చెట్లు భూమి అడుగు పొరల్లో గాలి లేని పరిస్థితుల్లో అధిక ఉష్ణోగ్రత, అధిక పీడనానికి గురై నేలబొగ్గుగా మారతాయి.

- నేలబొగ్గులో ముఖ్యమైన మూలకం కార్బన్. బొగ్గు నుంచి కోక్ అనే పదార్థాన్ని తయారు చేస్తారు.
- కార్బన్ శాతం ఆధారంగా బొగ్గును పీట్, లిగ్నైట్, బిట్యుమినస్, ఆంత్రసైట్‌గా వర్గీకరిస్తారు.
- బొగ్గును మండించి విద్యుత్ ఉత్పత్తి చేయడాన్ని థర్మల్ విద్యుత్ అంటారు. దేశంలో 50 నుంచి 60 శాతం ఈ పద్ధతిలోనే విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. 1975లో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను పర్యవేక్షించడానికి ఎన్‌టీపీసీ సంస్థను ప్రారంభించారు. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ థర్మల్ విద్యుత్ కేంద్రం స్వాతంత్ర్యానికి పూర్వమే విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించింది. థర్మల్ విద్యుత్ కేంద్రాల వల్ల ఏర్పడే ప్రధాన సమస్య వాయు కాలుష్యం.

పెట్రోలియం: మిలియన్ సంవత్సరాల క్రితం సముద్రంలో నివసించే జంతువులు మృతి చెందిన తర్వాత ఇసుకలో కూరుకుపోతాయి. ఇలా భూగర్భంలో అధిక ఉష్ణోగ్రత, పీడనాలకు గురికావడం వల్ల హైడ్రో కార్బన్లుగా రూపాంతరం చెందుతాయి. వీటినే పెట్రోలియం, సహజవాయువు అంటారు.

- ప్రస్తుతం అధికంగా వినియోగిస్తున్న శిలాజ ఇంధనం పెట్రోలియం. పెట్రోలియాన్ని శుద్ధి చేసి అనేక పదార్థాలను తయారు చేస్తారు. దేశంలో పెట్రోలియం ఉత్పత్తులను రవాణా రంగంలో 50%, గృహరంగంలో 30%, పరిశ్రమల్లో 10%, వ్యవసాయ, ఇతర రంగాల్లో 10% ఉపయోగిస్తున్నారు.
- బాంబే హై, అస్సాం, అండమాన్ నికోబార్ దీవులు, కృష్ణా-గోదావరి పరీవాహక ప్రాంతాలు పెట్రోలియం లభించే ప్రాంతాల్లో ముఖ్యమైనవి. ఇవి దేశీయ ఉత్పత్తి అవసరాలకు సరిపోకపోవడంతో విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడానికి విదేశీ మారకద్రవ్యం వెచ్చించాల్సి వస్తోంది.

పెట్రోలియం శుద్ధి – ముఖ్యమైన పదార్థాలు: పెట్రోలియం నుంచి వచ్చే పెట్రోలియం వాయువును ఎల్‌పీజీ సిలిండర్లలో, పెట్రోల్, డీజిల్‌ను వాహనాలకు ఇంధనంగా, కిరోసిన్‌ను చాలా దేశాల్లో గృహ అవసరాలకు ఇంధనంగా, పారాఫిన్ మైనాన్ని కొవ్వొత్తులు, క్రీముల తయారీలో ఉపయోగిస్తారు.

- పెట్రోలియంను శుద్ధి చేయడం ద్వారా వచ్చే ముడి పదార్థాలతో కందెనలు, ప్లాస్టిక్‌లు, ఔషధాలు, కృత్రిమ దారాలు తయారు చేస్తారు.

సహజ వాయువు: మీథేన్ మొదలైన వాయువుల మిశ్రమాన్ని సహజ వాయువు అంటారు. దీన్ని సిలిండర్ల రూపంలో లేదా పైపుల ద్వారా నేరుగా ఇళ్లకు సరఫరా చేయవచ్చు. దీన్ని సంపీడనం చెందించి CNG రూపంలో వాహనాల ఇంధనంగా కూడా వినియోగించవచ్చు.

ఇతర శక్తి వనరులు

సౌరశక్తి: సూర్యుడి నుంచి వచ్చే కిరణాలను సౌరశక్తి అంటారు. దీనిలో అతినీలలోహిత కిరణాలు, సాధారణ కాంతి కిరణాలు, పరారుణ కిరణాలు ఉంటాయి. ఒక సెకండ్ కాలంలో భూమిపైకి చేరే సౌరశక్తిలో 10^{17} జౌల్ శక్తి ఉంటుంది.

- సౌర విద్యుత్, సౌర ఉష్ణం అనే రెండు రకాలుగా సౌరశక్తిని ఉపయోగించుకోవచ్చు.
- సౌరశక్తిని ఉపయోగించుకుని సౌర ఫలకల సహాయంతో విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేయవచ్చు. ఈ శక్తితో కృత్రిమ ఉపగ్రహాలు, అంతరిక్ష నౌకలు వాటికి కావాల్సిన విద్యుత్‌ను తయారు చేసుకుంటాయి. ట్రాఫిక్ సిగ్నల్స్, రైల్వే ప్లాట్‌ఫామ్‌లపై ఉపయోగించే దీపాలు సౌర ఫలకల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను వినియోగించుకుంటాయి.

పవనశక్తి: ఉష్ణోగ్రత, పీడనాల్లో వ్యత్యాసం కారణంగా గాలి ఒకచోటు నుంచి మరొక చోటుకి పయనిస్తుంది. వీటినే పవనాలు అంటారు.

- గంటకు కనీసం 15 కిలోమీటర్ల వేగంతో గాలి వీచే ప్రాంతాల్లో పెద్దపెద్ద గాలిమరలను ఏర్పాటు చేసి, వాటి సహాయంతో విద్యుత్ జనరేటర్లు తిరిగేలా చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు. దీనివల్ల ఎలాంటి కాలుష్యం ఏర్పడదు, కాబట్టి స్థానిక ఇంధన వనరుగా ఉపయోగించుకోవచ్చు. స్థాపిత సౌకర్యాలపరంగా భారతదేశం నాలుగో స్థానంలో, పవనశక్తి ద్వారా విద్యుత్ ఉత్పత్తిలో ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది.
- తమిళనాడులోని పెరంబుడి, కోయంబత్తూర్, గుజరాత్‌లోని కచ్ తీర ప్రాంతంలో, ఆంధ్రప్రదేశ్‌లోని రామగిరి, తిరుమల, నెల్లూరు, అనిమెల మొదలైన ప్రాంతాల్లో గాలిమరల ద్వారా పవనశక్తి నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. గాలిమరలను బీహెచ్ఈఎల్ సంస్థ రూపొందించేది.

జలశక్తి: కొంత ఎత్తు నుంచి కిందకు జారే నీటికి గతిశక్తి ఉంటుంది. దీన్ని ఉపయోగించుకుని టర్బైన్‌లను తిప్పడం ద్వారా విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేయవచ్చు. అదేవిధంగా ప్రవహిస్తున్న నీటిని సరకు రవాణా చేసేందుకు కూడా వినియోగించుకోవచ్చు. దేశంలో మొట్టమొదటి జలవిద్యుత్ ప్రాజెక్ట్‌ను 1902లో కర్ణాటకలోని శరావతి నదిపై నిర్మించారు. దీన్ని శివసముద్రం జలవిద్యుత్ ప్రాజెక్ట్ అంటారు. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమైన జల విద్యుత్ కేంద్రాలు శ్రీశైలం, నాగార్జునసాగర్.

అలల శక్తి: సముద్రంలోని అలల ద్వారా వచ్చే శక్తిని ఉపయోగించుకుని విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు.

భూ ఉష్ణశక్తి: భూఅంతర్భాగంలో అధిక వేడి ఉంటుంది. కాబట్టి నీటిని లోపలికి పంపిస్తే, ఆ వేడి ద్వారా నీరు ఆవిరిగా మారి భూమిపైకి వస్తుంది. ఈ ఆవిరితో యంత్రాలను నడపవచ్చు, విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు.

సముద్ర ఉష్ణశక్తి: సూర్యుడి వేడి వల్ల సముద్రం పై పొరలు వేడెక్కుతాయి. లోపలి పొరలకు, పై పొరలకు మధ్య ఉండే ఉష్ణోగ్రతల వ్యత్యాసాన్ని ఉపయోగించుకుని విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు.

బయోగ్యాస్: వ్యవసాయం లేదా గృహాల నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలను కుళ్లబెట్టడం ద్వారా దీన్ని తయారు చేస్తారు. బయోగ్యాస్‌లో మీథేన్, కార్బన్ డైఆక్సైడ్, హైడ్రోజన్, హైడ్రోజన్ సల్ఫైడ్ లాంటి వాయువులు కలిసి ఉంటాయి.

రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

746 Word of the Day

Gingerly

Telugu meaning: జాగ్రత్తగా, పదిలంగా

English meaning: The word gingerly (జింజర్లీ) is an adverb that describes doing something in a very cautious or careful manner to avoid harm.

Synonyms: Cautiously, Carefully

Antonyms: Recklessly, Boldly

Usage:
1. She stepped gingerly onto the icy pavement, afraid she might slip and fall.
2. He gingerly opened the fragile box, knowing the contents were valuable and delicate.

Latest Updates

PM YASASVI Scholarship

The Central Sector Scheme of Top Class Education in Schools for OBC, EBC and DNT Students aims to provide premium quality education to meritorious students from disadvantaged communities. This scholarship supports their education from Class 9 to Class 12 in the best-performing schools, covering tuition, hostel, and other necessary fees up to Rs.1,25,000 per year. Eligible candidates can apply online before 31 August 2025.

Scientist Posts

CSIR-Indian Institute of Toxicology Research (CSIR-IITR), Lucknow, is inviting applications for the Scientist posts. The total no. of posts is 18. The last date for online applications is 31st August 2025.

Common Law Admission Test (CLAT) 2026

The Common Law Admission Test (CLAT) is a national-level entrance exam for admissions to undergraduate (UG) and postgraduate (PG) law programmes offered by 24 National Law Universities in India. The application fee is Rs.4,000. Eligible candidates can apply online before 31 October 2025.

Did You Apply..?

Today (August 19) is the last date for the following Jobs/ Apprentice posts.

- 125 Manager posts in Bank of Baroda. *Qualification:* Degree, MBA, CA/CMA/CS/CFA.
- 330 Deputy Manager Jobs in Bank of Baroda. *Qualification:* Degree.
- 108 Senior Resident jobs in AIIMS Nagpur. *Qualification:* Medical degree.

For more information and other notifications - scan QR code

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ఆగస్టు 19
చరిత్రలో ఈనాడు

ఒక చిత్రం అనేక విషయాలను తెలుపుతుంది. ఇది అనేక భావోద్వేగాలు, భావనలను కలిగిస్తుంది. దీనిది విశ్వభాష. మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే ప్రతి దృశ్యాన్ని ఫొటో రూపంలో బంధించి, విలువైన జ్ఞాపకంగా మనతో ఉంచుకోవచ్చు. వీటిని చూసినప్పుడల్లా పాత గుర్తులను నెమరువేసుకునే అవకాశం ఉంటుంది. మనకు కావాల్సిన వ్యక్తులు, ప్రకృతి అందాలు, పక్షులు - జంతువులు, కాలానికి అనుగుణంగా వచ్చే మార్పులు ఇలా ప్రతిదీ మనం చిత్తరువుగా భద్రపరచుకోవచ్చు. ప్రస్తుత డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్ల వాడకం పెరిగాక ప్రతి సందర్భాన్ని తీపి గుర్తుగా మలుచుకునేందుకు ఫొటోలను తీసుకుంటున్నారు. చారిత్రక సంఘటనలకు దృశ్య రూపం కల్పించి, వాటిని భవిష్యత్తు తరాలకు అందించడంలో 'ఫొటోగ్రఫీ' ముఖ్యపాత్ర పోషిస్తోంది. మానవ జీవనంలో ఫొటోగ్రఫీ ప్రాముఖ్యాన్ని తెలియజేసే ఉద్దేశంతో ఏటా ఆగస్టు 19న 'ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం'గా (World Photography Day) నిర్వహిస్తారు. దీన్నే 'వరల్డ్ ఫొటో డే'గా పిలుస్తారు. ఈ కళారూపాలకు కారణమైన ఫొటోగ్రాఫర్లను గౌరవించుకోవడంతోపాటు సమాజంలో దీన్ని ఒక కళగా వ్యాప్తి చేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

- ఒకప్పుడు కాలక్షేపానికి ఫొటోలు తీసేవారు. సాంకేతికత అభివృద్ధి చెందడంతో కాలక్రమేణా ఫొటోగ్రఫీ ఎంతగానో మెరుగుపడింది. ప్రస్తుతం దీన్ని ఒక కెరీర్‌గా ఎంచుకునే స్థాయికి ఎదిగింది. మన దేశంలోని కొన్ని ఇన్‌స్టిట్యూట్స్ ఫొటోగ్రఫీలో డిప్లొమా, యూజీ, పీజీ లెవల్లో కోర్సులు అందిస్తున్నాయి. ఉద్యోగం లేదా ఫ్రీలాన్సింగ్ ద్వారా ఉపాధి పొందేందుకు ఇది చక్కటి కెరీర్ ప్లాట్‌ఫాంలా ఉపయోగపడుతోంది.

చారిత్రక నేపథ్యం:

ఫొటోగ్రఫీ చరిత్ర 1837లో ఫ్రాన్స్‌లో ప్రారంభమైంది. ఆ సమయంలో జోసెఫ్ నీస్‌ఫోర్ నీప్సే, లూయిస్ డగ్యురే అనే శాస్త్రవేత్తలు మొదటిసారి ఫొటోగ్రఫిక్ ప్రక్రియ లేదా డాగ్యురోటైప్‌ను అభివృద్ధి చేశారు.

- 1838లో లూయిస్ డగ్యురె తొలిసారి ఇద్దరు వ్యక్తుల ఫొటో తీశాడు. 1839, ఆగస్టు 19న ఫ్రెంచ్ ప్రభుత్వం డాగ్యురోటైప్ ప్రక్రియను అధికారికంగా ప్రకటించింది. ఫొటోలను సంగ్రహించి, రక్షించే పద్ధతుల్లో ఒకటిగా ఇది పేరొందింది. ఫొటోగ్రఫీ పుట్టుకకు దీన్నే నాందిగా పేర్కొంటారు.
- ఈ కీలకమైన రోజును గుర్తుంచుకునేందుకు ఏటా ఆగస్టు 19న 'ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం'గా జరుపుకోవాలని ప్రపంచ ఫొటోగ్రఫీ సంస్థ 2009లో తీర్మానించింది. దీన్ని మొదటిసారి 2010లో నిర్వహించారు.

2025 నినాదం: "My Favorite Photo"

జనరల్ స్టడీస్ - పర్యావరణ సమస్యలు

కాప్ - 29 సదస్సు

ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకీ కాలుష్యం పెరిగిపోతోంది. భూఉష్ణోగ్రతలు అంతకంతకూ హెచ్చుస్థాయిలకు చేరుకుంటున్నాయి. ఫలితంగా అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి కారణం వాతావరణంలో ఏర్పడే మార్పులు. దీన్ని అరికట్టేందుకు కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ పేరుతో కాప్ ఏర్పాటైంది. ఇది సదస్సులు నిర్వహిస్తూ కాలుష్య కట్టడికి ప్రపంచ దేశాలు చేపట్టాల్సిన చర్యలు, లక్ష్యాలను నిర్దేశిస్తుంది. దీనికి కావాల్సిన నిధులను సమకూర్చే బాధ్యతను తీసుకుంటుంది. కాప్ -29 సదస్సు, అందులో తీసుకున్న నిర్ణయాలు తదితరాలపై పోటీపరీక్షార్థులు అవగాహన పెంచుకోవాలి.

పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్ర పోషించే యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ నిర్వహించే కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ - 29వ సదస్సు (కాప్ 29)ను 2024 నవంబరు 11 నుంచి 22 వరకు అజర్‌బైజాన్ దేశంలోని బాకులో నిర్వహించారు.

- కాప్ - 29 సదస్సుకు ప్రెసిడెంట్‌గా ముక్తార్ బాబాయేవ్ వ్యవహరించారు. ఈయన సదస్సు ద్వారా పరివర్తనాత్మక నిధులు సమకూరాలని కాంక్షించారు. ఇప్పటికే సమకూరిన బిలియన్ల నిధులు రానున్న దశాబ్దాల్లో ట్రిలియన్లుగా మారనున్నాయని పేర్కొన్నారు.

కాప్ సదస్సులు – పూర్వాపరాలు

1992లో 198 దేశాలతో ఏర్పాటైన యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ కాప్ సదస్సులను నిర్వహిస్తోంది.

- ఈ సదస్సుల ముఖ్య లక్ష్యం దేశీయ ఉద్గారాల సమాచారాన్ని సేకరించడం (NDCs), ఆయా ఉద్గారాల నియంత్రణను పరిశీలించడం, వాతావరణ మార్పు వ్యతిరేక ప్రభావాలను తగ్గించడానికి కావాల్సిన గ్లోబల్ క్లైమేట్ పాలసీలను రూపొందించడం.

గతంలో కాప్ సదస్సుల్లో ఏయే అంశాలు ప్రధానంగా చర్చించారు, కాప్ - 29 సదస్సు ముఖ్య ప్రతిపాదనలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs

Indian shuttler Tanya Hemanth clinched the women's singles crown at the Saipan International 2025 in the Northern Mariana Islands on 16 August 2025. The top seed, ranked 86 in the world, defeated Japan's Kanae Sakai 15-10, 15-8 in the final under the Badminton World Federation's new 3x15 scoring format.

On 16 August 2025, President of India Droupadi Murmu gave Manipur Governor Ajay Kumar Bhalla additional charge as the Nagaland Governor. This move follows the demise of Nagaland Governor La Ganesan on August 15, 2025.

India will host the Asian Open Short Track Speed Skating Trophy 2025 for the first time. This will be organized from 20 to 23 August 2025 at the Maharana Pratap Sports College, in Raipur, Dehradun.

The Northeast Frontier Railway (NFR) and IIT-Guwahati have collaborated to introduce biodegradable and compostable materials as a replacement for conventional plastic to ensure environmental sustainability.

For more Current Affairs: Scan QR code

Quadrilaterals

1. If the sum of the interior angles of a regular polygon be 1260°, the number of sides the polygon is ...
A) 8 B) 10 C) 9
D) 12 E) 14

2. Ratio of the number of sides of two regular polygon is 3 : 4 and the ratio of their each interior angles is 14 : 15, then the number of sides of these two respective polygons are..
A) 9, 12 B) 8, 10 C) 10, 12
D) 7, 10 E) 11, 15

3. The number of diagonals in the regular polygon of 12 sides...
A) 36 B) 52 C) 48
D) 54 E) 72

4. ABCD is a cyclic quadrilateral AC and BD intersects at M. If $\angle DAC = 47^\circ$ and $\angle ABD = 78^\circ$ then what is the value (in degrees) of $\angle ADC$?
A) 65° B) 55° C) 60°
D) 58° E) 75°

5. In a trapezium, the two non parallel sides are equal in length, each being 15 cm. The parallel sides are at a distance of 12 cm a part. If the smaller sides of the parallel sides is of length 11 cm, then the sum of the diagonals of the trapezium is...
A) $8\sqrt{34}$ cm B) $7\sqrt{35}$ cm
C) $16\sqrt{17}$ cm D) $17\sqrt{15}$ cm
E) $19\sqrt{17}$ cm

6. PQRS is a parallelogram with PQ || RS and PS || QR - Line AQ is a bisector of $\angle PQR$. If $\angle SPQ = 54^\circ$ then, what is $\angle QAS$?
A) 96° B) 126° C) 117°
D) 63° E) 78°

7. ABCD is a cyclic quadrilateral. If angle A is $2\frac{1}{3}$ times the angle C and angle D is $5\frac{2}{3}$ times the angle B. Then the sum of the angles B and C is...
A) 75° B) 81° C) 79°
D) 90° E) 10°

Bank Exams

Quantitative Aptitude

8. The interior angle of a regular polygon is 135°. The number of sides of the polygon is...
A) 12 B) 9 C)10 D) 8 E) 19

9. PQRS is a cyclic quadrilateral. Diagonals PR and QS meets at M. If $\angle PMQ = 108^\circ$ and $\angle RQS = 34^\circ$ then $\angle PSQ$ measures..
A) 74° B) 72° C) 146°
D) 56° E) 112°

10. In a kite, the length of diagonals are 18 cm and 42 cm one of the angles between the diagonals is 135°. Find the area of the kite.
A) $\frac{189}{\sqrt{2}}$ sq cm B) $\frac{198}{\sqrt{2}}$ sq cm
C) $189\sqrt{2}$ sq cm D) $198\sqrt{2}$ sq cm
E) None of the above

11. In the parallelogram PQRS, PM is perpendicular SR and RL is perpendicular to PS. If PM = 21 cm, SR = 24 cm, and RL = 18 cm, then find the perimeter of the parallelogram.
A) 63 cm B) 102 cm C) 90 cm
D) 104 cm E) 114 cm

12. ABCD is a cyclic quadrilateral and AB is a diameter of the circle. If $\angle CAB = 37^\circ$ then, what is the measure of $\angle ADC$?
A) 53° B) 127° C) 143°
D) 74° E) 52°

13. ABCD is a cyclic quadrilateral such that its sides AD and BC produced meet at M and sides AB and DC produced meet at N. If $\angle A = 59^\circ$ and $\angle ABC = 78^\circ$, then the difference to between $\angle M$ and $\angle N$ is...
A) 12° B) 31° C) 42°
D) 24° E) 7°

14. The length and the breadth of a rectangle are respectively equal to the adjacent sides of a parallelogram. If the angle between the given adjacent sides of a parallelogram is 60°, then what is the ratio between the area of the rectangle and the parallelogram?
A) $2 : \sqrt{3}$ B) 1 : 2
C) $\sqrt{3} : 2$ D) 2 : 1
E) 7 : 1

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas
Asst. Prof. of Mathematics.

మాదిరి ప్రశ్నలు

కరెంట్ అఫైర్స్



■ బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రిసెర్చ్ కౌన్సిల్ (బీఏఆర్‌సీ) నూతన ఛైర్మన్?
జ: గౌరవ్ బెనర్జీ

■ ఆగస్టు 7 నుంచి 17 వరకు 'ది వరల్డ్ గేమ్స్' 12వ ఎడిషన్ ఏ నగరంలో జరిగాయి?
జ: చెంగ్డు (చైనా)

■ బాలికల ఉన్నత విద్యను ప్రోత్సహించడానికి నిజుత్ మొయినా 2.0 పథకాన్ని ప్రారంభించిన రాష్ట్రం?
జ: అస్సాం

■ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏ వ్యాధిని క్యాన్సర్‌కు కారణమని ప్రకటించింది?
జ: హెపటైటిస్ డి

■ భారతదేశంలోనే తొలిసారిగా ఏ ఐఐటీ డ్రైవర్‌రహిత బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది?
జ: హైదరాబాద్ ఐఐటీ

■ చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నీ విజేత? **జ:** విన్సెంట్ కీమర్ (జర్మనీ)

■ ఉల్చి ఫ్రీడమ్ షీల్డ్ వార్షిక సంయుక్త సైనిక విన్యాసం ఏ దేశాల మధ్య జరుగుతుంది? **జ:** దక్షిణ కొరియా, అమెరికా

■ 'ది లాస్ట్ బెగ్గర్: ఫ్రమ్ డొనేషన్ టూ డిగ్నిటీ' పుస్తక రచయిత?
జ: సంజీవ్ చోప్రా

■ ఇంటర్నేషనల్ డే ఆఫ్ ప్లే (అంతర్జాతీయ ఆటల దినోత్సవం) ను ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? ('చూజ్ ప్లే – ఎవ్రీ డే' అనే థీమ్‌తో 2025లో ఈ దినోత్సవాన్ని నిర్వహించారు)
జ: జూన్ 11

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?



☛ బ్యాంక్ ఆఫ్ బరోడాలో డిప్యూటీ మేనేజర్ ఉద్యోగాలు (330)
చివరి తేదీ: 19.08.2025

☛ ఎయిమ్స్ నాగ్‌పుర్‌లో సీనియర్ రెసిడెంట్ ఖాళీలు (108)
చివరి తేదీ: 19.08.2025

విపరీత నష్ట నివారణ వ్యూహం!

జనరల్ స్టడీస్ – డిజాస్టర్ మేనేజ్‌మెంట్

ప్రకృతి వైపరీత్యాలతోపాటు మానవ తప్పిదాల వల్ల విపత్తులు సంభవిస్తుంటాయి. వాటి ప్రభావాలను కనిష్ఠ స్థాయికి తగ్గించడానికి చేపట్టే చర్యలనే 'విపత్తు నిర్వహణ' అంటారు. ప్రాణాలను కాపాడుకోవడానికి, ఆస్తి నష్టాలను తగ్గించడానికి, దెబ్బతిన్న సమాజాలను తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడానికి విపత్తు నిర్వహణ తప్పనిసరి. వివిధ రకాల విపత్తులపై ప్రజల్లో అవగాహన పెంచి, భవిష్యత్తు ఆపదలను గట్టెక్కించే వ్యూహాలు అందులో ఉంటాయి. ఆ ప్రాథమిక అంశాలు, వినియోగించే పదాలు, అర్థాలు, విస్తృతి గురించి పోటీ పరీక్షార్థులు విధిగా తెలుసుకోవాలి. దేశంలో, ప్రపంచవ్యాప్తంగా ఏర్పాటైన విపత్తు నిర్వహణ సంస్థలు, వాటి కేంద్ర స్థానాలు, లక్ష్యాలపై అవగాహన కలిగి ఉండాలి.



గుజరాత్ భూకంపం (2001)

'ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్ క్రాస్ అండ్ రెడ్‌సెంట్ సొసైటీస్' ప్రచురించిన 'ప్రపంచ విపత్తు నివేదిక – 2010' ప్రకారం 2000 నుంచి 2009 మధ్య ప్రపంచవ్యాప్తంగా విపత్తుల ప్రభావానికి గురైన వారిలో 85% ఆసియా, పసిఫిక్ ప్రాంతానికి చెందినవారే ఉన్నారు.



విపత్తు నిర్వహణ - ప్రాథమిక భావనలు

(ప్రపంచ వ్యాప్తంగా విపత్తు నిర్వహణ కేంద్రాలు – వివరాలు)

వైపరీత్యాలన్నీ విపత్తు స్థాయిని పొందలేవు. కొన్ని వైపరీత్యాల్లో నిర్దేశిత సంభావ్యతల్లో ఏ ఒక్కటి జరిగినా విపత్తులుగా మారతాయి. అవి 1) ప్రాణనష్టం. 2) ఎక్కువగా ఆస్తి నష్టం. 3) ప్రజలు తమ జీవనోపాధిని పునరుద్ధరించుకోలేని స్థాయికి నష్టపోవడం. 4) ఎక్కువమంది గాయపడి ఆసుపత్రి పాలవడం. 5) ఆ ప్రాంత మౌలిక వసతులు, ప్రకృతి వనరులు తీవ్రంగా ధ్వంసమవడం. 6) ఆ ప్రాంత సుస్థిరాభివృద్ధి దెబ్బతినడం.

దుర్బలత్వం: ఏదైనా భౌగోళిక ప్రాంతం లేదా ఒక కమ్యూనిటీలో సంభవించే వైపరీత్యం వల్ల నష్టతీవ్రతను పెంచే ఆ ప్రాంత పరిస్థితుల పరిధిని 'దుర్బలత్వం' అంటారు. ✤ ఒక కమ్యూనిటీ, దాని నిర్మాణం, అందులోని సేవలు లేదా ఏదైనా భౌగోళిక ప్రాంతం, దాని స్వభావం, నిర్మాణం, అవి విపత్తు ప్రాంతానికి లేదా ప్రమాదకర భూభాగానికి ఉన్న సామీప్యత రీత్యా విధ్వంసానికి గురయ్యే పరిధిని దుర్బలత్వంగా పేర్కొనవచ్చు. ✤ దుర్బలతం అనేది ఒక కమ్యూనిటీలో నివసించే ప్రజల ఆర్థిక పరిస్థితి, లింగభేదం, పేదరికం, నిరక్షరాస్యత, వయసు, సరైన అవగాహన లేకపోవడం, పట్టణీకరణ, జనాభా పెరుగుదలపై ఆధారపడి ఉంటుంది.

ఉదా: 2001లో గుజరాత్‌లో సంభవించిన భూకంపం కారణంగా భుజ్ పట్టణ పరిసర ప్రాంతాల్లో నివసించే వారి కంటే ఇరుకైన రోడ్లు, సురక్షితం కాని భవనాలు, అధిక జనసాంద్రత ఉన్న భుజ్ పాత నగరానికి చెందినవారే ఎక్కువగా మరణించారు. పట్టణ శివారుల్లోని నివాస ప్రాంతాల్లో విశాలమైన రోడ్లు ఉండటమే కాకుండా ఒకటి/రెండు అంతస్థుల భవనాలే కలిగి ఉండటంతో భూకంపం సమయంలో త్వరగా బయటకు వచ్చారు. అంటే భుజ్ శివారు ప్రాంతాల్లో నివసిస్తున్న వారి కంటే భుజ్ పాతనగరంలో నివసిస్తున్న వారికి అధిక దుర్బలత్వం ఉంది.

సామర్థ్యం లేదా సమర్థత: ఏదైనా కమ్యూనిటీ ప్రాంతంలో సంభవించిన వైపరీత్యాల వల్ల నష్టపోయిన ఆస్తులు, వనరులు, జీవనోపాధిని పునరుద్ధరించుకోగల శక్తినే ఆ కమ్యూనిటీ సామర్థ్యంగా పిలుస్తారు. అది అక్కడి ప్రజల సాంఘిక, ఆర్థిక, స్థితిగతులపై ఆధారపడి ఉంటుంది.

ఉదా: ఎక్కువ తీవ్రత ఉన్న భూకంపం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ లాంటి ప్రాంతంలో సంభవిస్తే దానివల్ల అక్కడి ఆస్తులు, వనరులు హెచ్చుస్థాయిలో ధ్వంసమైనప్పటికీ వాటిని త్వరితగతిన పునరుద్ధరించుకోగలిగిన శక్తి ఆ కమ్యూనిటీకి ఉంటుంది. ఇలాంటి ప్రాంతాల్లో ఎలాంటి దుర్బల పరిస్థితులు లేకపోవడంతో వైపరీత్యాలు విపత్తుగా మారవు. కానీ తక్కువ తీవ్రత ఉన్న భూకంపం మురికివాడ ప్రాంతాల్లో సంభవించినప్పటికీ దానివల్ల ఆ ప్రాంతంలో జరిగిన నష్టాన్ని పునరుద్ధరించుకోగలిగిన శక్తి అక్కడి ప్రజలకు ఉండదు. కారణం వారి కమ్యూనిటీలో పేదరికం, బలహీనమైన నివాసగృహాలు, మౌలిక వసతుల లేమి, నిరక్షరాస్యత తదితర భౌతిక, సాంఘిక, ఆర్థిక పరమైన దుర్బల పరిస్థితులు ఎక్కువగా ఉండటమే. ఇలాంటి ప్రాంతాల్లో వైపరీత్యాలు విపత్తుగా మారతాయి.



ఇండియా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కాంగ్రెస్ (ఐడీఎంసీ): జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ఐడీఎం) ఆధ్వర్యంలో భారతదేశ మొదటి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కాంగ్రెస్ 2006, నవంబరు 29, 30ల్లో న్యూదిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగింది. నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రారంభించారు. రెండో ఐడీఎంసీ సమావేశం 2009, నవంబరు 4-6ల్లో విజ్ఞాన్ భవన్‌లో జరిగింది.

అపాయం/ విపత్కర స్థితి/ ముప్పు: వైపరీత్యాలు, దుర్బలత్వ పరిస్థితుల పరస్పర చర్యల కారణంగా ఆర్థిక కార్యకలాపాల్లో అంతరాయం, పర్యావరణ క్షీణతతోపాటు మరణాలు, గాయాలు, ఆస్తి, జీవనోపాధి నష్టం లాంటి హానికర పర్యవసానాలు లేదా ఊహించదగిన నష్టాలు జరిగే సంభావ్యతను అపాయం (రిస్క్) అంటారు.
✤ నిర్దిష్ట కాలవ్యవధిలో ఒక ప్రాంతంలో వైపరీత్య సంఘటన వల్ల తలెత్తే ఊహించని నష్టాల అంచనాను ముప్పు లేదా 'విపత్కర స్థితి' అంటారు. ముప్పు స్థాయి పలు అంశాలపై ఆధారపడి ఉంటుంది. 1) వైపరీత్య స్వభావం ✤ విపత్కర స్థితి = వైపరీత్యం x దుర్బలత్వం/ సామర్థ్యం 2) వైపరీత్య ప్రభావానికి గురయ్యే అంశాల దుర్బలత్వం. 3) ఆ అంశాల ఆర్థిక విలువ. ✤ ఒక కమ్యూనిటీ/ప్రాంతం వైపరీత్యాలకు గురై, ప్రభావితమైనప్పుడు ఆ ప్రాంతం ముప్పులో ఉన్నట్లు తెలియజేస్తుంది. ✤ విపత్తు వల్ల ఒక కమ్యూనిటీకి కలిగిన ముప్పు నుంచి రక్షించడానికి, ఆ బాధల నుంచి తప్పించడానికి విపత్తు నిర్వహణను చేపట్టే విధానాలు- 1) సంసిద్ధత
2) ఉపశమనం

సంసిద్ధత: ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండటం.

ఉపశమనం: వైపరీత్యం సంభవించిన తర్వాత దాని తీవ్రతను, మళ్లీ విపత్తుకు గురయ్యే పరిస్థితిని తగ్గించి త్వరగా మామూలు స్థితికి రావడం.

ఉదా: కరవు పీడిత ప్రాంతాల్లో నీటిని నిల్వ చర్యల రూపంలో భవిష్యత్తులో రాబోయే నీటిఎద్దడిని ఎదుర్కోవడం, తుపాను వల్ల నష్టపోయిన బాధితులకు సురక్షిత ప్రాంతాల్లో పునరావాసం, పునర్నిర్మాణం కలిగించడం. ✤ 2004 సునామీ తర్వాత తమిళనాడులోని సామియార్ పెట్టయ్ గ్రామంలో ఇతర గ్రామాలతో పోల్చుకుంటే తక్కువ మరణాలు సంభవించాయి. ఆ గ్రామస్థులు శోధన, రక్షణ, ఖాళీ చేయడం, ప్రథమ చికిత్సలో శిక్షణ పొంది ఉండటంతో విపత్తుల సమయంలో సమర్థంగా స్పందించారు. పెద్దసంఖ్యలో ప్రాణాలను కాపాడుకోవడానికి అది దోహదపడింది.

మరింత సమాచారం

> **ఐక్యరాజ్యసమితి విపత్తు కుదింపునకు అంతర్జాతీయ వ్యూహం (యూఎన్ఐఎస్‌డీఆర్) విడుదల చేసిన గ్లోబల్ అసెస్‌మెంట్ రిపోర్ట్ 2011 ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా వరదలకు గురవుతున్న వారిలో 90% పైగా దక్షిణాసియా, తూర్పు ఆసియా, పసిఫిక్ దేశాల్లోనే ఉంటున్నారు.**

అంతర్జాతీయ విపత్తు నిర్వహణ సంస్థలు:

1) పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్ (పీటీడబ్ల్యూసీ): దీనినే అంతర్జాతీయ సునామీ హెచ్చరికల కేంద్రం అంటారు. 1948లో ఏర్పాటు చేశారు. ప్రధాన కార్యాలయం అమెరికాలోని హవాయి రాష్ట్రం ఇవా బీచ్‌లో ఉంది. అమెరికాకు చెందిన నేషనల్ ఓషానిక్, అట్మాస్ఫియరిక్ విభాగం నిర్వహిస్తోంది. 2004లో హిందూ మహాసముద్రంలో సునామీ అనంతరం ఈ కేంద్రం సేవలను హిందూ మహాసముద్రం, కరేబియన్, చుట్టుపక్కల ప్రాంతాలకూ విస్తరించారు.



2) ఇంటర్నేషనల్ సునామీ ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఐటీఐసీ): యునెస్కోకు చెందిన 'ఇంటర్ గవర్నమెంటల్ ఓషనోగ్రాఫిక్ కమిషన్' ఆధ్వర్యంలో 1965లో ఈ సంస్థ ఏర్పాటైంది. ప్రధాన కేంద్రం అమెరికాలో హవాయి రాష్ట్రంలోని హొనొలులు.

3) పసిఫిక్ ప్రాంతంలో సునామీ హెచ్చరిక సమన్వయ గ్రూపు: 1968, మార్చి 22న ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌లో 'ఇంటర్ గవర్నమెంటల్ ఓషనోగ్రాఫిక్ కమిషన్' (ఐఓసీ) ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేశారు.

4) ఆసియన్ డిజాస్టర్ రిడక్షన్ సెంటర్: జపాన్‌లోని కోబ్ నగరంలో 1998లో ఏర్పాటు చేశారు.

5) ఆసియా డిజాస్టర్ ప్రిపేర్డ్‌నెస్ సెంటర్: థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో 1986, జనవరిలో ఏర్పాటు చేశారు.

6) ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ): ఇది ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ. భూగోళ వాతావరణాన్ని పర్యవేక్షించే ఈ సంస్థ ప్రధాన కేంద్రం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉంది. ఏటా మార్చి 23న ప్రపంచ వాతావరణ దినోత్సవం నిర్వహిస్తారు.

> ◆ **అంతర్జాతీయ విపత్తు కుదింపు దినోత్సవం – అక్టోబరు 13. 2013లో ఈ దినోత్సవాన్ని విపత్తులు, అంగవైకల్యంతో పోరాడుతున్న వారికి అంకితం చేశారు. 2009 వరకు ఏటా అక్టోబరు రెండో బుధవారాన్ని ఈ దినోత్సవంగా పాటించేవారు. 2009, డిసెంబరు 21న ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ నిర్ణయం ప్రకారం అక్టోబరు 13కు మార్చారు.**
> ◆ **జాతీయ విపత్తు నిర్వహణ దినోత్సవం – అక్టోబరు 29.**



7) సార్క్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెంటర్ (ఎస్‌డీఎంసీ): దీనిని 2006, అక్టోబరులో న్యూదిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆవరణలో ఏర్పాటు చేశారు.

మరింత సమాచారం



రచయిత: సక్కరి జయకర్

జీవితంలో ఎదిగేందుకు పది నైపుణ్యాలు! – లైఫ్ స్కిల్స్



కళాశాలలో కష్టపడి చదివి తెలుసుకున్న అంశాలతోనే జీవితంలో అద్భుతంగా ఎదగాలంటే కుదరదు. అంతకు మించి నేర్చుకోవాలి. మంచి ఉద్యోగ సాధనతో పాటు మెరుగైన జీవనం కావాలంటే పది నైపుణ్యాలు తప్పనిసరని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనమూ ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఆ పది నైపుణ్యాలు ఏమిటి? వాటిని పెంపొందించుకుని జీవితంలో త్వరగా ఏవిధంగా రాణించాలో తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.


'యుద్ధం.. వ్యాపారం సహజీవనం చేయలేవు!'

పోర్చుగీసు నావికుడు వాస్కోడిగామా సముద్రమార్గాన్ని కనిపెట్టడంతో భారతదేశానికి ఐరోపా వాసుల రాక మొదలైంది. వ్యాపారం, లాభార్జనే ధ్యేయంగా వచ్చిన పోర్చుగీసు, డచ్, బ్రిటిష్, ఫ్రెంచ్‌వారు తొలుత పరస్పరం ఘర్షణ పడ్డారు. యుద్ధతంత్రం, అధునాతన ఆయుధ సంపత్తి పుష్కలంగా ఉన్న ఆంగ్లేయ కంపెనీ ఆ యుద్ధాల్లో విజయం సాధించి తిరుగులేని వలసవాద శక్తిగా అవతరించింది. మూడు శతాబ్దాలపాటు జరిగిన ఈ చారిత్రక పరిణామక్రమం, చోటుచేసుకున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పులను పోటీ పరీక్షార్థులు సమగ్రంగా తెలుసుకోవాలి. ఐరోపా శక్తులు భారత గడ్డపై చేసిన యుద్ధాలు, వాటి పర్యవసానాలు, వర్తక స్థావరాలుగా ఏర్పాటు చేసుకున్న ప్రాంతాలు, వలస పాలకులు, అధికారుల్లో శక్తిమంతులు, వారితో పోరాడిన, సంబంధాలు నిర్వహించిన స్వదేశీ రాజుల వివరాలపై అవగాహన కలిగి ఉండాలి.

జనరల్ స్టడీస్-భారతదేశ చరిత్ర

యూరోపియన్ల రాక


1. భారత దేశానికి యూరోపియన్లు వచ్చిన వరుసను గుర్తించండి.
   1) పోర్చుగీస్ - డచ్ - బ్రిటిష్ - డేనిష్ - ఫ్రెంచ్
   2) పోర్చుగీస్ - బ్రిటిష్ - డచ్ - ఫ్రెంచ్ - డేనిష్
   3) డచ్ - బ్రిటిష్ - పోర్చుగీస్ - డేనిష్ - ఫ్రెంచ్
   4) బ్రిటిష్ - పోర్చుగీస్ - డచ్ - డేనిష్ - ఫ్రెంచ్
2. భారత్‌లో యూరోపియన్‌ల మధ్య గొడవలకు ప్రధాన కారణం?
   1) వారిలో జాతి వివక్ష అధికమవడం
   2) తమ దేశ ఆధిపత్యాన్ని అధికంగా ప్రదర్శించడం
   3) భారతీయులు వారిలో వారికి చిచ్చుపెట్టడం
   4) యూరోపియన్లు ఎక్కువ అవడంతో లాభాలు తగ్గడం
3. ప్లాసీగా పిలిచే పలాశి ఏ రాష్ట్రంలో ఉంది?
   1) బెంగాల్ 2) ఒడిశా
   3) ఆంధ్రప్రదేశ్ 4) ఉత్తర్‌ప్రదేశ్
4. 'సతి' విధానాన్ని రద్దు చేయడానికి ప్రయత్నించిన పోర్చుగీసు గవర్నర్?
   1) ఫ్రాన్సిస్-డి-అల్మీడా 2) అల్బూకర్క్
   3) నినా-డ-కున్హా 4) అల్ఫోన్సో-డి-సౌజా
5. కింది వాటిలో అల్బూకర్క్‌కు సంబంధించి సరికానిది?


అల్బూకర్క్


   1) ఈయన భారత్‌లో పోర్చుగీసు రాజ్య నిర్మాత.
   2) మొదట పోర్చుగీసు గవర్నర్‌గా ఖ్యాతి గడించాడు.
   3) గోవా ఆక్రమణ ఈయన కాలంలో జరిగింది.
   4) ఇతడిని 'పోర్చుగీసు రాబర్ట్ క్లైవ్'గా పిలుస్తారు.
6. భారతదేశంలో పోర్చుగీసువారి పతనానికి కారణం?
   1) భారత్ కంటే బ్రెజిల్ మీద ఆసక్తి ఎక్కువగా ఉండటం.
   2) అసమర్థులైన గవర్నర్లు.
   3) పోర్చుగల్ స్పెయిన్‌లో విలీనమవడం.
   4) పైవన్నీ
7. ప్లాసీ యుద్ధం జరిగిన సంవత్సరం?
   1) 1764 2) 1749 3) 1757 4) 1794
8. మొదటిసారిగా భారతీయులను తమ కంపెనీలకు కాపలా సైనికులుగా నియమించుకోవడాన్ని ప్రారంభించిన యూరోపియన్‌లు ఎవరు?
   1) బ్రిటిష్ 2) డేనిష్ 3) డచ్ 4) ఫ్రెంచ్
9. సూరత్‌ను బ్రిటిషర్లు ఎలా పొందారు?
   1) జహంగీర్‌తో యుద్ధం చేయడం ద్వారా
   2) జహంగీర్‌తో రాయబారం ద్వారా
   3) పోర్చుగీసువారితో యుద్ధం ద్వారా
   4) డచ్చివారితో రాయబారం ద్వారా
10. యూరోపియన్ కంపెనీలు, వాటి ప్రధాన వర్తక స్థావరాలను జత చేయండి.
   1) బ్రిటిష్ ఎ) మద్రాస్
   2) డచ్ బి) పులికాట్
   3) ఫ్రెంచ్ సి) పుదుచ్చేరి
   4) పోర్చుగీసు డి) గోవా
   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 2) 1-ఎ, 2-సి, 3-డి, 4-బి
   3) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి 4) 1-బి, 2-డి, 3-సి, 4-ఎ
11. బ్రిటిష్‌వారి కాలంలో మచిలీపట్నం దేనికి ప్రసిద్ధి చెందింది?
   1) నూలు వస్త్రాలు 2) కలంకారీ అలంకరణ
   3) సుగంధద్రవ్యాలు 4) దంతపు వస్తువులు
12. ప్రసిద్ధి చెందిన కర్ణాటక యుద్ధాలు ఎవరెవరి మధ్య జరిగాయి?
   1) బ్రిటిష్ - డచ్ 2) పోర్చుగీస్ - బ్రిటిష్
   3) ఫ్రెంచ్ - బ్రిటిష్ 4) బ్రిటిష్ - డేనిష్
13. గోల్కొండ సుల్తాన్ ఆంగ్లేయులకు గోల్డెన్ ఫర్మానా (బంగారు శాసనం) ప్రకటించిన సంవత్సరం?
   1) 1630 2) 1757 3) 1632 4) 1690
14. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ తరపున భారత్‌లోకి ప్రవేశించిన మొదటి నౌక?
   1) గ్లోబ్ 2) హెక్టార్
   3) గాబ్రియల్ 4) రెడ్ డ్రాగన్
15. బక్సార్ యుద్ధం జరిగిన సంవత్సరం?
   1) 1764 2) 1765 3) 1790 4) 1717
16. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి గోల్డెన్ ఫర్మానా జారీ చేసిన మొగల్ చక్రవర్తి?
   1) బహదూర్ షా జాఫర్ 2) ఔరంగజేబు
   3) ఫరూక్ సియర్ 4) రెండో అక్బర్
17. అంబయానా (1623) హత్యాకాండ ఎవరెవరి మధ్య జరిగింది?
   1) బ్రిటిష్ - డచ్ 2) ఫ్రెంచ్ - డచ్
   3) బ్రిటిష్ - పోర్చుగీస్ 4) డేనిష్ - బ్రిటిష్
18. 'యుద్ధం, వ్యాపారం ఒకే చోట సహజీవనం చేయలేవు' అని అన్న ఆంగ్లేయుడు ఎవరు?


థామస్ రో

   1) రాబర్ట్ క్లైవ్
   2) థామస్ రో
   3) వారెన్ హేస్టింగ్
   4) కెప్టెన్ హిప్పన్
19. ఏ యుద్ధానంతరం బాంబే ప్రెసిడెన్సీ ఏర్పాటుకు దారి సుగమం అయింది?
   1) 3వ పానిపట్ యుద్ధం
   2) 3వ ఆంగ్లో మరాఠా యుద్ధం
   3) దామల చెరువు యుద్ధం
   4) 4వ ఆంగ్లో మైసూర్ యుద్ధం
20. కింది వర్తక స్థావరాలను, వాటి రాష్ట్రాలతో జతపరచండి.
   1) బాలాసోర్ ఎ) గోవా
   2) సేరంపుర్ బి) ఆంధ్రప్రదేశ్
   3) పులికాట్ సి) బెంగాల్
   4) వెంగుర్ల డి) ఒడిశా
   1) 1-ఎ, 2-డి, 3-బి, 4-సి 2) 1-డి, 2-ఎ, 3-సి, 4-బి
   3) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ 4) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
21. కింది వాటిలో పోర్చుగీసువారికి సంబంధించి సరికానిది గుర్తించండి.
   1) భారత్‌కు మొదటిగా వచ్చి మొదటిగా వెళ్లిపోయారు.
   2) భారత్‌లో మిరప పంటను ప్రవేశపెట్టారు.
   3) కాలికో వస్త్రాలను ఎగుమతి చేశారు.
   4) బుడత కీచులు అనే పేరొందారు.
22. డచ్‌వారి మొదటి వర్తక స్థావరం?
   1) పులికాట్ 2) సూరత్
   3) మచిలీపట్నం 4) బాలాసోర్
23. 'ప్లాసీ' ప్రాంతానికి సంబంధించి సరైంది?
   1) బ్రిటిష్ గతిని మార్చిన ప్రాంతం ప్లాసీ.
   2) ప్లాసీ అనే పదం ఆంగ్లేయులు ఉచ్చరించారు.
   3) ఇక్కడ ఎర్రటిపూలు పూసే పలాశీ మొక్క ప్రసిద్ధి.
   4) పైవన్నీ
24. 'ఆపరేషన్ విజయ్' ఏ దేశం అధికారాన్ని గోవాలో లేకుండా చేసింది?
   1) బ్రిటిష్ 2) ఫ్రెంచ్ 3) డచ్ 4) పోర్చుగీసు
25. ప్రకటన–(ఎ): ఫ్రాన్సిస్–డి–అల్మీడా నీలి నీటి విధానాన్ని ప్రవేశపెట్టాడు.
   కారణం–(ఆర్): భారత్ భూభాగాలను ఆక్రమించి, రాజకీయ అధికారం స్థాపించాలని అల్మీడా భావించాడు.
   1) ఎ, ఆర్ లు సరైనవి; ఆర్ కు ఎ సరైన వివరణ.
   2) ఎ, ఆర్ లు సరైనవి; ఆర్ కు ఎ సరైన వివరణకాదు.
   3) ఎ సరైంది, కానీ ఆర్ సరికాదు.
   4) ఎ సరికాదు కానీ ఆర్ సరైంది.
26. పోర్చుగీసువారు భారత్‌లో 'ఐబేరియన్ శైలి'ని ప్రవేశపెట్టారు. అయితే దీని లక్షణం?
   1) పైకప్పు, మెట్ల కోసం కలపను వాడటం
   2) ఇటుకలు ప్రధానంగా ఉపయోగిస్తారు.
   3) 1, 2 4) ఏదీకాదు
27. కింది వాటిలో ఒకటి డేనిష్‌వారి వర్తక స్థావరం కాదు?
   1) ట్రాంక్విబార్ 2) మచిలీపట్నం
   3) అండమాన్ - నికోబార్ 4) సూరత్
28. బెంగాల్‌లో ఫ్రెంచ్‌వారి ఏకైక వర్తక స్థావరం ఏది?
   1) హుగ్లీ 2) కోల్‌కతా
   3) చిట్టగాంగ్ 4) చంద్ర నగూర్
29. కింది వాటిలో ఏ కంపెనీని 'బటావియా కంపెనీ' అని కూడా పిలుస్తారు?
   1) బ్రిటిష్ కంపెనీ 2) డచ్ కంపెనీ
   3) పోర్చుగీసు కంపెనీ 4) ఫ్రెంచ్ కంపెనీ
30. యూరప్‌లో బ్రిటిష్‌వారికి, ఫ్రెంచ్ వారికి మధ్య జరిగిన x la - Chapelle సంధి ద్వారా భారత్‌లో ఆగిన యుద్ధం?



   1) మొదటి మైసూర్ యుద్ధం
   2) రెండో కర్ణాటక యుద్ధం
   3) మొదటి కర్ణాటక యుద్ధం
   4) మూడో కర్ణాటక యుద్ధం
31. భారతదేశ చరిత్రలో 1748వ సంవత్సరపు ప్రాధాన్యం?
   1) మొగల్ చక్రవర్తి మహ్మమద్ షా మరణం.
   2) మరాఠా ఛత్రపతి సాహు మరణం.
   3) హైదరాబాద్ నిజాం మరణం.
   4) పైవన్నీ
32. 1802లో నెల్లూరు, చిత్తూరు ప్రాంతాలను బ్రిటిష్ పాలనలోకి తెచ్చింది ఎవరు?
   1) డల్హౌసీ 2) వెల్లస్లీ
   3) కారన్ వాలీస్ 4) బెంటింక్
33. కరైకల్ అనే ప్రాంతం అప్పట్లో ఏ రాజు అధీనంలో ఉండేది?
   1) తిరువాన్కూర్ రాజా 2) తిరుపళ్లూర్ రాజా
   3) తంజావూర్ రాజా 4) తిరుచానూర్ రాజా
34. 'వందవాసి యుద్ధం' ఏ యుద్ధంలో భాగంగా జరిగింది?
   1) ప్లాసీ యుద్ధం
   2) మొదటి కర్ణాటక యుద్ధం
   3) రెండో కర్ణాటక యుద్ధం
   4) మూడో కర్ణాటక యుద్ధం
35. మీర్ జాఫర్‌కు సంబంధించి సరైంది?
   1) సిరాజ్-ఉద్దౌలా అనంతరం బెంగాల్ నవాబు.
   2) చిన్సూరా యుద్ధంలో బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాడాడు.
   3) మీర్ జాఫర్ కుమారుడు మిరాన్ సిరాజ్ ఉద్దౌలాను హతమార్చాడు.
   4) పైవన్నీ
36. బెంగాల్‌లో బ్రిటిష్‌వారి మొదటి స్థావరం?
   1) కోల్‌కతా 2) హుగ్లీ
   3) బాలాసోర్ 4) చిట్టగాంగ్
37. కింది వాటిలో సరికాని దాన్ని గుర్తించండి.
   1) భారత్‌లో పొగాకును బ్రిటిష్ వారు ప్రవేశపెట్టారు.
   2) థామస్ రో ప్రసిద్ధి చెందిన బ్రిటిష్ రాయబారి.
   3) బ్రిటిష్‌వారు మద్రాసును మున్సిపాలిటీగా మార్చారు.
   4) మచిలీపట్నంలో బ్రిటిష్ స్థావరం ఉంది.
38. బ్రిటిషర్లు 1765లో దివానీ అధికారాన్ని ఏ ప్రాంతాల మీద పొందారు?
   1) బెంగాల్, బిహార్, ఒడిశా
   2) బెంగాల్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా
   3) అయోధ్య, మధ్యప్రదేశ్, బెంగాల్
   4) బిహార్, అయోధ్య, హైదరాబాద్
39. ఏ యుద్ధానంతరం భారతదేశంలో డచ్ వారి అధికారం సన్నగిల్లింది?
   1) చిన్సూరా యుద్ధం 2) శాంథోమ్ యుద్ధం
   3) వందవాసి యుద్ధం 4) కర్ణాటక యుద్ధం
40. 'జామెరిన్' అంటే అర్థం?
   1) గొప్ప చక్రవర్తి
   2) ప్రపంచ విజేత
   3) సముద్రాధిపతి
   4) దేవుడి కుమారుడు



రచయిత: కాకులూరు వెంకటేశ్వర్లు

సమాధానాలు

1-1; 2-4; 3-1; 4-2; 5-2; 6-4; 7-3; 8-4; 9-2; 10-1; 11-1; 12-3; 13-3; 14-4; 15-1; 16-3; 17-1; 18-2; 19-2; 20-3; 21-1; 22-3; 23-4; 24-4; 25-3; 26-3; 27-4; 28-4; 29-2; 30-3; 31-4; 32-2; 33-3; 34-4; 35-4; 36-2; 37-1; 38-1; 39-1; 40-3.

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

ఐప్యాడ్ ఆర్టిస్ట్ ఇలస్ట్రేటర్ ఫ్రమ్ నిఫ్ట్

సంస్థ: లా సెట్ నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ఫొటోషాప్ లైట్‌రూమ్ సీసీ, ప్రీమియర్ ప్రో, కోరల్‌డ్రా
స్టైపెండ్: రూ.6000-8000
☛ https://shorturl.at/kMraR

ఆర్కిటెక్చర్

సంస్థ: జిగ్యాస్ బోర నైపుణ్యాలు: అడోబ్ ఫొటోషాప్, ఆటోక్యాడ్, గూగుల్ స్కెచప్
స్టైపెండ్: రూ.5,500-10,500
☛ https://shorturl.at/j8vBN

వీటికి దరఖాస్తు గడువు: సెప్టెంబరు 10

ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్

సంస్థ: సిద్ధివినాయకా క్రియేటివ్ ల్యాబ్స్
నైపుణ్యాలు: బ్లాగింగ్, కంటెంట్, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, పింటరెస్ట్, సెర్చ్ ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, కాపీ రైటింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇన్‌స్టాగ్రామ్ యాడ్స్, మార్కెటింగ్, యూట్యూబ్ యాడ్స్ స్టైపెండ్: రూ.5,000
☛ https://shorturl.at/Hybr8

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: కెరియర్‌నెస్ట్ నైపుణ్యాలు: డిజిటల్, సోషల్ మీడియా, ఈమెయిల్ మార్కెటింగ్
స్టైపెండ్: రూ.10,000
☛ https://shorturl.at/h4bvy

వీడియో ఎడిటింగ్/ మేకింగ్

సంస్థ: ఏఅండ్‌ఎం గ్రాఫికల్ ప్రొడక్షన్స్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ప్రీమియర్ ప్రో, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ స్టైపెండ్: రూ.10,000-13,000
☛ https://shorturl.at/NmMMj

బ్యాక్‌ఎండ్ డెవలప్‌మెంట్

సంస్థ: కోడింగ్ జూనియర్
నైపుణ్యాలు: ఏపీఐస్, సీఎస్ఎస్, డాకెట్, గిట్, గోలాంగ్, మాంగోడీబీ, మైఎస్‌క్యూఎల్, రియాక్ట్, రెస్ట్ ఏపీఐ, ఎస్‌క్యూఎల్, టైప్‌స్క్రిప్ట్
స్టైపెండ్: రూ.12,000-20,000
☛ https://shorturl.at/EphqP

వీటికి దరఖాస్తు గడువు: సెప్టెంబరు 12

రిసెర్చ్ రైటింగ్ అసిస్టెంట్ (ఏఐ/ఎంఎల్)


సంస్థ: హౌస్ ఆఫ్ కౌటన్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఏఐ, డేటాసైన్స్, డేటా స్ట్రక్చర్స్, డీప్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్, నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, న్యూరల్ నెట్‌వర్క్స్, పైథాన్ స్టైపెండ్: రూ.12,000-25,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 2
☛ https://shorturl.at/d5KtU

ఇన్‌సైడ్ సేల్స్

సంస్థ: విగ్నం ల్యాబ్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం, సేల్స్
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 3
☛ https://shorturl.at/miESn

డిజిటల్ అడ్వర్టైజింగ్

సంస్థ: గ్లోబల్ ట్రెండ్ నైపుణ్యాలు: ఫేస్‌బుక్ యాడ్స్, గూగుల్ అనలిటిక్స్, యాడ్‌వర్డ్స్, ఇన్‌స్టాగ్రామ్, పింటరెస్ట్ మార్కెటింగ్
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 13
☛ http://internshala.com/i/519390



ఆసక్తి ఉంటే ఆకాశమే హద్దు!

రాకేష్ శర్మ నుంచి శుభాంశు శుక్లా వరకూ మానవ సహిత వ్యోమ యాత్ర విద్యార్థుల్లో కుతూహలం కలిగిస్తోంది. చంద్రయాన్-3 నుంచి ఆదిత్య ఎల్-1 వరకూ భారత్ విజయాలు యువత దృష్టిని అంతరిక్ష పరిశోధనలవైపు మరలుస్తున్నాయి. ప్రస్తుతం దాదాపు రూ.75 వేల కోట్ల స్పేస్ మార్కెట్టును సమీప భవిష్యత్తులో నాలుగు లక్షల కోట్లకు చేర్చాలన్న కేంద్రప్రభుత్వ లక్ష్యం.. ఈ రంగం వైపు ప్రైవేటు కంపెనీలను ఆకర్షిస్తోంది.

‘చందమామ రావే.. జాబిల్లి రావే’, ‘ట్వింకిల్.. ట్వింకిల్ లిటిల్ స్టార్’ వింటూ అంకురించిన ఆసక్తి ఆకాశమంత పెద్దదై ఈ రంగంలో ప్రవేశించాలనుకునే యువతను రోదసి రంగం స్వాగతిస్తోంది. కొత్త ఆలోచనలతో వచ్చేవారికి అవకాశాలు ఎదురు చూస్తున్నాయి.



ఒకప్పుడు ప్రభుత్వ రంగానికే పరిమితమైన అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యానికి వీలు కలుగుతోంది. అంతర్జాతీయ అంతరిక్ష మార్కెట్లో కేవలం 2 శాతంగా ఉన్న భారత్ తన వాటాను 8 శాతానికి అంటే నాలుగు రెట్లు పెంచేందుకు ప్రైవేటు సంస్థలతో కలిసి నడవాలనుకుంటోంది. దీనితో ప్రస్తుతం లక్షమందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న స్పేస్ ఇండస్ట్రీలో యువతకు నాలుగు రెట్ల అవకాశాలు రాబోతున్నాయి.

> **అంతరిక్ష పరిశోధన, ప్రయోగాలు, యాత్రలతో భారత్ ఎన్నో విజయాలు సాధిస్తూవస్తోంది. అయితే వీటి ద్వారా వాణిజ్యపరమైన ఫలితాలు సాధించి దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇచ్చే స్థాయికి ఎదగాల్సి ఉంది. ఈ ఎదుగుదలే ప్రైవేటు రంగానికి సోపానమై అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తి ఉన్న యువత కెరియర్‌కు స్పేస్ రాకెట్లా నిలువనుంది!**

స్టార్టప్‌ల జోరు

ఈ లక్ష్యానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం అంతరిక్ష రంగంపై నియంత్రణలను సడలించడంతో ప్రైవేటు కంపెనీలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే 250 స్టార్టప్స్ గగన క్షేత్రంలో వెలుగులు నింపేందుకు కృషి ప్రారంభించాయి. ఇప్పటివరకూ అంతరిక్ష పరిశోధన అంటే ఇస్రో (ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్) గుర్తుకు వస్తుంటే ఇకపై ప్రైవేట్ సంస్థలు మెరవనున్నాయి.

ఎగుమతుల విపణి

ఇటీవలి కాలంలో భారత్ అంతరిక్ష విజయాలు ప్రపంచ దేశాలను అబ్బురపరచాయి. చంద్రయాన్-3 ...చంద్రగ్రహ దక్షిణ ధ్రువంపై దిగిన తొలి వ్యోమ నౌక. ఆదిత్య ఎల్-1 సూర్యమండలం దిశగా నిర్దేశిత కక్ష్యకు చేరిన మొదటి యాత్ర. ఈ రెండు విజయాలూ భారత్ అంతరిక్ష విజ్ఞానంలో, పరిశోధనలో సాధించిన పురోగతిని విశ్వానికి చాటాయి. ఫలితంగా తమ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టమంటూ అనేక దేశాలు వరుసకట్టాయి. దీనితో అంతరిక్ష ఎగుమతుల విపణిని విస్తృతం చేయాలన్న లక్ష్యాన్ని భారత్ నిర్దేశించుకుంది. కొత్త స్టార్టప్స్ మొగ్గ తొడగడానికీ, సరికొత్త ఉద్యోగావకాశాలకూ ఇది ఊత మిస్తోంది.

ఇస్రోకు తోడు మరో రెండు

ప్రస్తుతం అంతరిక్ష పరిశోధనపై ఆసక్తి గల యువతకు కెరియర్ అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ ఇస్రో. మరో రెండు ప్రభుత్వ సంస్థలూ అవతరించాయి. ఒకటి.. ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించి అనుమతులను త్వరితగతిన పూర్తి చేసేది. రెండోది అంతర్జాతీయంగా అంతరిక్ష పరిశోధనలకున్న మార్కెట్టును కైవసం చేసుకునేందుకు ఉద్దేశించింది.

▼ ఇన్–స్పేస్: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ ఆధ్వర్యంలో పనిచేసే ఈ సంస్థ అంతరిక్ష క్షేత్రంలో పనిచేయాలనుకుంటున్న వాణిజ్య కంపెనీలకు అనుమతులను మంజూరు చేస్తుంది.

▼ ఎన్.ఎస్.ఐ.ఎల్: న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ అనే ఈ సంస్థ ఇస్రోకి సంబంధించిన వ్యాపార కార్యకలాపాలను నిర్వహించే వాణిజ్య సంస్థ.

వీటి ఆవిర్భావంతో ఈ రంగంలో ఉద్యోగావకాశాలు పెరిగాయి. కొత్తగా ప్రైవేటు కంపెనీలు ఉత్సాహంగా కాలిడుతున్నాయి.

అవకాశాలు అపారం

అంతరిక్ష పరిశోధనలు ప్రధానంగా రెండు లక్ష్యాలతో సాగుతున్నాయి. మొదటిది- రోదసిలో భారరహిత స్థితిలో వివిధ జీవుల్లో జరిగే మార్పులు. రెండోది- మానవ నివాసాలకు అనువైన భూమిని పోలిన గ్రహం కోసం అన్వేషణ, పరిశోధనలు. ఇవి దశాబ్దాల నుంచి జరుగుతున్నాయి. వీటికి తోడు మరో రెండు కోణాల్లో జరుగుతున్న కృషి ఈ రంగంలో అవకాశాలను పెంచుతోంది.

▼ శాటిలైట్ కమ్యూనికేషన్: అంతరిక్షం ద్వారా భూమిని ఉపగ్రహాల సాయంతో పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంపుతుండటం. ఈ అవసరాలు రోజురోజుకీ విస్తృతమవుతుండటంతో మార్కెట్ పెరుగుతోంది. ఇప్పటికే చాలా దేశాలు ఇస్రోను సంప్రదిస్తున్నాయి.

▼ బ్రాడ్‌బాండ్ వ్యాప్తి: బ్రాడ్‌బాండ్‌ను భూతలం నలుమూలలకు చేర్చడం అనేక సవాళ్లతో కూడి ఉండటంతో మారుమూల గ్రామాలకు సమాచార వ్యవస్థ వెళ్లలేకపోతోంది. ఉపగ్రహ వినియోగం ద్వారా ఈ పరిమితిని అధిగమించగలిగితే బ్రాడ్‌బాండ్ వ్యాప్తిని మరో దశకు తీసుకువెళ్లవచ్చు.



యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

అదనంగా ఏ కోర్సులు మేలు?

స్టాటిస్టిక్స్ స్పెషలైజేషన్‌తో డిగ్రీ చదువుతున్నాను. దీంతోపాటు డిస్టెన్స్‌లో ఏ కోర్సు చేస్తే పరిజ్ఞానం పెరుగుతుంది? - లహరి



■ ఈ రోజుల్లో స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్ సంఖ్యల విశ్లేషణకు మాత్రమే పరిమితం కాకుండా డేటా ఆధారిత నిర్ణయాలకు చాలా ఉపయోగకరంగా ఉంది. ఈ డిగ్రీ పూర్తి చేసినవారు తమ కెరియర్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలంటే కేవలం పాఠ్యపుస్తకాల పరిజ్ఞానంతో సరిపెట్టుకోకుండా అదనపు నైపుణ్యాలను పెంచుకోవడం చాలా అవసరం. ప్రస్తుత ఉద్యోగ మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని డిగ్రీ చదువుతూనే కొన్ని అనుబంధ కోర్సుల్ని ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్ విధానంలో నేర్చుకుంటే మేలు. ముఖ్యంగా కంప్యూటర్ ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు డేటా అనలిస్టులకు అత్యంత కీలకం. డేటా విశ్లేషణకు ప్రామాణికంగా ఉపయోగపడే పైతాన్, ఆర్ లాంటి ప్రోగ్రామింగ్ భాషలు నేర్చుకుంటే పెద్ద మొత్తంలో ఉన్న డేటాను సమర్థంగా నిర్వహిస్తూ విశ్లేషించవచ్చు. ఈ భాషలు డేటా మోడళ్లను రూపొందించడానికీ, అంచనాలు వేయడానికీ, మెషిన్ లెర్నింగ్ పద్ధతులను అమలు చేయడానికీ అవసరమైన శక్తిమంతమైన సాధనాలను అందిస్తాయి. డేటాబేస్‌ల నుంచి సమాచారాన్ని సేకరించడానికి అవసరమైన ఎస్‌క్యూఎల్ పరిజ్ఞానం కూడా తప్పనిసరి.

బిజినెస్ అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్ లాంటి కోర్సులు చేసి సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ఆర్థిక సంస్థలు, మార్కెటింగ్ ఏజెన్సీల్లాంటి చోట్ల ఉద్యోగాలు పొందవచ్చు. బయోస్టాటిస్టిక్స్ సబ్జెక్టులో మెలకువలు నేర్చుకుంటే వైద్య పరిశోధనలు, క్లినికల్ ట్రయల్స్ విభాగాల్లో పనిచేయవచ్చు. ఆపరేషన్స్ రిసెర్చ్‌లో సర్టిఫికెట్/ డిప్లొమా చేస్తే పరిశ్రమల నిర్వహణ, సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్ రంగాల్లో ఉద్యోగాలు పొందవచ్చు. యాక్చూరియల్ సైన్స్, ఇన్సూరెన్స్ మేనేజ్‌మెంట్‌ల్లో కూడా ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్ సర్టిఫికెట్/ డిప్లొమా చేసే ప్రయత్నం చేయొచ్చు.

డేటా విజువలైజేషన్ టూల్స్‌పై పట్టు కూడా చాలా అవసరం. టాబ్ల్యూ, పవర్ బీఐ లాంటి టూల్స్ నేర్చుకుంటే డేటాను గ్రాఫ్‌లు, చార్టుల రూపంలో అందంగా, స్పష్టంగా చూపించవచ్చు. ఎంఎస్ ఎక్సెల్, ఎస్‌పీఎస్ఎస్, ఎస్ఏఎస్ లాంటి సాంప్రదాయిక గణాంక సాఫ్ట్‌వేర్‌లపై శిక్షణ పొందితే పరిశోధన, విద్యా రంగాల్లో అవకాశాలు విస్తరిస్తాయి. మరో ముఖ్య విషయం- సాఫ్ట్ స్కిల్స్. ఇవి విద్యార్థి విజయంలో కీలక పాత్ర పోషిస్తాయి. సాంకేతిక నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, బృందంతో కలిసి పనిచేసే నైపుణ్యాలు చాలా ప్రధానం.

> **స్టాటిస్టిక్స్ డిగ్రీ అనేది భవిష్యత్తుకు బలమైన పునాది మాత్రమే. దీనిపై ప్రోగ్రామింగ్, డేటా సైన్స్, సాఫ్ట్‌స్కిల్స్ లాంటి అదనపు కోర్సులను కూడా నేర్చుకుని కెరియర్‌ను మరింత మెరుగుపర్చుకోవచ్చు**

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఎన్‌సీసీతో ఆర్మీ అధికారి!

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ పేరుతో ప్రత్యేక నోటిఫికేషన్‌ను ఇండియన్ ఆర్మీ ఏటా విడుదల చేస్తోంది. అవివాహిత పురుష గ్రాడ్యుయేట్లు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్వ్యూలో ప్రతిభతో శిక్షణకు ఎంపిక చేస్తారు. దీన్ని విజయవంతంగా పూర్తిచేసుకున్నవారిని లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఆకర్షణీయ వేతనం, ప్రోత్సాహకాలు అందిస్తారు. ఇటీవలే వెలువడిన ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ ప్రకటన వివరాలు...



భారతీయ సైన్యం షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో ఏడాదికి రెండుసార్లు ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ పోస్టుల భర్తీకి ప్రకటనలు విడుదల చేస్తోంది. డిగ్రీతో పాటు ఎన్‌సీసీ అర్హత ఉన్నవారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తులను అభ్యర్థులు పొందిన అకడమిక్, ఎన్‌సీసీ మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్టు చేస్తారు. ఎన్‌సీసీ సీలో ఏ గ్రేడ్ ఉంటే 50, బీ గ్రేడ్‌కి 25 బోనస్ మార్కులు దక్కుతాయి. అలాగే గ్రాడ్యుయేషన్‌లో పొందిన మార్కులకూ గరిష్ఠంగా 50 బోనస్ మార్కులు కేటాయించారు. ఈ రెండు మార్కులూ కలిపి ఖాళీలకు కొంత మందిని చొప్పున సెలక్షన్ కేంద్రాల్లో నిర్వహించే ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు.

ఏపీ, తెలంగాణ అభ్యర్థులకు బెంగళూరులో మౌలిక పరీక్ష ఉంటుంది. సైకాలజిస్ట్, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్, ఇంటర్వ్యూ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఇవి జరుగుతాయి. రెండు దశల్లో ఐదు రోజులు కొనసాగుతాయి. తొలిరోజు స్టేజ్-1లో ఉత్తీర్ణులైనవారికే తర్వాతి 4 రోజులు నిర్వహించే స్టేజ్-2 ఇంటర్వ్యూకి అవకాశమిస్తారు. ఇందులో విజయవంతమైనవారికి వైద్య పరీక్షలు నిర్వహించి, శిక్షణలోకి తీసుకుంటారు.

ఎంపికైతే...

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ విధానంలో ఎంపికైనవారికి ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడెమీ, చెన్నైలో ఏప్రిల్, 2026 నుంచి 49 వారాలు శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో ప్రతి నెల రూ.56,100 స్టైపెండ్ చెల్లిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారికి పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ డిగ్రీని మద్రాస్ యూనివర్సిటీ ప్రదానం చేస్తుంది. అనంతరం లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఇలా చేరినవారు పదేళ్లపాటు ఉద్యోగంలో కొనసాగవచ్చు. వ్యవధి పూర్తయిన తర్వాత సంస్థ అవసరాలు, అభ్యర్థుల ఆసక్తుల ప్రకారం కొందరిని శాశ్వత ఉద్యోగం (పర్మనెంట్ కమిషన్) లోకి తీసుకుంటారు. మిగిలినవారికి మరో నాలుగేళ్లపాటు సర్వీస్ పొడిగిస్తారు. ఆ తర్వాత వీరు వైదొలగాలి.

లెఫ్టినెంట్‌గా విధుల్లో చేరినవారు రెండేళ్ల అనుభవంతో కెప్టెన్, ఆరేళ్లకు మేజర్, 13 ఏళ్ల సేవలతో లెఫ్టినెంట్ కల్నల్ హోదాలకు చేరుకోవచ్చు. వీరికి మొదటి నెల నుంచే లెవెల్-10 రూ.56,100 మూల వేతనంతోపాటు మిలిట్రీ సర్వీస్ పే, డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర అలవెన్సులు అందుతాయి. 17-18 లక్షల రూపాయిల వార్షిక వేతనాన్ని వీరు అందుకుంటారు.

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ మెన్

మొత్తం ఖాళీలు: 70. వీటిలో 7 పోస్టులను యుద్ధంలో మరణించిన సైనికోద్యోగుల పిల్లలకు కేటాయించారు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ. ప్రస్తుతం చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే మూడు విద్యా సంవత్సరాలు ఎన్‌సీసీ సీనియర్ డివిజన్ వింగ్‌లో కొనసాగి ఉండాలి. ఎన్‌సీసీ సి సర్టిఫికెట్‌లో కనీసం బీ గ్రేడ్ పొందాలి. యుద్ధంలో మరణించిన ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు ఎన్‌సీసీ సి సర్టిఫికెట్ అవసరం లేదు.

వయసు: జనవరి 1, 2026 నాటికి 19 నుంచి 25 ఏళ్లలోపు ఉండాలి. జనవరి 2, 2001 - జనవరి 1, 2007 మధ్య జన్మించినవారు అర్హులు.

ఆన్‌లైన్ దరఖాస్తులు: సెప్టెంబరు 10 మధ్యాహ్నం 3 వరకు స్వీకరిస్తారు.

ఇంటర్వ్యూలు: నవంబరు మొదటి వారంలో

వెబ్‌సైట్: http://www.joinindianarmy.nic.in

ఉద్యోగాలు

ఐఐటీఆర్‌లో సైంటిస్టులు

లఖ్‌నవూలోని సీఎస్ఐఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టాక్సికాలజీ రిసెర్చ్ (ఐఐటీఆర్) 18 సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ సైంటిస్ట్: 16 ◗ సీనియర్ సైంటిస్ట్: 01
◗ ప్రిన్సిపల్ సైంటిస్ట్: 01
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్, ఎంబీబీఎస్, పీహెచ్‌డీ లేదా ఎండీతో పాటు పని అనుభవం.
వయసు: 2025 ఆగస్టు 31వ తేదీ నాటికి సైంటిస్ట్‌కు 32 ఏళ్లు, సీనియర్ సైంటిస్ట్‌కు 37 ఏళ్లు, ప్రిన్సిపల్ సైంటిస్ట్‌కు 45 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు సైంటిస్ట్‌కు రూ.1,15,548, సీనియర్ సైంటిస్ట్‌కు రూ.1,32,864, ప్రిన్సిపల్ సైంటిస్ట్‌కు రూ.2,01,972. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2025 ఆగస్టు 31.
వెబ్‌సైట్: www.iitr.res.in/En/Recruitment.aspx

ఐఎంఎంటీలో ప్రాజెక్ట్ అసోసియేట్లు

ఒడిశాలోని సీఎస్ఐఆర్- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (ఐఎంఎంటీ) భువనేశ్వర్ తాత్కాలిక ప్రాతిపదికన 23 ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ ప్రాజెక్ట్ అసోసియేట్-1: 15
◗ సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్: 03
◗ ప్రాజెక్ట్ అసిస్టెంట్-2: 04
◗ జూనియర్ రిసెర్చ్ ఫెలో: 01
అర్హత: పోస్టును అనుసరించి బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్, డిప్లొమా, ఎంటెక్, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం.
గరిష్ఠ వయసు: 2025 ఆగస్టు 31వ తేదీ నాటికి ప్రాజెక్ట్ అసోసియేట్-1, అసిస్టెంట్, జేఆర్ఎఫ్‌లకు 35 ఏళ్లు, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు 40 ఏళ్లు. **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ అసోసియేట్-1కు రూ.25,000, ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.20,000, జూనియర్ రిసెర్చ్ ఫెలోకు రూ.37,000, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.42,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31.08.2025
ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
వెబ్‌సైట్: https://rects.immt.res.in/

నోటీస్ బోర్డు

డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌లో..

దిల్లీలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 5 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ సీనియర్ మేనేజర్ (కమ్యూనికేషన్స్ & మీడియా) - 01
◗ కంటెంట్ రైటర్ కమ్ సోషల్ మీడియా అసిస్టెంట్ మేనేజర్ - 02 ◗ సీనియర్ మేనేజర్ (ఈవెంట్ మేనేజ్‌మెంట్ & ప్రొక్యూర్‌మెంట్) -01
◗ వీడియో ఎడిటర్ & మోషన్ గ్రాఫిక్స్ - 01
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీటెక్, పీజీ (సైన్స్, మేనేజ్‌మెంట్, జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్, పబ్లిక్ పాలసీ)తో పాటు ఉద్యోగానుభవం. **గరిష్ఠ వయసు:** 55 ఏళ్లు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 27-08-2025.
ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
వెబ్‌సైట్: https://dic.gov.in/careers/

స్విమ్స్‌లో ఫ్యాకల్టీ

తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానం.. శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్).. రెగ్యులర్ ప్రాతిపదికన 106 మెడికల్ ఫ్యాకల్టీ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది.
◗ ప్రొఫెసర్: 09 ◗ అసోసియేట్ ప్రొఫెసర్: 30
◗ అసిస్టెంట్ ప్రొఫెసర్: 67
విభాగాలు: అనాటమీ, అనస్థీషియాలజీ, బయోకెమిస్ట్రీ, కార్డియాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, ఎమర్జెన్సీ మెడిసిన్, ఫోరెన్సిక్ మెడిసిన్, జనరల్ సర్జరీ, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, మెడికల్ ఆంకాలజీ, న్యూరాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, ఆప్తల్మాలజీ, పీడియాట్రిక్, డెర్మటాలజీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, నెఫ్రాలజీ, సైకియాట్రీ, యూరాలజీ...
అర్హత: పోస్టును అనుసరించి డీఎన్‌బీ/ ఎంఎస్/ ఎండీ, ఎంసీహెచ్, డీఎంతో పాటు ఉద్యోగానుభవం.
వయసు: ప్రొఫెసర్‌కు 58 ఏళ్లు; అసోసియేట్ ప్రొఫెసర్/ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు 50 ఏళ్లు మించకూడదు.
వేతన శ్రేణి: నెలకు ప్రొఫెసర్‌కు రూ.1,48,200- 2,11,400. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,01,500- రూ.1,67,400; అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,38,300- రూ.2,09,200.
ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్/ ఇంటర్వ్యూ ఆధారంగా.
చిరునామా: ది రిజిస్ట్రార్, శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, అలిపిరి రోడ్, తిరుపతి.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 08.09.2025.
వెబ్‌సైట్: https://svimstpt.ap.nic.in/

వాక్ఇన్

ఐహెచ్‌బీటీలో ..

హిమాచల్ ప్రదేశ్‌లోని సీఎస్ఐఆర్- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ బయోరిసోర్స్ టెక్నాలజీ (ఐహెచ్‌బీటీ) తాత్కాలిక ప్రాతిపదికన 15 ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
◗ ప్రాజెక్ట్ అసోసియేట్-1: 09 ◗ ప్రిన్సిపల్ (పీఏటీ): 01 ◗ ప్రాజెక్ట్ అసిస్టెంట్-2: 04
◗ ప్రాజెక్ట్ అసోసియేట్-2: 01
అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం. **గరిష్ఠ వయసు:** ఇంటర్వ్యూ తేదీ నాటికి ప్రాజెక్ట్ అసోసియేట్, అసిస్టెంట్‌లకు 35 ఏళ్లు, ప్రిన్సిపల్‌కు 40 ఏళ్లు. **స్టైపెండ్:** నెలకు ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.20,000, ప్రాజెక్ట్ అసోసియేట్-1కు రూ.25,000- రూ.31,000, అసోసియేట్-2కు రూ.35,000, ప్రిన్సిపల్‌కు రూ.49,000.
ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
ఇంటర్వ్యూ తేదీ: 2025 ఆగస్టు 20, 21, 26.
వేదిక: సీఎస్ఐఆర్-ఐహెచ్‌బీటీ, పాలమ్‌పూర్ (హిమాచల్‌ప్రదేశ్).
వెబ్‌సైట్: https://www.ihbt.res.in/en/

ప్రవేశాలు

జామ్-2026

దేశంలోని 22 ఐఐటీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ (టెక్నాలజీ), (రిసెర్చ్), ఎమ్మెస్సీ ఎంటెక్, జాయింట్ ఎంఎస్సీ పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ (డ్యూయల్ డిగ్రీ) కోర్సుల్లో ప్రవేశానికి ‘జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ (జామ్-2026)’ ప్రకటన వెలువడింది.
అర్హత: నిర్దేశిత విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం ఆఖరు సంవత్సరం కోర్సులు చదువుతున్నవారు.
సీట్లు: 3 వేలు అందుబాటులో ఉన్నాయి.
దరఖాస్తు ఫీజు: మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఒక పేపర్‌కి రూ.1,000 రెండు పేపర్లకు రూ.1,350. మిగిలిన అభ్యర్థులు అందరికీ ఒక పేపర్‌కు రూ.2,000. రెండు పేపర్లకు రూ.2,700
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, విశాఖపట్నం, విజయవాడ గుంటూరు, ఒంగోలు, తిరుపతి.
రిజిస్ట్రేషన్ ప్రారంభం: 05-09-2025.
రిజిస్ట్రేషన్ గడువు: 12-10-2025
పరీక్ష తేదీ: 15-02-2026.
ఫలితాల ప్రకటన: 18-03-2026.
వెబ్‌సైట్: https://jam2026.iitb.ac.in/#

నేషనల్ సైన్స్ సెంటర్‌లో టెక్నీషియన్లు

న్యూదిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియమ్స్‌కు చెందిన నేషనల్ సైన్స్ సెంటర్ (ఎన్ఎస్‌సీ).. 24 టెక్నీషియన్ పోస్టులను భర్తీచేయనుంది.

మొత్తం ఖాళీల్లో టెక్నీషియన్-ఏ-18, ఆర్టిస్ట్-ఏ-3, ఎడ్యుకేషన్ అసిస్టెంట్-ఏ-1, టెక్నికల్ అసిస్టెంట్-ఏ-1, ఎగ్జిబిషన్ అసిస్టెంట్-ఏ-1 ఉన్నాయి.

టెక్నీషియన్-ఏ పోస్టులకు.. పదో తరగతి, ఫిట్టర్/ కార్పెంటరీ/ ఎలక్ట్రానిక్స్/ పెయింటర్/ డ్రాఫ్ట్స్‌మెన్/ కంప్యూటర్ హెచ్/ డబ్ల్యూ అండ్ నెట్‌వర్కింగ్ ట్రేడ్‌తో ఐటీఐ. ఏడాది ఉద్యోగానుభవం ఉండాలి.

ఆర్టిస్ట్-ఏ ఉద్యోగానికి.. పదో తరగతి, ఫైన్/ కమర్షియల్ ఆర్ట్‌లో రెండేళ్ల డిప్లొమా/ సర్టిఫికెట్, ఏడాది ఉద్యోగానుభవం ఉండాలి. ఫైబర్ గ్లాస్ ఆర్ట్/ ఆర్ట్ మోడలింగ్/ స్కల్ప్చర్ వర్క్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు.

వయసు: 35 సంవత్సరాలు మించకూడదు. ప్రత్యేక వర్గాలకు చెందినవారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సడలింపులు వర్తిస్తాయి.

దరఖాస్తు ఫీజు: రూ.885 (750+135 జీఎస్టీ) ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలు, మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు.
వేతనం: టెక్నీషియన్/ ఆర్టిస్ట్‌కు నెలకు రూ.19,900-63,200. ఇతర పోస్టులకు రూ.29,200-92,300.

ఎంపిక ఇలా

విద్యార్హతలు, అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి.. ఆప్టిట్యూడ్/ ట్రేడ్‌టెస్ట్‌కు ఎంపిక చేస్తారు.
✦ కాల్‌లెటర్లను అభ్యర్థి ఈమెయిల్ ఐడీకి పంపిస్తారు.
✦ సబ్జెక్టు సంబంధిత ముఖ్యాంశాలను పునశ్చరణ చేసుకుంటే.. ట్రేడ్‌టెస్ట్‌లో విజయం సాధించే అవకాశం ఉంటుంది.
✦ ప్రభుత్వ/ ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న అభ్యర్థులు ‘నో అబ్జెక్షన్ సర్టిఫికెట్’ను దరఖాస్తు సమయంలోనే అప్‌లోడ్ చేయాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 30-08-2025
వెబ్‌సైట్: https://nscd.gov.in/career/

Wordwise

ఆహ్లాదకరంగా ఇంగ్లిష్ పదజాలం పెంచుకుందామా? ఇక్కడ ఇచ్చిన Wordwise ను పూర్తిచేయండి. పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగపడుతుంది!

ACROSS

1. An armoured soldier who rides a horse
7. Breadwinner or provider is known as __
8. Smallest common household cells, smaller than AA, are called __ batteries
9. Compass direction between North and East in short
11. Nickname for Stuart
12. Respect or value for someone
14. 'Taller' with its letters mixed up

DOWN

1. The edible inside of a seed—like one piece of corn
2. Short for 'not applicable'
3. Chemical symbol of iridium
4. Rearrange the letters of "A N G L E S"
5. A device that warms a room or water
6. A serious injury or deep emotional shock
10. Superlative suffix as in 'biggest', 'smallest'
13. Two-letter code for 'Telugu'

1	2	3	4	5	6
7					
	■	■	8		
9	10	■	11		
12		13			
14					


- డా. వంగీపురం శ్రీనాథాచారి

ANSWERS

DOWN
1. KERNEL
2. NA
3. IR
4. GNASEL
5. HEATER
6. TRAUMA
10. EST
13. TE

ACROSS
1. KNIGHT
7. EARNER
8. AAA
9. NE
11. STU
12. ESTEEM
14. LTELRA (TALLER)

రోదసిలో ఢిష్యుం.. ఢిష్యుం!



- ఉపగ్రహాల హైజాకింగ్.. కక్ష్యలోకి ఆయుధాలు
- రణరంగంగా మారుతున్న అంతరిక్షం
- ఖగోళ మైనింగ్ కేంద్రంగా ఘర్షణలు జరగొచ్చంటున్న నిపుణులు

వాషింగ్టన్: అది ఈ ఏడాది మే 9. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ సైన్యాన్ని ఓడించినందుకు గుర్తుగా రష్యా 'విక్టరీ డే కవాతు'ను నిర్వహిస్తోంది. నాడు ఆ దేశ మద్దతు ఉన్న కొందరు హ్యాకర్లు.. ఉక్రెయిన్‌కు టీవీ సేవలు అందించే ఒక ఉపగ్రహాన్ని హైజాక్ చేశారు. ఫలితంగా ఉక్రెయిన్‌లో టీవీ ప్రసారాలు మారిపోయాయి. మాస్కోలో జరుగుతున్న విక్టరీ డే కవాతు దృశ్యాలు అక్కడి స్క్రీన్లపై ప్రత్యక్షమయ్యాయి. రష్యా యుద్ధ ట్యాంకులు, సైనికులు, ఆయుధాలు దర్శనమిచ్చాయి. ఉక్రెయిన్‌వాసుల్లో భయాందోళనలు నింపడం దీని ఉద్దేశం.

21వ శతాబ్దంలో మారుతున్న యుద్ధరీతులకు ఇది దర్పణం పడుతోంది. సంప్రదాయ పద్ధతిలో నేల, సముద్రం, నింగిలోనే కాకుండా సైబర్, రోదసిలోకీ అది విస్తరిస్తోంది. ఒక ఉపగ్రహాన్ని నిర్వీర్యం చేయడం ద్వారా.. ఒక్క తూటా కూడా పేల్చకుండానే ప్రత్యర్థికి పెను నష్టం కలిగించొచ్చు.

లక్ష్యాలుగా ఉపగ్రహాలు

పనిచేయగలిగిన స్థితిలో ఉన్న 12వేలకుపైగా ఉపగ్రహాలు ప్రస్తుతం పుడమిని చుట్టేస్తున్నాయి. ఇవి ప్రసారాలు, కమ్యూనికేషన్లు, నేవిగేషన్, గూఢచర్యం, వాణిజ్య రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. శత్రు దేశం ప్రయోగించే క్షిపణులను చాలా త్వరగా గుర్తించడానికీ ఇవి సాయపడతాయి. ఈ నేపథ్యంలో ప్రత్యర్థి ఆర్థిక, సైనిక సన్నద్ధతను దెబ్బతీయాలని చూసే దేశాలకు ఉపగ్రహాలు ప్రధాన లక్ష్యాలుగా మారుతున్నాయి. వైరి పక్షాన్ని మానసికంగా దెబ్బతీయడానికీ ఈ వ్యూహం ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు జీపీఎస్ సేవలను స్తంభింపచేయగలిగితే.. ప్రజల్లో తీవ్ర గందరగోళం తలెత్తుతుంది.

ఎలా?

ఉపగ్రహానికి తోడ్పాటు అందించే లేదా భూమితో దాని కమ్యూనికేషన్లను నియంత్రించే సాఫ్ట్‌వేర్ లేదా హార్డ్‌వేర్‌లోని బలహీనతలను హ్యాకర్లు లక్ష్యంగా ఎంచుకుంటారు. ఉపగ్రహంలోని సాధనం భద్రంగా ఉండొచ్చు.. కానీ అది కాలం చెల్లిన సాఫ్ట్‌వేర్‌తో నడుస్తుండొచ్చు. అలాంటి పరిస్థితుల్లో దాన్ని సులువుగా హ్యాక్ చేయవచ్చు.



2022లో రష్యా దళాలు ఉక్రెయిన్‌పై దండెత్తినప్పుడు.. కొందరు హ్యాకర్లు ఉక్రెయిన్ ప్రభుత్వం, సైన్యం వాడే వయాశాట్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. ఇది అమెరికాకు చెందిన ఉపగ్రహ కంపెనీ. హ్యాకర్లు దీనిలోకి మాల్‌వేర్‌ను పంపి.. లక్షలాది మోడెమ్‌లను దెబ్బతీశారు. ఫలితంగా ఐరోపాలోని అనేక ప్రాంతాల్లో కమ్యూనికేషన్ సేవలు నిలిచిపోయాయి. ఇది రష్యన్ హ్యాకర్ల పనేనని ఉక్రెయిన్ ఆరోపించింది.

రష్యా అణు సాధనం

మరోవైపు భూ దిగువ కక్ష్యలోని ఉపగ్రహాలను ధ్వంసం చేయడానికి రష్యా.. అణు, అంతరిక్ష ఆధారిత ఆయుధాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు నిపుణులు అనుమానిస్తున్నారు. ఇందులోని అణు సాధనం ఉపగ్రహాల్లోని ఎలక్ట్రానిక్ పరికరాలను దహించేస్తుందని చెబుతున్నారు. దీన్ని వినియోగంలోకి తెస్తే.. రోదసిలో సామూహిక జనహనన ఆయుధాలను మోహరించరాదన్న అంతర్జాతీయ ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లవుతుందని అమెరికా అధికారులు పేర్కొంటున్నారు. దిగువ భూ కక్ష్యలోకి ఉపగ్రహాలను పంపలేని పరిస్థితిని ఇది కల్పిస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. "ఈ ఆయుధం.. 1957లో అంతరిక్ష యుగానికి బీజాలు వేసిన రష్యా ఉపగ్రహం స్పుత్నిక్ లాంటిది. ఒకవేళ అది రోదసిలోకి చేరితే.. అంతరిక్ష యుగం అంతమైనట్లే! దాన్ని అడ్డుకోవాలి. ఇది ఒకవిధంగా అంతరిక్షంలో 'క్యూబా క్షిపణి సంక్షోభం' లాంటిది" అని అమెరికా కాంగ్రెస్ సభ్యుడు మైక్ టర్నర్ స్పష్టంచేశారు.

మైనింగ్‌పై ఫైటింగ్

చంద్రుడు, గ్రహశకలాలపై ఉన్న విలువైన ఖనిజాలు, ఇతర పదార్థాల కోసం భవిష్యత్‌లో మైనింగ్ జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. వీటికోసం భవిష్యత్‌లో దేశాల మధ్య ఘర్షణలు జరగొచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. చందమామపై చిన్నపాటి అణు రియాక్టర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా ఇటీవల ప్రకటించింది. చైనా, రష్యా కన్నా ముందే దాన్ని సాకారం చేయడం చాలా ముఖ్యమని తెలిపింది. చందమామపై ఆవాసాన్ని ఏర్పాటు చేయాలంటే విద్యుత్ అవసరమని పేర్కొంది. చంద్రుడిపై కొన్ని ప్రదేశాల్లోకి మొదట చేరుకొని, ఆ ప్రాంతంపై హక్కులను దక్కించుకోవాలనుకుంటున్నట్లు తెలిపింది.

చందమామపై భారీగా హీలియం-3 నిల్వలు ఉన్నాయి. దీన్ని కేంద్రక సంలీన చర్యలో వాడి భారీగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని శాస్త్రవేత్తలు తలపోస్తున్నారు. అయితే ఈ సాంకేతికత వినియోగంలోకి రావడానికి ఇంకా కొన్ని దశాబ్దాలు పడుతుంది. ఈలోగా చందమామపై నియంత్రణ కలిగిన దేశాలు సూపర్ పవర్లుగా ఎదిగే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రచ్ఛన్న యుద్ధం ముగిశాక అంతరిక్ష రంగంలోకి పెట్టుబడుల ప్రవాహంలో జోరు తగ్గింది. చందమామపై మైనింగ్ వాస్తవ రూపం దాల్చే అవకాశం ఉంటే.. ఈ పోటీ మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. చైనా, రష్యాలు కూడా చంద్రుడిపై సొంత అణు రియాక్టర్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నాయి. మరోవైపు అమెరికా.. చందమామతోపాటు అంగారకుడిపైకి యాత్రలు చేపట్టాలనుకుంటోంది. కృత్రిమ మేధ (ఏఐ) ఈ పోటీకి ఆజ్యం పోసే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.



సైబర్‌నేరాలపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కేంద్రమంత్రి బండి సంజయ్

సైబర్ మోసగాళ్ల నుంచి రూ.5,489 కోట్ల స్వాధీనం

- 12 లక్షలకుపైగా మొబైల్ ఫోన్ల బ్లాక్
- 13 లక్షలకుపైగా బ్యాంకు ఖాతాల స్తంభన
- బండి సంజయ్‌కి వివరించిన అధికారులు

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా సైబర్ మోసగాళ్ల నుంచి ఇప్పటివరకు రూ.5,489 కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు కేంద్రహోంశాఖ అధికారులు ఆ శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కి తెలిపారు. దీంతోపాటు 12 లక్షలకుపైగా సిమ్‌లు/మొబైల్ హ్యాండ్‌సెట్లను బ్లాక్ చేసినట్లు వెల్లడించారు. 13.3 లక్షల మ్యూల్ అకౌంట్లను స్తంభింపజేసినట్లు తెలిపారు. అలాగే రూ.4,631 కోట్ల మోసపూరిత లావాదేవీలను అడ్డుకున్నట్లు చెప్పారు. సోమవారం ఆయన ఇక్కడి తన కార్యాలయంలో సైబర్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ డివిజన్ కార్యకలాపాలను సమీక్షించినప్పుడు అధికారులు ఈ వివరాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు బండి సంజయ్ స్పందిస్తూ ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న మొత్తాన్ని బాధితులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం నిబంధనలను సులభతరం చేయాలని సూచించారు. అత్యంత ప్రాధాన్యం కల్గిన కేసుల్లో సైబర్ కమాండోల సేవలు ఉపయోగించుకోవాలని చెప్పారు. మహిళలు, చిన్నారులను లక్ష్యంగా చేసుకొని నిర్వహించే ఆన్‌లైన్ నేరాలపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. సైబర్ నేరాలకు సంబంధించిన మోసాల గురించి ఫిర్యాదుచేసేందుకు ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ ,నంబరు 1930 గురించి ప్రాంతీయ భాషల్లో విస్తృత ప్రచారంచేయాలని సూచించారు. దేశరాజధాని ప్రాంతంలో జరిగే సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం దిల్లీ పోలీసులు ఏర్పాటుచేసిన ఈ-జీరో ఎఫ్ఐఆర్ విధానాన్ని అన్ని రాష్ట్రాలూ ప్రారంభించే మార్గాలను అన్వేషించాలని నిర్దేశించారు.

భారత్ చూపు రష్యా, చైనా వైపు

- ట్రంప్ సలహాదారుడి కీలక వ్యాఖ్యలు

వాషింగ్టన్: రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం ఆపాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహాదారు పీటర్ నవారో పేర్కొన్నారు. ఈ చమురు నిధులతోనే ఉక్రెయిన్‌లో మాస్కో యుద్ధం చేస్తుందని ఆరోపించారు. పుతిన్‌ను ఒంటరి చేసేందుకు ప్రపంచం చేస్తున్న ప్రయత్నాలకు భారత్ గండికొడుతోందని విమర్శించారు. చమురు కొనుగోలుతో మాస్కోకు కావాల్సిన డాలర్లను భారత్ సమకూరుస్తోందని ఆక్షేపించారు. 'ఫైనాన్షియల్ టైమ్స్'కు రాసిన ఓ వ్యాసంలో ఈ వ్యాఖ్యలు చేశారు. చైనా, రష్యాతో సన్నిహిత సంబంధాల కోసం భారత్ చూస్తోందన్నారు. 'భారత్‌ను అమెరికా ఓ వ్యూహాత్మక భాగస్వామిగా చూడాలి అంటే.. న్యూదిల్లీ కూడా ఆ విధంగానే వ్యవహరించాలి'' అని ఆ వ్యాసంలో నవారో పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ రుణం రూ.200 లక్షల కోట్లు

- పదేళ్లలో 182% పెరిగిన అప్పు
- 38% ఆదాయం వడ్డీలకే సరి
- దశాబ్దకాలంలో అసలు రూ.32 లక్షల కోట్లు, వడ్డీ రూ.85 లక్షల కోట్ల చెల్లింపు

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.200 లక్షల కోట్లకు చేరింది. ఇది జీడీపీలో 56.1 శాతానికి సమానం. కేంద్రానికి వస్తున్న ఆదాయంలో 37.32% మొత్తం రుణాలపై వడ్డీ చెల్లింపులకే వెళ్తోంది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. సోమవారం లోక్‌సభలో తమిళనాడు కాంగ్రెస్ సభ్యుడు ఎం.కె. విష్ణుప్రసాద్ అడిగిన ప్రశ్నకు ఆమె ఈమేరకు బదులిచ్చారు. 2015-16లో కేంద్ర ప్రభుత్వ అప్పులు రూ.70.98 లక్షల కోట్ల మేర ఉండగా, పదేళ్లలో అది 181.99% మేర పెరిగింది. ఇదే సమయంలో జీడీపీలో రుణ నిష్పత్తి 51.5% నుంచి 56.1%కి చేరింది. దశాబ్దకాలంలో కేంద్రం రూ.117.78 లక్షల కోట్ల అప్పు చెల్లించింది. ఇందులో అసలు కింద రూ.32.61 లక్షల కోట్లు, వడ్డీ కింద రూ.85.17 లక్షల కోట్లు చెల్లించింది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో వడ్డీ చెల్లింపుల కోసం 2015-16లో 36.96% మొత్తం పోగా, ఇప్పుడు అది 37.32%కి పెరిగింది.

రాష్ట్ర ప్రభుత్వాల అప్పులు రూ.81 లక్షల కోట్లు

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రూ.200 లక్షల కోట్ల రుణానికి తోడు రాష్ట్ర ప్రభుత్వాలు మరో రూ.81 లక్షల కోట్ల అప్పు చేశాయి. 2025 మార్చి 31 నాటికి దేశంలోని 28 రాష్ట్రాల మీద రూ.81,54,004 కోట్ల రుణం ఉన్నట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి ఇచ్చిన మరో సమాధానం వెల్లడించింది. ఇందులో అత్యధికంగా తమిళనాడుకు రూ.9.55 లక్షల కోట్ల అప్పు ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో ఉత్తర్‌ప్రదేశ్ (రూ.8.57 లక్షల కోట్లు), మహారాష్ట్ర (రూ.8.12 లక్షల కోట్లు), కర్ణాటక (రూ.7.25 లక్షల కోట్లు) నిలిచాయి.



ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించిన లెక్కల ప్రకారం కేంద్ర ఆర్థిక ముఖచిత్రం ఇదీ

సంవత్సరం	ఆ ఏడాది తీసుకున్న అప్పు (రూ.లక్షల కోట్లు)	అప్పటికి మొత్తం అప్పు (రూ.లక్షల కోట్లు)	జీడీపీలో అప్పు %	చెల్లించిన అసలు (రూ.లక్షల కోట్లు)	వడ్డీ (రూ.లక్షల కోట్లు)	ఆదాయంలో వడ్డీ చెల్లింపులకు %
2015-16	5.33	70.98	51.5	1.67	4.42	36.96
2016-17	5.36	74.94	48.7	2.01	4.81	34.98
2017-18	5.91	82.87	48.5	1.64	5.29	36.85
2018-19	6.49	93.26	49.3	1.79	5.83	37.52
2019-20	9.34	105.07	52.3	2.70	6.12	36.34
2020-21	18.18	121.86	61.4	2.62	6.80	41.61
2021-22	15.85	138.66	58.8	3.00	8.05	37.12
2022-23	17.38	156.13	58.1	3.53	9.29	38.96
2023-24	16.55	171.70	57.0	4.88	10.64	38.98
2024-25 (ప్రొవిజనల్)	15.77	185.94	56.0	4.16	11.16	36.76
2025-26 (బడ్జెట్ అంచనా)	15.69	200.16	56.1	4.61	12.76	37.32

ఏఎంయూ వీసీ కేసు విచారణ నుంచి వైదొలగిన న్యాయమూర్తి

దిల్లీ: ప్రొఫెసర్ నైమా ఖాతూన్‌ను అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయ(ఏఎంయూ) వైస్ ఛాన్సలర్‌గా నియమించడంపై దాఖలైన కేసు విచారణ నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.వినోద్ చంద్రన్ వైదొలిగారు. వైస్ ఛాన్సలర్ ఎంపికకోసం జరిగిన ఎన్నికలో ఖాతూన్ భర్త పాల్గొని ఆమెకు అనుకూలంగా ఓటు వేశారని, ఆ కారణంగా ఆ ఎన్నిక చెల్లదని పేర్కొంటూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ పరిణామం చోటు చేసుకుంది. వీసీగా ఉన్న వ్యక్తి ఈ ఎంపికలో పాలు పంచుకోకుండా ఉండవలసింది అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. కన్సార్టియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీ(సీఎన్ఎల్‌యూ) వైస్ ఛాన్సలర్‌గా తాను ఫైజాన్ ముస్తఫాను వైస్ ఛాన్సలర్ పదవికి ఎంపిక చేశానని, అందుకే ఈ కేసు విచారణ నుంచి వైదొలగుతున్నానని న్యాయమూర్తి జస్టిస్ వినోద్ చంద్రన్ పేర్కొన్నారు.

మాజీ ఎంపీ ఆత్మహత్య కేసు... ఎఫ్ఐఆర్ పునరుద్ధరణకు సుప్రీం నిరాకరణ

దిల్లీ: మాజీ ఎంపీ మోహన్ డేల్కర్‌ను ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారన్న కేసుకు సంబంధించి 9 మందిపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను పునరుద్ధరించేందుకు సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. ఆత్మహత్య చేసుకునేలా తన తండ్రిని ప్రేరేపించారంటూ మోహన్ డేల్కర్ కుమారుడు అభినవ్ డేల్కర్ దాఖలుచేసిన కేసును బాంబే హైకోర్టు 2022, సెప్టెంబరు 8న కొట్టివేసింది. ఈ కేసును తిరిగి చేపట్టాలని కోరుతూ అభినవ్ సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. మాజీ ఎంపీ 2021లో ముంబయిలోని ఒక హోటల్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు పాల్పడే ముందు 30 పేజీల లేఖ వదిలివెళ్లారు. ఎవరో ప్రేరేపించడం వల్ల బాధితుడైన వ్యక్తి 30 పేజీల లేఖ వదిలి వెళ్లగలిగాడంటే ఆయన క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడలేదనే అర్థం అని ప్రధాన న్యామూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు.

పుతిన్ 'మలం' కోసం ప్రత్యేక సూట్‌కేస్

- అలాస్కాకు తీసుకెళ్లిన రష్యా అధ్యక్షుడి అంగరక్షకులు

ఇంటర్నెట్ డెస్క్: ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపుపై చర్చించేందుకు ఇటీవల అలాస్కాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ భేటీ అయ్యారు. ఆ సమయంలో పుతిన్ మల విసర్జన వ్యర్థాలను తీసుకెళ్లడానికి ఆయన అంగరక్షకులు ప్రత్యేకంగా ఓ సూట్‌కేసును తీసుకెళ్లినట్లుగా తెలుస్తోంది. పుతిన్ ఆరోగ్యం గురించి విదేశీయులు తెలుసుకోకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. పుతిన్ ఎక్కడికైనా విదేశీ పర్యటనకు వెళ్లినప్పుడు ఆయన బాడీగార్డులు మలవిసర్జన వ్యర్థాలను సేకరించి రష్యాకు తిరిగి తీసుకెళ్తారని అమెరికాకు చెందిన 'ది ఎక్స్‌ప్రెస్' ప్రచురించింది. అందుకే అలాస్కా భేటీకి ప్రత్యేక సూట్‌కేసును తీసుకొచ్చినట్లుగా తెలిపింది. మల పరీక్ష ద్వారా ఆయన ఆరోగ్య పరిస్థితిని ఇతరులు తెలుసుకునే అవకాశం ఉండటం వల్లే ఈ జాగ్రత్త పాటించినట్లుగా పేర్కొంది. 2019 మే నెలలో పుతిన్ ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లినప్పుడు కూడా ఇలానే చేసినట్లు ఫ్రెంచ్ న్యూస్ మ్యాగజీన్ తెలిపిందని పేర్కొంది. పుతిన్ విదేశాల్లో పర్యటించినప్పుడు ఆయన రక్షణ బాధ్యత ఫెడరల్ ప్రొటెక్షన్ సర్వీస్(ఎఫ్‌పీఎస్) నిర్వహిస్తుందని తెలిపింది. ఆయన మల విసర్జనకు వెళ్లిన ప్రతిసారి బాడీగార్డులు వాటిని సేకరించి ఓ ప్రత్యేకమైన ప్యాకెట్‌లో భద్రపరుస్తారని వెల్లడించింది. అనంతరం వాటిని ఓ సూట్‌కేసులో ఉంచి రష్యాకు తీసుకెళ్తారని కథనంలో ప్రచురించింది. ఇది పుతిన్ ఆరోగ్యం గురించి విదేశీయులకు తెలియకుండా ఉండేందుకు చేసే చర్యగా పేర్కొంది. పుతిన్ మలమూత్రాలను సేకరించే అంశం 1999లో అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే కొనసాగుతోందని జర్నలిస్ట్ ఫరీదా రుస్తమోవా తెలిపినట్లు 'ది ఎక్స్‌ప్రెస్' చెప్పింది.

భారత్‌లో చైనా విదేశాంగ మంత్రి

- సరిహద్దు వివాదంపై నేడు అజీత్ డోభాల్‌తో భేటీ

దిల్లీ: భారత్‌లో రెండు రోజుల పర్యటన కోసం చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ సోమవారం దిల్లీకి విచ్చేశారు. సరిహద్దు సమస్యపై ప్రత్యేక ప్రతినిధుల 24వ సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్‌తో ఆయన చర్చల్లో పాల్గొంటారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఈ భేటీ ఉంటుంది. అదే రోజు సాయంత్రం లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసంలో ఆయన మోదీని కలవనున్నారు. ఇరుదేశాల నడుమ కుదిరిన అవగాహన ఒప్పందాలు, ఇంతకు ముందు జరిపిన చర్చల్లో తీసుకున్న నిర్ణయాలతో భారత్‌తో కలిసి పనిచేయడమే వాంగ్ యీ పర్యటన లక్ష్యమని చైనా ఓ ప్రకటనలో తెలిపింది. భారత్‌పై అమెరికా 25 శాతం అధిక సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించిన తర్వాత ఈ పర్యటన మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది.

వాంగ్ యీతో జైశంకర్ భేటీ

భారత్-చైనా సంబంధాల విషయంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. పరస్పర గౌరవం, సున్నితత్వం, ప్రయోజనాల ఆధారంగా ఈ సంబంధాలు ముందుకు సాగాలని పేర్కొన్నారు. వాంగ్ యీతో సోమవారం సమావేశమైన సందర్భంగా జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరుదేశాల మధ్య విభేదాలనేవీ వివాదాలుగా మారకూడదన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో శాంతియుత వాతావరణాన్ని సంయుక్తంగా నెలకొల్పడం ఎంతో ముఖ్యమని,



జైశంకర్‌తో వాంగ్ యీ

ఉద్రిక్తతల తగ్గింపు ప్రక్రియ ముందుకు సాగడం చాలా అవసరమని జైశంకర్ వ్యాఖ్యానించారు.

పాక్‌కు చైనా ఆయుధాలు సరఫరా చేసింది: జైరాం రమేశ్

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు ఆయుధాలు సరఫరా చేసి, సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేసిన చైనా మూడు నెలలు కూడా కాకముందే ఆ దేశ విదేశాంగ మంత్రి వాంగ్ యీ పర్యటించడాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎత్తి చూపారు. గాల్వాన్ అంశంపై చైనాకు మోదీ క్లీన్‌చిట్ ఇచ్చిందుకు భారత్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని, 2020లో జరిగిన ఈ ఘటనలో మరణించిన 20 మంది సైనికుల బలిదానాలకు ఇది అవమానకరమని రమేశ్ ఎక్స్‌లో పోస్టుచేశారు.

✦ వాంగ్ యీ ఈ నెల 21 నుంచి రెండు రోజులు పాకిస్థాన్‌లో పర్యటించనున్నట్లు సమాచారం.

పహల్గాంలో పంద్రాగస్టు వేడుకలు

- ఐసీఏఐ వినూత్న ప్రయోగం

హైదరాబాదు: చార్టర్డ్ అకౌంటెన్సీ వృత్తి నియంత్రణ, అభివృద్ధి లక్ష్యాలుగా పార్లమెంటు రూపొందించిన చట్టం ప్రాతిపదికన ఏర్పాటైన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ (ఐసీఏఐ) సంస్థ దేశ 79వ స్వాతంత్ర్యదినోత్సవాన్ని పహల్గాంలో జమ్మూకశ్మీర్ ప్రజల మధ్య జరుపుకొంది. ఈ సందర్భంగా సంస్థ భారత సైనిక దళాలకు, జమూకశ్మీర్ ప్రజలకు సంఘీభావం తెలిపింది. ఐసీఏఐ తన 445వ కౌన్సిల్ సమావేశాన్ని ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకూ పహల్గాంలో నిర్వహించింది. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించిన తొలి జాతీయ స్థాయి సంస్థగా ఖ్యాతి గడించింది. ఐసీఏఐ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు, పిల్లలతో సహా దాదాపు 130 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐసీఏఐకి ఈ ప్రాంతం పట్ల ఉన్న నమ్మకానికి, జమ్మూకశ్మీర్ శాంతి సౌభాగ్యాల పట్ల నిబద్ధతకు ఇది నిదర్శనంగా నిలిచిందని ఐసీఏఐ అధ్యక్షుడు చరణ్‌జోత్ సింగ్ నందా అన్నారని ఒక ప్రకటన తెలియజేసింది. జమ్మూకశ్మీర్‌లో ఈ కార్యక్రమాలు నిర్వహించడం తమకు గర్వకారణమని ఐసీఏఐ ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్ అన్నారు. పహల్గాంలో జరిగిన ఐసీఏఐ కౌన్సిల్ సమావేశానికి ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా హాజరుకావడం విశేషం. ఐసీఏఐ నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా జమ్మూకశ్మీర్ భారత అవిభాజ్య అంగమని, జాతి యావత్తూ ఈ విషయంలో సమైక్యంగా, నిర్భయంగా నిలిచిందని తెలిపే బలమైన సందేశాన్ని అందించగలిగామని సంస్థ తన ప్రకటనలో వివరించింది.

సియాటిల్‌లో కవాతు భారత సాంస్కృతిక వైవిధ్యానికి నిదర్శనం

సియాటిల్: భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సియాటిల్‌లోని కాన్సులేట్ జనరల్ నిర్వహించిన కవాతు దేశంలోని అన్ని రాష్ట్రాల సాంస్కృతిక వైవిధ్యానికి నిదర్శనంగా నిలిచింది. ఈ కవాతులో దేశంలోని 28 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించేలా చేసిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయని భారత కాన్సులేట్ ఓ పత్రికా ప్రకటనలో సోమవారం తెలిపింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ఒక జిల్లా ఒక ఉత్పత్తి(ఓడీఓపీ)ని ప్రదర్శించేలా భవనాన్ని కూడా ఏర్పాటుచేశారు. ఈ కవాతులో భారత కాన్సులేట్ జనరల్ ప్రకాశ్ గుప్తా, సియాటిల్ మేయర్ బ్రూస్ హారిస్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఇది భారత్‌లోని గొప్ప వారసత్వం, సాంప్రదాయాల్ని అందరికీ చూపించిందని ప్రకటనలో వెల్లడించింది.


ఆపరేషన్ సిందూర్ సమయంలో అదృశ్యమైన పాక్ యుద్ధ నౌకలు

కరాచీ: 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ నౌకాదళానికి చెందిన యుద్ధ నౌకలు భారత్ క్షిపణులకు అందకుండా సుదూర ప్రాంతాలకు తరలిపోయాయి. ఈ విషయం ఇటీవలే ఓ ఆంగ్ల పత్రిక సంపాదించిన ఉపగ్రహ చిత్రాల్లో వెల్లడైంది. కరాచీ నౌకా స్థావరంలో ఉండాల్సిన యుద్ధనౌకలను కొన్నింటిని కమర్షియల్ టెర్మినల్స్‌లోకి తీసుకెళ్లి ఉంచగా.. మిగిలినవి ఇరాన్ సరిహద్దుల్లో ఆశ్రయం పొందాయి. మే 8వ తేదీ నాటి చిత్రాల్లో కరాచీ నౌకా స్థావరంలో వీటి జాడ లేదు. అదే నెల 10వ తేదీన 7 యుద్ధనౌకలు 100 కిలోమీటర్ల దూరంలోని గ్వాదర్ పోర్టులో దర్శనమిచ్చాయి. వీటిలో చైనాలో తయారైన జుల్ఫికర్ శ్రేణి ఫ్రిగెట్లు కూడా ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్‌కు కేవలం ఆరు నెలల ముందు చైనా నుంచి నాలుగు జుల్ఫికర్ శ్రేణి నౌకలు వచ్చాయి. వీటి ప్రారంభోత్సవ సమయంలో నౌకా విధ్వంసక క్షిపణులను ప్రయోగించిన వీడియోను పాక్ విడుదల చేసింది. కానీ, సైనిక ఘర్షణ మొదలుకాగానే.. వీటి నిర్ణీత నౌకాశ్రయాన్ని వదిలి వెళ్లిపోయాయి.

భారత్-పాక్ పరిస్థితులు గమనిస్తున్నాం

- శాంతి ఒప్పందం కొనసాగించడం కష్టం: రుబియో

ఇంటర్నెట్ డెస్క్: భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న పరిస్థితులను తాము ప్రతిరోజూ నిశితంగా గమనిస్తున్నామని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందాలు చాలా సున్నితమైనవని, వాటిని కొనసాగించడం చాలా కష్టమని ఓ వార్తా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు.



రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం విజయవంతం కాకపోవడానికి కారణం.. కాల్పులు ఆపేందుకు రష్యా అంగీకరించకపోవడమేనన్నారు. చైనాపై ఆంక్షలు విధిస్తే ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉందని, అందుకే వెనక్కి తగ్గాల్సి వచ్చిందని సమర్థించుకున్నారు. చైనా, భారత్‌లపై 100 శాతం సుంకాల విధింపును ప్రతిపాదించే సెనెట్ బిల్లుపై పలు యూరోపియన్ దేశాలు అసంతృప్తి వ్యక్తంచేశాయని రుబియో వెల్లడించారు. రష్యాతో భారత్ చేస్తున్న ఇంధన వాణిజ్యం అమెరికాకు ఓ సమస్యగా మారిందన్నారు. ఇది పరోక్షంగా ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి సహకరిస్తోందని ఆరోపించారు.

సముద్ర తాపంతోనే ఆకస్మిక వరదలు

- తక్కువ వర్షపాతమున్నా తీవ్రనష్టం

దిల్లీ: హిమాలయ సమీప రాష్ట్రాలు హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లతోపాటు కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ ఆకస్మిక విపత్తులకు ఆలవాలం కావడానికి పెరుగుతున్న సముద్ర తాపమే కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇటీవల సంభవించిన అనేక మేఘ విస్ఫోట సంఘటనలు, వరదలు, కొండచరియల ప్రమాదాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నది వారి వాదన. దీని కారణంగా సాధారణ లేదా లోటు వర్షపాతం కూడా ఒక్కోసారి విపత్తులకు దారితీస్తోంది. హిమాలయ రాష్ట్రాల్లో ఆకస్మిక వరదలు సంభవించిన చోట్ల సాధారణం లేదా అంతకన్నా తక్కువ వర్షపాతమే నమోదైందని భారత వాతావరణ శాఖ జిల్లాలవారీ వర్షపాత గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో, జమ్మూ ప్రాంతంలోని కిశ్త్‌వాడ్, కరువాలలో కూడా ఇదే తీరు కనబడింది. జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్‌లో ఈ నెలలో సాధారణ వర్షపాతం 301.5 మి.మీ.కాగా అక్కడ ఇప్పటివరకూ కేవలం 86.5 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైంది. 71 శాతం లోటు వర్షపాతం నమోదైంది. అయినప్పటికీ అక్కడ మేఘ విస్ఫోట వర్షపాతం కురిసిన కారణంగా వరదలు సంభవించాయి. కరువాలో ఈ సీజన్‌లో సాధారణ వర్షపాతం 898.6 మి.మీ. కాగా ఇప్పటికే 854.6 మి.మీ. వర్షం కురిసింది. ఈ ప్రాంతంలో ఈనెల 17న కురిసిన మేఘ విస్ఫోట వర్షపాతం బీభత్సం సృష్టించింది. సముద్ర తాపం అసాధారణంగా పెరిగిపోతున్న కారణంగా హిమాలయాల్లో ఈ పరిస్థితి ఏర్పడుతోందని క్లైమేట్ ఇంప్యాక్ట్స్, క్లైమేట్ ట్రెండ్స్ సంస్థకు చెందిన కార్తికి నేగి అన్నారు. సముద్ర తాపం పెరిగిన కారణంగా వేడెక్కిన గాలులు హిమాలయాల వైపు పయనించినప్పుడు అక్కడ ఆకస్మికంగా చల్లబడి కన్వెక్టివ్ మేఘాలు ఏర్పడటానికి కారణమవుతున్నాయి. ఈ మేఘాలు 20 నుంచి 30 కిలోమీటర్ల పరిధిలో గంటకు 100 లేదా అంతకన్నా ఎక్కువ వర్షం కురిపించి విధ్వంసం సృష్టిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.

కలుషితాహారంతో 100 మందికి అస్వస్థత

- లద్దాఖ్‌లోని లేహ్‌లో ఘటన

లేహ్: లద్దాఖ్‌లోని లేహ్‌లో ఓ చిత్ర బృందానికి చెందిన 100 మందికి పైగా కార్మికులు కలుషితాహారం తిని అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారు. ప్రస్తుతం వారందరి పరిస్థితి నిలకడగా ఉందని స్థానిక అధికారి ఒకరు సోమవారం తెలిపారు. తీవ్రమైన కడుపునొప్పి, తలపోటు, వాంతులతో బాధపడుతున్న ఆ కార్మికులనందరిని ఆదివారం రాత్రి బాగా పొద్దుపోయాకా ఎస్ఎన్ఎం ఆసుపత్రికి తీసుకొచ్చారని వివరించారు. వారంత లేహ్‌లో చిత్రీకరణ జరుపుకొంటున్న ఓ బాలీవుడ్ సినిమా చిత్రబృందానికి చెందిన కార్మికులని తెలిపారు. ఆదివారం రాత్రి దాదాపు 600 మంది అక్కడ భోజనం చేశారని చెప్పారు. కలుషితానికి కారణాలు తెలుసుకునేందుకు ఆహార నమూనాలు సేకరించినట్లు పోలీసులు తెలిపారు.

పేద, మధ్య ఆదాయ దేశాల ప్రజలపై ఔషధాల భారం

- ఆర్థికంగా చితికిపోతున్నారని అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: పేద, మధ్య ఆదాయ దేశాల్లో ప్రజలు ఔషధాల కోసం అధిక ఆదాయ దేశాల వారి కంటే ఎక్కువ చెల్లిస్తున్నారని, దీంతో వారు ఆర్థికంగా మరింత చితికిపోతున్నారని ఓ పరిశోధనలో వెల్లడైంది. 2022లో 72 దేశాల్లో 550 ఔషధాల ధరలను విశ్లేషించిన అమెరికా బ్రౌన్ విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ పరిశోధకులు సోమవారం ఈ మేరకు ఓ నివేదికను వెలువరించారు. దీని ప్రకారం.. ధనిక దేశాల్లో ఔషధాల ధర ఎక్కువగా ఉంది. అయితే స్థానిక కరెన్సీలో కొనుగోలును లెక్కించినపుడు మాత్రం ఔషధాల ధరలు పేద దేశాల్లోనే ఎక్కువగా ఉన్నాయి. 2022లో ప్రతి వ్యక్తీ వినియోగించే ఔషధాల మోతాదు సంఖ్య యూరప్‌లో(634) అత్యధికంగా, ఆగ్నేయాసియాలో(143) అత్యల్పంగా ఉంది. పేద దేశాలు ఔషధ ఖర్చుల భారాన్ని అధికంగా ఎదుర్కొంటున్నాయి. సాధారణంగా భారత్, పాక్‌లో ధరలు తక్కువగా ఉన్నప్పటికీ స్థానిక కరెన్సీతో పోల్చినపుడు మాత్రం మధ్యస్తంగా ఉన్నాయి. దేశాల మధ్య వీటి ధరలు వ్యాధి, చికిత్సను బట్టి మారుతున్నాయి. మానసిక రుగ్మతలు, ప్రవర్తనా లోపాల చికిత్సకు వాడే ఔషధాల ధరలు ఎక్కువగా, హైపటైటిస్ బి, సి చికిత్సలకు వాడే మందుల ధరలు తక్కువగా ఉన్నాయి. భారత్‌లోని ప్రజలు నెలవారీ ఔషధాల కోసం కనీసం 10 రోజుల వేతనాలను చెల్లించాల్సి వస్తోంది.

జాతీయ క్రీడా విధానంలో భాగస్వాములు అవ్వండి: ఎన్ఎంసీ

ఈనాడు, అమరావతి: 'ఖేలో భారత్ నీతి- 2025'లో అందరూ భాగస్వాములు కావాలని జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) కోరింది. కేంద్ర యువజన, క్రీడా వ్యవహారాల మంత్రిత్వ శాఖ జులై 1న ప్రకటించిన ఈ కొత్త జాతీయ క్రీడావిధానం విజయవంతం చేసేందుకు అన్ని వైద్యకళాశాలలు/ సంస్థలు సహకరించాలని కోరుతూ సోమవారం పబ్లిక్ నోటీసు పంపింది. విద్యాలయాల్లో క్రీడా మౌలిక వసతుల కల్పన, ప్రతిభ గుర్తింపుతో.. అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా పోటీతత్వం పెంచాలని సూచించింది. విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్య అభివృద్ధికి చొరవ చూపాలని ఎన్ఎంసీ పేర్కొంది.

భూ కేటాయింపులపై చర్చించిన ఉప సంఘం

ఈనాడు-అమరావతి: రాజధానిలో పలు సంస్థలకు భూ కేటాయింపులపై సచివాలయంలో మంత్రివర్గ ఉప సంఘం సమావేశమైంది. మంత్రులు నారాయణ, సంధ్యారాణి, అధికారులు హాజరయ్యారు. మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్ జూమ్ ద్వారా పాల్గొన్నారు. భూ కేటాయింపుల కోసం వచ్చిన ప్రతిపాదనలపై వీరు చర్చించారు.

శక్తి పేరిట మహిళా భద్రత విభాగం..

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పోలీసు విభాగంలో 'శక్తి' పేరిట మహిళలు, చిన్నారుల భద్రత విభాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసింది. సీఐడీలోని మహిళా భద్రత విభాగానికి కేటాయించిన పోస్టులనే శక్తి విభాగానికి కేటాయించింది. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా నుంచి అందిన ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

డిగ్రీ అధ్యాపకుల ధర్నా వాయిదా

ఈనాడు, అమరావతి: సాధారణ బదిలీలు, ఇతర సర్వీసు నిబంధనల కోసం డిగ్రీ కళాశాల అధ్యాపక సంఘాలు తలపెట్టిన ధర్నాను 29వ తేదీకి వాయిదా వేసినట్లు ఐకాస సోమవారం ప్రకటించింది. తొలుత ప్రకటించిన నిరసనల షెడ్యూల్ ప్రకారం సోమవారం ధర్నా నిర్వహించాల్సి ఉండగా.. కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ హామీ మేరకు వాయిదా వేసినట్లు పేర్కొంది.

పదోన్నతుల జాబితాలో 138 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు

ఈనాడు, అమరావతి: వైద్య కళాశాలల్లోని వివిధ క్లినికల్, నాన్ క్లినికల్ సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లో ప్రొఫెసర్ల ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో క్లినికల్ విభాగాల్లో 119 మంది, నాన్ క్లినికల్ విభాగాల్లో 19 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు పదోన్నతులకు అర్హులని ప్యానల్ జాబితాతో కూడిన ఉత్తర్వులను వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ సోమవారం విడుదల చేసింది. ఈ ఒక్కసారికి బోధన అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి సడలించారు.

మాంసం అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా ప్రకాశ్ నాయుడు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మాంసం అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా సింగనమల నియోజకవర్గానికి చెందిన ప్రకాశ్ నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

21న అంగన్‌వాడీల నిరసన

ఈనాడు, అమరావతి: అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని ఈ నెల 21న దేశ వ్యాప్తంగా చేపట్టనున్న బ్లాక్‌డేలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రాల్లో నిరసనలు తెలియజేయాలని నిర్ణయించినట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంఘాలు ప్రకటించాయి. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ అనుబంధ అంగన్‌వాడీ సంఘాలన్నీ ఉమ్మడిగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటాయని ఆ సంఘాల ప్రధాన కార్యదర్శులు సుబ్బరావమ్మ, లలితమ్మ, జ్యోతి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏపీ సాంకేతిక విద్య, శిక్షణ మండలికి ఎన్‌సీవీఈటీ గుర్తింపు

ఈనాడు, అమరావతి: ఏపీ సాంకేతిక విద్య, శిక్షణ మండలి (ఎస్‌బీటీఈటీ)కి జాతీయ వృత్తి విద్యా శిక్షణ మండలి (ఎన్‌సీవీఈటీ) నుంచి డ్యుయల్ కేటగిరి గుర్తింపు లభించింది. దక్షిణాదిలోనే మొదటిగా ఏపీ ఎస్‌బీటీఈటీకి ఈ గుర్తింపు లభించింది. దీంతో ఒకేసారి నైపుణ్యాభివృద్ధి కోర్సులను రూపకల్పన చేయడంతో పాటు విద్యార్థుల సామర్థ్య పరీక్షలను నిర్వహిస్తుంది. నైపుణ్య కోర్సుల నిర్వహణలో రెండు సంస్థలూ కలిసి ధ్రువపత్రాలు జారీ చేస్తాయి. ఈ మేరకు దిల్లీలో సోమవారం రెండు విభాగాలకు చెందిన అధికారుల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో ఎన్‌సీవీఈటీ ఛైర్మన్ రజిత్ పున్హాని, సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ గణేష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

'జనగణన-2027' రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: దేశ వ్యాప్తంగా 2027లో చేపట్టనున్న జనగణనకు సంబంధించి రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ ఏర్పాటైంది. ఈ మేరకు సాధారణ పరిపాలన విభాగం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా సాధారణ పరిపాలన విభాగం, రెవెన్యూ, పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి, ప్రణాళిక, పురపాలక-పట్టణాభివృద్ధి, పాఠశాల విద్య, ఐటీ శాఖల ముఖ్య కార్యదర్శులు/కార్యదర్శులతో పాటు గ్రామ, వార్డు సచివాలయ, పంచాయతీరాజ్, పురపాలక, సర్వే సెటిల్‌మెంట్స్ విభాగాల కమిషనర్లు, సంచాలకులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ రాష్ట్రంలో జనగణన పర్యవేక్షణ, శాఖల మధ్య సమన్వయం, ప్రక్రియను సకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటుంది. ఈసారి డిజిటల్ పద్ధతిలో మొబైల్ ఫోన్ల ద్వారా జనగణన చేపడతారు. తొలిసారిగా ప్రజలకు స్వీయ నమోదుకు అవకాశం కల్పిస్తారు. ప్రతి గ్రామాన్ని, పట్టణాన్ని జియో రిఫరెన్స్ ఎన్యుమరేషన్ బ్లాకులు (ఈబీ)గా విభజిస్తారు. తొలి దశలో భాగంగా వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు మధ్యలో 30 రోజుల పాటు నివాసాలను లెక్కిస్తారు. రెండో దశలో 2027 ఫిబ్రవరిలో జనగణన చేపడతారు. కులాల వివరాలు సైతం నమోదు చేస్తారు.

బొగ్గు కొనుగోళ్లలో పొదుపు మంత్రం

- అధిక ధర కోల్ కోటా తగ్గించుకునే ప్రతిపాదన
- ఈసీఎల్ నుంచి అదనపు కోటాకు యత్నం
- ఎంవోసీకి లేఖ రాసిన రాష్ట్ర ప్రభుత్వం
- కొనుగోళ్లు, రవాణా ఛార్జీలు కలిసి రూ.753 కోట్లు ఆదా!



ఈనాడు, అమరావతి: జెన్‌కో థర్మల్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు కొనుగోళ్లు, రవాణాను సమర్థంగా నిర్వహించడం ద్వారా ఏటా రూ.753 కోట్ల ఆదాకు అవకాశం ఉందని రాష్ట్రప్రభుత్వం గుర్తించింది. సింగరేణి కాలరీస్ నుంచి తీసుకునే బొగ్గులో కొంత వాటా తగ్గించుకొని, ఆ మేరకు ఒడిశాలోని మహానది కోల్‌ఫీల్డ్స్ (ఎంసీఎల్) నుంచి తీసుకునేలా ప్రతిపాదించింది. విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడం ద్వారా వినియోగదారులపై ట్రూఅప్ భారాన్ని తొలగించాలన్న ప్రభుత్వ ఆలోచనలో భాగంగా ఈ ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. వైకాపా పాలనలో ఏటా కనీసం రూ.వెయ్యి కోట్లకు తగ్గకుండా వినియోగదారులపై ట్రూఅప్ భారాన్ని వేసింది. కూటమి ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ట్రూఅప్ భారాన్ని లేకుండా చేసింది.

బొగ్గు కేటాయింపుల మార్పులతో..

✦ సింగరేణి విక్రయించే జి-12 గ్రేడ్ బొగ్గు టన్ను ధర రూ.4,976. ఎంసీఎల్ నుంచి అదే గ్రేడ్ బొగ్గు టన్ను ధర రూ.4,335 మాత్రమే. టన్నుకు రూ.641 చొప్పున ఆదా అవుతుంది. సింగరేణి నుంచి ఏటా 68.80 లక్షల టన్నుల బొగ్గు జెన్‌కోకు కోటా కింద వస్తోంది. ఇక్కడి బొగ్గుకు ధర ఎక్కువైనందున ఆ మేరకు జెన్‌కోపై భారం పడుతోంది. సింగరేణి నుంచి తీసుకునే బొగ్గులో 48 లక్షల టన్నులను ఎంసీఎల్‌కు బదిలీ చేస్తే.. భారం తగ్గనుంది. కోటా మార్పుల వల్ల బొగ్గు కొనుగోళ్ల రూపంలో ఏటా రూ.308 కోట్లు ఆదా అవుతుందని అంచనా. దీనికి అనుమతించాలని కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖకు(ఎంవోసీ) ఈ ఏడాది జూన్ 17న రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. మిగిలిన 20.80 లక్షల టన్నులు సింగరేణి నుంచి తీసుకునేలా ప్రతిపాదించింది.

✦ విదేశీ బొగ్గు కొనుగోలుకు బదులు ఈస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ (ఈసీఎల్) నుంచి హై గ్రాస్ కెలోరిఫిక్ వాల్యూ (జీసీవీ) బొగ్గు వినియోగిస్తే విద్యుత్ ఉత్పత్తి 10% పెరుగుతుందని అంచనా. ఆ మేరకు సంస్థకు చెల్లించే స్థిరఛార్జీల్లో ఏటా రూ.205 కోట్లు మిగులుతాయని లెక్కగట్టారు. కృష్ణపట్నం థర్మల్ కేంద్రంలోని మొదటి యూనిట్‌కు అధిక జీసీవీ ఉన్న బొగ్గును వాడాలి. దీని కోసం 50 వేల టన్నుల విదేశీ బొగ్గును జెన్‌కో అధిక ధరకు కొంటోంది. ప్రత్యామ్నాయంగా ఈసీఎల్ నుంచి 18 లక్షల టన్నులు తీసుకునేలా ఫ్యూయల్ సప్లై అగ్రిమెంట్(ఎఫ్ఎస్ఏ)ను సవరించాలని ఈ ఏడాది జూన్ 27న రాష్ట్ర ప్రభుత్వం ఎంవోసీకి లేఖ రాసింది. ప్రస్తుతం ఈసీఎల్ నుంచి ఏటా 98 లక్షల టన్నుల బొగ్గు వస్తోంది. తక్కువ గ్రేడ్ బొగ్గు వాడటం వల్ల ప్లాంటు నుంచి ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి 60% దాటట్లేదు.

రవాణా ఛార్జీల్లోనూ మిగులు

బొగ్గు రవాణాకు టెలిస్కోపిక్ విధానంలో రైల్వేశాఖకు ఛార్జీలు చెల్లిస్తే ఏటా రూ.240 కోట్లు ఆదా అవుతుందని అంచనా. జెన్‌కోలు థర్మల్ ప్లాంట్ల కోసం రైలుమార్గంలో ఏటా 80 లక్షల టన్నుల బొగ్గు తీసుకుంటున్నాయి. దానికి టెలిస్కోపిక్ విధానంలో ఛార్జీలు చెల్లిస్తే టన్నుకు రూ.300 వరకు ఆదా అవుతుందని లెక్కించారు. ఈ ప్రకారం ఏటా సరకు రవాణా ఛార్జీల్లో రూ.240 కోట్లు మిగిలే అవకాశముంది. టెలిస్కోపిక్ విధానంలో దూరం పెరిగేకొద్దీ.. కిలోమీటరుకు సరకు రవాణా ఛార్జీ తగ్గుతుంది.

లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు

మంత్రి నారాయణ ఆదేశం

ఈనాడు-అమరావతి: భారీ వర్షాల కారణంగా జనజీవనానికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని పురపాలక మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. సచివాలయం నుంచి సోమవారం ఆయన పుర, నగర పాలక సంస్థల, నగర పంచాయతీ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలి. రోడ్లపై నీరు నిలవకుండా చూడాలి. విజయవాడలో కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి' అని మంత్రి నారాయణ సూచించారు.

భారీగా దెబ్బతిన్న రోడ్లు.. మరమ్మతులకు మంత్రి జనార్దన్‌రెడ్డి ఆదేశం: భారీ వర్షాలు కారణంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 1,002 కి.మీ. ఆర్ అండ్‌బీ రహదారులు ధ్వంసమయ్యాయి. 13 చోట్ల రాష్ట్ర, జిల్లా రోడ్లు కోతకు గురయ్యాయి. 159 కల్వర్టులు దెబ్బతిన్నాయి. 65 చోట్ల రోడ్ల అంచులు (సైడ్ ఎడ్జ్‌లు) కొట్టుకుపోయాయి. నాలుగుచోట్ల రోడ్లపై భారీ వృక్షాలు నేలకూలాయి. 74 చోట్ల రోడ్లపై నుంచి వరదనీరు ప్రవహించింది. 56 చోట్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా, సోమవారం సాయంత్రానికి 20 చోట్ల ట్రాఫిక్ పునరుద్ధరించారు. రహదారులు దెబ్బతిన్నచోట్ల తక్షణం మరమ్మతులు చేయాలని, వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ఆర్ అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఇంజినీర్లను ఆదేశించారు. బలహీనంగా ఉన్న కల్వర్టులు, వంతెనలు, కోతకు గురయ్యే రోడ్ల విషయంలో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలి

భారీ వర్షాలపై అధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: వాయుగుండం హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్లు ముందస్తు ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం ఆయన సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఇతర అధికారులతో సమీక్షించారు. 'భారీ వర్షాలు కొనసాగితే విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాలి. ప్రజలకు సమాచారం అందించేలా అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి. ఉత్తరాంధ్రలో నదులు, వాగులు ఉప్పొంగడంతో పాటు కొండ ప్రాంతాలు కోతకు గురయ్యే అవకాశం ఉంది. ఆయాచోట్ల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి' అని నిర్దేశించారు.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

విద్యార్థులపై పెరిగిన రుణభారం

- పదేళ్లలో ఏపీలో 209% పైకి
- లోక్‌సభలో కేంద్ర మంత్రి వెల్లడి

ఈనాడు, దిల్లీ: చదువుల కోసం తీసుకున్న రుణాల భారం ఆంధ్రప్రదేశ్ విద్యార్థులపై పదేళ్లలో 209% మేర పెరిగిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌధరి వెల్లడించారు. సోమవారం లోక్‌సభలో ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, 2016 మార్చి నాటికి రాష్ట్రంలోని 1,09,293 మంది విద్యార్థులపై రూ.3,859 కోట్ల రుణభారం ఉండగా, 2025 మార్చికల్లా ఆ మొత్తం రూ.11,932 కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో రుణాలు తీసుకున్న విద్యార్థుల సంఖ్య 1,29,133కి చేరింది. ఈ పదేళ్లలో అప్పులు చేసిన విద్యార్థుల సంఖ్య కేవలం 18.15% పెరిగినప్పటికీ, వారిపై అప్పుల భారం మాత్రం 209.19% ఎగబాకింది. పదేళ్ల క్రితం సగటున ఒక్కో విద్యార్థిపై రూ.3.53 లక్షల అప్పు ఉండగా, ఇప్పుడది రూ.9.24 లక్షలకు హెచ్చింది. దేశవ్యాప్తంగా విద్యా రుణాల ఎన్‌పీఏ 2016-25 మధ్యకాలంలో రూ.2,634 కోట్ల నుంచి రూ.5,006 కోట్ల (90%)కు పెరిగింది.

ఏపీ రుణం- జీఎస్‌డీపీ నిష్పత్తి 34.7%

ఆంధ్రప్రదేశ్ రుణం రాష్ట్ర జీఎస్‌డీపీలో 34.7% మేర ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌధరి తెలిపారు. లోక్‌సభలో ఓ ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, '2025 మార్చి నాటికి ఏపీ రుణభారం రూ.5,62,557 కోట్లకు చేరింది. రుణం- జీఎస్‌డీపీ నిష్పత్తి ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఏపీ 12వ స్థానంలో ఉంది. ఈ జాబితాలో 57% నిష్పత్తితో అరుణాచల్‌ప్రదేశ్ టాప్‌లో ఉండగా, 16.3%తో ఒడిశా చివరి స్థానంలో ఉంది. గత నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్.. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.36,568 కోట్ల రుణం తీసుకుంది. అందులో రూ.18,250 కోట్లు (49.90%) 2024-25లోనే పొందింది' అని వివరించారు.

ఏపీలో 53 సీఆర్‌జెడ్ ఉల్లంఘనలు

రాష్ట్రంలో గత పదేళ్లలో 53 సీఆర్‌జెడ్ ఉల్లంఘన కేసులు నమోదైనట్లు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్‌సింగ్ తెలిపారు. లోక్‌సభలో బాపట్ల తెదేపా ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఇందులో అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలో 24, బాపట్ల జిల్లాలో 15, పశ్చిమ గోదావరి జిల్లాలో 6, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 2 చొప్పున, కృష్ణా, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో ఒక్కోటి చొప్పున కేసులు నమోదైనట్లు తెలిపారు.

పీఎం ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టులో మరో 4,715 మందికి అవకాశం

పీఎం ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టు రెండో దశ పైలట్ ప్రాజెక్టు కింద ఆంధ్రప్రదేశ్ నుంచి 4,715 మంది విద్యార్థులకు వివిధ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం లభించినట్లు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. లోక్‌సభలో నంద్యాల తెదేపా ఎంపీ బైరెడ్డి శబరి అడిగిన ప్రశ్నకు ఆమె బదులిచ్చారు. 'ఐదేళ్లలో దేశంలోని టాప్ 500 కంపెనీల్లో కోటి మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కల్పించాలన్న ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును 2024-25 బడ్జెట్‌లో ప్రవేశపెట్టాం. తొలి దశ పైలట్ ప్రాజెక్టు 2024 అక్టోబర్ 3న ప్రారంభమైంది. అందులో ఏపీలోని వివిధ సంస్థల్లో 5 వేల మందికి ఇంటర్న్‌షిప్ దొరికింది. 2025 జనవరి 9 నుంచి ప్రారంభమైన రెండో దశ ప్రాజెక్టులో ఏపీ కంపెనీల్లో 4,715 మందికి అవకాశం లభించింది. వారిలో అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలో 1,100 మంది, తూర్పు గోదావరి జిల్లాలో 625 మందికి అవకాశం దక్కింద'ని మంత్రి నిర్మల వివరించారు.

54 విద్యాసంస్థలకు క్యూఎస్ ర్యాంకులు

2015-26 మధ్యకాలంలో భారతీయ విద్యాసంస్థల క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకుల్లో దాదాపు నాలుగు రెట్ల వృద్ధి నమోదైందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. లోక్‌సభలో అనకాపల్లి భాజపా ఎంపీ సీఎం రమేశ్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 2015లో దేశంలోని 11 విద్యాసంస్థలకు మాత్రమే క్యూఎస్ ర్యాంకులు ఉండేవని, 2026 నాటికి ఆ సంఖ్య 54కు పెరిగిందని చెప్పారు. 8 భారతీయ సంస్థలు తొలిసారి ఇందులో చోటు సంపాదించుకున్నాయని తెలిపారు. ఈ ర్యాంకుల జాబితాలో ఒకే సంవత్సరంలో కొత్తగా ఇన్ని సంస్థలు చేరిన దాఖలా మరే దేశంలోనూ లేదన్నారు.



జాతీయ ఫిల్మ్ అవార్డు గ్రహీతలతో సీఎం రేవంత్‌రెడ్డి

భారతీయ సినిమా నిర్మాణానికి కేంద్రంగా హైదరాబాద్‌ను నిలపాలి: సీఎం

71వ జాతీయ ఫిల్మ్ అవార్డు గ్రహీతలకు సన్మానం

ఈనాడు, హైదరాబాద్: భారతీయ సినిమా నిర్మాణానికి కేంద్రంగా హైదరాబాద్‌ను నిలపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 71వ జాతీయ ఫిల్మ్ అవార్డులకు ఎంపికైన సినీ ప్రముఖులు సోమవారం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భగవంత్ కేసరి సినిమా దర్శకుడు అనిల్ రావిపూడి, హనుమాన్ సినిమా దర్శకుడు ప్రశాంత్ వర్మ, విజువల్ ఎఫెక్ట్స్ నిర్వాహకులు వెంకట్, శ్రీనివాస్, బృంద సభ్యులు, ఫైట్ మాస్టర్లు నందు, పృథ్వీ, బేబి సినిమా దర్శకుడు సాయి రాజేశ్, సింగర్ రోహిత్‌లను సీఎం రేవంత్‌రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ సినిమా నిర్మాతలు చైతన్య రెడ్డి, నిరంజన్‌రెడ్డి, బేబి సినిమా నిర్మాత ఎస్‌కేఎన్, భగవంత్ కేసరి నిర్మాత గారపాటి సాహు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినిమా పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను పలువురు సీఎం దృష్టికి తీసుకెళ్లగా..సినిమా రంగ ప్రోత్సాహానికి అవసరమైన చేయూతనందిస్తామని సీఎం పేర్కొన్నారు.

సబిత, కృపానందంలకు తెలంగాణ హైకోర్టు నోటీసులు

- ఓఎంసీ కేసులో సీబీఐ అప్పీలుపై విచారణ సెప్టెంబరు 17కు వాయిదా

ఈనాడు, హైదరాబాద్: ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విశ్రాంత ఐఏఎస్ కృపానందంలకు హైకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన రికార్డులను సీబీఐ కోర్టు నుంచి తెప్పించాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేసింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో 8, 9వ నిందితులుగా ఉన్న అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందం, అప్పటి గనుల శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిలను నిర్దోషులుగా ప్రకటిస్తూ మే 6న హైదరాబాద్ సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని కోరుతూ సీబీఐ అప్పీలు దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. సీబీఐ తరఫున శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ ఈ కేసులో బి.వి.శ్రీనివాసరెడ్డి, గాలి జనార్దనరెడ్డి, గాలి వ్యక్తిగత సహాయకుడు మెఫజ్ అలీఖాన్, గనుల శాఖ మాజీ డైరెక్టర్ వి.డి.రాజగోపాల్‌లకు శిక్ష విధిస్తూ సీబీఐ కోర్టు తీర్పు వెలువరించిందన్నారు. ఇదే కేసులో నిందితులైన 8, 9వ నిందితుల పాత్రపై సీబీఐ దర్యాప్తు చేసి సమర్పించిన ఆధారాలను కింది కోర్టు పరిగణనలోకి తీసుకోకపోవడంతో అప్పీలు దాఖలు చేసినట్లు తెలిపారు. వాదనలను విన్న న్యాయమూర్తి అప్పీలు దాఖలుకు అనుమతిస్తూ సబితా ఇంద్రారెడ్డి, కృపానందంలకు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను గాలి, బి.వి.శ్రీనివాసరెడ్డి తదితరులు దాఖలు చేసిన అప్పీళ్లతో కలిపి సెప్టెంబరు 17కు వాయిదా వేశారు.

కేజీబీవీ ప్రిన్సిపల్ అక్రమ బదిలీపై రాజకీయాలు ఆపాలి

ఏపీఎస్‌ఎస్‌ఏఈ ఐకాస

ఈనాడు, అమరావతి: కేజీబీవీ ప్రిన్సిపల్ సౌమ్య అక్రమ బదిలీపై రాజకీయాలు ఆపాలని, దీనిపై సీఎం చంద్రబాబు వెంటనే జోక్యం చేసుకోవాలని ఏపీ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల ఐకాస డిమాండ్ చేసింది. 'శ్రీకాకుళం జిల్లా పొందూరు కేజీబీవీ ప్రిన్సిపల్ సౌమ్య అక్రమ బదిలీపై అధికార, ప్రతిపక్ష పార్టీలు అసలు విషయాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయి. ఆమె వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ సామాజిక మాధ్యమాల్లో కించపరిచేలా తెదేపా వారు ట్రోల్స్ చేస్తున్నారు. వైకాపా తన రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని వాడుకుంటోంది. ఆమె బదిలీని తక్షణమే నిలిపివేసి, మొత్తం వ్యవహారానికి బాధ్యుడైన అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలి" అని వెల్లడించింది.

ఎండీఎస్ తాజా నోటిఫికేషన్

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: నీట్-పీజీ (ఎండీఎస్) కటాఫ్ శాతాన్ని 19.863కి తగ్గించిన నేపథ్యంలో విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం కన్వీనర్/యాజమాన్య కోటా సీట్ల భర్తీకి తాజాగా సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. కటాఫ్ తగ్గించిన తరువాత అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 18 రాత్రి 7 గంటల నుంచి 21 వరకు రాత్రి 7 గంటల్లోగా కొత్తగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మాప్-అప్ రౌండ్ కౌన్సెలింగ్ అనంతరం కన్వీనర్ కోటాలో 15 సీట్లు, యాజమాన్య కోటాలో 96 సీట్లను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. కొత్తగా దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు మార్గ నిర్దేశకాల్లో సందేహాలుంటే 89787 80501 నంబరుకు, సాంకేతిక సమస్యలు తలెత్తితే 90007 80707 నంబరుకు ఫోన్ చేయవచ్చని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు.

గోదావరి బోర్డు ఛైర్మన్‌గా బీపీ పాండే

ఈనాడు, హైదరాబాద్: గోదావరి నదీ యాజమాన్య బోర్డు ఛైర్మన్‌గా బీపీ పాండే సోమవారం హైదరాబాద్‌లోని బోర్డు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ అంజద్ హుస్సేన్ ఆయనతో భేటీ అయ్యారు. గత నెలాఖరు వరకు ఛైర్మన్‌గా ఉన్న ఏకే ప్రధాన్ పదవీ విరమణ చేసిన విషయం తెలిసిందే.



విజయవాడ పీఎన్‌బీఎస్ బస్టాండ్‌లో నిరీక్షిస్తున్న మహిళలు

'స్త్రీ శక్తి'ని చూపుతున్నారు!



గుంటూరు బస్సు నిండిపోయిందిలా..

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి తీసుకొచ్చిన 'స్త్రీ శక్తి' పథకాన్ని మహిళలు పూర్తి స్థాయిలో ఉపయోగించుకుంటున్నారు. సోమవారం విజయవాడ నుంచి గుంటూరు, ఏలూరు, జగ్గయ్యపేట, వినుకొండ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు కిక్కిరిసిపోయాయి. గతంలో టికెట్ రోల్స్ రోజుకు మూడు అయ్యేవని, ఇప్పుడు మధ్యాహ్నానికే 4 అయిపోతున్నాయని ఓ కండక్టర్ తెలిపారు. – ఈనాడు, అమరావతి

వర్షంలోనూ మహిళా ప్రయాణికుల రద్దీ

- సోమవారం స్త్రీశక్తి పథకాన్ని వినియోగించుకున్న 18 లక్షల మంది
- రూ.7 కోట్లకు పైగా లబ్ధి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ.. మహిళలు పెద్దసంఖ్యలో సోమవారం ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం వినియోగించుకున్నారు. మొత్తం 18 లక్షల మంది స్త్రీశక్తి పథకం కింద జీరో ఫేర్ టికెట్లతో ప్రయాణించినట్లు తేలింది. వీరికి రూ.7 కోట్లకు పైగా లబ్ధి కలిగింది. సోమవారం రాష్ట్రమంతటా 86 శాతం ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) నమోదైంది. అంతకుముందు ఆదివారం ఇది 82 శాతం ఉంది. శ్రీకాకుళం జిల్లాలో 95 శాతం, విజయనగరంలో 91 శాతం, అనకాపల్లిలో 84 శాతం ఓఆర్ నమోదైంది. విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మాత్రం 69 శాతమే ఓఆర్ నమోదైంది. గత నాలుగు రోజుల్లో కలిపి 47 లక్షల మంది ప్రయాణించగా, వీరికి రూ.19 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఈ పథకం అమలు తీరుపై సీఎం చంద్రబాబు ఆర్టీసీ అధికారులతో సమీక్షించారు. మహిళలు డిజిలాకర్‌లో ఆధార్ సాఫ్ట్‌కాపీ చూపినా ప్రయాణానికి అనుమతించాలని సీఎం ఆదేశించారు.

'బ్రహ్మదియా' బొగ్గు నాణ్యతపై మరోసారి అధ్యయనం

ఏపీఎండీసీ అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

ఈనాడు, అమరావతి: ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)కి చెందిన ఝార్ఖండ్‌లోని బ్రహ్మదియా బ్లాక్‌లోని బొగ్గు నాణ్యతపై మరోసారి అధ్యయనం చేయించాలని, కోల్ ఇండియాకు చెందిన సంస్థతో పరిశీలన జరిపించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఏపీఎండీసీ రాబడి మరింత పెరిగేందుకు వీలున్న మార్గాలను అన్వేషించాలని పేర్కొన్నారు. సచివాలయంలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆ శాఖ అధికారులతో సోమవారం సీఎం సమీక్షించారు. బీచ్ శాండ్ టెండర్లకు సంబంధించి హైకోర్టులో కేసు ముగిసినందున.. తదుపరి చర్యలు తీసుకొని, ప్రాజెక్ట్ డెవలపర్ ఎంపిక ప్రక్రియ చేపట్టాలన్నారు. ఆరు ఉమ్మడి జిల్లాలకు సీనరేజ్ గుత్తేదార్ల ఎంపికకు పిలిచిన టెండర్ల ప్రక్రియను సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. మిగిలిన ఏడు జిల్లాల్లో సీనరేజ్ గుత్తేదార్ల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వీటిలో కూడా ప్రస్తుత గుత్తేదార్ల గడువు ముగిస్తే, వాటికీ టెండర్లు పిలవాలని ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా పరిటాల వద్ద రోడ్ మెటల్ క్వారీలకు సమీపంలో వేసిన వెంచర్‌పై ఫిర్యాదులు వస్తున్న అంశంపై సీఎం అధికారులతో మాట్లాడారు. అధిక సంఖ్యలో క్వారీలున్న ప్రాంతంలో వాటికి కిలోమీటరు లోపే ఎలా వెంచర్ వేశారని సీఎం ప్రశ్నించారు. దీనిపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

యూరియా కొరత సృష్టిస్తే క్రిమినల్ కేసులు: మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఎక్కడైనా కావాలని యూరియా కొరత సృష్టిస్తే ఉపేక్షించబోమని.. రైతులను ఇబ్బంది పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. మార్క్‌ఫెడ్ గోదాముల్లోని నిల్వలను కూడా మార్కెట్లోకి తరలించాలని ఆదేశించారు. యూరియా సరఫరా, సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల్లో నిల్వలపై సోమవారం రాత్రి ఆయన అధికారులతో సమీక్షించారు. దిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్ కూడా రాష్ట్రానికి యూరియా త్వరితగతిన పంపిణీ చేసేలా చూడాలని కేంద్ర మంత్రి నడ్డాను కోరారని అచ్చెన్నాయుడు చెప్పారు. రాబోయే మూడు రోజుల్లో యూరియా అందుబాటులోకి వస్తుందని వివరించారు. ప్రైవేటు వ్యాపారులు ఎక్కువ ధరకు యూరియా, డీఏపీ విక్రయిస్తున్నారని.. వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆగస్టులో కేంద్రం నుంచి అవసరం మేరకు ఎరువులు అందలేదని.. అందుకే కొంత ఇబ్బంది తలెత్తిందని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు మంత్రికి వివరించారు.

పీజీ వైద్య కోర్సుల ఇన్ సర్వీసు కోటాలో సవరణలు

ఈనాడు, అమరావతి: వైద్య విద్య పీజీ కోర్సుల్లో ఇన్ సర్వీసు కోటా రిజర్వేషన్ నిబంధనలను ప్రభుత్వం సవరించింది. 2025-26 విద్యా సంవత్సరంలో సీట్ల కేటాయింపులో ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ కోటాలోని 50 శాతం సీట్లలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఇన్ సర్వీసు అభ్యర్థులకు క్లినికల్ విభాగాలైన జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, అనస్థీషియా, ఎమర్జెన్సీ మెడిసిన్, రేడియో-డయాగ్నసిస్‌లలో 15 శాతం సీట్లు కేటాయిస్తారు. నాన్ క్లినికల్ విభాగాల్లో 30 శాతం సీట్లు కేటాయించాలని నిర్ణయించారు. ఇన్ సర్వీస్ అభ్యర్థుల కోసం కేటాయించిన సీట్లు మూడో కౌన్సిలింగ్ (మాప్ అప్ రౌండ్) వరకు ఖాళీగా ఉంచుతారు. ఆ తర్వాత రెగ్యులర్ (నాన్ సర్వీసు) అభ్యర్థులకు కేటాయిస్తారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీ సిఫార్సులు, పీహెచ్‌సీ వైద్యుల సంఘం అభ్యర్థన మేరకు ఈ మార్పులు చేశారు. 2026-27 సంవత్సరం నుంచి స్పెషలిస్టుల అవసరాలు ముందస్తుగా అంచనా వేయడానికి కమిటీ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.



జంతర్‌మంతర్‌లో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య. చిత్రంలో ఎంపీ పాకా సత్యనారాయణ, ఇరురాష్ట్రాల బీసీ సంఘాల ప్రతినిధులు

బీసీల డిమాండ్లపై జంతర్‌మంతర్‌లో ధర్నా

ఈనాడు, దిల్లీ: బీసీల డిమాండ్లపై ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం దిల్లీలోని జంతర్‌మంతర్‌లో ధర్నా నిర్వహించింది. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటుచేయాలని, ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేటురంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలన్న డిమాండ్లతో ఈ ఆందోళన కార్యక్రమం నిర్వహించింది. ఇందులో భాజపా ఎంపీలు ఆర్.కృష్ణయ్య, పాకా సత్యనారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ హయాంలో బీసీల సమస్యకు పరిష్కారం లభిస్తుందని తాము విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రంలో 27 మంది బీసీలకు మంత్రిపదవులు ఇవ్వడంతోపాటు, నలుగురిని గవర్నర్లుగా, గిరిజన మహిళను రాష్ట్రపతిగా చేసిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జి నుకనమ్మ, దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జి షణ్ముగం, తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలా వెంకటేష్, తెలంగాణ రాష్ట్ర బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.